శుక్రవారం 18-8-2023


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 335

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**భారత్‌కు రెండు కాంస్యాలు**

వరల్డ్‌కప్ ఆర్చరీ స్టేజ్–4 టోర్నీలో రెండో రోజు భారత్ ఖాతాలో పతకాలు -13లో



**సిమ్ డీలర్లకూ వెరిఫికేషన్**

మోసాల నివారణకే బల్క్ కనెక్షన్లు నిలిపివేస్తున్నామన్న కేంద్రం - 13లో



**షెడ్యూల్‌కు ముందే తొలి జాబితా**

ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడకముందే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



**స్వావలంబనకు చిహ్నం 'వింధ్యగిరి'**

భారత నౌకాదళం కోసం నిర్మించిన యుద్ధ నౌక 'వింధ్యగిరి'ని హుగ్లీ తీరంలో రాష్ట్రపతి జలప్రవేశం చేయించారు.


వివరాలు 6లో ▸



**సంక్షోభం వస్తే ఆయన సైలెంట్**

దేశంలో ఎక్కడ సంక్షోభం వచ్చినా ప్రధాని మోదీ సైలెంట్ అయిపోతారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

వివరాలు 6లో ▸



**ఇక క"న్నీళ్లే"నా..?**

ప్రపంచంలో 25 దేశాలు నీటికి కటకటలాడుతున్నట్టుగా వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ తాజా అధ్యయనంలో వెల్లడైంది.

వివరాలు 6లో ▸



సీఎం వైఎస్ జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలను చూపుతున్న ఎడెక్స్ సీఈవో అనంత్ అగర్వాల్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు

# ఉన్నత విద్యలో గేమ్ చేంజర్

## ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

- మన విద్యార్థులు ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి కోర్సులు ఉచితంగా చదివే అవకాశం
- హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా పలు అత్యుత్తమ వర్సిటీల నుంచి సర్టిఫికేషన్లు
- రెగ్యులర్ కోర్సులతో పాటు చదువుకోవచ్చు.. విద్యార్థులకు సర్టిఫికెట్లు, క్రెడిట్లు జారీ
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా కోర్సులకు రూపకల్పన.. ఆధునికతను అందిపుచ్చుకుంటూ విద్య అందించడమే లక్ష్యం
- విద్యార్థులకు నచ్చిన వర్టికల్స్‌లో విద్యను అందించేలా చర్యలు
- అంతర్జాతీయ వర్సిటీల కోర్సులు ఉచితంగా నేర్చుకునే అవకాశం: సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యారంగంలో మరో విప్లవాత్మక మార్పునకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు సైతం ప్రపంచ స్థాయి కోర్సులను అందించేందుకు మార్గం సుగమం చేసింది. హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా ఇతర ప్రపంచ అత్యుత్తమ వర్సిటీల సర్టిఫికేషన్ పొందేలా ప్రముఖ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎడెక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనంత్ అగర్వాల్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు

మిగతా 2వ పేజీలో ▶

### ఎంఎస్ఎంఈల్లో ఎగుమతులపై దృష్టి

- నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- మెరుగైన మార్కెటింగ్.. క్లస్టర్ల వారీగా మౌలిక వసతులు
- విదేశాల్లో అమలు చేస్తున్న విధానాలనూ పరిశీలించాలి

2 లో

# గ్రూప్–1 ఫైనల్ ఫలితాలు విడుదల

## డిప్యూటీ కలెక్టర్, సీటీవో, డీఎస్పీ, ఎంపీడీవో వంటి 111 పోస్టుల భర్తీ

- మరో పోస్టు స్పోర్ట్స్ కోటాకు చెందింది.. టాప్ 10 ర్యాంకుల్లో ఆరుగురు మహిళలు
- 11 నెలల్లోనే నియామక ప్రక్రియను పూర్తి చేసిన ఏపీపీఎస్సీ
- అత్యంత పారదర్శకంగా ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలు

### 110 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక


1వ ర్యాంకు ప్రత్యూష


2వ ర్యాంకు భూమిరెడ్డి పావని


3వ ర్యాంకు కె. లక్ష్మీ ప్రసన్న


4వ ర్యాంకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 111 గ్రూప్–1 పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల తుది ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గురువారం విడుదల చేసింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో 11 నెలల వ్యవధిలోనే ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఈ ఫలితాల వివరాలను ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ మీడియాకు వెల్లడించారు. మొత్తం 111 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువరించగా ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలను నిర్దేశిత తేదీల్లో ఏపీపీఎస్సీ నిర్వహించింది. 110 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. స్పోర్ట్స్ కోటాకు

మిగతా 14వ పేజీలో ▶

### త్వరలో గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్లు

- 2020 అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- 220 జూనియర్ లెక్చరర్లు
- డిగ్రీ కాలేజీల లెక్చరర్లు, డిప్యూటీ డీఈవో తదితర 1,199 పోస్టుల భర్తీకి కూడా

14 లో

## ఏది నిజం?

### పెత్తందార్లు.. మీరు, మీ బాబే రామోజీ

- సీఎం వైఎస్ జగన్ చర్యలతో పేదల ఆర్థిక స్వావలంబన
- పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పేదల ఖాతాల్లో రూ.2.31 లక్షల కోట్లు
- డీబీటీ, నాన్ డీబీటీ కలిపి ఏకంగా రూ.4.65 లక్షల కోట్ల ప్రయోజనం
- ఈ మార్పును చూసి ఓర్చుకోలేక చంద్రబాబు దుష్ప్రచారం
- రాష్ట్రం శ్రీలంక అవుతోందంటూ పెత్తందారుగా ఆందోళన
- రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందంటూ వంత పాడిన రామోజీ
- 'ఈనాడు'లో తప్పుడు రాతల ద్వారా తానూ పెత్తందారుల పక్షమేనని నిరూపణ
- సీఎం జగన్ పక్షానే పేదలు
- 2019 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలోనూ వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం.. 2024 ఎన్నికల్లోనూ క్లీన్ స్వీప్ ఖాయమంటోన్న జాతీయ సంస్థల సర్వేలు
- వెరసి నిత్యం 'ఈనాడు'లో నీతిమాలిన రోత రాతలు

4 లో

## ఫ్యాక్ట్ చెక్

### బాబూ.. మీ నోట వ్యవసాయం మాటా!

- వ్యవసాయమే దండగ అన్నది మీరే
- ఉచిత విద్యుత్ అంటే తీగలపై బట్టలారేసుకోవాలన్నారు
- నాడు రైతులు రాత్రి పూట పొలాల్లో, పగలు సొసైటీల వద్ద పడిగాపులు.. గతం మరిచి ఇప్పుడు రైతులంటూ నంగనాచి కబుర్లా?
- అన్నదాతలకు కొండంత అండగా నిలిచిన జగన్ ప్రభుత్వం
- సీజన్ ముగియకుండానే ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రాయితీ

10 లో

### ప్రతిభకు సర్కారు పట్టం

ఐక్యరాజ్య సమితికి రాష్ట్ర ప్రతినిధులుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

10 లో



## ఇదండీ సంగతి




ఇప్పుడు కూడా కనబడకుంటే 'విజన్ 3000' పెడతా!

# 'మార్గదర్శి'.. మరో 'అగ్రిగోల్డ్'..!

## ఆర్థికంగా పతనం అంచున మార్గదర్శి చిట్‌ఫండ్స్

- బ్రాంచి బ్యాంకు ఖాతాల్లో నిధులు లేవు
- ప్రధాన కార్యాలయం బ్యాంకు ఖాతా కూడా ఖాళీ
- నిధులన్నీ మళ్లించేసిన యాజమాన్యం
- చందాదారులు, డిపాజిట్‌దారులకు చెల్లింపులు ప్రశ్నార్థకం
- ప్రభుత్వం జోక్యం చేసుకోకుంటే చందాదారులు మునగడం ఖాయం
- ఫోర్జరీ సంతకాలతో 'మార్గదర్శి' యథేచ్ఛగా మోసాలు
- పైసా చెల్లించకుండా మేనేజ్‌మెంట్ టికెట్ పేరిట ప్రైజ్‌మనీ తీసుకున్న యాజమాన్యం

3 లో



నెల్లూరు కరెంట్ ఆఫీస్ సెంటర్ సమీపంలోని మార్గదర్శి కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్న అధికారులు

- 37 బ్రాంచిలలో స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాలు
- సోదాల్లో బయటపడ్డ పలు వాస్తవాలు

### రామోజీ, శైలజా కిరణ్ మళ్లీ డుమ్మా

3 లో

- సీఐడి విచారణకు మళ్లీ ముఖం చాటేసిన వైనం
- రాష్ట్రంలో జరిగిన నేరం కాబట్టి ఇక్కడే విచారణకు పిలుపు
- రెండోసారి నోటీసులు జారీ చేసినా బేఖాతరు
- సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి



### బోనులో చిక్కిన మరో చిరుత

| 3 రోజుల్లో ఇది రెండోది | 50 రోజుల్లో పట్టుబడిన మూడు చిరుతలు |
|---|---|

- అలిపిరి–తిరుమల శేషాచలం అటవీ ప్రాంతంలోని నడక దారిలో గురువారం అర్ధరాత్రి దాటాక మరో చిరుత చిక్కింది. మూడు రోజుల క్రితమే ఓ చిరుత పట్టుబడగా.. తాజాగా గురువారం 1.30 గంటల సమయంలో మరో చిరుత బోనులో చిక్కింది. దీనిని మగ చిరుతగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

- వివరాలు 5లో



'చంద్రయాన్-3'లో

### కీలక ఘట్టం ఆవిష్కృతం

- చందమామపై అధ్యయనం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూలై 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్‌లో గురువారం మధ్యాహ్నం 1.35 గంటలకు కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వ్యోమనౌకలోని ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి రోవర్ 'ప్రజ్ఞాన్'తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' విజయవంతంగా విడిపోయింది.

- వివరాలు 6లో

# నగదు రహితం.. సులభతరం

- పంచాయతీల్లో ఆన్‌లైన్ లావాదేవీలు.. మరింత మెరుగైన పాలనకు చర్యలు
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 953 పంచాయతీల్లో అమలు.. బ్యాంకు ఖాతాలు, క్యూఆర్ కోడ్‌లు అందజేత




ఏలూరు (మెట్రో): ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇప్పటికే సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువచేసింది. అలాగే అవినీతిరహిత లావాదేవీలు చేపట్టేందుకు పంచాయతీల్లో నగదురహిత కార్యకలాపాలకు ఉపక్రమించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఆన్‌లైన్, క్యూఆర్‌కోడ్‌ల ద్వారా లావాదేవీలు చేపట్టేలా చర్యలు తీసుకుంది.

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా..**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికారులు రెండు జిల్లాల్లోని అన్ని పంచాయతీల పరిధిలో నగదు రహిత లావాదేవీలు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నగదురహితం ద్వారా అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలు అందించేందుకు సిబ్బందికి సైతం శిక్షణ ఇచ్చారు. కేవలం ప్రచార ఆర్భాటానికే కాకుండా నగదు రహిత లావాదేవీలు చేపట్టేందుకు జిల్లాలోని అన్ని పంచాయతీలకు బ్యాంకు ఖాతాలను ప్రారంభింపజేసి, అలాగే ఆయా బ్యాంకు ఖాతాలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌లను సైతం అందించారు. ఇకపై పంచాయతీల పరిధిలో ప్రజలు ఇంటి, కుళాయి, ప్రకటన పన్నులు వంటివి ఆన్‌లైన్ ద్వారా సులభంగా చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఏలూరు జిల్లాలో 547 పంచాయతీల పరిధిలో బ్యాంకు ఖాతాలను ప్రారంభించి 547 బ్యాంకు ఖాతాలకు అనుసంధానంగా 547 క్యూఆర్ కోడ్‌లను, పశ్చిమగోదావరి జిల్లాలో 406 పంచాయతీలకు గాను 406 బ్యాంకు ఖాతాలను ప్రారంభింపచేసి 406 క్యూఆర్‌కోడ్‌లను అందించారు. ఇక నుంచి ఆయా బ్యాంకు ఖాతాల్లో నేరుగా ప్రజలు పన్నుల సొమ్ములు జమచేసేలా చర్యలు తీసుకున్నారు.

**సులభంగా పన్నుల చెల్లింపు**

ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం ఎటుచూసినా నగదు రహితమే కొనసాగుతోంది. ప్రజలు ఏది కొనాలన్నా, ఏది తినాలన్నా నగదుతో పనిలేకుండానే కేవలం బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు ఉంటే సరిపోయేలా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటివి ఉపయోగించి నగదును సులభతరంగా బదిలీ చేస్తున్నారు. అలాగే పంచాయతీల్లో కూడా లావాదేవీలు జరిపేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రజల ముంగిళ్లలోనే సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇకపై పన్నుల సొమ్ములను గడప వద్దే ప్రజలు క్యూఆర్‌కోడ్ ద్వారా చెల్లించే సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిద్వారా ప్రజలు సులభంగా పన్నులు చెల్లించడంతో అవినీతికి తావులేకుండా సేవలు పొందవచ్చు.

**ప్రజల సౌకర్యార్థం**

ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా నగదుతో పనిలేకుండా నేరుగా పన్నులు చెల్లించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఏలూరు జిల్లావ్యాప్తంగా బ్యాంకు ఖాతాలను ప్రారంభించి పంచాయతీలకు క్యూఆర్ కోడ్‌లను సైతం అందించాం. ఈనెల 15 నుంచి ఈ విధానం అమలులోకి వచ్చింది. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, అవినీతికి తావులేకుండా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా పంచాయతీ అధికారి, ఏలూరు

# నిట్‌లో సీట్ల కోత

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో ఈ ఏడాది మొత్తం 270 సీట్లకు కోతపడింది. హోం స్టేట్ కోటాలో ఏకంగా ఏపీ విద్యార్థులు 135 మంది, అదర్ స్టేట్ కోటాలో దేశ వ్యాప్తంగా మరో 135 మంది విద్యార్థులు ఏపీ నిట్‌లో చేరే అవకాశం లేకుండా పోయింది. రెగ్యులర్ డైరెక్టర్ లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. డైరెక్టర్ లేకపోవడం, ఫ్యాకల్టీ కొరత వంటివి సీట్లపై ప్రభావం చూపింది. ఏపీ నిట్‌కు ఇంతకుముందు డైరెక్టర్‌గా వ్యవహరించిన సీఎస్‌పీ రావు పలు ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో సస్పెండయ్యారు. ఆ తర్వాత రెగ్యులర్ డైరెక్టర్ ఇప్పటివరకు లేరు. నిట్ ఫైలుపై చిన్న సంతకం కావాలన్నా ఇన్‌చార్జిగా ఉన్న నాగపూర్ నిట్ డైరెక్టర్ కోసం కూడా నాగపూర్ వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రభావం నిట్ అభివృద్ధిపై నేరుగా పడింది. ఈ విద్యాసంవత్సరంలో నిట్‌లో 270 సీట్లకు కోత పడింది.

**అభివృద్ధిలో దూసుకుపోతున్న సమయంలో**

ఏపీ నిట్ దూసుకెళ్తున్న తరుణంలో నిట్ డైరెక్టర్‌పై అవినీతి ఆరోపణలు రావడం నిట్ ప్రతిష్టపై ప్రభావం చూపింది. సస్పెండైన నిట్ డైరెక్టర్ స్థానంలో నాగపూర్ నిట్ డైరెక్టర్ ప్రమోద్ పడోలేను ఆరు నెలలు ఇన్‌చార్జిగా నియమించారు. ఆ గడువు ముగియడంతో దానిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఈలోగా డైరెక్టర్ నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. డైరెక్టర్ నియామక ప్రక్రియ మినహా మిగిలిన తంతు ముగిసింది. ఇది జరుగుతున్న తరుణంలోనే జరిగిన బోర్డు ఆఫ్ గవర్నెన్స్ సమావేశంలో ఫ్యాకల్టీ కొరత కారణంగా ఏపీ నిట్ సీట్లను తగ్గించే ప్రతిపాదన రావడం, ఇన్‌చార్జి డైరెక్టర్ అంగీకరించడంతో విద్యార్థులకు తీరని అన్యాయం జరిగింది.

**ఫ్యాకల్టీ లేకపోవడమే కారణం**

ఏపీ నిట్‌లో ప్రస్తుతం 2,300 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం 12 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ ఉండాలి. కనీసం 15 మంది విద్యార్థులకు ఒక ఫ్యాకల్టీ ఉన్నా నాణ్యమైన విద్యను అందించగలరు. ప్రస్తుతం ఏపీ నిట్‌లో 43 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారు. 120 మంది అడహాక్ ఫ్యాకల్టీ ఉన్నారు. కొత్త ఫ్యాకల్టీలను శాశ్వత ప్రాతిపదికన నియమించకపోవడంతో 150 మంది విద్యార్థులను కూడా ఒకే తరగతిలో ఉంచి విద్యను బోధించే పరిస్థితి వచ్చింది. ఏపీ నిట్ ఏర్పాటు సమయంలో 480 సీట్లు కేటాయించారు. వరంగల్ నిట్‌లో ఉన్న సూపర్ న్యూమరరీ సీట్లు 120 సీట్లను ఏపీ నిట్‌కు ఇచ్చారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 150 సీట్లు వచ్చాయి. గత విద్యాసంవత్సరం వరకు ఈ దామాషాలోనే సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగింది.

## క్లుప్తంగా...

### నేడు సీఎం జగన్ విజయవాడ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ ఈ నెల 18న (శుక్రవారం) విజయవాడలో పర్యటించనున్నారు. హయత్ ప్లేస్ హోటల్‌ను వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు. ఉదయం 10.45 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి విజయవాడ గుణదలలో నూతనంగా నిర్మించిన హయత్ ప్లేస్ హోటల్‌ను ప్రారంభిస్తారు. అనంతరం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

### విజయనగరం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు భవనాలు సిద్ధం



ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: విజయనగరం వైద్యకళాశాలలో తరగతుల నిర్వహణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. రూ. 500 కోట్లతో చేపట్టిన కళాశాల భవన నిర్మాణపనులు దాదాపు పూర్తికావచ్చాయి. కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్లు 150 అందుబాటులో ఉండగా, రాష్ట్ర కోటాలో ఉన్న 63 సీట్ల భర్తీకి ఈ నెల 16న కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇది 19వ తేదీ వరకు కొనసాగనుంది. బుధ, గురువారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 22 సీట్లు భర్తీ అయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. మొదటి ఏడాది ఎంబీబీఎస్ విద్యార్థులకు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ తరగతుల నిర్వహణకు సంబంధించిన భవనాలు 90 శాతం పూర్తయ్యాయి. మరో పది రోజుల్లో ఇవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

### నేడు విశాఖలో ఏపీఈఆర్‌సీ క్యాంపు కార్యాలయం ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) క్యాంపు కార్యాలయం విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఆవరణలో శుక్రవారం ప్రారంభం కానుంది. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ఈఆర్సీ సభ్యులు ఠాకూర్ రామ్‌సింగ్, పీవీఆర్ రెడ్డి హాజరుకానున్నారు. కాగా, శనివారం ఉదయం ఈపీడీసీఎల్ సమావేశ మందిరంలో ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ కార్యక్రమం నిర్వహించనుంది. ప్రజల నుంచి సలహాలు, సూచనల్ని స్వీకరించనుంది.

### మహిళా వర్సిటీకి 35వ ర్యాంక్



ర్యాంక్ పత్రంతో వీసీ భారతి, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ప్రతిష్టాత్మక ఇండియా టుడే జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 35వ ర్యాంక్ సాధించింది. ప్రభుత్వ యూనివర్సిటీల కేటగిరీలో పద్మావతి వర్సిటీకి ఈ ర్యాంక్ లభించింది. ఈ సందర్భంగా గురువారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే ఉన్నత ర్యాంక్ సాధించేలా కృషి చేసిన ఐక్యూ ఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ త్రిపుర సుందరి, ఆమె బృందాన్ని అభినందించారు. బోధన, బోధనేతర సిబ్బంది కృషితో వర్సిటీ 35వ ర్యాంక్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ వెంకటకృష్ణ, ప్రొఫెసర్ విద్యావతి, ప్రొఫెసర్ సీత తదితరులు పాల్గొన్నారు.

### హిందూస్థాన్ షిప్‌యార్డు రికార్డ్

10 నెలల్లోనే 'సాగర్‌భూషణ్' సిద్ధం



సీ ట్రయల్స్ పూర్తి చేసుకున్న సాగర్‌భూషణ్ డ్రిల్ షిప్

సాక్షి, విశాఖపట్నం : భారీ నౌకల మరమ్మతుల విషయంలో హిందూస్థాన్ షిప్‌యార్డు ఎప్పటికప్పుడు తన రికార్డుని మెరుగుపరుచుకుంటోంది. కేవలం 10 నెలల వ్యవధిలో భారీ డ్రిల్ షిప్ మరమ్మతులు పూర్తి చేసి మరో ఘనతను హెచ్ఎస్ఎల్ సొంతం చేసుకుంది. ఓఎన్‌జీసీకి చెందిన డ్రిల్ షిప్ సాగర్ భూషణ్ మరమ్మతుల కోసం 2022 నవంబర్‌లో షిప్‌యార్డుకు వచ్చింది. కేవలం 10 నెలల్లో మరమ్మతులు పూర్తి చేసిన షిప్‌యార్డ్.. షెడ్యూల్ ప్రకారం మొదటి విడత సీ ట్రయల్‌ని గురువారం విజయవంతంగా పూర్తి చేసింది. ప్రధాన మరమ్మతులన్నీ పూర్తిచేసినట్లు హెచ్ఎస్ఎల్ సీఎండీ హేమంత్ ఖత్రి వెల్లడించారు. సాగర్‌భూషణ్ మరమ్మతులకు 1,500 టన్నులకు పైగా స్టీల్ వినియోగించినట్లు తెలిపారు. షిప్‌యార్డు సిబ్బంది, ఎంఎస్ఎంఈలకు ఖత్రి అభినందనలు తెలిపారు.

# ఎంఎస్ఎంఈల్లో ఎగుమతులపై దృష్టి

## నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- మెరుగైన మార్కెటింగ్.. క్లస్టర్ల వారీగా మౌలిక వసతులు
- విదేశాల్లో అమలు చేస్తున్న విధానాలనూ పరిశీలించాలి
- తక్కువ రేటుకే విద్యుత్, రుణాలు అందిస్తే నిలదొక్కుకుంటాయి
- పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనుల్లో వేగం పెరగాలి



సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేస్తూ అంతర్జాతీయ మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకునేలా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. గురువారం పోర్టులు, ఫిషింగ్ హార్బర్లపై సమీక్ష సందర్భంగా అత్యధికంగా ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈలకు ఊతమివ్వడంపై సీఎం జగన్ కీలక సూచనలు చేశారు. ఇతర దేశాల్లో ఎంఎస్ఎంఈల నిర్వహణ, నాణ్యమైన ఉత్పాదకాల తయారీ విధానాలను పరిశీలించి మనవద్ద అమల్లోకి తేవాలని ఆదేశించారు. వినూత్న ఉత్పాదనలు, సాంకేతిక పరిజ్ఞానం బదిలీపై దృష్టి సారించాలన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఆయా విధానాలను అందుబాటులోకి తేవడం ద్వారా ఎంఎస్ఎంఈలకు చేయూతనిచ్చేలా కార్యక్రమాలను మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. తక్కువ ధరకు విద్యుత్‌తో పాటు తక్కువ వడ్డీకే రుణాలు అందించగలిగితే పోటీ ప్రపంచంలో ఎంఎస్ఎంఈలు నిలదొక్కుకుంటాయని, ఈ దిశగా అధికారులు చొరవ చూపాలని నిర్దేశించారు. ఎంఎస్ఎంఈల్లో పర్యావరణ అనుకూల విధానాలకు పెద్దపీట వేయాలని కోరారు. క్లస్టర్లుగా విభజించడం ద్వారా మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని పేర్కొంటూ హ్యాండ్‌లూమ్స్, గ్రానైట్ రంగాల్లో ఎంఎస్ఎంఈలను క్లస్టర్లుగా విభజించాలని సూచించారు. రాష్ట్రంలో రూ.15,375 కోట్లతో చేపట్టిన నాలుగు పోర్టుల నిర్మాణ పనుల్లో పురోగతి, పది ఫిషింగ్ హార్బర్లు, ఫిష్‌ల్యాండ్ సెంటర్ల నిర్మాణ పనుల గురించి సమావేశంలో అధికారులు వివరించారు. ప్రాజెక్టుల వారీగా పురోగతిని సీఎం అడిగి తెలుసుకున్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. మంచినీళ్లపేట ఫిషింగ్ హార్బర్‌ను తొలి దశలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### 4 పోర్టుల పురోగతి ఇలా

#### రామాయపట్నం

- ఇప్పటికే సౌత్ బ్రేక్ వాటర్, నార్త్ బ్రేక్‌వాటర్ పనులు దాదాపుగా పూర్తి.
- సెప్టెంబరు కల్లా డ్రెడ్జింగ్, రెక్లిమేషన్ పనులు పూర్తి.
- రామాయపట్నం తొలిదశలో నాలుగు బెర్తులు ఏర్పాటు. తద్వారా ఏటా 34 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో రవాణా లక్ష్యం.
- అంతిమంగా 19 బెర్తులు, 138 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో రవాణా లక్ష్యంగా రామాయపట్నం పోర్టు నిర్మాణం.
- రామాయపట్నం పోర్టు అన్ని దశలతో కలిపి మొత్తం నిర్మాణ వ్యయం అంచనా రూ.3,736 కోట్లు.

#### మచిలీపట్నం పోర్టు

- తొలిదశలో 4 బెర్తులు ఏర్పాటు. తొలివిడతలో 35 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో రవాణా.
- అంతిమంగా 16 బెర్తులతో 115 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో రవాణా సామర్థ్యంతో నిర్మాణం కానున్న మచిలీపట్నం పోర్టు.
- అన్ని దశలతో కలిపి బందరు పోర్టు మొత్తం నిర్మాణ వ్యయం రూ.5,155 కోట్లు.
- ప్రస్తుతం చురుగ్గా పనులు. కొనసాగుతున్న నార్త్ బ్రేక్ వాటర్, సౌత్ బ్రేక్ వాటర్ పనులు.
- కొనసాగుతున్న గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పనులు.

#### మూలపేట పోర్టు

- శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న మూలపేట పోర్టులో సౌత్ బ్రేకింగ్ వాటర్ పనులు ప్రారంభం.
- తొలిదశ కింద 4 బెర్తుల ఏర్పాటు. ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్న 1, 2 బెర్తుల నిర్మాణం.
- తొలిదశలో ఏడాదికి 23 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో రవాణా.
- అంతిమంగా 10 బెర్తులు ఏర్పాటు. ఏటా 83 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో రవాణా సామర్థ్యం.
- అన్ని దశలతో కలిపి మూలపేట పోర్టు నిర్మాణ వ్యయం రూ.4,361 కోట్లు.

#### కాకినాడ గేట్‌వే పోర్టు..

- ఫేజ్ -1 కింద మూడు బెర్తుల ఏర్పాటు.
- తొలిదశలో ఏటా 16 మిలియన్ మెట్రిక్ టన్నుల రవాణా.
- మొత్తంగా 60 మిలియన్ మెట్రిక్ టన్నుల రవాణాకు విస్తరణ.
- ఇప్పటికే 1.1 కి.మీ. మేర సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణ పనులు.
- అన్ని దశలతో కలిపి కేజీపీఎల్ నిర్మాణ వ్యయం రూ.2,123 కోట్లు.

### ఫిషింగ్ హార్బర్లు..

- తొలిదశలో ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం.
- జువ్వలదిన్నెలో 86 శాతం పనులు పూర్తి, నిజాంపట్నంలో 62 శాతం, మచిలీపట్నంలో 56.22 శాతం, ఉప్పాడలో 55.46 శాతం పూర్తైన పనులు.
- మరో 40 రోజుల్లో సిద్ధం కానున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్.
- మొదటి దశలోని ఫిషింగ్ హార్బర్లన్నీ డిసెంబర్ కల్లా పూర్తి.
- రెండోదశలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, ఓడరేవు, బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం. (మంచినీళ్లపేట ఫిషింగ్ హార్బర్‌ను తొలి దశలోనే పూర్తి చేయాలని తాజాగా సీఎం జగన్ ఆదేశం) మొత్తంగా 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం.

### ఫిష్ ల్యాండ్ సెంటర్లు

నెల్లూరు జిల్లా నేలటూరులో జెట్టీ నిర్మాణం, భీమిలి, అనకాపల్లి జిల్లా రాజయ్యపేట, విజయనగరం జిల్లా చింతపల్లి, తిరుపతి జిల్లా రాయదరువు, అనకాపల్లి జిల్లా దొండవాక, కాకినాడ జిల్లా ఉప్పలంకలో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఏపీ బాటలో కేంద్రం..

**గ్రామాల్లో మౌలిక వసతులకు కేంద్రం అడుగులు**

- పీఏసీఎస్‌లలో ప్రపంచ స్థాయి ఆహార ధాన్యాల నిల్వ సౌకర్యం
- వరల్డ్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో ఆచంట పీఏసీఎస్ ఎంపిక
- దీనికి అనుబంధంగా పెద్దఎత్తున మౌలిక వసతులు
- రూ.86.20 లక్షలతో 500 మెట్రిక్ టన్నుల గోదాము నిర్మాణం
- రూ.1.13 కోట్లతో గంటకు రెండు టన్నుల సార్టెక్స్ రైస్‌ను ఉత్పత్తి చేసే అత్యాధునిక రైస్‌మిల్లు కూడా..
- కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద కిసాన్ డ్రోన్ ఏర్పాటు



సాక్షి, అమరావతి : ఏపీలో మాదిరిగానే గ్రామస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం కూడా నడుంబిగించింది. ఆర్బీకేలకు అనుబంధంగా గోదాములతో పాటు పెద్దఎత్తున మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నట్లుగానే కేంద్రం కూడా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్)కు అనుబంధంగా వసతుల కల్పనకు కార్యాచరణ సిద్ధంచేసింది. ఇందులో భాగంగా సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ, మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టు (వరల్డ్స్ లార్జెస్ట్ గ్రెయిన్ స్టోరేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు)కు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు కింద తొలిదశలో దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 12 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఎంపిక చేసింది. ఈ ప్రాజెక్టు కింద పీఏసీఎస్ స్థాయిలో గోదాముతో పాటు అత్యాధునిక రైస్‌మిల్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనుంది. ఇందుకోసం రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలోని మృత్యుంజయ సహకార సమితి పీఏసీఎస్‌ను ఎంపిక చేశారు. సొసైటీ ఆదాయ, వ్యయాల ఆధారంగా ఈ పీఏసీఎస్‌కు అన్ని విధాలుగా వయబులిటీ ఉందని గుర్తించి దీనిని ఎంపిక చేశారు.

**డీపీఆర్ తయారీ..**

ఇక జాతీయస్థాయిలో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న నాబ్‌స్కాన్ ఈ ప్రాజెక్టు కోసం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారుచేసింది. ఈ బృందం ఇటీవలే ఆచంట పీఏసీఎస్‌ను సందర్శించి సంతృప్తి కూడా వ్యక్తంచేసింది. ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన రెండెకరాల భూమిలో సాయిల్ టెస్టింగ్ చేశారు. ఇక ఈ ప్రాజెక్టు కింద..

- రూ.2.14 కోట్ల అంచనాతో ఆహార ధాన్యాల నిల్వకోసం అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పించబోతున్నారు.
- రూ.86.20 లక్షల అంచనా వ్యయంతో.. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన గోదాము నిర్మిస్తారు.
- రూ.1,12,86,000 అంచనా వ్యయంతో గంటకు రెండు టన్నుల సామర్థ్యంతో కూడిన అత్యాధునిక కలర్ సార్టెక్స్ రైస్‌మిల్‌ను నిర్మిస్తారు.
- ఏన్సలరీ, సపోర్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.14.06 లక్షల అంచనాతో విద్యుత్, అగ్నిమాపక సౌకర్యాలు కల్పిస్తారు.
- అంతేకాక.. పీఏసీఎస్‌కు ప్రత్యేకంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రూ.1.18 లక్షల అంచనాతో డ్రోన్‌ను కూడా సమకూరుస్తారు.
- ఈ ప్రాజెక్టు కింద చేపట్టే వ్యయంలో 20% (రూ.42.86 లక్షలు) సొసైటీ సమకూర్చుకుంటే, మిగిలిన 80% (రూ.171.44 లక్షలు) ఆప్కాబ్ ద్వారా ప్రభుత్వం రుణం సమకూరుస్తుంది.
- ఈ ప్రాజెక్టుకు ఆగస్టు మూడో వారంలో శంకుస్థాపన చేస్తారు. నవంబరు నెలాఖరుకల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

**ఏపీ బాటలోనే..**



ఏపీ బాటలోనే పీఏసీఎస్ స్థాయిలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాలన్న సంకల్పంతో కేంద్రం ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. దీనికి ఆచంట పీఏసీఎస్‌ను ఎంపిక చేసింది. ఇక్కడ రూ.2.14 కోట్లతో గోదాము, రైసుమిల్లు, ఇతర వసతులు కల్పిస్తారు. – అహ్మద్ బాబు, కమిషనర్, సహకార శాఖ

# పారిశ్రామిక పార్కుల్లో 16.2 శాతం భూమి ఎస్సీలకు

- ఎస్టీలకు 6 శాతం, ఎంఎస్ఎంఈలకు 15 శాతం భూమి కేటాయింపు
- యాంకర్ యూనిట్లకు 25 శాతం తక్కువ ధరకు భూమి
- 33 ఏళ్లకు లీజుకు భూమి.. ఆ తర్వాత పెంచుకోవచ్చు
- ఏపీఐఐసీ భూ కేటాయింపులపై నూతన మార్గదర్శకాలు జారీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) అభివృద్ధి చేసే పారిశ్రామిక పార్కుల్లో ఎస్సీ పారిశ్రామికవేత్తలకు 16.2 శాతం, ఎస్టీలకు 6 శాతం భూమి తప్పనిసరిగా కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ మేరకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. నూతన పారిశ్రామిక పాలసీ 2023 -27 కింద వివిధ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులకు ఏపీఐఐసీ భూ కేటాయింపులకు ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్స్ అలాట్‌మెంట్ రెగ్యులేషన్ 2020 కింద కేటాయించిన భూములకు ఈ కొత్త నిబంధనలు వర్తించవని, తాజాగా చేసిన కేటాయింపులకు మాత్రమే వర్తిస్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా మార్గదర్శకాల ప్రకారం.. పారిశ్రామిక పార్కుల్లో 10 శాతం భూమిని కామన్ ఫెసిలిటీ సెంటర్, 5 శాతం వాణిజ్య ప్లాట్స్‌కు కేటాయించాలి. ఎంఎస్ఎంఈలకు 15 శాతం కేటాయించాలి. రూ.500 కోట్ల పైబడి పెట్టుబడితో కనీసం 1,000 మందికి ఉపాధి కల్పిస్తూ కనీసం మరో ఐదు అనుబంధ యూనిట్లు వచ్చే యాంకర్ యూనిట్లకు 25 శాతం తక్కువ ధరకు భూమి కేటాయిస్తారు. మండలస్థాయిలో ఏర్పాటు చేసే యాంకర్ యూనిట్లకు 20 నుంచి 33 శాతం వరకు తగ్గింపు ఇస్తారు. 33 ఏళ్లపాటు లీజుకు భూమిని ఇస్తారు. ఆ తర్వాత లీజును 66, 99 సంవత్సరాలకు పెంచుకోవచ్చు. ఉత్పత్తి ప్రారంభించి 10 ఏళ్లు దాటి నిబంధనలను పూర్తి చేసిన యూనిట్లకు ఆ భూమిని కొనుక్కొనే హక్కు కల్పిస్తారు.

**వివిధ కంపెనీలకు భూకేటాయింపులు**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రోత్సాహక విధానంలో భాగంగా వివిధ పరిశ్రమలకు భూములను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పలు ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వట్ల గ్రామం వద్ద ఉన్న రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీని సంజమల రైల్వే స్టేషన్‌కు అనుసంధానిస్తూ రైల్వే లైన్ నిర్మాణం కోసం 211.49 ఎకరాలు కేటాయించింది. ఎన్టీఆర్ జిల్లా మల్లవల్లి వద్ద బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుకు అవిశా ఫుడ్స్‌కు 101.81 ఎకరాలు, విజయనగరం జిల్లా బొబ్బిలి వద్ద సత్య బయోఫ్యూయల్‌కు 30 ఎకరాలు కేటాయించింది. తిరుపతిలో హిందుస్థాన్ స్టీల్ వర్క్స్‌కు కేటాయించిన 50.71 ఎకరాల యూనిట్ పూర్తి కావడానికి గడువును పెంచింది. కియా వెండర్స్‌కు రాయితీలకు సంబంధించిన విధివిధానాలు, శ్రీకాళహస్తి వద్ద ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ (గతంలో శ్రీకాళహస్తి పైప్స్) కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఫెర్రో అల్లాయిస్ యూనిట్‌కు, గుంటూరు టెక్స్‌టైల్ పార్క్, తారకేశ్వర టెక్స్‌టైల్ పార్కులకు వాటి పెట్టుబడి, ఉద్యోగ కల్పన ఆధారంగా టైలర్‌మేడ్ రాయితీలను ప్రకటించింది.

# ఉన్నత విద్యలో గేమ్ చేంజర్

▶ మొదటి పేజీ తరువాయి

ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు రూపొందించిన ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులతో రాష్ట్ర వర్సిటీ కోర్సులను మిళితం చేసి ఉత్తమ విద్య అందించేలా రోడ్ మ్యాప్ రూపొందించనున్నారు. ఎడెక్స్ ఒప్పందాన్ని ఉన్నత విద్యలో గేమ్ ఛేంజర్‌గా సీఎం జగన్ అభివర్ణించారు. ప్రపంచంలో అనూహ్యంగా మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి వివిధ రకాల సబ్జెక్టులను ఉచితంగా నేర్చుకునే అవకాశం మన విద్యార్థులకు దక్కుతుందన్నారు. విదేశాలకు వెళ్లి చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన వర్సిటీలు రూపొందించిన కోర్సులను సులభంగా నేర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

### టాప్ ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్..

'ఎడెక్స్' ప్రపంచంలో ప్రముఖ ఈ-లెర్నింగ్ ప్లాట్‌ఫామ్. ఇది 170కిపైగా టాప్ ర్యాంకింగ్ విద్యాసంస్థల నుంచి ఆన్‌లైన్ కోర్సులను అందిస్తోంది. ఇందులో 37 టాప్ 50 విశ్వవిద్యాలయాలున్నాయి. ప్రపంచంలోనే టాప్-4 వర్సిటీలైన ఎంఐటీ, హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ కూడా ఉన్నాయి. ఎడెక్స్ ఓపెన్ సోర్స్ ప్లాట్‌ఫామ్‌ను మన రాష్ట్ర విద్యార్థులు ఉచితంగా ఉపయోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖతో కలసి ఎడెక్స్ పని చేస్తుంది.

### మెరుగైన ఉపాధి, ఉద్యోగాలు

రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను ఉచితంగా నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఈ కోర్సులు చేసిన విద్యార్థులకు హార్వర్డ్, ఎంఐటీ, కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ వంటి వర్సిటీలతో ఎడెక్స్ సంయుక్త సర్టిఫికేషన్ లభిస్తుంది. ఇది మన విద్యార్థుల ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మరింత మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా దేశంలో అందుబాటులో లేని ఎన్నో కోర్సులను ఎడెక్స్ అందిస్తుంది. వివిధ కోర్సులకు సంబంధించి అందుబాటులో లేని బోధనా సిబ్బంది కొరతను దీని ద్వారా అధిగమించవచ్చు. ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులతో పాటు ఆర్ట్స్, కామర్స్‌లో పలు రకాల సబ్జెక్టులకు చెందిన కోర్సులను ఎడెక్స్‌తో ఒప్పందం ద్వారా అందుబాటులోకి తెస్తున్నాం. ఇది ఉన్నత విద్యలో గొప్ప మార్పులకు దారితీస్తుంది. ఈ క్రమంలో ఉన్నత విద్య సిలబస్‌ను పూర్తిస్థాయిలో పునఃపరిశీలన చేసి అన్ని విభాగాల్లోని కోర్సులను రీ డిజైన్ చేయాలి. ఆధునికతను అందిపుచ్చుకుంటూ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా కోర్సులను తీర్చిదిద్దాలి. కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్ పెట్టాలి. తద్వారా విద్యార్థి తనకు కావాల్సిన వర్టికల్‌ను చదువుకునే అవకాశం ఇవ్వాలి. ఇప్పుడున్న ప్రతి కోర్సునూ, అందులో ఉన్న సబ్జెక్టులను పూర్తిగా మార్పు చేయాలి. ఇందుకోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేద్దాం.

### నైపుణ్యంతో రాణించేలా..

విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్‌గా ఎదిగేందుకు ప్రపంచంలో చోటు చేసుకుంటున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా సిద్ధం చేయాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్, డేటా అనలిటిక్స్, వర్చువల్ రియాలిటీ, అగ్మెంటెడ్ రియాలిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, క్వాంటం కంప్యూటింగ్ లాంటివి ప్రస్తుతం ప్రపంచంలో అభివృద్ధి చెందిన టెక్నాలజీ. ఈ మొత్తం సబ్జెక్టు నేర్చుకోవాలంటే బోధనా విధానంతో పాటు అందుబాటులో ఉన్న కంటెంట్‌ను మెరుగుపరచాలి. ప్రపంచంలో అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన అత్యుత్తమ అధ్యాపకులతో మన విద్యార్థులకు బోధించేలా ఎడెక్స్‌తో ఒప్పందం దోహదం చేస్తుంది. టీచింగ్, లెర్నింగ్ కోసం కొత్త టెక్నాలజీ, బోధనా విధానాలను ఎడెక్స్, ఏపీ ఉన్నత విద్యాశాఖ సంయుక్తంగా రూపొందించనున్నాయి. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన శిక్షణ, అభ్యాసన నైపుణ్యాలను అందించడంలో ఎడెక్స్ సహకరిస్తుంది. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను గుర్తించి స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులను సమకూరుస్తుంది.

### సీఎం జగన్ విజన్ గొప్పది

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్ చాలా గొప్పది. విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద విద్యార్థుల కోసం ప్రపంచం మెచ్చిన అత్యుత్తమ వర్సిటీల నుంచి ఉత్తమ కోర్సులను, నిపుణులైన అధ్యాపకులతో బోధన అందించాలని తపిస్తున్నారు. టెక్నాలజీతో కూడిన విద్య అందించడం ద్వారానే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని దూరదృష్టితో గుర్తించారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్య అందించాలనే సంకల్పంతో ఎడెక్స్‌ను ఆహ్వానించారు. ఈ ఒప్పందం ద్వారా ఏపీ విద్యార్థులు దాదాపు వెయ్యికి పైగా కోర్సులను ఆర్ట్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, లా, సైకాలజీ, బయాలజీ, మెడిసిన్ లాంటి అనేక విభాగాల్లో చదువుకోవచ్చు. ఆధునికతకు తగ్గట్టుగా పాఠ్యాంశాల రూపకల్పన, కొత్త సాంకేతిక నిపుణులను సృష్టించడం, ఇప్పటికే ఉన్న కోర్సుల పునరుద్ధరణ, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ తదితర అంశాలపై ఏపీతో కలసి పనిచేస్తాం. ఎడెక్స్ ద్వారా టాప్ వర్సిటీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి సర్టిఫికేషన్ లభిస్తుంది.
– అనంత్ అగర్వాల్, ఎడెక్స్ వ్యవస్థాపకుడు

### మన విద్యార్థులకు ప్రయోజనం ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ఎడెక్స్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ద్వారా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఎంఐటీ, హార్వర్డ్ లాంటి అత్యున్నత స్థాయి సంస్థలు అందించే పలు కోర్సులను ఆన్‌లైన్‌లో అభ్యసించే అవకాశం మన విద్యార్థులకు లభిస్తుంది. ఈ సంస్థలు అందించే సర్టిఫికెట్లు, క్రెడిట్ల ద్వారా మన విద్యార్థులకు మంచి వేతనాలతో కూడిన ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయి. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న మేజర్ కోర్సులతో పాటు మైనర్ కోర్సులుగా వీటిని అమలు చేయనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యాసంస్థల్లో పలు కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సంస్కరించి పైథాన్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటివి సిలబస్‌లో చేర్చింది. ఈ మేరకు కరిక్యులమ్ సిద్ధమైనా బోధనా సిబ్బంది తగినంతగా అందుబాటులో లేనందున విద్యార్థులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందడం లేదు. ఈ నేపథ్యంలో ఎడెక్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా మన విద్యార్థులు వరల్డ్‌క్లాస్ వర్సిటీలు, ఇతర విద్యాసంస్థలు అందించే కోర్సులను రెగ్యులర్ కోర్సులతో పాటుగా అభ్యసించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మేజర్ కోర్సుల సర్టిఫికెట్లు, క్రెడిట్లతోపాటు ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ విద్యాసంస్థల నుంచి మైనర్ కోర్సుల సర్టిఫికెట్లు, క్రెడిట్లు కూడా విద్యార్థుల ఖాతాలో జమ కానున్నాయి. తద్వారా చదువు పూర్తయిన అనంతరం అవకాశాలను గరిష్టంగా అందుకోగలుగుతారు.

### చదువుల్లో సమూల సంస్కరణలు..

విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి కార్పొరేట్ స్థాయి చదువులను పేద విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. జగనన్న విద్యా దీవెన (తల్లుల ఖాతాలకు 100 శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్), జగనన్న వసతి దీవెన (రూ.20 వేల వరకు హాస్టల్, బోర్డింగ్ ఖర్చుల కోసం), జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాల ద్వారా పోస్ట్ మెట్రిక్ స్థాయి చదువులకు అడుగడుగునా అండగా నిలుస్తున్నారు. విదేశీ విద్యా దీవెన ద్వారా క్యూఎస్/టైమ్స్ ర్యాంకింగ్‌లో టాప్ 50 విద్యా సంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఆన్‌లైన్ వర్టికల్స్, తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌లు, నాలుగేళ్ల డిగ్రీ, జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తెచ్చారు. ఈ క్రమంలో ఎడెక్స్‌తో సరికొత్త విద్యా విప్లవాన్ని ప్రారంభించారు.

# వచ్చే నెలలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభం

- ఆరోగ్యశ్రీ క్యాన్సర్ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా క్యాంపులు
- తిరుపతి, అనకాపల్లి జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి, బాధితులకు మెరుగైన చికిత్స అందించి మరణాలను కట్టడి చేయడానికి గ్రామస్థాయిలోనే సెప్టెంబర్ నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ఏటా 70వేల క్యాన్సర్ కేసులు కొత్తగా నమోదవుతున్నాయి. 38 వేల మందికి పైగా మరణిస్తున్నట్లు అంచనా. కొత్త కేసుల్లో 70 శాతం బాగా ముదిరిన తర్వాత మూడు, నాలుగు స్టేజిలలో గుర్తించినవే. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున స్క్రీనింగ్ నిర్వహించి ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి రోగులను తప్పించాలని సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు. కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్‌లో భాగంగా 50 కిలోమీటర్ల దూరంలోనే వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద క్యాన్సర్ చికిత్స అందించే నెట్‌వర్క్ ఆస్పత్రులు రాష్ట్రవ్యాప్తంగా 60కు పైగా ఉన్నాయి. వీటికి సమీపంలోని మండలాల్లోని గ్రామాల్లో 30 ఏళ్లు పైబడిన వారందరినీ పరీక్షిస్తారు. ఆ మండలాల్లో ప్రతి ఆస్పత్రి నెలకు మూడు స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించాలి. రొమ్ము, గర్భాశయ, ఊపిరితిత్తులు ఇతర క్యాన్సర్‌ల నిర్ధారణకు ప్రాథమిక పరీక్షలు చేస్తారు. అల్ట్రాసౌండ్, మామోగ్రామ్, కొలొనోస్కోపి, ఇతర పరికరాలతో కూడిన మొబైల్ స్క్రీనింగ్ యూనిట్(పింక్ బస్) ద్వారా నిర్వహిస్తారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ఆస్పత్రులకు తరలిస్తారు. అక్కడ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సేవలందిస్తారు. తొలుత స్విమ్స్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లాలో, వైజాగ్‌లోని హోమిబాబా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో అనకాపల్లి జిల్లాలో పైలెట్‌గా స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు. తిరుపతి జిల్లాలో 9.93 లక్షల మందికి, అనకాపల్లి జిల్లాలో 13.14 లక్షల మందికి స్క్రీనింగ్ చేస్తారు.

## సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు కన్నుమూత

**తెలంగాణ గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్, ఇతర ప్రముఖుల సంతాపం**


కృష్ణారావు(ఫైల్)

**హఫీజ్‌పేట్/సాక్షి, హైదరాబాద్:** సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు సీహెచ్‌వీఎం కృష్ణారావు (64) కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచారు. నాలుగు దశాబ్దాలపాటు పత్రికా రంగంలో కొనసాగిన ఆయన వివిధ మీడియా సంస్థల్లో పనిచేశారు. రాజకీయ వర్గాల్లో 'బాబాయ్'గా పేరుపొందిన ఆయన పూర్తిపేరు చిర్రావూరి వెంకట మాణిక్య కృష్ణారావు. 1959 ఆగస్టు 9న ఆయన జన్మించారు. పాత్రికేయ రంగంలో కృష్ణారావు ప్రయాణం 1975లో ఒక రిపోర్టర్‌గా ప్రారంభమైంది. ఆ తర్వాత ఒక్కో మెట్టు ఎక్కుతూ పైకి వచ్చారు. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్, ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికల్లో పనిచేశారు. డెక్కన్ క్రానికల్ పత్రికలో న్యూస్ బ్యూరో చీఫ్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. గతేడాది ఆయన క్యాన్సర్ బారిన పడ్డారు. కృష్ణారావుకు భార్య లక్ష్మి, కుమారుడు కిరీటి, కూతురు కిన్నెర ఉన్నారు. కృష్ణారావు మరణం పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. కృష్ణారావు మరణం తెలుగు రాష్ట్రాల్లో పత్రికా రంగానికి తీరనిలోటని పేర్కొన్నారు. కృష్ణారావు మరణ వార్త తెలుసుకున్న పలువురు రాజకీయ నాయకులు, జర్నలిస్టు ముఖ్యులు గోపన్‌పల్లి జర్నలిస్ట్‌కాలనీలోని ఆయన నివాసానికి చేరుకొని నివాళులు అర్పించారు.

**సీఎం జగన్ సంతాపం**

**సాక్షి, అమరావతి:** సీనియర్ జర్నలిస్ట్ సీహెచ్‌వీఎం కృష్ణారావు మృతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. తెలుగు, ఇంగ్లిష్ జర్నలిజంలో అత్యున్నత స్థాయికి ఎదిగిన కృష్ణారావు బాబాయిగా అందరికీ సుపరిచితులని గుర్తుచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## తిరుమల భద్రతకు తొలి ప్రాధాన్యత

**రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్త**

**తిరుమల:** తిరుమల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్త అన్నారు. తిరుమల భద్రతా కమిటీ ముఖ్య అధికారిగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయనను నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో తిరుమల భద్రతపై ఏర్పాటుచేసిన వివిధ విభాగాల నిపుణుల కమిటీ సిఫార్సులను ఎస్‌డబ్ల్యూ ఐజి శశిధర్ రెడ్డి, తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో అమలుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. తిరుమల భద్రతను మరింత పటిష్ట పరచేందుకు ఏఐ టెక్నాలజీతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానించనున్నట్లు తెలిపారు. టీటీడీ సీవీఎస్‌వో నేతృత్వంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి తిరుమలలో విధులు నిర్వహించే అన్ని విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తామన్నారు. భద్రతా సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శ్రీ దశ మహాగణపతిగా ఖైరతాబాద్ వినాయకుడు

- 69వ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతి 63 అడుగుల మట్టి వినాయకుడు
- శ్రీ దశ మహా విద్యా గణపతిగా నామకరణం
- 50 శాతం పనులు పూర్తి వినాయకచవితికి మూడు రోజుల ముందే దర్శనం



ఈ సంవత్సరం శ్రీ దశ మహా విద్యాగణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్న ఖైరతాబాద్ మహాగణపతి నమూనా

**ఖైరతాబాద్(హైదరాబాద్):** ప్రతి యేటా వివిధరూపాల్లో కొలువుదీరే హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయకుడు ఈ సంవత్సరం శ్రీ దశ మహావిద్యాగణపతిగా భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఖైరతాబాద్ గణేశ్ విగ్రహ ప్రతిష్ఠాపన 69వ సంవత్సరం సందర్భంగా మహాగణపతి 63 అడుగుల ఎత్తు, 23 అడుగుల వెడల్పులో ఉండే మహాగణపతి పక్కనే కుడివైపు వరాహాదేవి, ఎడమవైపు సరస్వతిమాత విగ్రహాలు పది అడుగుల ఎత్తు ఉండగా, మహాగణపతి 63 అడుగుల ఎత్తులో నాగశేషుపై నిలబడి ఉండే ఆకారంలో తలపై ఏడు పడగలు, 10 చేతులు ఉంటాయి. మహాగణపతి పక్కన కుడివైపు 18 అడుగుల ఎత్తులో లక్ష్మీ నరసింహస్వామి, ఎడమవైపు వీరభద్రస్వామి విగ్రహాలు ఉంటాయి. శ్రీ దశ మహావిద్యాగణపతిగా నామకరణం చేయడం ప్రత్యేకతగా ఉందని దివ్యజ్ఞాన సిద్ధాంతి విఠలశర్మ తెలిపారు. అమ్మవారి ఉపాసనలో దశ మహావిద్యలు అధిక ప్రాధాన్యత కలిగినవనీ, విద్యకు గణపతి అనుగ్రహం కావాల్సి ఉన్నందున దశ మహావిద్యాగణపతిగా నామకరణం చేసినట్లు తెలిపారు. వెల్డర్లు, కార్పెంటర్లు, ఆర్టిస్టులు మొత్తంగా 150 మంది విగ్రహ తయారీ పనుల్లో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు.

## కూరగాయలే ఎక్కువగా తినాలి

- రోజుకు తీసుకోవాల్సింది 240 గ్రాములు.. తీసుకుంటున్నది 145 గ్రాములే
- అంతర్జాతీయ కూరగాయల పరిశోధన కేంద్రం డైరెక్టర్ జనరల్ మార్కోవోపేరీస్



**రామచంద్రాపురం (పటాన్‌చెరు):** 'ఒక మనిషి నిత్యం 240 గ్రాముల కూరగాయలను ఆహారంగా తీసుకోవాలి..కానీ కేవలం 145 గ్రాములే తీసుకుంటున్నారని'అంతర్జాతీయ కూరగాయల పరిశోధన కేంద్రం డైరెక్టర్ జనరల్ డాక్టర్ మార్కో వోపేరీస్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం ఇక్రిశాట్‌లోని వరల్డ్ వెజిటేబుల్ సెంటర్ 50వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మార్కో వోపేరీస్ విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లోనూ జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకుంటున్నారని, నిత్యం కూరగాయలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటామని చెప్పారు. ఆదాయం తక్కువగా ఉన్న ప్రజలు సైతం ఎక్కువ మాంసాహారం తీసుకుంటున్నారని, అభివృద్ధి చెందిన ఫ్రాన్స్‌లాంటి దేశాల్లో సైతం కూరగాయలు ఎక్కువగా తినడం లేదన్నారు. తైవాన్, జపాన్, వియత్నాం, కొరియాలాంటి దేశాల్లో కూరగాయలను ఆహారంగా తీసుకునేవారి ఎక్కువ అని, భారత్‌లో అయితే 145 గ్రాముల కూరగాయలను మాత్రమే ఆహారంగా తీసుకుంటున్నారని తెలిపారు. కూరగాయల సాగులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటం వల్ల అవి తిన్నవారికి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. కూరగాయలు, పండ్లపై మరింత పరిశోధన జరగాలన్నారు. అవసరమైతే కూరగాయల నుంచి తీసిన జ్యూస్ భద్రపరచుకొని దానిని తీసుకోవచ్చన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులకు కూరగాయలు పండించే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ టీకే బెహెరా, ప్రపంచ విత్తనపరిశోధన సంస్థ రీజినల్ డాక్టర్ రామ్‌నాయర్ పాల్గొన్నారు.

# 'మార్గదర్శి'.. మరో 'అగ్రిగోల్డ్'..!




**సాక్షి, అమరావతి:** మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఒక మేడి పండు అన్న నిజం వెలుగు చూసింది. పొట్ట విప్పి చూస్తే ఆర్థిక అక్రమాలు గుట్టలు గుట్టలుగా బయటపడ్డాయి. ఫోర్జరీ సంతకాలతో మోసాలు..., చందాదారులకు తెలియకుండానే చిట్టీ పాటలు..., మేనేజ్‌మెంట్ టికెట్లు పేరిట బురిడీలు..., ఏజెంట్ల ద్వారా కనికట్టు..., బ్రాంచిల నుంచి ప్రధాన కార్యాలయానికి అక్రమంగా నిధులు మళ్లింపు..., నిధుల్లేక ఖాళీగా ఉన్న బ్యాంకు ఖాతాలు.. ఇలా మార్గదర్శి చిట్‌ఫండ్స్ లోగుట్టు ఆధారాలతో సహా వెలుగు చూసింది. చందాదారుల సొమ్ముతో రామోజీరావు అక్రమ వ్యాపార సామ్రాజ్యం విస్తరణకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఇం'ధనం'గా ఉపయోగపడుతోందన్నది రూఢీ అయ్యింది. అదే సమయంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ సొంత ఆర్థిక పరిస్థితి దినదిన గండంగా ఉందన్న అసలు వాస్తవం వెల్లడైంది. చందాదారుల సొమ్ముకు ఏమాత్రం భద్రత లేదన్న విషయం ఆధారాలతో సహా బయటపడింది. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మార్గదర్శి చిట్‌ఫండ్స్ మరో అగ్రిగోల్డ్ కానున్నదన్నది విస్పష్టమైంది. వేలాదిమంది మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు నిండా మునిగిపోయే ప్రమాదం ఉందన్న విషయం రూఢీ అయింది. రాష్ట్రంలో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 37 శాఖల్లో స్టాంపులు – రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు గురువారం సోదాలు చేశారు. ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో చేపట్టిన ఈ ఆకస్మిక సోదాల్లో సంస్థ ఆర్థిక అక్రమాలు భారీగా వెలుగులోకి వచ్చాయి. కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం, ఆర్‌బీఐ నిబంధనలే కాదు.. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కింద కూడా పలు నేరాలకు సంస్థ యాజమాన్యం పాల్పడినట్టు వెల్లడైంది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలపై ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు ఏ–1గా, మేనేజింగ్ డైరెక్టర్ శైలజ కిరణ్ ఏ–2గా, బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) ఏ–3గా సీఐడీ కేసు నమోదు చేసి, చార్జిషీటు కూడా దాఖలు చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్టాంపులు – రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల బృందాలు చేపట్టిన సోదాలు గురువారం అర్ధరాత్రి కూడా కొనసాగుతున్నాయి. ఈ సోదాలు మరో రెండు రోజులు కొనసాగే అవకాశాలున్నాయి.

**ఇదే పరిస్థితి కొనసాగితే బోర్డు తిప్పేయడమే**

విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో జరిగిన సోదాల్లో పలు విస్మయకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రామోజీరావు ఘనంగా చెప్పుకొనే ఈ సంస్థ ఆర్థికంగా కుదేలవుతుందనేందుకు స్పష్టమైన ఆధారాలు బయటపడ్డాయి. సంస్థ ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. అధికారులు సోదాలు చేస్తున్న 37 శాఖల బ్యాంకు ఖాతాల్లో వాటి చందాదారుల నిధులు లేవని వెల్లడైంది. అంటే చందాదారులు చెల్లించిన డబ్బును అక్రమంగా ప్రధాన కార్యాలయానికి తరలించేశారు. ఆ నిధులు ప్రధాన కార్యాలయం బ్యాంకు ఖాతాలో ఉన్నాయా అంటే అక్కడా లేవు. వాటిని గుట్టుచప్పుడు కాకుండా రామోజీరావు సొంత వ్యాపార సంస్థల్లో, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా మళ్లించేశారు. వెరసి రాష్ట్రంలోని 37 మార్గదర్శి శాఖల ఆర్థిక పరిస్థితి కుదేలైంది. ఆ శాఖల చందాదారులు చిట్టీ పాటలు పాడిన సొమ్ము (ప్రైజ్ మనీ)ని చెల్లించే స్థితిలో సంస్థ లేదన్న విషయం సోదాల్లో తేలింది. ఇది ఎన్నో ఏళ్లుగా ఉన్న పరిస్థితే అని కూడా స్పష్టమైంది. కొత్తగా చిట్టీ వేసే చందాదారులు చెల్లించే చందా మొత్తంతో పాత చిట్టీల చందాదారులు పాడిన ప్రైజ్‌మనీని చెల్లిస్తూ ఇన్నాళ్లూ సంస్థ కనికట్టు చేస్తోంది. కానీ కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982ను కచ్చితంగా పాటించాలని రాష్ట్ర చిట్ రిజిస్ట్రార్ స్పష్టం చేయడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ గత ఏడాది డిసెంబర్ నుంచి కొత్త చిట్టీ గ్రూపులు వేయడంలేదు. అంటే 9 నెలలుగా వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి. కొత్త చిట్టీలు, కొత్త చందాదారులు, కొత్తగా చందా మొత్తాలు రాక డిసెంబర్ ముందు మొదలు పెట్టిన వేలాది చందాదారులకు చిట్టీపాట ప్రైజ్‌మనీ చెల్లించడం మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు తలకుమించిన భారంగా పరిణమించింది. మరో వైపు చందాదారులకు చిట్టీపాట మొత్తం చెల్లించకుండా వాటిని అక్రమ డిపాజిట్లుగా మళ్లిస్తోంది. కాలపరిమితి తీరిన డిపాజిట్లు చందాదారులకు తిరిగి చెల్లించాలి. అందుకు కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ వద్ద నిధులు లేవు. ఈ పరిణామాల నేపథ్యంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైజ్‌మనీ, డిపాజిట్ల చెల్లింపు సందేహాస్పదంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే మూసివేతకు ముందు అగ్రిగోల్డ్ సంస్థ ఏ దుస్థితిలో ఉందో.. ప్రస్తుతం మార్గదర్శి చిట్‌ఫండ్స్ అదే ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటోందన్నది ఆధారాలతో సహా బయటపడినట్టు సమాచారం. మార్గదర్శి భవిష్యత్‌లో కూడా కోలుకునే అవకాశాలు కనిపించడంలేదు. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏ క్షణంలోనైనా బోర్డు తిప్పేస్తే చందాదారులు, డిపాజిట్‌దారులు నిండా మునిగిపోయే ప్రమాదం ఉందన్నది స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాల్లో బయటపడినట్టు తెలుస్తోంది. చందాదారులు, డిపాజిట్‌దారుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అనివార్యత కనిపిస్తోంది.

### మార్గదర్శి సహాయ నిరాకరణ

స్టాంపులు – రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ సోదాలకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ అడుగడుగునా ఆటంకాలు సృష్టించేందుకు యత్నించింది. అధికార బృందాలు లోపలికి రాకుండా సిబ్బంది వాగ్వాదానికి దిగారు. సోదాల సందర్భంగా కీలక రికార్డులు చూపించేందుకు సిబ్బంది నిరాకరించారు. అధికారుల బృందాలకు సహకరించవద్దని మార్గదర్శి ప్రధాన కార్యాలయం శాఖలకు ఫ్యాక్స్ ద్వారా ఆదేశించడం గమనార్హం. ఈనాడు పాత్రికేయులను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్యోగుల పేరిట కార్యాలయాల్లోపల మోహరించారు. వారు సోదాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈనాడు ప్రధాన కార్యాలయానికి చేరవేశారు. వారిచ్చిన సమాచారాన్ని వక్రీకరిస్తూ మీడియాలో వార్తలు ప్రసారం చేయడం ద్వారా అధికారుల బృందాలను బ్లాక్ మెయిల్ చేసేందుకు పన్నాగం పన్నారు. ఈ విధంగా సోదాలను అడ్డుకునేందుకు ఎంతగానో ప్రయత్నించారు. అయినప్పటికీ అధికారుల బృందాలు నిబంధనలను పాటిస్తూ సోదాలు కొనసాగిస్తున్నాయి.

**అన్నీ అక్రమాలే..**

ఇక చిట్టీ గ్రూపుల్లో మేనేజ్‌మెంట్ టికెట్ల చందాను మార్గదర్శి చిట్‌ఫండ్స్ వాస్తవంగా చెల్లించడమే లేదన్నది కూడా ఆధారాలతో వెల్లడైంది. ఏదైనా చిట్టీ గ్రూపులో కొన్ని టికెట్లు (సభ్యులు) ఖాళీగా ఉండిపోతే వాటిని మేనేజ్‌మెంట్ పేరిట నమోదు చేస్తారు. ఆ టికెట్ల చందా మొత్తాన్ని సంస్థ యాజమాన్యం చెల్లించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ 37 బ్రాంచిల్లోనూ సంస్థ పేరిట ఉన్న టికెట్ల చందాను చెల్లించడమే లేదు. అందుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలు ఏవీ రికార్డుల్లో నమోదు కానేలేదు. కానీ మేనేజ్‌మెంట్ టికెట్లకు చెల్లించాల్సిన డివిడెండ్లు, టికెట్ల పేరిట చిట్టీ పాట పాడి ప్రైజ్‌మనీని మాత్రం తీసుకుంటోంది. అంటే రామోజీరావు, ఆయన కుటుంబ సభ్యులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండానే.. అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తున్నట్టుగా కూడా వెల్లడైంది.

### కీలక పత్రాలు స్వాధీనం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలకు సంబంధించిన కీలక ఆధారాలను స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాలు, చిట్టీ గ్రూపుల చందాల వివరాలు, నిధుల మళ్లింపునకు సంబంధించిన పత్రాలు, ఫోర్జరీ సంతకాలు చేసిన రికార్డులు, హార్డ్ డిస్క్‌లను జప్తు చేసి పంచనామా నిర్వహించారు. తమ సంతకాలను ఫోర్జరీ చేసినట్టుగా చందాదారుల వాంగ్మూలాలను నమోదు చేశారు. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసులో సీఐడీ అధికారులు కీలక పురోగతి సాధించినట్లైంది. ఈ సోదాలు శుక్ర, శనివారాలు కూడా కొనసాగే అవకాశాలున్నాయి. దాంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయని భావిస్తున్నారు.

### ఫోర్జరీ సంతకాలతో యథేచ్ఛగా అక్రమాలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలకు పాల్పడుతోందన్నది పూర్తి ఆధారాలతో ఈ సోదాల్లో వెల్లడైంది. ఆ సంస్థ కేవలం చిట్‌ఫండ్స్ చట్టం, ఆర్‌బీఐ నిబంధనలే కాదు.. ఐపీసీ చట్టాలను కూడా ఉల్లంఘిస్తూ ఆర్థిక అక్రమాలు, మోసాలకు పాల్పడుతోంది. ప్రధానంగా చందాదారుల సంతకాలను ఫోర్జరీ చేసి మరీ అక్రమాలకు పాల్పడుతున్నట్టుగా అధికారులు గుర్తించినట్టు సమాచారం. చిట్టీ గ్రూపుల పాటలు నిర్వహిస్తే కనీసం ఇద్దరు సభ్యుల కోరం ఉండాలి. కానీ ఆ కోరం కూడా లేకుండానే చిట్టీ పాటలు నిర్వహిస్తోంది. అందుకోసం చందాదారులు వచ్చినట్టుగా వారి సంతకాలను మినిట్స్ బుక్‌లో ఫోర్జరీ చేస్తోంది. అంతేకాదు కొందరు చందాదారులు వారు రాలేనందున వారి తరఫున చిట్టీ పాటలో పాల్గొనేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఏజెంట్లకు అనుమతి (ఆథరైజేషన్) ఇచ్చినట్టుగా పత్రాలు కనిపించాయి. ఈ రెండు సందర్భాల్లోనూ చందాదారుల సంతకాలు ఫోర్జరీ చేసినట్టుగా అధికార బృందాలు గుర్తించాయి. ఆ సంతకాలు ఉన్న చందాదారులను అధికారులు సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. అసలు తాము ఎవరికీ ఆథరైజేషన్ ఇవ్వనేలేదని, తాము రాకున్నా వచ్చినట్టు మినిట్స్ బుక్‌లో నమోదు చేయడం ఏమిటని ఆ చందాదారులు తిరిగి ప్రశ్నించారు. అవి తమ సంతకాలు కావని, ఫోర్జరీవి అని స్పష్టం చేశారు. ఆ చందాదారుల అసలు సంతకాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ రికార్డుల్లో ఉన్న సంతకాలతో పోల్చి చూడగా అవి ఫోర్జరీ అనే విషయం స్పష్టమైంది. ఆ విధంగా ఏకంగా 70 శాతం చందాదారుల సంతకాలు ఫోర్జరీయేనని అధికారులు గుర్తించారు. ఫోర్జరీ సంతకాలతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ దశాబ్దాలుగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు వెల్లడైంది.

## రామోజీ, శైలజాకిరణ్ మళ్లీ డుమ్మా

- సీఐడీ విచారణకు మళ్లీ ముఖం చాటేసిన వైనం
- రాష్ట్రంలో జరిగిన నేరం కాబట్టి ఇక్కడే విచారణకు పిలుపు
- రెండోసారి నోటీసులు జారీ చేసినా బేఖాతరు
- తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి

**సాక్షి, అమరావతి:** మార్గదర్శి చిట్ ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–1గా ఉన్న చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ మరోసారి సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. విచారణకు హాజరు కావాలని సీఐడీ రెండోసారి నోటీసులు జారీ చేసినప్పటికీ బేఖాతరు చేశారు. తద్వారా దర్యాప్తునకు ఏమాత్రం సహకరించే ప్రసక్తే లేదన్న వైఖరిని పునరుద్ఘాటించారు. కేంద్ర చిట్ ఫండ్ చట్టం, ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల నిధులను మళ్లించిన కేసులో విజయవాడ సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు రామోజీరావు, శైలజాకిరణ్‌కు నోటీసులు జారీ చేశారు. వీరు ఈ నెల 16న (బుధవారం) విచారణకు హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. కానీ విచారణకు హాజరుకాలేదు. సీఐడీ దర్యాప్తునకు రామోజీరావు, శైలజాకిరణ్ ముఖం చాటేయడం ఇది రెండోసారి. ఈ కేసులో గుంటూరు సీఐడీ కార్యాలయంలో జూలై 5న విచారణకు హాజరు కావాలని గతంలో సీఐడీ అధికారులు రామోజీరావు, శైలజాకిరణ్‌తోపాటు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లకు నోటీసులు జారీ చేశారు. అప్పుడు కూడా కేవలం మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లు మాత్రమే విచారణకు హాజరయ్యారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయం చెప్పినట్లుగానే తాము చేశామని వారు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. కానీ రామోజీరావు, శైలజాకిరణ్ మాత్రం విచారణకు హాజరు కాలేదు. తాము విచారణకు హాజరయ్యే పరిస్థితుల్లో లేమని సీఐడీ కార్యాలయానికి ఈ మెయిల్ ద్వారా తెలిపారు.

**మళ్లీ కూడా అదే వైఖరి**

రామోజీరావు, శైలజాకిరణ్‌కు మరో అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో బుధ, గురువారాల్లో విచారణకు హాజరు కావాలని సీఐడీ ఈ నెల 9న నోటీసులు జారీ చేసింది. ఈసారీ వారిద్దరూ విచారణకు ముఖం చాటేశారు. ఈ కేసులో రామోజీరావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఓసారి, శైలజాకిరణ్‌ను రెండుసార్లు సీఐడీ అధికారులు విచారించారు. ఆ విచారణ సమయంలో ఇంటి గేట్లు ఉద్దేశ పూర్వకంగా తెరవకుండా అధికారులను వేచి చూసేలా చేశారు. ఆపై విచారణకు ఏమాత్రం సహకరించ లేదు. కాగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చందాదారుల నిధులు మళ్లించినందున.. అంటే నేరం ఆంధ్రప్రదేశ్‌లో జరిగినందున వారిద్దరినీ రాష్ట్రంలోనే విచారించాల్సి ఉంది. అందుకే ఏపీలో విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సీఐడీ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోనుందన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

### సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు నేడు తాడేపల్లికి కాంట్రాక్ట్ లెక్చరర్లు

**సాక్షి,అమరావతి:** కాంట్రాక్ట్ లెక్చరర్ల ఆధ్వర్యంలో ఈ నెల 18న 'సీఎం సార్‌కు కృతజ్ఞతలు' కార్యక్రమాన్ని తాడేపల్లిలో నిర్వహిస్తున్నట్టు కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో–చైర్మన్ కల్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిలోని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కార్యాలయం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసు క్రమబద్ధీకరణలో 2014 జూన్ 2 నాటికి (2.6.2014) నాటికి ఐదేళ్ల సర్వీస్ నిబంధనను సడలించి మరిన్ని కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వైఎస్ జగన్ నిర్ణయం చరిత్రాత్మకం అని పేర్కొన్నారు.

## తిరుగుబాటు చేయండి

- విశాఖకు నిత్యం వందల లారీల ఇసుక
- ఈనాడులో నిజాలు రాస్తున్నారని మార్గదర్శిపై దాడులు: చంద్రబాబు


బాబు మాట్లాడుతుండగా వెళ్లిపోతున్న ప్రజలు

**సాక్షి అమలాపురం/ రావులపాలెం:** 'రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతోంది. ఈ దోపిడీదారుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు జనం తిరుగుబాటు చేయాలి. కేసులు పెట్టినా భయపడకుండా పోరాటం చేయండి'.. అని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. రావులపాలెం వాకలరాజు విగ్రహం సెంటరులో బాబు మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్ అన్న జగన్‌కు ఇదే చివరి ఛాన్స్ అవుతుందన్నారు. నిత్యావసర వస్తువులు, విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ రేట్లు, మద్యం రేట్లు ఇలా అన్ని పెంచారని బాబు విమర్శించారు. ఒక మంత్రి రూ.ఎనిమిది వేల కోట్ల కాంట్రాక్టులు తీసుకున్నారని.. ప్రశ్నించడానికి వెళ్తే తనపై దాడిచేసి తిరిగి తన మీదే కేసు పెట్టారన్నారు. ఈనాడులో నిజాలు రాస్తున్నారని 60ఏళ్ల అనుభవం ఉన్న మార్గదర్శిపై దాడులు చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. అందరికీ అమ్మఒడి అని చెప్పి ఇప్పుడు ఒక్కరికే ఇస్తున్నారని.. తాను అధికారంలోకి వస్తే ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.20 వేలు చొప్పున ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. సీఎం పింఛన్ పెంచకపోవడంవల్ల ఒక్కొక్కరు రూ.30 వేల చొప్పున కోల్పోయారున్నారన్నారు.

**ఇసుకలో కోట్ల దోపిడీ..**

మండపేట నుంచి రావులపాలెం వస్తున్న సమయంలో బాబు జొన్నాడ వద్ద ఇసుక గుట్టలను పరిశీలించి సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఇక్కడ ఒక ర్యాంపు నుంచి రూ.280 కోట్ల ఇసుక వెళ్తోందని ఆరోపించారు. కానీ, గోదావరి చెంతనే ఉన్న రావులపాలెంలో ఇసుక దొరకడంలేదని.. వైజాగ్‌కు మాత్రం రోజూ వందల లారీల ఇసుక వెళ్తున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సైతం ఇసుక దోపిడీలో వాటా ఉందని చంద్రబాబు విమర్శించారు. అంతకుముందు.. మండపేట నుంచి రావులపాలెం వస్తున్న సమయంలో ఆయన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఎక్కారు. అధికారంలోకి వస్తే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తానన్నారు.

## అమెరికా నుంచి తెలుగు విద్యార్థులు వెనక్కి!

- కారణాలేమిటో వెల్లడించని తీరు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

**సాక్షి, హైదరాబాద్:** అమెరికాలో చదువుకోవడం కోసం వెళ్లిన తెలుగు విద్యార్థులను అక్కడి ఇమిగ్రేషన్/భద్రతా అధికారులు ఎయిర్‌పోర్టు నుంచే తిప్పిపంపేశారు. ఎందుకు పంపేస్తున్నారనే దానిపై అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే.. బలవంతంగా విమానం ఎక్కించి వెనక్కి పంపారు. ఇలా అట్లాంటా, శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో ప్రాంతాల నుంచి 21 మందిని తిప్పిపంపినట్టు తెలిసింది. అయితే పత్రాలు, వివరాలన్నీ పరిశీలించాకే అమెరికా వీసా ఇస్తారని, అలాంటప్పుడు ఈ సమస్య ఎందుకొచ్చిందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నా..**

అమెరికాలో ఆగస్టులో విద్యా సంవత్సరం మొదలవుతుంది. దీనికి తగ్గట్టుగానే భారత విద్యార్థులు ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు. అక్కడి వీసా నిబంధనలకు అనుగుణంగా అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుంటారు. ముందే టోఫెల్, జీఆర్‌ఈ వంటి పరీక్షలు రాస్తారు. వాటి మార్కుల ఆధారంగానే అక్కడి యూనివర్సిటీలలో సీట్లు వస్తాయి. తర్వాత అమెరికాలో చదువుకున్నన్ని రోజులు జీవించడానికి అవసరమయ్యే మేర సొమ్మును బ్యాంకు బ్యాలెన్స్‌గా చూపిస్తారు. ఇందుకోసం విద్యార్థులు కన్సల్టెన్సీల సహకారం సైతం తీసుకుంటున్నారు.

**పలు అనుమానాలు..**

- అమెరికాలో 'సాక్షి' ప్రతినిధికి అందిన సమాచారం ప్రకారం.. పలువురు తెలుగు విద్యార్థులు బ్యాంక్ ఖాతాలో సొమ్మును చూపిన అంశం, ఇతర వివరాలపై అమెరికా అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.
- అమెరికాలో ఆటా సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమెరికాలో ఎన్నారై వ్యవహారాల సలహాదారు డాక్టర్ వాసుదేవరెడ్డి, నాటా సభ్యుడు సింహ అందించిన సమాచారం ప్రకారం.. విద్యార్థులను తిప్పి పంపడానికి కారణాలను అమెరికా కేవలం భారత కాన్సులేట్‌కు మాత్రమే చెబుతుంది. ఆ వివరాలు తెలుసుకునేందుకు తెలుగు అసోసియేషన్లు ప్రయత్నిస్తున్నాయి.

> ఎవడైతే సత్కార్యం చేస్తాడో అతడు తన (మేలు) కొరకే చేస్తాడు.
> మరియు దుష్కార్యం చేసేవాడు దాని ఫలితాన్ని అనుభవిస్తాడు.
> నీ ప్రభువు తన దాసులకు అన్యాయం చేసేవాడు కాడు.
>
> – ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 18 ఆగస్టు 2023

# ఇది సరైన ఔషధమేనా?

జనరిక్ ఔషధాల వినియోగాన్ని మెరుగ్గా అమలు చేసేందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మరోసారి మార్గదర్శకాలు జారీ చేసింది. ఖరీదైన కంపెనీ మందుల బదులు చౌకగా లభించే జనరిక్ ఔషధాలనే తప్పక రాయాలంటూ వైద్యులకు ఆదేశాలిచ్చింది. వైద్యం ఖరీదవుతున్న వేళ సామాన్యు లకు సాంత్వననిచ్చే ఆదేశాలు స్వాగతించాల్సినవే. ఈ విషయంలో ఎన్ఎంసీ మార్గదర్శకాలివ్వడం ఇదేమీ తొలిసారి కాదు. మునుపెప్పుడో ఇచ్చినా, వాటి అమలు అంతంత మాత్రమైంది. అందుకే, ఈసారి ఆదేశాలు పాటించకుంటే జరిమానాలు విధిస్తామంటూ హెచ్చరించింది. ఇక్కడే తకరారు వచ్చింది. ఇది 'పట్టాలు లేకుండా రైళ్ళు నడపడం లాంటిది' అంటూ దేశంలోని వైద్యులకు అతి పెద్ద సంఘమైన భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) తప్పుపడుతోంది. ఈ విధాన నిర్ణయాలు తీసుకొనే ముందే జనరిక్ మందుల్ని ప్రోత్సహించి, నాణ్యమైనవి దొరికేలా చేయాల్సింది. అది చేయకుండా జరిమానా నిబంధనలు పెట్టడం ఏ మాత్రం సబబన్నది ఐఎంఏ వాదన. వెరసి, వృత్తి నిర్వహణకు సంబంధించి ఆగస్ట్ మొదట్లో అమలులోకి వచ్చిన కొత్త మార్గదర్శకాలపై చర్చ జరుగుతోంది.

ఈ నిబంధనల ప్రకారం డాక్టర్లు ఇకపై మోతాదులో స్వల్పతేడా సైతం దుష్పరిణామాలకు దారి తీసే మందుల విషయంలో తప్ప, మిగతావన్నీ జనరిక్ మందులే సిఫార్సు చేయాలి. ఫలానా బ్రాండే వాడాలనకూడదు. తత్సమాన జనరిక్ ఔషధం పేరు రాయాలి. నిర్ణీత మోతాదులో, అనుమతించిన కాంబినేషన్లలోనే ఆచితూచి మందులు రాయాలి. స్పష్టంగా, అర్థమయ్యేలా, ఇంకా వీలుంటే ఇంగ్లీషులో పెద్ద బడి అక్షరాల్లో మందుల చీటీ రాయాలి. అర్థం కాని కోడిగీతల్లో రాస్తే గందరగోళ పడ్డ రోగులు పొరపాటుగా వేరే మందులు తీసుకొనే ప్రమాదం ఉందనేది అంతరార్థం. అలాగే రోగి పరిస్థితి, చికిత్స, ఫలితం లాంటివి డాక్టర్లు ట్విట్టర్ వగైరాల్లో చర్చించరాదంటూ రోగుల హక్కులు కాపాడేలా 11 అంశాలతో సోషల్ మీడియా మార్గదర్శకాలూ ఇచ్చింది. ఇవన్నీ మంచి మాటలే.

బ్రాండెడ్ మందులతో పోలిస్తే, జనరిక్ ఔషధాలు సగటున 30 నుంచి 80 శాతం చౌకని ఓ లెక్క. అందువల్ల ఆ మేరకు ఆరోగ్యరక్షణ ఖర్చులు తగ్గుతాయి. సహజంగానే సామాన్యులకు అది పెద్ద ఊరట. అదే సమయంలో, డాక్టర్ల వాదన ఏమిటంటే – మిగిలే లాభం తక్కువ గనక అన్ని ఫార్మ సీలూ అన్నిరకాల జనరిక్ మందులనూ నిల్వ చేయవు. డాక్టర్ రాసిచ్చిన మందు లేనప్పుడు నిర్ణయం షాపువాడి చేతిలోకి వస్తుంది. అప్పుడు నాణ్యతతో సంబంధం లేకుండా, ఎక్కువ లాభం మిగిలే మందులను అంగట్లో అంటగట్టే ప్రమాదం ఉంది. అంతేకాక, వైద్యులు తమ అనుభవం కొద్దీ రోగికి సరిపోయే మందు రాయడానికి వీలు లేకుండా పోతుందనీ, కంపెనీలను బట్టి జనరిక్ ఔషధాల నాణ్యతలోనూ తేడాలు తప్పవు గనక చికిత్స సమర్థంగా సాగదనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మన దేశంలో నాణ్యతా ప్రమాణాల నియంత్రణ అంతంత మాత్రమే. కాబట్టి ఈ ఆందోళనను అంత తేలిగ్గా కొట్టిపారేయలేం. నాణ్యతకు హామీ లేకపోతే, మందుల్ని వాడినా ప్రయోజనం ఉండదన్నది నిష్ఠురసత్యం. ఈ రకమైన చికిత్స, ఔషధ వినియోగంతో వ్యాధి తగ్గకుంటే రోగికి నష్టం, డాక్టర్ పేరుకూ దెబ్బ. ఇన్ని లోటుపాటులున్న అంశంపై నిర్ణయాలు ప్రకటించే ముందు సంబంధిత వర్గాలన్నిటితో సమగ్రంగా చర్చించడం తప్పక అవసరం. అదేమీ లేకుండా మార్గదర్శకా లను నోటిపై చేశారని వైద్యవర్గాల ఆరోపణ. నిజానికి, దేశంలోని జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో చేయాల్సింది చాలా ఉంది. అది డాక్టర్లు, మందుల ఉత్పత్తిదార్లు, పాలకులు – అంతా అంగీకరించే మాటే. తయారయ్యే మందుల్లో అన్ని బ్యాచ్‌లకూ ప్రభుత్వం నాణ్యతా పరీక్ష చేయడం ఆచరణ సాధ్యం కాదు. కేవలం 0.1 శాతం మందులకే పరీక్షలు జరుగుతున్నాయట. గత మూడేళ్ళ కాలంలో జనరిక్, బ్రాండెడ్ జనరిక్, బ్రాండెడ్ మందులన్నిటికీ జరిపిన పరీక్షల్లో దాదాపు 3 శాతం ప్రమాణాల మేరకు నాణ్యంగా లేవని సాక్షాత్తూ కేంద్ర ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మందుల తయారీలో నిర్దుష్టమైన విధానాల్ని అనుసరించడమే నాణ్యతను సాధించ డానికి మూల మంత్రం. పాలకులు అందుకు కట్టుదిట్టమైన విధివిధానాలు పెట్టాలి.

ఆ మాటకొస్తే కొన్నేళ్ళ క్రితం దాకా జనరిక్స్ తయారీ సంస్థలకు కొన్ని టెస్ట్‌లు తప్పనిసరి కాదు. బ్రాండెడ్ మందులకు సమానంగా జనరిక్ మందు స్పందిస్తున్నట్టు నిర్ధరించే బయో–ఈక్వలెన్స్ పరీక్ష కానీ, నిర్ణీత వాతావరణ పరిస్థితుల్లో ఔషధ నాణ్యత ఏ మేరకు మారుతుందో చూసే స్టెబిలిటీ అధ్యయనాలు కానీ జరపకుండానే బండి నడిచింది. ఇప్పుడవి తప్పనిసరి చేశారు. కానీ, అవేవీ జరగకుండానే బయటకొచ్చిన జనరిక్స్ చాలానే ఇప్పటికీ విపణిలో ఉన్నట్టు ఔషధరంగ నిపుణులు అంగీకరిస్తున్నారు. అందుకే, ఇప్పటికైనా నిబంధనల అమలును వాయిదా వేసి, అన్ని వర్గాలతో కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయి సంప్రతింపులు జరపాలన్నది వైద్య సంఘం డిమాండ్.

వైద్యవృత్తికి సంబంధించి నియంత్రణాధికారాలున్న ఎన్ఎంసీ ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. వైద్యులు నిరంతరం తమ వృత్తినైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్న మార్గదర్శకం ఆచరణలో ఏ మేరకు సాధ్యమో ఆలోచించాలి. పర్యవేక్షించే విధానమేమిటో చెప్పాలి. అన్నిటి కన్నా ముందు బ్రాండెడ్‌కు దీటుగా జనరిక్ ఔషధాలు పనిచేస్తాయనే భరోసా ప్రజల్లో కల్పించాలి. షాపుల్లో ఈ రకం ఔషధాలన్నీ పెద్దయెత్తున నిల్వ ఉండేలా, జన్ ఔషధీ కేంద్రాలు ఊరి నలుమూలలా నెలకొనేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఆ పని చేయకుండా మార్గదర్శకాలు, జరిమానాలంటూ హడావిడి చేస్తే ఏం లాభం? పుండు ఒకచోట ఉంటే, మందు మరొకచోట రాసినట్టే!

### గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.విదియ సా.5.46 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పుబ్బ రా.9.58 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** తె.5.50 నుండి 7.34 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.27 నుండి 1.18 వరకు, **అమృతఘడియలు:** ప.2.54 నుండి 4.40 వరకు, శుక్ర మూఢమి త్యాగం.

**సూర్యోదయం** :5.46 **సూర్యాస్తమయం** : 6.21
**రాహుకాలం** : ఉ.10.30 నుండి 12.00 వరకు
**యమగండం** : ప.3.00 నుండి 4.30 వరకు

# పెత్తందార్లు మీరు, మీ బాబే రామోజీ..



పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సంక్షేమ పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ డీబీటీ రూపంలో 50 నెలల్లో పేదల ఖాతాల్లో రూ.2,31,123.28 కోట్లు జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో రూ.2,33,915.92 కోట్ల ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపి పేదలకు రూ.4,65,039.20 కోట్ల లబ్ధి కలిగించారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. ఈ రీతిన ఆర్థిక స్వావలంబన సాధిస్తున్న పేదలను చూసి ఓర్చుకోలేక.. సంక్షేమ పథకాలతో రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని దబాయించిన చంద్రబాబు పెత్తందారు కాదా? ఆయన తానా అంటే తందానా అంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారంటూ తప్పుడు రాతలతో పుంఖానుపుంఖాలుగా కథనాలు అచ్చేసిన మీరు పెత్తందార్ల పక్షం కాదా రామోజీ?

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు అగ్రవర్ణాల్లోని పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ.. 30.76 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.75,670.05 కోట్ల విలువైన ఇంటి స్థలాలను సీఎం వైఎస్ జగన్ పంపిణీ చేశారు. సెంటు భూమి శవాన్ని పూడ్చటానికి మాత్రమే సరిపోతుందంటూ పేదల సొంతింటి స్వప్నంపై అవహేళన చేస్తూ మాట్లాడటం ద్వారా తాను పెత్తందారుడినని చంద్రబాబు చాటుకున్నారు. కోర్టుల్లో కేసులు వేయించి పేదల ఇళ్ల స్థలాల పంపిణీకి మోకాలడ్డిన చంద్రబాబు పెత్తందారు కాదా? ఆయనకు వంతపాడుతున్న మీది పెత్తందారీ పోకడ కాదా రామోజీ?

నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్.. పేద పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రవేశపెడితే.. దాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో కేసులు వేయించిన చంద్రబాబుది పెత్తందారీ మనస్తత్వం కాదా? ఇందుకు మద్దతిస్తూ అక్షరోద్యమం నడిపిన మీరూ ఆ బాపతే కదా రామోజీ?

అమరావతి రాజధాని ప్రాంతంలో 50 వేల మంది పేదలకు సీఎం వైఎస్ జగన్ ఇళ్ల స్థలాలు ఇస్తుంటే.. దాన్ని నిరసిస్తూ హైకోర్టులో కేసులు వేయించి.. వారికి ఇళ్ల స్థలాలు ఇస్తే సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందని వాదించేలా చక్రం తిప్పిన చంద్రబాబు పెత్తందారు కాదా? ఆయన్ను సమర్థిస్తూ వరుస కథనాలు వండివార్చిన మిమ్మల్ని పెత్తందారు అనక ఇంకేమనాలి రామోజీ?

సీఎం వైఎస్ జగన్.. ప్రతి సందర్భంలోనూ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అని తాపత్రయ పడుతూ, వారి అభ్యున్నతి కోసం నాలుగేళ్లుగా పరితపిస్తున్నారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వారికి అగ్రతాంబూలం ఇస్తున్నారు. అన్ని పదవుల్లోనూ సింహ భాగం కేటాయిస్తున్నారు. ఇది పెత్తందారీతనమా? లేక 'ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా?' అని చంద్రబాబు వారిని అవమానించడం పెత్తందారీతనమా? తేల్చి చెప్పే ధైర్యముందా రామోజీ?

**'ఈ రోజు రాష్ట్రంలో జరుగుతోంది కులాల మధ్య యుద్ధం కాదు.. క్లాస్ వార్.. పేదలు ఒక వైపు, పెత్తందారీ మనస్తత్వం ఉన్న వాళ్లు మరో వైపు. వచ్చే ఎన్నికల్లో పొరపాటు జరిగితే పేదలు రాష్ట్రంలో బతికే పరిస్థితి ఉండదు' అంటూ రాష్ట్రంలో చంద్రబాబు, ఎల్లో మీడియా పోకడలపై సీఎం వైఎస్ జగన్ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం.. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ వైఎస్సార్‌సీపీకి ప్రజలు చారిత్రక విజయాలను కట్టబెట్టడం.. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని జాతీయ సంస్థల సర్వేలు నొక్కివక్కాణిస్తుండటం.. వీటన్నింటితో ఇక చంద్రబాబుకు రాజకీయంగా నూకలు చెల్లడం ఖాయమని మీరు తీవ్రంగా ఆందోళన చెందుతుండటం నిజం కాదా రామోజీ? విషం చిమ్ముతున్నది అందుకే కదా?**

## సీఎం వైఎస్ జగన్ చర్యలతో పేదల ఆర్థిక స్వావలంబన

## వెరసి నిత్యం 'ఈనాడు'లో నీతిమాలిన రోత రాతలు

**ఏది నిజం?**

### కార్పొరేట్‌కు కొమ్ము కాసింది బాబే


చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వ రంగంలో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయకుండా.. ప్రైవేట్, కార్పొరేట్ వైద్య కళాశాలలకే పట్టంకట్టారు. టీడీపీ నాయకులు, సానుభూతిపరులకు వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిచ్చి.. వారి జేబులు నింపారు. ఇదంతా అప్పుడు రామోజీ కళ్లకు పచ్చగా కనిపించింది. ఇప్పుడు కొత్తగా ఏర్పాటయ్యే వైద్య కళాశాలలను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్వహించడం కోసం సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెడితే.. దేశంలో ఎక్కడా లేనట్టుగా చేస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి 2017 నుంచి రాజస్తాన్, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. రాష్ట్రంలో పాత 12 వైద్య కళాశాలల్లో ఉన్న ఎంబీబీఎస్ సీట్లకు కొత్త విధానాన్ని అమలు చేయకుండా కేవలం కొత్తగా ఏర్పాటైన కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా పోగా.. మిగిలిన సీట్లలో 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తున్నారు. మరో 50 శాతం సీట్లలో 35 శాతం 'బీ', 15 శాతం సీట్లను 'సీ' కేటగిరిలో భర్తీ చేయనున్నారు. ఈ సీట్లకు ఫీజుల రూపంలో వచ్చే నిధులను ఆయా కళాశాలల అభివృద్ధికే ప్రభుత్వం ఖర్చు చేయనుంది. సీఎం వైఎస్ జగన్ పేదల పక్షపాతి కాబట్టే నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం కోసం 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది 5 వైద్య కళాశాలలు ప్రారంభించడం ద్వారా ఏకంగా 750 సీట్లను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో 15 శాతం ఆల్ ఇండియా కోటా పోగా మిగిలిన సీట్లలో 50 శాతం రిజర్వేషన్ వర్గాలకు కేటాయిస్తున్నారు. అంటే 300కు పైగా సీట్లు కన్వీనర్ కోటాలో ఈ ఏడాది నుంచి పెరిగాయి. ఇది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు మేలు చేయడం కాదా?

### ఇంటిపై హక్కులు కల్పిస్తే తప్పా?

గృహ నిర్మాణ సంస్థ నుంచి రుణాలు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్న పేదలకు మేలు చేకూర్చేలా 'జగనన్న సంపూర్ణ గృహ హక్కు' పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 1983 నుంచి 2011 ఆగస్టు 15 వరకు గృహ నిర్మాణ సంస్థ నుంచి రుణం పొంది/రుణం పొందకుండా నిర్మించిన ఇళ్లకు యాజమాన్య హక్కులు కల్పించింది. దీంతో 22–ఏ జాబితాలో ఉండే స్థలాలపై పేదలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు లభించాయి. పేదలు తమ కాళ్లపై తాము నిలబడాలి.. ఇళ్లలో నివసించే హక్కు స్థానంలో పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలన్నది ఈ పథకం ఉద్దేశం. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికి యాజమాన్య హక్కులను కల్పించారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్(ఓటీఎస్)ను అమలు చేసి రుణాల నుంచి విముక్తి కల్పించాలని.. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల నుంచి విజ్ఞప్తులు వచ్చినా చంద్రబాబు పట్టించుకున్న పాపాన పోలేదు. అప్పట్లో ప్రభుత్వం పేదల మొర ఆలకించడం లేదంటూ రామోజీరావు ఒక్క రాత కూడా రాసిన పాపానపోలేదు. ఇప్పుడు పేదలపై మితిమీరిన భారం లేకుండా రూ.10వేలు, ఒక వేళ అంతకంటే తక్కువ రుణం ఉంటే అదే మొత్తం చెల్లించిన వారికి, రుణాలు తీసుకోని వారికైతే రూ.10 వంటి నామ మాత్రపు ఫీజులతో ఇళ్లపై యాజమాన్య హక్కులు కల్పించారు. రిజిస్ట్రేషన్ ఫీజులను మినహాయించారు. ఇది పేదలకు మేలు చేయడం కాదా?

### ఉన్నతంగా విదేశీ విద్య

జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా రాష్ట్రానికి చెందిన అనేక మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు.. నోబెల్ గ్రహీతలైన టిమ్ కుక్, స్టీవ్ జాబ్స్ వంటి గొప్ప వ్యక్తులు, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు చదువుకున్న విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ పథకం కింద గత ఏడాది 290, ఈ ఏడాది 67 మందికి కలిపి రూ.142.71 కోట్లు మంజూరు చేసింది. 2022–23 విద్యా సంవత్సరానికి గత ఏడాది ఫిబ్రవరిలో లబ్ధిపొందిన 290 మందిలో ఎస్సీ విద్యార్థులు 27 మంది, బీసీ 64, క్రిస్టియన్ నలుగురు, ముస్లింలు 20, ఈబీసీలు 175 మంది ఉన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఫాల్ సీజన్ కింద ఎంపికైన వారు 67 మంది ఉండగా, వీరిలో ఎస్సీ విద్యార్థులు ఐదుగురు, ఎస్టీ ఒక్కరు, బీసీ 13, క్రిస్టియన్ నలుగురు, ముస్లింలు ఎనిమిది మంది, ఈబీసీలు 36 మంది ఉన్నారు. 2022–23 బ్యాచ్‌కు చెందిన 290 మంది విద్యార్థులకు రెండో విడత వాయిదా ఫీజు, వీసా చార్జీలు, విమాన ఖర్చులతో సహా రూ.35.40 కోట్లను ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. గత ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ కార్డు రాగానే ఒకసారి, మొదటి సెమిస్టర్ పూర్తవగానే రెండోసారి ఫీజు చెల్లించి వదిలేసేది. ఆ తర్వాత విద్యార్థి ఏమయ్యాడో పట్టించుకునే వారు కాదు. గత ప్రభుత్వం విదేశాల్లో చదువుకునేందుకు 2014–19 మధ్య ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.15 లక్షల చొప్పున, ఓసీలకు రూ.10 లక్షల చొప్పున చెల్లించి చేతులు దులుపుకుంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం నూరు శాతం ఫీజు చెల్లిస్తోంది. ఓసీలకు రూ.కోటి, ఇతర వర్గాలకు రూ.1.25 కోట్ల వరకు వెచ్చిస్తోంది. పైగా చంద్రబాబు 2016–17, 2018–19 సంవత్సరాల్లో 3,326 మంది విద్యార్థులకు రూ.318 కోట్ల బకాయిలను పెట్టారు. ఇప్పుడు నిధుల దుర్వినియోగానికి తావు లేకుండా విద్యార్థి సెమిస్టర్/టర్మ్ పత్రాలు సమర్పించగానే ఆ నిధులను ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం పొందేలా 21 కోర్సులకు సంబంధించి ప్రతి కోర్సుకు టాప్ 50లో ఉన్న విద్యా సంస్థలను నిర్ణయించింది. దీంతో మొత్తం విద్యా సంస్థల సంఖ్య 320కి పెరిగింది. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే అన్న పరిమితిని తొలగించింది. దీనికి కూడా వక్రభాష్యం చెప్పడం రామోజీకే చెల్లింది.



### సామాన్యునికి అందుబాటులో సినీ వినోదం

టీడీపీ ప్రభుత్వ హయాంలో సినీ సిండికెట్ సినిమా టికెట్ల రేట్లు ఇష్టానుసారంగా పెంచుకుని అడ్డగోలుగా దోపిడీకి పాల్పడింది. టికెట్ల గణాంకాలు ఎక్కడా ఉండేవి కావు. ఈ పరిస్థితిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సినిమా టికెట్ల విక్రయాల విధానంలో సంస్కరణలు తీసుకువస్తూ ఆన్‌లైన్‌లో సినిమా టికెట్ల విక్రయాలను అందుబాటులోకి తీసుకువస్తూ విధాన నిర్ణయం తీసుకుంది. అలా చేస్తే తమ దందాకు చెక్ పడుతుందని భావించిన టీడీపీ అనుకూల సిండికేట్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కాగా మరోవైపు నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల కేటగిరీల్లో సినిమా టికెట్ ధరలను నిర్ణయిస్తూ 2021 ఏప్రిల్ 8న జీవో 35 జారీ చేసింది. దీనిపై కూడా కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో హోమ్, సినిమాటోగ్రఫీ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ సినీ రంగానికి చెందిన వివిధ సంఘాల ప్రతినిధులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన ఓ విధానాన్ని రూపొందించింది. ఆ మేరకు సినిమా టికెట్ల ధరలను నిర్ణయిస్తూ 2022 మార్చి 7న జీవో 13 జారీ చేసింది. భారీ బడ్జెట్ సినిమాలకు టికెట్ల ధరలను తొలి వారం రోజుల పాటు పెంచుకునేందుకు నిర్దిష్టమైన విధి విధానాలను రూపొందించింది. హీరో, హీరోయిన్, దర్శకుడి పారితోషకాలు కాకుండా సినిమా నిర్మాణ వ్యయం రూ.100 కోట్లు దాటితే.. సినిమాలో కనీసం 20 శాతం ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్ చేస్తే... టికెట్ల ధరలను తొలి పది రోజులపాటు పెంచుకునేందుకు అనుమతిస్తామని పేర్కొంది. ఈ నిర్ణయం పట్ల యావత్ సినీ పరిశ్రమతోపాటు సామాన్యులు కూడా హర్షం వ్యక్తం చేశారు. దీనిపై కూడా దిగజారుడు రాతలేనా రామోజీ?

### మద్యం వ్యసనానికి దూరమవుతున్న పేదలు

మద్యం ధరలు షాక్ కొట్టేలా చేస్తాం.. పేదలను మద్యం వ్యసనానికి దూరం చేస్తాం.. అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు విస్పష్టంగా ప్రకటించారు. అదే విధానాన్ని సమర్థంగా అమలు చేస్తుంటే ఈనాడు రామోజీరావుకు కంటగింపుగా మారింది. రాష్ట్రంలో 2014–19 మధ్య మద్యం దుకాణాలన్నీ టీడీపీ నేతల ప్రైవేటు సిండికేట్ గుప్పిట్లో ఉండేవి. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు సాగిస్తూ పేదలను కొల్లగొట్టేవారు. నిర్ణీత వేళలను పాటించకుండా విక్రయాలు సాగించేవి. ఇప్పుడు ఆ దందాకు చెక్ పెట్టారు. 43 వేల బెల్ట్ దుకాణాలను తొలగించారు. గత సర్కార్ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పుడు 2,934కి తగ్గిపోయాయి. ఈ సంఖ్యను ఇంకా తగ్గించే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. కొత్త బార్లకు లైసెన్స్‌లు ఇవ్వలేదు. 2019లో ఖరారు చేసిన 840 బార్లే ఉన్నాయి. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ) పన్నూ విధించారు. దీంతో మద్యం ధరలు పెరిగాయి. తద్వారా పన్నుతో రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా వాస్తవానికి మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. టీడీపీ హయాంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విక్రయాలు సగానికి పడిపోవడమే అందుకు నిదర్శనం. టీడీపీ ప్రభుత్వంలో 2018– 19లో రాష్ట్రంలో 384.31 లక్షల మద్యం కేసులు, 277.1 లక్షల బీర్ కేసులు విక్రయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2019–20లో మద్యం కేసులు 308.49 లక్షలు, బీరు 212.91లక్షల కేసులే విక్రయించారు. 2020–21లో మద్యం కేసులు 187.55 లక్షలు, బీరు కేసులు 56.97 లక్షలతో విక్రయాలు తగ్గిపోయాయి. 2021–22లో మద్యం కేసులు 266.08 లక్షలు, బీరు కేసులు 81.67 లక్షలు, 2022–23లో మద్యం కేసులు 335.98 లక్షలు, బీరు కేసులు 116.76 లక్షల కేసులు విక్రయించారు. అయినా సరే చంద్రబాబు కోసం ఈనాడు దుష్ప్రచారం చేస్తోంది.

### నేతన్నకు తోడుగా..

గత ప్రభుత్వం నేతన్నల కోసం ఐదేళ్లలో కేవలం రూ.442 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం నాలుగేళ్లలోనే నవరత్నాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా రూ.3,706 కోట్లు ఖర్చు చేయడం విశేషం. వరుసగా ఐదేళ్లు నేతన్న నేస్తం ద్వారా రూ.969.77 కోట్లు అందించింది. ఈ పథకం అమలు తర్వాత చేనేత కార్మికులు తమ మగ్గాలను డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషీన్ తదితర ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసి కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ వారి జీవితాలను మెరుగుపర్చుకున్నారు. నేతన్నల పెన్షన్ కోసం రూ.1,396.45 కోట్లు ఇచ్చింది. చేనేత రంగానికి ఊతమిచ్చేలా ఆప్కోకు రూ.468.84 కోట్లు (గత ప్రభుత్వ బకాయిలు రూ.103 కోట్లతో కలిపి) చెల్లించింది. ఈ మూడు పథకాలకు రూ.2,835.06 కోట్లు వ్యయం చేసింది. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి నేతన్నల ఆదాయం పెంచేందుకు ప్రముఖ ఈ కామర్స్ సంస్థలతో వైఎస్ జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. చేనేతకు కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తూ ఆర్గానిక్ వస్త్రాల తయారీ, కొత్త కొత్త డిజైన్లు వంటి వినూత్న ప్రయోగాలతో ప్రోత్సహిస్తోంది. ప్రత్యేక శిక్షణ, క్లస్టర్ ట్రైనింగ్ వంటి గట్టి ప్రయత్నాలతో చేనేత కుటుంబాలకు నైపుణ్యాన్ని మెరుగుపరిచే కృషి చేస్తోంది. శిక్షణతో వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో సబ్సిడీ అందించి మగ్గాలు, షెడ్లు తదితర సామగ్రిని సమకూర్చారు. మిల్లు వస్త్రాలకు దీటుగా చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించడం, ఆప్కో షోరూమ్‌లను విస్తరించి సొసైటీల వద్ద వస్త్రాలు కొనుగోలు చేసి విక్రయించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. కేరళ, ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ ఏపీ చేనేత వస్త్రాల విక్రయాలకు చర్యలు చేపట్టింది. ఒక జిల్లా ఒక ఉత్పత్తి(ఓడీఓపీ) కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 24 జిల్లాల్లో ఏకంగా 36 చేనేత వస్త్రాల ఉత్పత్తిని గుర్తించి వాటికి జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్ సాధించేలా కృషి చేస్తోంది. 'పచ్చ'పొరలు కమ్మిన మీకు ఇవేవి కన్పించట్లేదా రామోజీ?



### ఓట్ల కోసం చంద్రబాబు డ్రామా

చంద్రబాబు హయాంలో 2014 జూన్ నుంచి 2016 అక్టోబర్ వరకు కందిపప్పు పంపిణీయే చేయలేదు. 2016 నవంబర్ నుంచి 2018 ఫిబ్రవరి వరకు గిరిజన ప్రాంతాల్లో మాత్రమే కిలో రూ.40 చొప్పున పంపిణీ చేశారు. ఎన్నికలు ముంచుకొస్తుండటంతో 2018 మార్చి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్డుదారులకు రెండు కిలోల కందిపప్పు పేరిట పంచి మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అప్పట్లో బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.63 ఉంటే రూ.23 మాత్రమే సబ్సిడీ భరించి రూ.40కు పంపిణీ చేశారు. మార్కెట్ ఒడిదుడుకులు, కోవిడ్ సంక్షోభం, ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసరాల రేట్లు అమాంతం పెరిగాయి. దీంతో ప్రస్తుత మార్కెట్‌లో కిలో కందిపప్పు రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.160కు చేరింది. ప్రభుత్వం రెండు, మూడు నెలల ముందు వరకు రూ.120కిపైగా కంది పప్పు ఉన్నప్పుడు సబ్సిడీపై రూ.67కే ఇచ్చింది. నెలకు రూ.56 కోట్లు సబ్సిడీ ఖర్చు అయ్యేది. ఇప్పుడు పెద్ద ఎత్తున బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేయలేని పరిస్థితి. ఇలాంటి తరుణంలో నాఫెడ్ నుంచి కందులు కొనుగోలు చేసి వాటిని మర ఆడించి సబ్సిడీపై లబ్ధిదారులకు పంపిణీ చేసేలా కసరత్తు చేస్తోంది. దీనితో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హోల్‌సేల్ వ్యాపారులతో మాట్లాడి తక్కువ ధరకు కందిపప్పు, బియ్యాన్ని విక్రయించే స్టాల్స్ ఏర్పాటు చేసింది. నాణ్యమైన పంచదారను సైతం ప్రతి నెలా అర కిలో చొప్పున క్రమం తప్పకుండా అందిస్తోంది. అన్నింటికీ మించి పేదలకు అనేక సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలిచింది. అదే చంద్రబాబు ప్రభుత్వం పండగల పేరుతో సొంత కాంట్రాక్టుదారులకు నాసిరకం సరుకులు సరఫరా చేసే బాధ్యతను అప్పగించి దోచుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రజలకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా తొలుత రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు పంపిణీ చేస్తోంది. అన్ని మున్సిపాల్టీల్లో ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని పంపిణీ చేస్తోంది.

### నాడు చీకట్లు.. నేడు వెలుగులు



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కుటుంబాల వారికి నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఇంధన వినియోగ చార్జీలతో పాటు, ట్రూ అప్, ఎఫ్‌పీపీసీఏ చార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. గత ప్రభుత్వం చెల్లించాల్సిన ఎస్సీ, ఎస్టీల విద్యుత్తు వినియోగదారుల రాయితీ మొత్తం రూ.74.43 కోట్లను కూడా ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది. గత ప్రభుత్వ హయాంలో 0–75 యూనిట్ల పరిమితి వుండగా, 0–100 యూనిట్ల పరిమితి దాటిన వినియోగదారుల విద్యుత్ సర్వీసులకు విద్యుత్తు సరఫరాను నిలిపివేసేవారు. ఆ బకాయిలను కూడా ప్రస్తుత ప్రభుత్వం చెల్లించడంతో పాటు యూనిట్ల పరిమితిని కూడా 0–200కు పెంచింది. దీంతో సర్వీసులు పెరిగాయి. సబ్సిడీ పెరిగింది. 2017–18లో సబ్సిడీ రూ.52.04 కోట్లు ఉండగా, 2022–23కి రూ.189.17 కోట్లకు పెరిగింది. ఇదంతా పేదలకు మేలు చేయడం కాదా రామోజీ? టీడీపీ హయాంలో విద్యుత్ రంగాన్ని పూర్తిగా నష్టాల్లోకి నెట్టేసి దివాలా తీయించిన చంద్రబాబు ఇప్పుడు ఏమీ ఎరుగనట్టు మాట్లాడుతున్నారు. ఆయన హయాంలో పెరిగిన విద్యుత్ కొనుగోలు, పంపిణీ వ్యయాలను అప్పటి ప్రభుత్వం ఏపీఈఆర్సీకి సమర్పించలేదు. దానికి తోడు డిస్కంలపై ఒత్తిడి తెచ్చి, 25 ఏళ్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) చేయించారు. పవన విద్యుత్ యూనిట్ రూ.2.44 ఉన్నప్పుడు రూ.5.94తో ఒప్పందం చేసుకున్నారు. సౌర విద్యుత్ యూనిట్ రూ 2.44కు లభిస్తుంటే (బ్యాక్‌డౌన్ చార్జీలతో కలిపి అయితే రూ. 3.54) రూ.8.09తో ఒప్పందాలపై సంతకాలు చేశారు. చంద్రబాబు హయాంలో స్లాబుల పేరుతో విద్యుత్ చార్జీల దోపిడీ జరిగేది. ఇవన్నీ మరచిపోయి ఎవరి కోసం విషం కక్కుతున్నారు రామోజీ?

# బోనులో చిక్కిన మరో చిరుత

**మూడు రోజుల్లో ఇది రెండోది**

- 50 రోజుల్లో పట్టుబడిన మూడు చిరుతలు
- మిగిలిన చిరుతలను కూడా పట్టుకునేందుకు యత్నాలు
- భక్తుల చేతికి కర్రలిచ్చి తప్పించుకోబోం: టీటీడీ చైర్మన్ భూమన


ఫారెస్ట్ అధికారులు విడుదల చేసిన చిరుత ఫోటో

తిరుమల: అలిపిరి–తిరుమల శేషాచలం అటవీ ప్రాంతంలోని నడక దారిలో గురువారం అర్ధరాత్రి దాటాక మరో చిరుత చిక్కింది. మూడు రోజుల క్రితమే ఓ చిరుత పట్టుబడగా.. తాజాగా గురువారం 1.30 గంటల సమయంలో మరో చిరుత బోనులో చిక్కింది. దీనిని మగ చిరుతగా అటవీ శాఖ అధికారులు గుర్తించారు. మూడు రోజుల వ్యవధిలోనే రెండు చిరుతలు బోనులో చిక్కడంతో తిరుమలకు వెళ్లే భక్తులకు ఊపిరి పీల్చుకుంటున్నారు. 50 రోజుల వ్యవధిలోనే మూడు చిరుత పులులను బంధించినట్లు అటవీ శాఖ అధికారులు చెప్పారు. శ్రీవారి దర్శనం కోసం నడక దారిలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు టీటీడీ, అటవీ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఈ మార్గంలో సంచరించే మిగిలిన చిరుతలను సైతం పట్టుకునే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. భక్తుల భద్రత కోసం అటవీ శాఖ సూచనల మేరకు అడవిలో 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అధికారులు మరో 200 కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

**భక్తుల రక్షణే లక్ష్యం: భూమన**

కాగా, బంధించిన చిరుతను పరిశీలించేందుకు ఘటనా స్థలానికి గురువారం ఉదయం చేరుకున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. భక్తుల భద్రత కోసం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. భక్తులకు భద్రత కల్పిస్తూనే, నడక మార్గంలోకి వచ్చే చిరుతలను బంధించే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అటవీ శాఖ అధికారులు ప్రతిపాదన మేరకే.. నడిచి వచ్చే భక్తులకు చేతి కర్రలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. చేతి కర్రలిచ్చి టీటీడీ తన బాధ్యత నుంచి తప్పించుకుంటోందని సోషల్ మీడియాలో విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. తాము నిరంతరం కాలిబాటలో వచ్చే భక్తులు ప్రశాంతంగా రావాలని శ్రమిస్తున్నామన్నారు.

**చిరుతల కోసం మరో 6 బోన్లు**

ప్రస్తుతం బోనులో చిక్కుకున్న చిరుతను కూడా ఎస్వీ జూపార్కుకు తరలిస్తున్నామని అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ నాగేశ్వరరావు చెప్పారు. బాలిక లక్షితపై దాడికి తెగబడిన చిరుతను పరీక్షల అనంతరమే నిర్ధారణకు వస్తామన్నారు. లక్ష్మీనరసింహ ఆలయం అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి సంచార జాడలను తెలుసుకునేందుకు మూడు బృందాలను నియమించామని తెలిపారు. ప్రస్తుతం నాలుగు బోన్లు ఉండగా.. మరో ఆరు బోన్లు అదనంగా తెప్పించి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**బంటినీ బంధిస్తాం**

చిరుతలు, ఎలుగుబంట్ల సంచారాన్ని గుర్తించేందుకు ఇప్పటికే 300 కెమెరాలు ఏర్పాటు చేశామని, మరో 200 కెమెరాలను ఏర్పాటు చేస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో చిరుతలను ఎస్వీ జూ పార్క్ నుంచి తెచ్చి పెడుతున్నట్టు ప్రచారం జరుగుతోందని, ఇందులో ఏమాత్రం నిజం లేదని అన్నారు. ఎలుగుబంట్ల సంచారం ఇక్కడ ఉందని.. డ్రోన్ కెమెరాల ద్వారా వాటి జాడలను తెలుసుకుంటున్నామని చెప్పారు. ఎలుగుబంటిని కూడా బంధించి కాలిబాట నుంచి తరలిస్తామని చెప్పారు.

# ఏవీఎన్ పాఠశాలను సందర్శించిన 'అల్లూరి' మనవడు

**ఇదే పాఠశాలలో చదివిన మన్యం వీరుడు అల్లూరి**


రామరాజును సత్కరించిన ఏవీఎన్ యాజమాన్యం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చదువుకున్న పాఠశాలను ఆయన సోదరుడి మనవడు అల్లూరి శ్రీరామరాజు గురువారం సందర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు ఆహ్వానం మేరకు శ్రీరామరాజు ఏవీఎన్ కళాశాలను సందర్శించారు. తన తాత చదువుకున్న స్కూల్‌ను సందర్శించడం గర్వంగా ఉందని రామరాజు అన్నారు. ముందుగా కళాశాల ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామరాజును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కళాశాల ఆంగ్ల, గణాంక శాస్త్ర విభాగాధిపతులు పైడి రజని, గాంధీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భానుమతి, కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 23న ట్రిపుల్ ఐటీలో మూడో విడత కౌన్సెలింగ్




నూజివీడు: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 4 ట్రిపుల్ ఐటీలకు కలిపి ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్ జరగనుంది. తొలి రెండు విడతల్లో జరిగిన కౌన్సెలింగ్ అనంతరం జనరల్ కోటాలో నూజివీడు ట్రిపుల్ ఐటీలో 15 సీట్లు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 14, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 160, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 100 సీట్లు మిగిలాయి. వీటి భర్తీకి ఎంపిక జాబితాను 19న వర్సిటీ అధికారులు విడుదల చేయనున్నారు. దీంతో పాటు వెయిటింగ్ జాబితానూ విడుదల చేస్తారు. మూడో విడత కౌన్సెలింగ్ 23న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్ అనంతరం కూడా ఏమైనా సీట్లు మిగిలితే 27న వెయిటింగ్ జాబితాలోని అభ్యర్థులతోసీట్లు భర్తీ చేస్తారు.

# మోదీ కార్మిక వ్యతిరేక విధానాలు దుర్మార్గం

**ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్**

కూర్మన్నపాలెం/గాజువాక: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 17వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న బస్సు యాత్రను కూర్మన్నపాలెం ఉక్కు దీక్షా శిబిరం వద్ద గురువారం అమర్‌జిత్ కౌర్ ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో అనేక కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ.. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. బేటీ పడావో...బేటీ బచావో అనే నినాదాన్ని పాటించాల్సిన నరేంద్రమోదీ ప్రభుత్వం మణిపూర్‌లో మహిళలు, పిల్లలపై అత్యాచారాలకు, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు : రామకృష్ణ**

తమ పార్టీ గురువారం చేపట్టిన బస్సుయాత్రలో భాగంగా ప్రజా సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సభలు, సమావేశాలను నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు.తమ యాత్ర వచ్చేనెల 8న తిరుపతిలో ముగుస్తుందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు జె.వి.సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకుల కొండ వద్ద చిరుత కళేబరం

**2 రోజుల్లో రెండు చిరుతల మృతి**


కొండలో చిరుత కళేబరం

మడకశిర రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం మెళవాయి సమీపంలోని కాకులకొండ వద్ద గురువారం మగ చిరుత కళేబరాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం ఆడ చిరుత కళేబరం కనిపించిన నేపథ్యంలో ఘటనా స్థలంలో ఆనవాళ్లు గుర్తించేందుకు గురువారం అటవీశాఖ అధికారులు కొండలోని గుంతలో పరిశీలించగా అక్కడ మగ చిరుత కళేబరాన్ని గుర్తించారు. విషయాన్ని అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రారెడ్డి, పెనుకొండ అటవీశాఖ డివిజన్ అధికారి ఆనంద్, రేంజ్ అధికారి శ్రీనివాసరెడ్డి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ ఘటనాస్థలికి చేరుకుని గుంతలో ఉన్న చిరుత కళేబరాన్ని పరిశీలించారు. ఆడ చిరుతలాగే తాజాగా లభించిన మగ చిరుత కూడా మృతి చెందిన సమయంలో మల, మూత్ర విసర్జన చేసింది. సమీపంలో ఏదో ద్రవ పదార్థం ఉందన్న అనుమానంతో నమూనాలను సేకరించారు. చిరుత కళేబరాన్ని మడకశిర అటవీశాఖ కార్యాలయానికి తీసుకువచ్చారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ అమర్ బుధ, గురువారాల్లో లభించిన ఆడ, మగ చిరుతలకు పోస్టుమార్టం నిర్వహించి కళేబరాలను కాల్చి వేశారు. రవీంద్రారెడ్డి మాట్లాడుతూ..2 చిరుతలూ ఒకే రోజు మృతి చెంది ఉండవచ్చని చెప్పారు. వీటి వయసు రెండేళ్లు ఉంటుందన్నారు. ఈ చిరుతల తల్లి కూడా కొండ ప్రాంతంలో ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. పోస్టుమార్టం ద్వారా సేకరించిన నమూనాలను తిరుపతి, విజయవాడ, బెంగళూరు ల్యాబ్‌లకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ రెండు చిరుతలకు ఎలాంటి గాయాలు లేవని, రెండూ ఒకే కారణంతో మృతి చెంది ఉంటాయని వెటర్నరీ ఏడీ తెలిపారు. విష ప్రయోగమా...? లేదా వ్యాధి సోకి మృతి చెందాయా..? అన్నది ల్యాబ్ రిపోర్టుల ద్వారా తెలుస్తుందన్నారు.

# నలుగురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

- తహసీల్దార్, డీటీ, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వోపై వేటు
- భూ అక్రమాలకు పాల్పడటమే కారణం


మర్రిపూడి తహసీల్దార్ కార్యాలయం

మర్రిపూడి: ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలంలో భూ అక్రమాలకు పాల్పడిన స్థానిక తహసీల్దార్ సీహెచ్ కృష్ణారావు, డీటీ జి.జగదీశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి ఆర్‌ఐ ఎంవీఎం శేషాచలం, పన్నూరు గ్రామ వీఆర్వో డి.శివారెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులిచ్చారు. మర్రిపూడి మండలంలోని పన్నూరులో సర్వే నంబర్ 12–2, 169–1, ఇతర సర్వే నంబర్లలో 143.29 ఎకరాల పట్టా భూమికి ఆ గ్రామ వీఆర్వోతో పాటు ఆర్‌ఐ కలిసి రెవెన్యూ రికార్డులు పరిశీలించకుండా ఫ్యామిలీ ట్రీ అనే ఒక పత్రం తయారు చేసి అసలైన వారసులకు కాకుండా సంబంధం లేని 65 మందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసేందుకు సిఫారసు చేశారు. అప్పటి తహసీల్దార్, ప్రస్తుత డీటీ జగదీశ్వరరావు కూడా పూర్తిగా పరిశీలించకుండా పట్టాదారు పుస్తకాలు జారీ చేశారు. ప్రస్తుత తహసీల్దార్ కృష్ణారావు కూడా వాటిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేశారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన భూముల్లో 71.75 ఎకరాలను వారం రోజుల్లోనే వీఆర్వో శివారెడ్డి బంధువుల పేర్లమీద రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై హక్కుదారులైన గోరంట్ల వెంకటేశ్వర్లు, మరికొంతమంది ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు భూముల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు వెళ్తున్నందున రెవెన్యూ అధికారులంతా కలిసి అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మొత్తం అంశంపై కనిగిరి ఆర్డీవోతో విచారణ చేపట్టిన కలెక్టర్..ఆర్డీవో ఇచ్చిన నివేదిక ప్రకారం భూ అక్రమాలు జరిగినట్లు గుర్తించి బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేశారు. ఆ భూములకు సంబంధించి 91 మంది వారసులు ఉండగా, వీఆర్వో శివారెడ్డి తన బంధువుల పేర్ల మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అందుకు మిగతా రెవెన్యూ అధికారులు కూడా చేతులు కలిపి సహకరించారని తేలడంతో నలుగురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ సాధించాలి

**సాంకేతిక విద్య శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి పాలిటెక్నిక్ కళాశాల అక్టోబర్ చివరి నాటికి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు పొందాలని రాష్ట్ర సాంకేతిక విద్య శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఎన్‌బీఏ అక్రిడిటేషన్ పొందటం వల్ల విద్యార్థులకు ఎన్నో లాభాలు ఉంటాయన్నారు. ఎన్‌బీఏ పురోగతిపై గురువారం వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. ప్రస్తుతం 7 పాలిటెక్నిక్‌లు ఎన్‌బీఏ గుర్తింపు అందుకున్నాయన్నారు. వచ్చే మూడు నెలల్లో ఎన్‌బీఏ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి విద్యాసంస్థ సిద్ధం కావాలని సూచించారు. ఇప్పటికే ఎన్‌బీఏ బృందం మరో ఆరు పాలిటెక్నిక్ కళాశాల సందర్శనకు షెడ్యూల్ ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యా శాఖ జేడీ వెలగా పద్మారావు, సాంకేతిక విద్యా, శిక్షణా మండలి కార్యదర్శి రమణబాబు, జేసీలు జానకిరామయ్య, సత్యనారాయణమూర్తి, సాంకేతిక విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, ఓఎస్డీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఎర్రమట్టికి, ఎర్రమట్టి దిబ్బలకు తేడా తెలుసుకో పవన్

- టీడీపీ నేతలే తక్కువ ధరకు డీఫారం భూములు కొన్నారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లాండ్ పూలింగ్‌తో మేలు జరుగుతోంది
- పవన్ పేద ప్రజల పొట్ట కొట్టడం సరికాదు
- జేవీ అగ్రహారం, నిడిగట్టు, కొత్తవలస రైతులు

కొమ్మాది (భీమిలి): ఎర్రమట్టికి, ఎర్రమట్టి దిబ్బలకు తేడా తెలుసుకోవాలని ఇక్కడి జేవీ అగ్రహారం, నిడిగట్టు, కొత్తవలస రైతులు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు సూచించారు. పర్యాటక ప్రాంతం ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేస్తున్నారంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలను వారు ఖండించారు. గురువారం ఎర్రమట్టి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ ఉన్న సమయంలో ఈ ప్రాంతాల్లో ఒక్కో రైతుకు 5 ఎకరాలు ఇచ్చారని తెలిపారు. కాలక్రమేణా పంటలు పండకపోవడంతో ప్రభుత్వం ఈ భూములను అభివృద్ధి చేస్తామనడంతో లాండ్ పూలింగ్‌కు ఇచ్చామని, తమపై ఎటువంటి ఒత్తిడీ లేదని చెప్పారు. బుధవారం పవన్ పర్యటించిన ప్రాంతం నుంచి కనుచూపు మేరలో కూడా ఎర్రమట్టి దిబ్బలు లేవన్నారు. అసలు ఎర్రమట్టి కనిపించే ప్రాంతమంతా ఎర్రమట్టి దిబ్బలు కావని పవన్ తెలుసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా మట్టి ఎర్రగా ఉంటుందని, అలా అని ఊరంతా ఎర్రమట్టి దిబ్బలంటే ఎలా అని ప్రశ్నించారు. పవన్ పర్యటించిన ప్రాంతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం నాయకులు రైతుల వద్ద తక్కువ ధరకు డీఫారం భూములు కొన్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక లాండ్ పూలింగ్ ద్వారా రైతులకు మేలు జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూములు చవగ్గా లాగేసుకున్నా మాట్లాడని పవన్ ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. పవన్ వాస్తవాలు తెలుసుకుని ప్రజల్లోకి వెళ్లాలే తప్ప ఇతర పార్టీల లబ్ధికోసం పేదల పొట్టకొట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతోపాటు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు రామకృష్ణ, నల్లబాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

# మాయ మాటలతో బాబు భూసేకరణ

**1,054వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**


రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: రాజధాని పేరుతో మూడు పంటలు పండే భూములను మాయ మాటలతో సమీకరించిన బాబు ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసి రూ.లక్షల కోట్లు లబ్ధి పొందాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,054వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. 29 గ్రామాల్లో పేదలకు చెందిన అసైన్డ్, లంక భూములకు ప్రభుత్వం నుంచి పరిహారం రాదని తప్పుడు ప్రచారం చేసి బెదిరించి తక్కువ ధరలకు కొనుగోలు చేసిన నారాయణ, బాబు అండ్ కో 41 జీవోను అడ్డుపెట్టుకుని పేదల నోళ్లు కొట్టారని ధ్వజమెత్తారు. నిజంగా రాజధానికి మేలు చేసి ఉంటే బాబు, లోకేశ్ రాజధానిలో తిరిగి సెల్ఫీ ఛాలెంజ్‌లు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. టైమ్స్ నౌ, ఇండియా టుడే, చాణక్య సర్వేలలో ఏపీలో వైఎస్సార్‌సీపీ 24–25 ఎంపీ సీట్లు సాధించడం ఖాయమని ఇచ్చారంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల మద్దతు ఏ మేరకు ఉందో తెలుస్తుందన్నారు. కులవాదంతో అన్ని పార్టీల్లో ఉన్న బాబు కోవర్టులు ఎంతమంది ఏకమైనా రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

# 'వందేభారత్'లో సాంకేతిక లోపం

**ప్రత్యామ్నాయ రైలులో సికింద్రాబాద్‌కు ప్రయాణికులు**


ప్రత్యామ్నాయ రైలు వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న డీఆర్ఎం


తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర)/రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ: విశాఖలో గురువారం బయల్దేరాల్సిన విశాఖ–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లోని ఓ కోచ్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో అధికారులు రైలుని రద్దు చేసి మరో రైలులో ప్రయాణికులను సికింద్రాబాద్‌కు పంపారు. డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా విశాఖ నుంచి ఈ స్పెషల్ రైలు ఏర్పాటు చేశారు. ఈ రైలు విశాఖలో ఉదయం 7 గంటలకు బయల్దేరింది. వందేభారత్ మార్గంలో అదే హాల్ట్స్‌తో ఈ రైలు సికింద్రాబాద్ చేరుకుంది. తిరుగు ప్రయాణంలో కూడా ఈ స్పెషల్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మార్గంలో అదే హాల్ట్స్‌తో విశాఖ చేరుకోనుంది. కాగా, వందే భారత్ రద్దు చేయడంపై అన్ని రైల్వే స్టేషన్‌ల్లో ప్రకటనలు, మెసేజ్‌ల ద్వారా ప్రయాణికులకు సమాచారమిచ్చి, ప్రతి రైల్వే స్టేషన్‌లలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ప్రయాణం రద్దు చేసుకున్న వారికి పూర్తిగా నగదు రిఫండ్ చేశారు. ప్రత్యేక రైలులో ప్రయాణం చేసిన ప్రయాణికులకు వ్యత్యాసం నగదు రిఫండ్ చేశారు. ఈ రైలులో వందే భారత్ రైలు సేవలతో సమానంగా క్యాటరింగ్ ఏర్పాట్లు కూడా చేశారు.


# జాతీయస్థాయిలో సత్తాచాటిన సాక్షి ఫొటోగ్రాఫర్లు

**19న విజయవాడలో బహుమతుల ప్రదానం**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/నాగాయలంక/తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఫొటో కాంపిటీషన్ ఫలితాలను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు విడుదల చేశారు. గురువారం విజయవాడలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏపీపీజేఏ అధ్యక్షుడు సీహెచ్‌వీఎస్ విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి వి.రూబెన్ బెసాలియల్‌తో కలిసి కలెక్టర్ ఫలితాలను విడుదల చేశారు. పోటీల్లో జనరల్ కేటగిరీలో ఎండీ నవాజ్ (సాక్షి, వైజాగ్) ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఫొటో జర్నలిజం కేటగిరీలో సాక్షి ఫొటోగ్రాఫర్లు పి.లీలామోహన్‌రావు(వైజాగ్), వి. శ్రీనివాసులు (కర్నూలు), కందుల చక్రపాణి (విజయవాడ), పి.మనువిశాల్ (విజయవాడ), కె.శివకుమార్ (యాదాద్రి), కె.జయ శంకర్ (శ్రీకాకుళం), కేతారి మోహన్‌కృష్ణ (తిరుపతి), ఎస్.లక్ష్మీపవన్ (విజయవాడ) కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. జనరల్ కేటగిరీలో సాక్షి ఫొటోగ్రాఫర్ ఎస్ లక్ష్మీపవన్ (విజయవాడ) కన్సొలేషన్ బహుమతి గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా ఏపీపీజేఏ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పత్రికా ఫొటోగ్రాఫర్ల నుంచి 700 ఎంట్రీలు వచ్చాయన్నారు. విజేతలకు ఈనెల 19న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

**రూబెన్‌కు బెస్ట్ ఇమేజ్ అవార్డు**


రూబెన్ బెసాలియల్


సింహాద్రి కృష్ణప్రసాద్

వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో సాక్షి ఫొటోగ్రాఫర్ వి. రూబెన్ బెసాలియల్ తీసిన చిత్రానికి బెస్ట్ ఇమేజ్ అవార్డు లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అనే అంశంపై నిర్వహించిన పోటీలో ఆగస్టు 15న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో సీఎం వైఎస్ జగన్ పోలీసు దళాల పరిశీలన చిత్రానికి అవార్డు వచ్చింది. కాగా ఫొటోగ్రాఫర్ వి.రూబెన్ బెసాలియల్ తీశారు. కాగా కృష్ణాజిల్లా నాగాయలంకకు చెందిన సాక్షి రిపోర్టర్ సింహాద్రి కృష్ణప్రసాద్ పంపిన ఛాయాచిత్రానికి సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కింది. స్పెషల్ థీమ్ మ్యానిఫెస్టేషన్స్ ఆఫ్ నేచర్‌లో అండర్ స్టాండింగ్ ది క్లౌడ్స్ విభాగంలో ఆయన పంపిన 'క్లౌడ్స్ అంబరిల్లా టూ గాడ్' ఛాయాచిత్రం ప్రథమ సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అవార్డు దక్కించుకుంది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం జరిగే వేడుకల సభలో వీరికి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

# మంచినీరు.. గాలి నుంచి తయారు

- జేఎన్‌టీయూకేలో ఫలించిన ప్రయోగం
- పేటెంట్ కోసం సిద్ధమైన ప్రాజెక్టు నివేదిక

**గాలిలో ఉండే తేమ నుంచి వ్యక్తిగత స్థాయిలోనే మంచినీటిని తయారు చేసే పరికరాన్ని రూపొందించింది కాకినాడలోని జేఎన్‌టీయూ. ఈ ప్రయోగం ఫలించడంతో పేటెంట్ కోసం ప్రాజెక్ట్ నివేదిక సిద్ధమైంది. జేఎన్‌టీయూకే డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఈ నూతన అవిష్కరణకు నాంది పలికింది. ఆరు నెలలుగా వర్సిటీ ప్రొఫెసర్లు వివిధ ప్రయోగాలు చేసి ఎట్టకేలకు ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంతో త్వరలో విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో జేఎన్‌టీయూ కసరత్తు చేస్తోంది.**

–సాక్షి ప్రతినిధి, కాకినాడ


తేమ నుంచి శుద్ధమైన నీటిని ఉత్పత్తి చేసిన వాటర్ జనరేటర్

పల్లెలు, గిరిజన తండాల ప్రజలు ఇకపై కాలుష్య కారకమైన బ్యాక్టీరియాతో కూడిన నీటిని తాగాల్సిన అవసరం లేదు. ప్రధానంగా గిరిజనులు స్వచ్ఛమైన తాగునీరు దొరక్క బురదమయమైన చలమల నీటినే వడపోసుకుని తాగుతున్నారు. బ్యాక్టీరియాతో ఉండే ఈ నీటిని తాగడంతో వారి ఆరోగ్యం దెబ్బతింటోంది. టైఫాయిడ్‌తో పాటు సీజనల్‌గా వచ్చే మలేరియా, డయేరియా బారిన పడుతున్నారు. భూమిలో సున్నపు రాయి ఉన్న పల్లెలు, గిరిజన గ్రామాల్లో ఈ తరహా కాలుష్యంతో కూడిన నీరు తాగడమే ఇందుకు కారణమని పలు అధ్యయనాల్లో స్పష్టమైంది. ప్రతిరోజూ తాగడానికి, వంటింటి అవసరాల కోసం కుటుంబానికి 12 నుంచి 15 లీటర్ల నీరు అవసరం అవుతోంది. ఐక్యరాజ్య సమితి తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 2.10 బిలియన్లకు పైగా ప్రజలు సురక్షితమైన నీరు తాగలేకపోతున్నారు. గిరిజన ప్రాంతాలు, పల్లెల్లో అయితే వీరి సంఖ్య ఎక్కువగా ఉంటుందని ఆ నివేదిక స్పష్టం చేసింది.

**గిరిజనులు, పల్లెవాసుల్ని దృష్టిలో పెట్టుకుని..**

గతంలో ఇదే యూనివర్సిటీలో ప్రొఫెసర్ అల్లూరు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వాహనాలు వెళ్లలేని ఎత్తైన కొండ ప్రాంతాల్లో నివశించే గిరిజనులకు సులువైన పద్ధతిలో వైద్యం అందించేందుకు వీలుగా బైక్ అంబులెన్స్‌లు రూపొందించారు. తాజాగా గాలిలోని తేమ నుంచి నీటిని వెలికితీసే పరికరానికి రూపకర్త కూడా గోపాలకృష్ణ కావడం విశేషం. గాలిలోని తేమ నుంచి నీటిని ఉత్పత్తి చేసి.. ఆ నీటిని ట్యాంకుల్లో నిల్వ చేసి గిరిజనులకు శుద్ధమైన నీటిని అందిస్తారు. ఇందుకోసం నీటి జనరేటర్‌ను రూపొందించారు. ఈ వాతావరణ నీటి జనరేటర్ (అట్మాస్ఫిరిక్ వాటర్ జనరేటర్–ఏడబ్ల్యూజీ) గాలిలోని తేమ నుంచి నీటి ఆవిరిని వెలికి తీస్తుంది. నీటిని తాజాగా ఉంచడంతో పాటు బ్యాక్టీరియా రహిత, స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తుంది. ఈ యంత్రం ద్వారా ఉత్పత్తి చేసే నీరు ఎక్కడా కలుషితమయ్యే అవకాశమే ఉండదు. నీటి ఆవిరిని సేకరించిన తరువాత కార్బన్, రివర్స్ అస్మాసిస్, యూవీ స్టెరిలైజేషన్ లైట్లతో సహా అనేక ఫిల్టర్ల ద్వారా నీటిని శుద్ధి చేస్తారు. ఫలితంగా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుంది.

**ఇలా పని చేస్తుంది**

రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండీషనర్లు పనిచేసే సూత్రం ఆధారంగానే వాతావరణ నీటి జనరేటర్ (ఏడబ్ల్యూజీ) కూడా పనిచేస్తుంది. ఆవిరి కంప్రెషన్ రిఫ్రిజిరేషన్ ద్వారా ఆవిరి శీతలీకరణ పద్ధతి ద్వారా నీటి బిందువులను క్రోడీకరిస్తారు. ఆ బిందువులను తక్కువ ఉష్ణోగ్రతతో నిర్వహించే ఎవాపరేటర్ కాయిల్ గుండా పంపిస్తారు. ఈ నీటి జనరేటర్‌లో గాలి నుంచి వేరుగా ఉన్న మంచు బిందువు ఉష్ణోగ్రత నీటి ఆవిరికి ఘనీభవిస్తుంది. అలా ఘనీభవించిన నీటిని సేకరించి ఆవిరి వడబోత వ్యవస్థ ద్వారా ఫిల్టర్ చేసి ట్యాంకుల్లోకి పంపించి నిల్వ చేస్తారు. ఇలా ఒక నీటి జనరేటర్ యంత్రం ద్వారా రోజుకు 12 లీటర్లకు తక్కువ గాకుండా స్వచ్ఛమైన నీటిని సిద్ధం చేయవచ్చు. ఇందుకోసం ప్రాథమికంగా రూ.80 వేలు ఖర్చవుతుంది. నీటి పరిమాణాన్ని పెంచుకోవాలనుకుంటే నీటి జనరేటర్ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. ప్రధానంగా గిరిజనుల కోసం తయారుచేసిన ఈ ప్రాజెక్టు నివేదికను గిరిజన సంక్షేమ శాఖ దృష్టికి తీసుకువెళ్లాలని వర్సిటీ వర్గాలు నిర్ణయించాయి. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్‌తో సంబంధం లేకుండా సౌర, గాలి మరల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కూడా వినియోగించవచ్చు.

**నిర్వహణ చాలా సులభతరం**



వాతావరణ నీటి జనరేటర్ నిర్వహణ చాలా సులభతరం. గిరిజనుల నీటి కష్టాలు కడతేర్చడమే ప్రాజెక్ట్ లక్ష్యం. ఇలా ఉత్పత్తి చేసిన శుద్ధమైన నీరు నిత్యం ఒక కుటుంబానికి సరిపోతుంది. ఇంకా ఎక్కువ పరిమాణంలో నీరు కావాలనుకుంటే నీటి జనరేట్ సామర్థ్యాన్ని పెంచుకోవడం చాలా సులువు. 10 కుటుంబాలకు కలిసి గ్రూపుగా ఒక యూనిట్ కూడా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. పేటెంట్ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించబోతున్నాం.

– ప్రొఫెసర్ అల్లూరు గోపాలకృష్ణ, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్, జేఎన్‌టీయూ, కాకినాడ

# అభిరుచి..అవగాహన..ఆపై ఆదాయం

**సైబర్ నేరాల కట్టడిపై అవగాహనపెంపుపై యువత లఘు చిత్రాల రూపకల్పన**

సాక్షి, హైదరాబాద్ : ప్రతిభ ఉంటే చాలు...పెట్టుబడితో పని లేకుండా లఘు చిత్రాలను ప్రొఫెషనల్ డైరెక్టర్లను మించి చేస్తోంది మన యువత. అవకాశం దొరికితే రీల్స్..మీమ్స్‌తో నిత్యం సోషల్‌మీడియా ట్రెండింగ్‌లో ఉండాలని కోరుకుంటోంది నేటి యువత. అయితే ఈ క్రేజ్‌ను ఉపయోగించుకుని సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేలా యువతను ప్రోత్సహించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. ఆయా సంస్థలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యువతను ప్రోత్సహించేందుకు ఇదే మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. అందులో భాగంగా ఇటీవలే కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'కవచ్'– 2023 పేరిట హ్యాకథాన్ నిర్వహించింది. లఘు చిత్రాలు, రీల్స్, యానిమేషన్స్ ఇలా పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో వచ్చిన ఉత్తమ వీడియోలను సామాజిక మాధ్యమాల యాప్స్‌లో అవగాహన ప్రకటనలుగా వినియోగిస్తున్నారు. ఇదేవిధంగా అన్ని రాష్ట్రాల పోలీసుశాఖలు సైతం ప్రతీయేటా హ్యాకథాన్‌లు నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలోనూ ప్రతి ఏడాది ఈ తరహా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

**ఇతర విభాగాలు కూడా...**

పోలీస్, ఇతర దర్యాప్తు విభాగాలతోపాటు న్యాయవిభాగాలు సైతం ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలోనూ పలు జిల్లాల్లో లఘుచిత్రాలు, డాక్యుమెంటరీ పోటీల నిర్వహిస్తోంది. సైబర్‌నేరాలు, ఆర్థిక మోసాలు, మహిళలు, చిన్నారులపై సైబర్ వేధింపులు, చైల్డ్ పోర్నోగ్రఫీ దుష్ప్రభావాలు తదితర అంశాలను ఇతివృత్తంగా యువత రూపొందిస్తున్న లఘుచిత్రాలు ఆలోచింపజేసేలా ఉంటున్నాయి. తగిన పారితోషికం, గుర్తింపు ఉండటంతో యువత ఇలాంటి రీల్స్, షార్ట్‌ఫిల్మ్‌లు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## క్లుప్తంగా...

### నెహ్రూ అంటే పేరు కాదు.. కృషి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ పేరుని ప్రధానమంత్రుల మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీగా పేరు మార్చడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నెహ్రూకి ఆయన పేరు వల్ల గుర్తింపు రాలేదని, ఆయన చేసిన కృషి వల్ల వచ్చిందని అన్నారు. గురువారం నాడు లద్దాఖ్‌కు వెళ్లిన రాహుల్ విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. ''నెహ్రూకు వచ్చిన గుర్తింపు అంతా ఆయన చేసిన పనుల వచ్చింది. అంతే తప్ప ఆయన పేరు వల్ల కాదు'' అని అన్నారు. నెహ్రూ మ్యూజియం పేరు మార్చడంపై రాజకీయంగా వివాదాస్పదమైన నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.


### విమానాశ్రయంలోనే కుప్పకూలిన పైలట్

నాగ్‌పూర్: ఇండిగో సంస్థ పైలట్ ఒకరు విమానాశ్రయంలోనే గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఈ ఘటన నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో గురువారం చోటుచేసుకుంది. నాగ్‌పూర్-పుణె విమానాన్ని నడపాల్సిన కెప్టెన్ మనోజ్ సుబ్రమణ్యం(40) మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎయిర్‌పోర్టుకు వచ్చారు. బోర్డింగ్ గేట్ వద్ద ఉండగా ఆయన హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయారు. సిబ్బంది వెంటనే కిమ్స్-కింగ్స్ వే ఆస్పత్రికి తరలించారు. సీపీఆర్ చేపట్టినా ఫలితం లేకపోయిందని, ఆకస్మికంగా వచ్చిన గుండెపోటుతో అప్పటికే ఆయన అప్పటికే చనిపోయారని వైద్యులు ధ్రువీకరించారు.

### టెక్-ఫ్రెండ్లీగా కింది కోర్టులు

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

సాక్షి, న్యూఢిల్లీ: ఆధునిక సాంకేతికతకు మరింతగా వినియోగించుకుంటూ కింది స్థాయి న్యాయస్థానాలను 'టెక్-ఫ్రెండ్లీ'గా తయారుచేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. గురువారం ఆర్టికల్ 370 రద్దుపై రాజ్యాంగ ధర్మాసనం విచారణ సమయంలో సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే కింది కోర్టులు సాంకేతిక పుంజుకోవాల్సిన అవసరం ఉందంటూ చేసిన వాఖ్యపై సీజేఐ స్పందించారు. కోవిడ్ కష్టకాలంలో అన్ని వ్యవస్థలూ స్తంభించిపోయినా న్యాయస్థానాలను ప్రతిరోజూ నడపాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఈ-కోర్టుల ప్రాజెక్టు మూడో దశకు కేంద్రం కేటాయించిన భారీ బడ్జెట్ కారణంగా న్యాయవ్యవస్థ ముఖ్యంగా కింది కోర్టుల్లో సాంకేతిక పుంజుకొంటుందని సీజేఐ ఆశాభావం వ్యక్తంచేశారు. న్యాయస్థానాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ఇతోధిక నిధులు సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర అత్యంత ముఖ్యమైనదని గుర్తుచేశారు.




# ఇక కన్నీళ్లేనా..?

## ప్రపంచ జనాభాలో 25% మంది పరిస్థితి ఇదీ.!

భారత్ సహా 25 దేశాల్లో నీటికి కొరత

పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికా దేశాల్లో 83% జనాభాకు అందని సురక్షిత నీరు

నీటి కొరతతో ఆర్థికంగా నష్టపోతున్న భారత్, ఈజిప్టు, మెక్సికో, టర్కీ

వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ అధ్యయనంలో వెల్లడి

వానలు, వరదలతో ప్రపంచంలో కొన్ని దేశాలు అల్లాడిపోతుంటే, మరి కొన్ని దేశాల్లో గొంతు తడుపుకోవడానికి గుక్కెడు మంచినీళ్లకి కరువు వచ్చి పడింది. ప్రపంచంలో 25 దేశాలు నీటికి కటకటలాడుతున్నట్టుగా వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. అక్వెడక్ట్ వాటర్ రిస్క్ అట్లాస్ పేరుతో ఈ సంస్థ విడుదల చేసిన నివేదికలో ప్రపంచ జనాభాలో 25% మంది ప్రస్తుతం అత్యంత తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

### నివేదిక ఏం చెప్పిందంటే..

- ప్రపంచంలోని 25 దేశాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. వాటిలో భారత్, సౌదీ అరేబియా, చిలీ, శాన్‌మెరినో, బెల్జియం, గ్రీస్ వంటి దేశాలున్నాయి.
- బహ్రెయిన్, సైప్రస్, కువైట్, లెబనాన్, ఒమన్ ప్రతీ ఏడాది నీటి కొరతతో అల్లాడిపోతున్నాయి. ప్రతీ ఏడాది కరువు బారిన పడుతున్నాయి.
- ప్రపంచంలో నీటి కొరత అత్యధికంగా ఎదుర్కొంటున్న ప్రాంతాలు పశ్చిమ ఆసియా, ఉత్తర ఆఫ్రికా. ఈ ప్రాంతాల్లో 83% జనాభా అత్యధికంగా నీటి కొరత సమస్యను ఎదుర్కొంటున్నారు.
- దక్షిణాసియా జల సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ దేశాల్లో 74% మంది జనాభా నీటి కొరత అధికంగా ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారు.
- ప్రపంచ జనాభాలో 50% మంది అంటే 400 మంది కోట్ల వరకు ప్రతీ ఏడాది ఒక నెల రోజుల పాటు నీటికి కటకటగా ఉండే పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 60 శాతానికి చేరుకునే అవకాశాలున్నాయి.
- నీటి కొరత కారణంగా భారత్, మెక్సికో, ఈజిప్టు, టర్కీ దేశాలు ఆర్థికంగా భారీగా నష్టపోతున్నాయి.
- 2010లో నీటి కొరత వల్ల ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 15 లక్షల కోట్ల డాలర్లు (ప్రపంచ జీడీపీలో 24%) నష్టపోతే, 2050 నాటికి ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 31% నష్టం వాటిల్లుతుంది. అంటే 70 లక్షల కోట్ల డాలర్ల నష్టం వస్తుంది.
- ఆసియా దేశాల్లో భారత్ అత్యధికంగా నీటి కొరతను ఎదుర్కొంటుంది. 2050 నాటికి ఆసియా దేశాల్లో 80% మందికి సురక్షిత నీరు అందదు.
- ప్రపంచ వ్యవసాయ రంగం 60% నీటి కొరతను ఎదుర్కొంటోంది. దీని వల్ల వరి, గోధుమ, మొక్కజొన్న, చెరుకు పంటలపై ప్రభావం పడుతోంది.



నీరు మనకి జీవనాధారం. భూమ్మీద లభించే అత్యంత ముఖ్యమైన వనరు అదే. అయినా దాని నిర్వహణలో మనం విఫలమవుతూ వస్తున్నాం. జల సంరక్షణ అనే అంశంలో నేను 10 ఏళ్లుగా పని చేస్తున్నాను. దురదృష్టవశాత్తూ ప్రతీ ఏడాది అదే నివేదిక, అదే కథనం ఇవ్వాల్సి వస్తోంది. ఈ సంక్షోభ పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ప్రపంచ దేశాధినేతలు చిత్తశుద్ధితో పని చేస్తూ నీటి వనరుల సంరక్షణకి ఆర్థిక వనరులు కేటాయించాలి''

–సమంతా కుజ్మా, డబ్ల్యూఆర్ఐ నివేదిక రచయిత్రి

### నీటి కటకటకి కారణాలివే..!

జనాభా పెరుగుదల , పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పులు, నీటి నిర్వహణ సమర్థంగా చేయకపోవడం వంటివెన్నో నీటి కటకటకి కారణాలు. భూమ్మీద 70% నీటితో నిండి ఉన్నా మన అవసరాలు తీర్చే నీరు అందులో 3% మాత్రమే. అందులో రెండింట మూడొంతులు మంచు రూపంలో ఉంది. జనాభా పెరిగిపోతూ ఉండడంతో నీటికి డిమాండ్ పెరుగుతోంది. 1960తో పోల్చి చూస్తే నీటికి డిమాండ్ రెట్టింపు కంటే ఎక్కువైంది. యూరప్, అమెరికాలో నీటికి డిమాండ్ స్థిరంగా ఉంటే ఆఫ్రికా దేశాల్లో పెరుగుతోంది. 2050 నాటికి నీటికి డిమాండ్ మరో 25% పెరుగుతుందని అంచనా. వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రపంచంలో సగం దేశాల్లో అనావృష్టి పరిస్థితులు నీటి కొరతకు కారణమవుతున్నాయి. పరిశ్రమలు పెరిగిపోతూ ఉండడంతో నీటి వినియోగం అధికమవడమే కాకుండా, కలుషిత నీరు పెరిగిపోయే ప్రజల అవసరాలు తీర్చలేకపోతోంది.

### చేయాల్సింది ఇదే..!

ప్రతీ వాన బొట్టుని సంరక్షించడానికి ప్రపంచ దేశాలన్నీ శక్తివంచన లేకుండా కృషి చేయాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకే 70% నీటిని వాడాల్సి వస్తోంది. 2050 నాటికి పెరిగే జనాభాకి 2010 కంటే 56% అధికంగా పంటలు పండించాలి. తక్కువ నీటి వాడకంతో పంటలు పండించే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం వల్ల 2050 నాటికి నీటి కొరత ఎదుర్కొంటున్న ప్రాంతాలు గణనీయంగా తగ్గుతాయని ఒక అంచనా. చిత్తడి నేలలు పెంచడం, భూగర్భ జలాల పెంపొందించే చర్యలు చేపట్టడం వంటివి చెయ్యాలి. ఇక గ్లోబల్ వార్మింగ్ అదుపు చేయడానికి ప్రపంచ దేశాలన్నీ కృషి చేయాల్సి ఉంది.

**ఆ 25 దేశాలు ఇవే..!:** భారత్, బహ్రెయిన్, సైప్రస్, కువైట్, లెబనాన్, ఒమన్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, ఈజిప్టు, లిబియా, యెమన్, బోత్స్వానా, ఇరాన్, జోర్డాన్, చిలీ, శాన్ మారినో, బెల్జియం, గ్రీస్, టునిషియా, నమీబియా, దక్షిణాఫ్రికా, ఇరాక్, సిరియా

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికలు ముగిసే వరకూ

# ఆహార భద్రత !

- ఉచిత రేషన్ బియ్యం పథకం కొనసాగింపునకే కేంద్రం మొగ్గు
- ఎల్పీజీ సబ్సిడీ సిలిండర్లపై ఇస్తున్న సాయం కొనసాగించే అవకాశం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని నిరుపేద కుటుంబాలకు ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని ఈ ఏడాది డిసెంబర్ తర్వాత సైతం కొనసాగించే అవకాశాలున్నాయని కేంద్రప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. రాజకీయ కారణాలు, వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకాన్ని మరో ఆరు నెలల పాటు కొనసాగించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ పథకం ద్వారా 81 కోట్ల మంది లబ్ధిదారులకు కేంద్రప్రభుత్వం ప్రతి నెల ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తోంది. నిజానికి ఈ ఉచిత బియ్యం పంపిణీ ఈ ఏడాది డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్రం ఈ ఏడాది జనవరిలోనే నిర్ణయించడం తెల్సిందే. అయితే సార్వత్రిక ఎన్నికల్లో ఉచిత బియ్యం పథకాన్ని ప్రధానాస్త్రంగా చేసుకుని అధికార బీజేపీ ఇప్పటికే ప్రచారాన్ని మొదలుపెట్టింది. గతంలో రెండుసార్లు బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దేశంలోని పేద, మధ్య తరగతి వర్గాలు అండగా నిలిచిన నేపథ్యంలో ఈ పథకాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగించి ఈసారీ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ యోచిస్తోంది. దీంతోపాటే ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు రెండేళ్లుగా ఏడాది గరిష్ఠంగా ఒక్కో రీఫిల్‌కు రూ.200 సబ్సిడీ చొప్పున 12 సిలిండర్లను రాయితీ ధరకు అందిస్తోంది. వంటగ్యాస్ ధరలు ఎక్కువ స్థాయిలోనే కొనసాగితే ఈ గడువును మరో ఆరు నెలల పాటు పొడిగించే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

## స్వావలంబనకు చిహ్నం 'వింధ్యగిరి'

కోల్‌కతా: భారత నౌకాదళం కోసం దేశీయంగా నిర్మించిన యుద్ధ నౌక 'వింధ్యగిరి' దేశ స్వావలంబనకు చిహ్నమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. గురువారం ఆమె కోల్‌కతాలోని హుగ్లీ తీరంలో ఉన్న గార్డెన్ రీచ్ షిప్‌యార్డులో వింధ్యగిరిని జల ప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. ఆత్మనిర్భర్ భారత్‌కు, దేశం సముపార్జించిన సాంకేతిక ప్రగతికి ఇది నిదర్శనమన్నారు. సముద్ర జలాలపై భారత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఇదొక ముందడుగని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమబెంగాల్ గవర్నర్ ఆనందబోస్, సీఎం మమతా బెనర్జీ పాల్గొన్నారు. దేశీయంగా ఏడు యుద్ధ నౌకల తయారీ లక్ష్యంతో కేంద్రం 2019లో 'ప్రాజెక్ట్ 17 ఆల్ఫా'చేపట్టింది. 2019–22 వరకు అయిదు యుద్ధ నౌకలను నిర్మించి, నేవీకి అప్పగించారు. ఈ ప్రాజెక్టులో వింధ్యగిరి ఆరోది. ఆధునిక ఈ నౌకలో వినియోగించిన పరికరాలు, వ్యవస్థలు 75 శాతం వరకు దేశీయంగా తయారైనవి. విస్తృత ట్రయల్స్ తర్వాత భారత నేవీకి అప్పగించనున్నారు. సుమారు 149 మీటర్ల పొడవైన పీ17ఏ రకం ఈ యుద్ధ నౌకల్లో గైడెడ్ మిస్సైల్స్ ఉంటాయి. భూమి, ఆకాశం, నీటి లోపలి నుంచి ఎదురయ్యే విపత్తులను గుర్తించి నిర్వీర్యం చేయగలవు.



జలప్రవేశం చేస్తున్న వింధ్యగిరి యుద్ధనౌక. (ఇన్‌సెట్లో) కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము, సీఎం మమత

# 'చంద్రయాన్-3'లో కీలక ఘట్టం ఆవిష్కృతం

- ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన ల్యాండర్ మాడ్యూల్
- చంద్రుడి వైపు దూసుకెళ్తున్న ల్యాండర్ 'విక్రమ్'



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామపై అధ్యయనం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూలై 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్‌లో గురువారం మధ్యాహ్నం 1.35 గంటలకు కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. వ్యోమనౌకలోని ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి రోవర్ 'ప్రజ్ఞాన్'తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ 'విక్రమ్' విజయవంతంగా విడిపోయింది. ఇక జాబిల్లి ఉపరితలంపై క్షేమంగా దిగడమే తరువాయి. ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన తర్వాత 'థ్యాంక్స్ ఫర్ ది రైడ్, మేట్' అంటూ ల్యాండర్ మాడ్యూల్ ఒక సందేశాన్ని పంపించినట్లు ఇస్రో వెల్లడించింది. ప్రస్తుతం ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడికి వంద కిలోమీటర్లు ఎత్తులో లూనార్ ఆర్బిట్‌లో వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తూ ల్యాండర్ సమాచారాన్ని భూనియంత్రిత కేంద్రానికి అందిస్తోంది. ఈ నెల 18న, 20న ల్యాండర్ మాడ్యూల్‌ను చందమామకు మరింత సమీపానికి తీసుకెళ్లే ప్రక్రియలు చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియల్లో ల్యాండర్ వేగాన్ని క్రమంగా తగ్గిస్తారు. ఈ నెల 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్‌ను చంద్రుడి ఉపరితలంపై దక్షిణ ధ్రువ ప్రాంతంలో ల్యాండింగ్ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ ఆరోగ్యకరంగా ఉండి చక్కగా పని చేస్తున్నాయని ఇస్రో ప్రకటించింది. ప్రస్తుతం ప్రొపల్షన్ మాడ్యూల్ లూనార్ ఆర్బిట్‌లో పరిభ్రమిస్తుండగా, ల్యాండర్ చంద్రుడివైపు దూసుకెళ్లే పనిలో ఉంది. ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రుడి చుట్టూ కక్ష్యలో నెలలు/సంవత్సరాల తరబడి తన ప్రయాణం కొనసాగించనుంది. ఈ నెల 23న ఆవిష్కృతం కాబోయే అద్భుత ఘట్టాన్ని తిలకించేందుకు ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

### కోర్టు ఆవల రాజీ ఒప్పందం కుదుర్చుకోండి

వారణాసి(యూపీ): వారణాసిలోని జ్ఞానవాపి మసీదును గతంలో ఆలయం ఉన్న ప్రదేశంపై నిర్మించారా? అన్న దానిని తేల్చే విషయంలో న్యాయస్థానంలో నలుగుతున్న అంశాన్ని కోర్టు ఆవల రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని విశ్వ వేదిక్ సనాతన్ సంఘ్ పిలుపునిచ్చింది. జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో పురావస్తు శాఖ సర్వే కొనసాగుతున్న ఈ తరుణంలో సనాతన సంఘ్ చీఫ్ జితేంద్ర ఇలా బహిరంగ లేఖ రాయడం గమనార్హం. ఈ లేఖ తమకు అందిందని దీనిపై అంతర్గత సమావేశంలో చర్చిస్తామని ఇంతెజామియా మస్జిద్ కమిటీ సంయుక్త కార్యదర్శి మొహమ్మద్ యాసిన్ చెప్పారు.

## సలహా బోర్డు అనుమతిస్తే.. 3 నెలలకుపైగా నిర్బంధించొచ్చు

న్యూఢిల్లీ: ముందస్తు నిర్బంధానికి సరైన కారణం ఉందని అడ్వైజరీ బోర్డు అభిప్రాయపడిన సందర్భాల్లో.. ' 3 నెలలకు మించి ముందస్తు నిర్బంధంలో ఉంచరాదు' అనే నిబంధన వర్తించబోదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. గత ఏడాది ఆగస్టులో తనను అరెస్ట్‌చేశారని, కాకినాడ జిల్లా మేజిస్ట్రేట్ ఇచ్చిన ముందస్తు నిర్బంధ ఉత్తర్వు చెల్లదంటూ పెసల నూకరాజు అనే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలుచేయగా దానిని హైకోర్టు కొట్టేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా గురువారం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఆయనకు వ్యతిరేకంగా తీర్పును వెలువరించింది. ' ముందుస్తు నిర్బంధం సహేతుకమని అడ్వైజరీ బోర్డు భావిస్తే మూడునెలలకు మించి కూడా సంబంధిత వ్యక్తులను నిర్బంధంలో కొనసాగించవచ్చు. నిర్బంధం మూడు నెలలకు మించకూడదనే నిబంధన ఇలాంటి సందర్భాల్లో వర్తించదు' అని కోర్టు తీర్పు చెప్పింది. 'కింది కోర్టు ఉత్తర్వుల్లో ఇంతకాలం నిర్బంధించండి అని పేర్కొంటే అంత కాలానికే నిర్బంధంలో ఉంచుతారు. ఒకవేళ కాలావధిని కోర్టు పేర్కొనకపోతే ఆ వ్యక్తిని గరిష్ఠకాలం(12 నెలలు) నిర్బంధంలో ఉంచుతారు. నిర్బంధ ఉత్తర్వులొచ్చాక ప్రతీ మూడు నెలలకు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వును సమీక్షించాల్సిన అవసరంలేదు' అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

## సంక్షోభం వస్తే ఆయన సైలెంట్

ప్రధాని మోదీపై కేజ్రీవాల్ విమర్శ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీపై ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ మరోసారి విమర్శలు ఎక్కుపెట్టారు. గురువారం ఢిల్లీ రాష్ట్ర శాసనసభ ఇందుకు వేదికైంది. ' కూతురు లాంటి మణిపూర్ తీవ్ర విద్వేషాగ్నిలో చిక్కుకున్నపుడు తండ్రి స్థానంలో ఉన్న ప్రధాని మోదీ.. ఆమెన కాపాడాల్సిదిపోయి, పట్టించుకోకుండా మరో వైపు తిరిగి నిల్చున్నారు. మోదీ మౌనంగా ఎందుకున్నారని దేశం యావత్తు ప్రశ్నిస్తోంది. ఆయన ఇలా మౌనముద్రలో ఉండటం ఇదే తొలిసారి కాదు. గత తొమ్మిదేళ్ల పాలనా కాలంలో దేశంలో ఎక్కడ సంక్షోభం ఎదురుపడ్డా ఆయన ఇలాగే సైలెంట్ అయిపోయారు' అని కేజ్రీవాల్ విమర్శించారు. ' పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిల్చిన మహిళా మల్లయోధులు బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ యాదవ్‌పై లైంగిక ఆరోపణలు చేసినపుడూ మోదీ మౌనవ్రతం చేశారు. ఇదే మహిళా రెజ్లర్లు పతకాలు గెల్చినపుడు వారితో ఫొటోలు దిగేందుకు మొదట ముందుకొచ్చింది మోదీనే. 'మీరు నా బిడ్డలు' అని భరోసా ఇచ్చారు. కానీ తీరా వాళ్లు ధర్నాలు చేస్తుంటే మోదీ మౌనముద్రలోకి జారుకున్నారు. కనీసం ప్రధాని హోదాలో 'నేనున్నాను. ఎంక్వైరీ చేయించి సంబంధిత వ్యక్తుల్ని శిక్షిస్తానని హామీ ఇవ్వలేకపోయారు. కనీసం ఎఫ్ఐఆర్ నమోదు కోసం మహిళలు ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఇక మణిపూర్ అంశంలోనూ ఇంతే ' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### 'ఇండియా' కూటమితో మోదీలో గుబులు: నితీశ్

పాట్నా: విపక్షాలతో 'ఇండియా' కూటమి ఏర్పాటు కావడంతో ప్రధాని మోదీలో గుబులు మొదలైందని జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ అన్నారు. 'ఇండియా' ఏర్పాటైన తర్వాత ఎన్డీయే పక్షాల సమావేశాలు నిర్వహిస్తున్నారని పరోక్షంగా ప్రధాని మోదీని ఎద్దేవా చేశారు. ఎన్డీయే పగ్గాలు మోదీ చేతుల్లోకి వచ్చాక భాగస్వామ్య పక్షాలను గౌరవించడం మానేశారన్నారు. 'ఇండియా' అధికారంలోకి వస్తే దేశానికి మంచి జరుగుతుందన్నారు.

## అసెంబ్లీ సమరానికి బీజేపీ సన్నద్ధం

ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో అభ్యర్థుల తొలి జాబితాలు విడుదల

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఇంకా వెలువడలేదు. అయినా బీజేపీ ఈ రాష్ట్రాలకు సంబంధించి తమ అభ్యర్థుల తొలి జాబితాలను గురువారం విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్‌లో 21 మంది, మధ్యప్రదేశ్‌లో 39 మంది అభ్యర్థులను ఖరారు చేసింది. ఒక్కో రాష్ట్రంలో ఐదుగురు చొప్పున మహిళలకు అవకాశం కల్పించింది. ఛత్తీస్‌గఢ్‌లోని పఠాన్ శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌పై పోటీగా తమ పార్టీ ఎంపీ, సీనియర్ నేత విజయ్ బఘేల్‌ను బరిలోకి దింపుతోంది. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నాయి. అంతకంటే ముందు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నాయి.

## కూలిన చిన్న విమానం..10 మంది మృతి

కౌలాలంపూర్: మలేసియాలోని సెంట్రల్ సెలంగోర్‌లో గురువారం చిన్న విమానం కూలిన ఘటనలో మొత్తం 10 మంది చనిపోయారు. లంగ్‌క్వావి నుంచి సుబంగ్ విమానాశ్రయం వైపు వస్తున్న ప్రైవేట్ చార్టర్డ్ విమానంలో ఆరుగురు ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది ఉన్నారు. మరికొద్ది నిమిషాల్లో ల్యాండ్ అవుతుందనగా విమానం పల్టీలు కొడుతూ రహదారిపై కుప్పకూలింది. రహదారిపై వెళ్తున్న బైక్, కారుపై పడటంతో విమానంలోని 8 మందితోపాటు మరో ఇద్దరు చనిపోయారు. ఘటనకు కారణం తెలియాల్సి ఉంది. విమానం బ్లాక్‌బాక్స్ కోసం గాలింపు జరుగుతోంది.





వర్షబీభత్సానికి చివురుటాకులా వణికిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ముంపు ప్రాంతంలోని మహిళను హెలికాప్టర్ సాయంతో కాపాడుతున్న భారత వాయుసేన సిబ్బంది.

## మధ్యప్రదేశ్ ఇన్‌చార్జిగా సూర్జేవాలా

- యూపీసీసీ చీఫ్‌గా అజయ్ రాయ్
- కీలక నియామకాలను ప్రకటించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ గురువారం సంస్థాగతంగా కీలక మార్పులను ప్రకటించింది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన మధ్యప్రదేశ్‌కు పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జిగా రణదీప్ సూర్జేవాలాను నియమించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే అజయ్ రాయ్‌కు అప్పగించింది. గుజరాత్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జిగా ముకుల్ వాస్నిక్‌ను పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారని ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పార్టీ కర్ణాటక ఇన్‌చార్జిగా ఉన్న సూర్జేవాలా మధ్యప్రదేశ్ బాధ్యతలు అదనంగా నిర్వహిస్తారు. సూర్జేవాలాను మధ్యప్రదేశ్ సీనియర్ ఎన్నికల పరిశీలకుడిగా ఇటీవలే పార్టీ నియమించింది. అజయ్ రాయ్ 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నియోజకవర్గం నుంచి ప్రధాని మోదీపై పోటీ చేశారు. దళిత నేత, యూపీ పార్టీ చీఫ్ బ్రిజ్‌లాల్ ఖబ్రి స్థానంలో రాయ్ తక్షణమే నూతన బాధ్యతలు చేపడతారని పార్టీ ప్రకటన పేర్కొంది.

### మణిపూర్ మండిపోతుంటే బీజేపీ ప్రచారంలో బిజీ: ఖర్గే

న్యూఢిల్లీ: మణిపూర్ తగలబడుతుంటే బీజేపీ మాత్రం ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో మునిగి తేలుతోందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపించారు. గురువారం ఆయన ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. మహిళా నేతలు కష్టపడి పని చేయాలన్నారు. 'మన నేత రాహుల్ మణిపూర్‌కు వెళ్లగా లేనిది ప్రధాని ఎందుకు వెళ్లడం లేదు? 'అని ఖర్గే ప్రశ్నించారు. మణిపూర్‌లో అత్యాచారాలు జరుగుతున్నా మౌనంగా ఉండిపోయిన ప్రధాని మోదీ..అవిశ్వాస తీర్మానం తెచ్చిన తర్వాత మాత్రమే పార్లమెంట్‌లో మాట్లాడారన్నారు.

## వసుంధర రాజే లేకుండానే బీజేపీ ఎన్నికల కమిటీలు

జైపూర్: రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ను అధికార పీఠంపై నుంచి కిందకు దించేందుకు కంకణం కట్టుకున్న బీజేపీ తన పార్టీ కీలక నేతలతో కమిటీలను ఏర్పాటుచేసింది. ఈ మేరకు రెండు కీలక ఎలక్షన్ కమిటీలను ప్రకటించింది. అయితే ఈ రెండూ కమిటీల్లోనూ బీజేపీ రాష్ట్ర నేత, మాజీ మహిళా ముఖ్యమంత్రి వసుంధ రాజే పేరు చేర్చకపోవడం గమనార్హం. 21 మంది సభ్యులున్న ఎన్నికల నిర్వహణ కమిటీకి మాజీ ఎంపీ నారాయణ్ పాంచారియా నేతృత్వం వహిస్తారు. మేనిఫెస్టో కమిటీకి కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ సారథ్యం వహించనున్నారు. రాజేకు ప్రాతినిధ్యం కల్పించని అంశాన్ని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అరుణ్ సింగ్ ముందు ప్రస్తావించగా.. 'ఎన్నికల ప్రచారంలో ఆమె కీలకంగా ప్రచారం చేస్తారుగా. అయినా ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు. పార్టీ తరఫున ప్రచారంలో పాల్గొంటారు. ఆమె అంటే మాకెంతో గౌరవం' అని అసలు విషయాన్ని దాటవేశారు.



సందర్శకులకు తాజా టీను తయారుచేసి అందిస్తున్న రోబోటిక్ చేయి. గురువారం చైనాలోని బీజింగ్ నగర శివారులో నిర్వహించిన వార్షిక ప్రపంచ రోబోట్ సదస్సులో తీసిందీ ఫొటో.

సాక్షి 24|7 కర్ణాటక
K A R N A T A K A
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023

ట్యాంకర్‌తో తంటా






ధార్వాడ వద్ద హైవే అండర్‌పాస్ కింద ఇరుక్కున్న గ్యాస్ ట్యాంకర్, అధికారులు శ్రమించి దానిని బయటకు తీశారు. ఈ సందర్భంగా హైవేను బంద్ చేసిన దృశ్యం

## న్యూస్‌రీల్

### 15 రోజుల పాటు మెట్రోలో అంతరాయం



బనశంకరి: బెంగళూరులో పర్పుల్ లైన్ మెట్రో రైలు సేవల్లో గురువారం నుంచి 15 రోజుల పాటు అంతరాయం ఏర్పడింది. గురువారం కెంగేరి, మైసూరు రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య మెట్రో రైళ్లు సంచరించలేదు. పర్పుల్ లైన్ మార్గమైన కెంగేరి, చల్లఘట్ట, బయప్పనహళ్లి, కృష్ణరాజపుర మెట్రోస్టేషన్ల మధ్య సిగ్నలింగ్ వ్యవస్థ పనుల వల్ల 15 రోజుల పాటు మెట్రోసేవల్లో అంతరాయం ఉంటుంది. మైసూరురోడ్డు, బయప్పనహళ్లి మెట్రోస్టేషన్లలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రైళ్లు నడుస్తాయి. 23, 24 తేదీల్లో కెంగేరి, మైసూరు రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య ఉదయం 7 గంటల వరకు మెట్రో రైళ్లు తిరగవు. ఈ సమయంలో మైసూరు రోడ్డు, స్వామి వివేకానంద రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య మాత్రమే సర్వీసులుంటాయి. ఇంకా పలు స్టేషన్లలో మార్పులు చేర్పులు ఉంటాయని మెట్రో వర్గాలు తెలిపాయి.

### ఉపేంద్రకు మళ్లీ ఊరట

యశవంతపుర: వివాదాస్పద వ్యాఖ్యల కేసుల్లో నటుడు ఉపేంద్రకు ఉపశమనం దొరికింది. బెంగళూరు హలసూరు గేటు పోలీసుస్టేషన్‌లో దాఖలైన కేసుపై కూడా హైకోర్టు స్టే విధించింది. ఆయన పిటిషన్ మేరకు వాదనలు ఆలకించిన కోర్టు, హలసూరు గేటు, సీకే అచ్చుకట్టు స్టేషన్‌లో దాఖలైన రెండు కేసుల్లో చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఉపేంద్ర వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు, ఆ వీడియోలను తొలగించారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

### కలబురిగిలో లాకప్ డెత్?




మృతుడు ఉదయ కుమార్ (ఫైల్)

యశవంతపుర: కలబురిగిలో లాకప్ డెత్ జరిగింది. పట్టణంలోని అశోకనగర పోలీసుస్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. కలబురగి తాలూకా సిరసగిమడ్డికి చెందిన ఉదయకుమార పరదిని దొంగతనం కేసులో విచారణ కోసం గురువారం ఉదయం తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఫోన్ చేసి ఆస్పత్రిలో ఉన్నాడని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. పోలీసులు కొట్టడం వల్ల ఉదయకుమార్ చనిపోయాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

### కావేరి నీళ్లు.. సెగలు

- తమిళనాడుకు విడుదల చేయరాదని రైతుల ధర్నా



గురువారం మండ్య కేఆర్‌ఎస్ డ్యాం నుంచి పరుగులు తీస్తున్న కావేరి జలాలు



కేఆర్‌ఎస్ డ్యాం వద్ద రైతుల ఆందోళన

మండ్య: మండ్యలో ఉన్న కృష్ణరాజసాగర జలాశయం నుంచి తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం కార్యకర్తలు గురువారం మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు భారీగా తరలివచ్చి ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీటి విడుదలను తక్షణం నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయాధారిత మండ్య జిల్లాలో రైతుల పంటలకు సరైన సమయంలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం, కాలువల ద్వారా నీటిని వదలాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది సరిగా వర్షాలు పడకపోవడంతో కేఆర్‌ఎస్ జలాశయం పూర్తిగా నిండలేదని, మునుముందు రోజుల్లో బెంగళూరు నగరంతో పాటు జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య వస్తుందని అన్నారు.
మరోవైపు ఒప్పందం ప్రకారం కేఆర్‌ఎస్ నుంచి తమిళనాడుకు నిర్ణీత మొత్తంలో నీటి విడుదల కొనసాగుతోంది. కొన్ని గేట్లు ఎత్తి నీటిని పంపుతున్నారు. డ్యాం వద్ద కూడా రైతులు ధర్నా చేశారు. గొడవలు జరగకుండా డ్యాం పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటైంది.

# అక్రమాస్తులపై పంజా

- 10 మంది అధికారులపై లోకాయుక్త మెరుపు దాడులు
- భారీగా నగదు, బంగారం పట్టివేత
- కోట్ల రూపాయల ఆస్తుల గుర్తింపు





బీదర్ జిల్లాలో కానిస్టేబుల్ విజయ్‌కుమార్ ఇంట్లోని కారులో అధికారుల తనిఖీలు, ఈ సోదాల్లో పట్టుబడిన నోట్ల కట్టలు

బనశంకరి: ఇంకా తెల్లవారకుండానే రహస్యంగా చేరుకున్న లోకాయుక్త అధికారులు.. లంచగొండ్లకు ముచ్చెమటలు పట్టించారు. అవినీతి ఆరోపణలున్న అధికారులపై లోకాయుక్త పంజా విసిరింది. వీరిలో కానిస్టేబుల్ నుంచి అదనపు కలెక్టర్ వరకూ ఉన్నారు. గురువారం వేకువనుంచి బెంగళూరు, బెంగళూరు గ్రామాంతర, కొప్పళ, రామనగర, తుమకూరు, చిక్కబళ్లాపుర, దావణగెరె, కొడగు, ధార్వాడ, బీదర్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 50 చోట్ల మెరుపు దాడులు నిర్వహించారు. భారీగా లంచాలు తీసుకుంటూ పోగేసుకున్న అక్రమాస్తులు ఈ దాడుల్లో బయటపడ్డాయి.

**ఎక్కడెక్కడ సోదాలు..**

- మొత్తం 10 మంది అధికారులపై దాడులు నిర్వహించారు. ఒక్కో అధికారి వద్ద సగటున రూ. 3 కోట్లకు పైగా లెక్క తేలని ఆస్తులు కనుగొన్నట్లు లోకాయుక్త వర్గాలు తెలిపాయి.
- కొడగు జిల్లా అదనపు కలెక్టర్ నంజుండేగౌడ, హారంగి జలాశయ అదనపు ఇంజనీర్ రఘుపతి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. నంజుండేగౌడ నివాసం, కార్యాలయం, మైసూరులోని బంధువుల నివాసాల్లో భారీగా ఆస్తులను గుర్తించారు. ఇంజనీర్ రఘుపతికి మైసూరులో ఉన్న బృహత్ బంగ్లాలో సోదాలు జరుగుతున్నాయి.
- బెళగావి మహానగర పాలికె రెవెన్యూ అధికారి సంతోష్ అనిశెట్టర్ ఇల్లు, ఆఫీసులో సోదాలు చేశారు.
- బీదర్‌లో చిటగుప్ప పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విజయకుమార్‌కు హోసకనహళ్లి గ్రామంలో, హుమ్నాబాద్ పట్టణ టీచర్స్ కాలనీలో ఉన్న రెండు ఇళ్లపై దాడులు జరిపారు.
- చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె చిన్ననీటి పారుదల శాఖ ఇంజనీర్ కే.మహేశ్, భార్య బీబీఎంపీ ఏఈ హెచ్.భారతి జయనగరలో నివాసంలో సోదాలు చేపట్టారు. రూ.15 లక్షల నగదు, నగలు సీజ్ చేశారు.
- కొప్పళ నిర్మితి కేంద్రం ఎండీ మంజునాథ బన్ని కొప్ప ఆఫీసులో సోదాలు చేపట్టారు.
- బెంగళూరు వద్ద దేవనహళ్లి గ్రేడ్–2 తహసీల్దార్ శివరాజు ఆఫీసు, ఇళ్లల్లో ముమ్మరంగా సోదాలు జరిపారు.
- చిక్కబళ్లాపురం జిల్లా చిక్కజాల గ్రామ పంచాయతీ ఉద్యోగి లక్ష్మీపతి కి చెందిన తాలూకా కోడూరు ఫాంహౌస్‌లో తనిఖీలు చేపట్టారు. కోడూరులో మూడు ఎకరాల భూమి, తోట ఉన్నట్లు గుర్తించారు.



తుమకూరు నగరంలో ఇద్దరు అధికారులకు చెందిన విలాసవంత భవనాలు

### తుమకూరులో ఇద్దరు అధికారులపై దాడి

తుమకూరు: జిల్లా జడ్పీ అధికారి భువనహళ్లి నాగరాజుకు చెందిన తుమకూరు ఆదర్శనగరలోని ఇంట్లో సోదాలు చేశారు. లోకాయుక్త డీఎస్పీ ప్రదీప్ కుమార్ నాయకత్వంలో అధికారులు వచ్చారు. నాగరాజు, కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో మధ్యాహ్నం 12 వరకు వేచి ఉన్నారు. వారు రావడంతో తనిఖీలు సాగించారు. ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించారన్న ఆరోపణలతో తుమకూరు నగరాభివృద్ధి యోజన జాయింట్ డైరెక్టర్ అయిన నాగరాజుకు చెందిన దేవనూరు చర్చి రోడ్డులోని ఇంటిపైన, సొంతూరు పావగడ తాలూకాలోని అరసికెరె దగ్గర జంగమ నరహళ్లిలోని సొంతిళ్లు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేశారు. భారీగా నగదు, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

### నటరాజ్ ఇంట్లో డబ్బే డబ్బు



ఆర్‌ఐ నటరాజ్ ఇంట్లో దొరికిన డబ్బు, బంగారంతో అధికారులు

దొడ్డబళ్లాపురం: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై బీబీఎంపీ అధికారి నటరాజ్‌కు చెందిన కనకపుర తాలూకా శివనహళ్లి గ్రామం వద్ద ఉన్న ఇల్లు, ఫాంహౌస్‌పై లోకాయుక్త అధికారులు దాడులు చేశారు. బెంగళూరు మహదేవపుర పరిధిలోని బీబీఎంపీ ఆఫీసులో ఆర్‌ఐగా ఉన్నారు. శివనహళ్లి ఫాంహౌస్‌లో దాడులు జరపగా కట్టల కొద్దీ డబ్బు, నగలు, విలువైన వస్తువులు లభించాయి. ఫాంహౌస్‌లో కూడా విలువైన చెట్లు పెంచుతున్నట్లు కనుగొన్నారు. దాడి సమయంలో నటరాజ్ పరారీలో ఉన్నాడు. 7.5 ఎకరాల కొబ్బరితోట, సొంతూరిలో అందమైన బంగళా, వక్క తోటల రికార్డులు దొరికాయి. రూ. 4 కోట్ల అక్రమ ఆస్తులున్నట్లు తేలింది. ఈ నెల 4వ తేదీన ఓ అపార్టుమెంట్‌లో 79 ఫ్లాట్లకు ఖాతా చేయడానికి రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ నటరాజ్ పట్టుబడ్డాడు.

### కరువు తాలూకాలపై వారంలోగా నిర్ణయం: మంత్రి

శివాజీనగర: వచ్చేవారంలోగా రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాల ప్రకటనపై నిర్ణయం వెలువరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. గురువారం నగరంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో రైతులకు సమాచారమిచ్చే కాల్ సెంటర్‌ను ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తక్కువ వర్షాలు కురిసినందున మరో వారంలోగా కరువుపీడిత ప్రాంతాల ప్రకటనపై ప్రభుత్వం నిర్ణయం తెలియజేస్తుంది, కరువు మార్గదర్శకాలను మార్చాలని కేంద్రానికి సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. కేంద్రం నుంచి త్వరలోనే సమాధానం రావచ్చు, పాత మార్గదర్శకాలు అనుకూలం కాదు. ఇందులో 60 శాతం వర్షం కొరత మూడు వారాలు ఉంటే మాత్రం కరువు ప్రకటించాలనే నియమం ఉంది. ఒకవేళ కేంద్రం నుంచి సమాధానం రాకపోతే పాత మార్గదర్శకాల ప్రకారం కరువు తాలూకాలను ప్రకటిస్తామని తెలిపారు.



చిత్రలేఖనాలను తిలకిస్తున్న సందర్శకులు



### వర్ణచిత్రాల కనువిందు

బనశంకరి: చిత్రకళా పరిషత్‌లో ఇన్ అండ్ యంగ్ పేరుతో ఏర్పాటు చేసిన చిత్రలేఖనాల ప్రదర్శన కళాప్రియులను మురిపిస్తోంది. వర్ధమాన చిత్రకారుడు ఆర్.బాలసుబ్రమణ్యన్ గీసిన చిత్రాలతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వైవిధ్యభరితమైన పెయింటింగ్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రంగుల మిశ్రమంలో కొత్త పంథాకు ప్రాధాన్యమిస్తూ చిత్రలేఖనాలను రూపొందించినట్లు చిత్రకారుడు తెలిపారు.

# బచ్చా.. అయ్యాడు సీఐ



పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ దుస్తుల్లో బాలుడు అజాన్‌ఖాన్

- శివమొగ్గలో గుండెజబ్బు చిన్నారికి సరదా తీర్చిన పోలీసులు

శివమొగ్గ: బాలుడు సీఐగా అవతారమెత్తాడు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని ఆజమాయిషీ చేశాడు. భేష్.. చిన్న వయసులోనే మంచి ఉద్యోగం సంపాదించాడు అనుకుంటే పొరపాటే. గుండెజబ్బుతో బాధపడుతున్న బాలుని ఆశను తీర్చేందుకు శివమొగ్గ ఎస్పీ అతనికి ఈ అవకాశం కల్పించారు.

**ఇన్‌స్పెక్టర్ అజాన్‌ఖాన్**

వివరాలు.. శివమొగ్గ నగరానికి చెందిన, ప్రస్తుతం బాలెహొన్నూరులో నివాసం ఉంటున్న తబ్రేజ్ ఖాన్ అనే వ్యక్తి కుమారుడు అజాన్‌ఖాన్ (8) గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. పెద్దయ్యాక పోలీస్ అవుతానని అందరితో చెప్పేవాడు. కానీ అతని ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆ కోరిక నెరవేరుతుందో, లేదో చెప్పలేని పరిస్థితి. ఇది జిల్లా ఎస్పీ జీకే మిథున్‌కుమార్‌కు తెలిసింది. ఆయన సూచనతో బాలున్ని ఒక్కరోజు ఇన్స్‌పెక్టర్‌ని చేశారు. గురువారం ఉదయం చక్కగా కుట్టించిన పోలీస్ డ్రెస్ వేసుకుని బాలుడు శివమొగ్గ నగరంలోని దొడ్డపేట పోలీసు స్టేషన్‌కు రాగానే పోలీసులు గౌరవ వందనం ప్రకటించారు. సీఐ సీట్లో కూర్చుని సరదాగా గడిపాడు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జీకే మిథున్ కుమార్, ఏఎస్పీ అనిల్ కుమార్ భూమారెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. తరువాత బాలునికి మిఠాయిలు ఇచ్చి ఇంటికి సాగనంపారు. కల తీరడంతో చిన్నారి ఆనందానికి అవధులు లేవు. స్థానికులు, బాలుని బంధుమిత్రులు ఈ తతంగాన్ని ఉత్సాహంగా తిలకించారు.



చిన్నారి సీఐకి ఎస్పీ తదితరుల స్వాగతం

### తండ్రి అడిగాడు: ఎస్పీ

ఎస్పీ మిథున్ మాట్లాడుతూ కుమారుని కోరిక గురించి తండ్రి మాకు చెప్పడంతో సంతోషంగా అంగీకరించాం, బాలుడు చాలా ఉత్సాహంగా డ్యూటీ చేశాడు, ఒక సిబ్బందికి సెలవు మంజూరు చేశాడని చెప్పారు.

# మాటలు కలిపి రూ.కోట్లు లూటీ

- వృద్ధురాలికి ఘరానా ముఠా టోపీ
- అరెస్టు చేసిన పోలీసులు



నిందితులు విశాల, అరుంధతి, అపూర్వ, రాకేశ్

బనశంకరి: బీమా చేస్తామనే నెపంతో వృద్ధురాలిని పరిచయం చేసుకుని, ఇంటి వాస్తు సరిగా లేదని ఇంటిని విక్రయించి రూ.3.50 కోట్లు కాజేసిన ఘరానా ముఠాను గురువారం బనశంకరి పోలీసులు అరెస్టుచేశారు. ఆర్.విశాల, అరుంధతి, అపూర్వ, రాకేశ్ పట్టుబడిన వంచకులు.

వివరాలు.. బనశంకరి పద్మనాభనగర నివాసి శాంత (63), ఆమె కుమార్తెతో కలిసి జీవిస్తోంది. వంచకులు అరుంధతి, రాకేశ్ 2021లో వీరిని కలిసి ఇన్సూరెన్స్ పాలసీ చేయాలని అడిగారు. అలా స్నేహం పెంచుకుని పద్మనాభనగరలో గల ఇంటి సమాచారం తెలుసుకున్నారు. ఇంటి వాస్తు సక్రమంగా లేదని మాయమాటలు చెప్పి ఇంటిని అమ్మేద్దామని ఒప్పించారు. రియల్‌ఎస్టేట్ బ్రోకర్లను తీసుకువచ్చి సుమారు రూ.4.5 కోట్లకు ఇంటిని అమ్మేయించారు. ఈ నగదును ఆమె బ్యాంక్ అకౌంట్‌లోకి జమచేశారు.

**నకిలీ చెక్కులపై సంతకాలతో..**

శాంత, ఆమె భర్త పేరుతో షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని చెప్పి కత్రిగుప్పెలోని కెనరాబ్యాంక్‌లో ఉన్న రూ.1.90 కోట్లతో ఉండే రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలను క్లోజ్ చేయించారు. ఈ సమయంలో శాంత నుంచి ఆరు చెక్‌లపై, అలాగే ఖాళీ ఫారాలపై మోసగాళ్లు సంతకాలు చేయించుకున్నారు. 2023 మే 16 నుంచి జూన్ 26 వరకు వంచకులు చెక్కులను అదే బ్యాంకులో ఇచ్చి రూ.3.50 కోట్లను విశాలా ఆర్.సంజీవప్ప, ఆర్.పరిమళా అనే బ్యాంకు అకౌంట్లలోకి జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన శాంత పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలించి నలుగురు వంచకులను అరెస్ట్ చేశారు.

## భక్తిశ్రద్ధలతో శనీశ్వర పూజలు

పావగడ: శ్రావణ మాసోత్సవం సందర్భంగా ప్రసిద్ధ పావగడ శనీశ్వరాలయంలో కొలువు తీరిన నవగ్రహ దేవతలకు అభిషేక పూజలు తొలి రోజు గురువారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అభిషేక పూజల్లో పాల్గొని నవగ్రహాలకు పూజలు సమర్పించారు. శని దోష నివారణ పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట ర్పాటు చేసిన అగ్నిగుండంలోకి భక్తులు తొమ్మిది నల్ల ఒత్తులు సమర్పించి తొమ్మిది సార్లు ప్రదక్షిణలు చేశారు. శీతలాంభదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి తల నీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నదాసోహ భవనంలో స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కర్ణాటక లోని మంగళూరు నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.



నవగ్రహ దేవతలకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శనీశ్వరస్వామి

# గ్యాస్ ట్యాంకర్ ఎంత పని చేసింది?

- హైవే అండర్‌పాస్ కింద ఇరుక్కున్న వైనం
- ధార్వాడ హైకోర్టు బెంచ్ వద్ద సంఘటన
- 16 గంటల పాటు ప్రజలకు టెన్షన్

హుబ్లీ: ధార్వాడ సమీపంలో భారీ ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్ అండర్‌పాస్ కింద ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. పోలీసులు, ఫైర్ సిబ్బంది జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో డ్రైవర్లు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. 16 గంటలు శ్రమించి ట్యాంకర్‌ను బయటకు తీయడంతో హైడ్రామా సమాప్తమైంది.

**ఏం జరిగిందంటే**

వివరాలు... ధార్వాడ నగర సమీపంలో హైవే- 4లో హైకోర్టు బెంచ్ వద్ద ఒక అండర్ పాస్‌లో బుధవారం సాయంకాలం 7 గంటలప్పుడు ట్యాంకర్ చిక్కుకుపోయింది. ట్యాంకర్ డ్రైవర్ అవగాహన లేకుండా అవతలి వైపునకు వెళ్లగా, ట్యాంకర్ ఎత్తు ఎక్కువగా ఉండడంతో అండర్‌పాస్ పైకప్పుతో రాపిడి జరిగి ఇరుక్కుంది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ముందుకు, వెనక్కు కదల్లేకపోయింది.

**ముమ్మరంగా సహాయక చర్యలు**

విషయం తెలిసిన తరువాత జిల్లాధికారులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది క్రేన్లతో సహాయక చర్యలు ప్రారంభించారు. గ్యాస్ లీకై ఒక్క రవ్వ నిప్పు పడినా భస్మీపటలం సంభవిస్తుందనే భయం నెలకొంది. ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల కరెంటును నిలిపివేశారు. ఎవరూ ఇళ్లల్లో అగ్గిపెట్టె వాడరాదని, వంటలు చేయరాదని ప్రకటించారు. బెళగావి నుంచి ధార్వాడకు వచ్చే వాహనాలను నిలిపివేశారు. వేరే ట్యాంకర్‌ను తెప్పించి అందులోకి గ్యాస్‌ను డంప్ చేశారు. తరువాత ఖాళీ ట్యాంకర్‌ను క్రేన్లతో బయటకు లాగారు. ప్రజలు సహకరించారని జిల్లా ఎస్పీ డాక్టర్.సంజీవ్ పాటిల్ తెలిపారు. మొత్తానికి 16 గంటల పాటు అందరిని టెన్షన్ పెట్టిన గ్యాస్ ట్యాంకర్ ఉదంతం గురువారం మధ్యాహ్నాంకల్లా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గంటల కొద్దీ వాహనాలను బంద్ చేయడంతో ప్రజలు, ఉద్యోగులు కాలినడకన సంచరించారు. ఇళ్లల్లో ప్రజలు వంటలు చేసుకోక ఆకలి బాధ అనుభవించారు.



ట్యాంకర్‌ను బయటకు లాగుతున్న దృశ్యం


వాహనాలను బంద్ చేయడంతో కాలినడకన వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగులు


ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు

## క్లుప్తంగా

### మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం


గురుసిద్ధయ్యను సన్మానించిన దృశ్యం

రాయచూరు రూరల్: నగరసభ కమిషనర్ గురుసిద్ధయ్యను తాలూకా బేడ జంగమ సంఘం పదాధికారులు సన్మానించారు. గురువారం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో సంఘం గౌరవాధ్యక్షుడు ప్రభు శాస్త్రి కమిషనర్‌ను అభినందించి నగరాభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈసందర్భంగా శరణబసవ, మల్లికార్జున, మంజునాథ్, శరణయ్య, రేణుకా స్వామి, అంబమ్మ, జయశ్రీ. అయ్యప్ప, బసవరాజ్ స్వామిలున్నారు.

### విద్యార్థులకు దంత పరీక్షలు


దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయచూరు రూరల్: నగరంలోని ప్రభుత్వ జవహర్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం నవోదయ దంత కళాశాల వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చక్కగా చదువుకోగలరన్నారు. దాదాపు 200 మందికి వైద్యులు సోమనాథ్ రెడ్డి, కవిత, సహన, ఇందిరారాణి, టీనా, లావణ్య, భరిణి, సుభాష్ పరీక్షలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సంధ్య, శిల్ప, యంకమ్మ, తనూజ, మానేష్, బీరలింగ పాల్గొన్నారు.

### విద్యాట్రస్టు అధ్యక్షుడు కన్నుమూత

బనశంకరి: నగరంలో తెలుగు విజ్ఞానసమితి విద్యాట్రస్టు అధ్యక్షుడు కే.మునిస్వామిరాజు (80) గురువారం ఉదయం మరణించారు. ఆయన పలు ప్రముఖ విద్యాసంస్థల్లో సభ్యునిగా ఉన్నారు. సదాశివనగరలోని ఆయన నివాసంలో మునిస్వామిరాజు పార్థివదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. విద్యాట్రస్టుకు మునిస్వామిరాజు గత 4 దశాబ్దాలుగా అమూల్యమైన సేవలందించారని, ఆయన మృతి బాధాకరమని మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ అన్నారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఏ.రాధాకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, సమితి ఉపాధ్యక్షుడు కే.గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, సీఏ.వరదరాజు తదితరులు సంతాపం తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

చెళ్లకెరె రూరల్: నగరంలోని బీఈఓ కార్యాలయం వెనుక ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. ఉదయాన్నే ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని దావణగెరె జిల్లా బిళిచోడు గ్రామానికి చెందిన రవి(40)గా గుర్తించారు. ఇతను చెళ్లకెరెలోని వాల్మీకి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని సమాచారం. ఇతడు బ్యాండ్ వాయిస్తూ జీవిస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. స్థలానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేశాయి, సబ్‌ఇన్‌స్పెక్టర్ సతీష్‌నాయక్ వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక


అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలోని శ్రీనిధి పరపతి సహకార సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు గురువారం జరిగాయి. బళ్లారి సహకార సంఘాల ఉప విభాగపు ప్రముఖురాలు షాకీరబాను ఎన్నికల ప్రక్రియ చేపట్టగా అధ్యక్ష స్థానానికి ఎం.తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి జీ.సుధాకర్ మాత్రమే నామినేషన్లు వేయడంతో ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికై నట్టు ఎన్నికల అధికారిణి షాకీరబాను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు పీ.బ్రహ్మయ్య, గరడి విరుపాక్షప్ప, ఎం.మహేష్, లక్ష్మీ, ఎం.వెంకట కొండయ్య, జీ.విరుపాక్షప్ప, జీ.రవీంద్ర, సణ్ణహులుగప్ప, ఎం.లలిత, కొండమ్మ, సిబ్బంది జీ.శివశంకర్, ఎం.సునీల్, ఎం.హేమలత, జీ.రాకేష్, విరుపణ్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

### నర్సుల వాగ్వాదం


పాదరక్షను చూపుతున్న నర్సు

రాయచూరు రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆరోగ్య కార్యకర్తలు(నర్సులు)అవాచ్య పదాలతో నిందించుకుంటూ చెప్పులతో కొట్టుకున్న ఘటన జిల్లాలోని లింగసూగూరు తాలూకా ఈచనాళలో చోటు చేసుకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సు దీపా తనను కులం పేరుతో దూషించిందంటూ జ్యోతి అనే నర్సు పరస్పరం చెప్పులతో కొట్టుకున్నారు. కాగా విధి నిర్వహణలో ఇద్దరి మధ్య సామరస్యత లేకపోవడం వల్ల ఈ ఘటన జరిగిందని, ఇద్దరినీ వేర్వేరు చోట్లకు బదిలీ చేయాలని గ్రామస్తులు కోరారు.

### చిరుత పట్టివేతకు సన్నాహాలు


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా నీరమాన్వి కొండల్లో చిరుత సంచారం, పట్టివేతపై అధికారులతో చిన్న నీటి పారుదల శాఖా మంత్రి ఎన్ఎస్ బోసురాజు చర్చించారు. గురువారం నీరమాన్వి వద్ద అటవీ శాఖాధికారులతో ఆయన మాట్లాడారు. చిరుతను పట్టుకోవడానికి బోనులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణభయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి వెంట జెడీఎస్ మాజీ అధ్యక్షుడు దొడ్డ బసవరాజ్, నగరసభ మాజీ సభ్యుడు రుద్రప్పలున్నారు.

### అక్రమ భూ మంజూరుపై పరిశీలనకు సమితి

కోలారు: జిల్లాలో అక్రమ భూ మంజూరు చేసిన కేసులను పరిశీలించడానికి 14 మందితో సమితిని రచించినట్లు జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భూ మానిటరింగ్ సెల్ నుంచి గత పదేళ్లుగా ప్రభుత్వం నుంచి మంజూరు చేసిన స్థలాల సమూలాగ్ర సమాచారాన్ని సమితికి అందించారు. సమితి భూ లభ్యత జాబితాను అనుసరించి మంజూరు చేసిన భూముల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇంతవరకు మంజూరు చేసిన భూములు సక్రమమా లేదా అని సమితి పరిశీలిస్తుందన్నారు. మంజూరు దాఖలాల నైజత, సాగు మంజూరు నియమాల పాలన, ప్రభుత్వ, అటవీ, వక్ఫ్, దేవదాయ, గోమాళం, నగరసభ భూముల ఆక్రమణలపై కూడా ఈ సమితి అధ్యయనం చేస్తుందన్నారు. ఇప్పటికే మంజూరైన భూముల్లో నియమాలను ఉల్లంఘించారా? అనే విషయాన్ని కూడా సమితి పరిశీలిస్తుందన్నారు. ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ శివానంద్, భూ దాఖలాల డిప్యూటీ డైరెక్టర్ భాగ్యమ్మ, అన్ని తాలూకాల తహసీల్దార్లు ఉన్నారు.

## రాఘవేంద్ర సప్తరథోత్సవాలకు నీరందేనా?


వట్టిపోయిన తుంగభద్రా నది

రాయచూరు రూరల్: మంత్రాలయంలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాలు, సప్తరథోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అడుగంటింది. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గోవా, కేరళ, పాండిచ్చేరిల నుంచి వచ్చే భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించామని మఠం చెబుతున్నా నీటి సౌకర్యం విషయంలో ఆలయ పాలక మండలి మౌనం వహించింది. హొసపేటెలోని తుంగభద్ర డ్యాం పూర్తి స్థాయిలో నిండడానికి మరో ఐదు అడుగులు(15 టీఎంసీల) నీరు వచ్చి చేరాల్సి ఉంది. ఈనేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా డ్యాం నుంచి నదికి అధికారులు నీరు వదలలేదు. పైగా ఆలయ పాలక మండలి రాష్ట్ర ప్రభుత్వానికి, హొసపేటెలోని తుంగభద్ర బోర్డు అధికారులకు లేఖలు రాయలేదు. మరో 12 రోజుల్లో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతున్న తరుణంలో మాధవరం వద్ద తుంగభద్ర నదిలో నీరు లేక వట్టిపోయింది. నదిలో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందులు పడకుండా అధికారులు తుంగభద్ర డ్యాం నుంచి నీటిని వదలాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## 21 నుంచి ద్వితీయ పీయూ సప్లిమెంటరీ

- సజావుగా పరీక్షల నిర్వహణకు సూచన


మాట్లాడుతున్న జిల్లాధికారి ఎంఎస్ దివాకర్

హొసపేటె: జిల్లాలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న ద్వితీయ పీయూసీ ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ సూచించారు. ద్వితీయ పీయూసీలో ఫెయిలైన విద్యార్థులకు 2వ ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రిలిమినరీ ప్రిపరేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 5 పరీక్షా కేంద్రాల్లో 4184 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. ఈ సారి పరీక్ష మధ్యాహ్నం జరుగుతుందని, పరీక్ష అనంతరం సమాధాన పత్రాలు పోస్టాఫీసుకు పంపే వరకు అన్ని తాలూకా పోస్టాఫీసుల్లో సిబ్బందిని నియమించాలన్నారు. నిర్దేశిత సమయంలో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించడంతో పాటు, ప్రశ్న పత్రాలను తీసుకువెళ్లే వాహనాల జీపీఎస్ సిస్టమ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఈ విషయంలో అధికారులందరూ మరింత దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. సన్నాహాలపై అండర్ గ్రాడ్యుయేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్, వివిధ శాఖల తాలూకా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ మార్గదర్శకాల గురించి మాట్లాడారు. పరీక్ష ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన నిఘా ఉంచి పారదర్శకంగా పరీక్షల నిర్వహణకు సహకరించాలని సూచించారు.

## కొళాయిల్లో రంగు మారిన నీరు సరఫరా


కొళాయిలో సరఫరా అవుతున్న రంగు మారిన నీరు


సీసాలో రంగు మారిన నీరు దృశ్యం

రాయచూరు రూరల్: నగర ప్రజలకు నగర సభ అధికారులు గురువారం రంగు మారిన నీటిని సరఫరా చేశారు. మంగళవారపేట, జహీరాబాద్, జీడితోట, నవాబ్‌గడ్డ, వాసవి నగర్ ప్రాంతాల్లోని కొళాయిల్లో కృష్ణా నది నుంచి సరఫరా అయిన తాగునీరు రంగు మారింది. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు కొళాయిల్లో సరఫరా చేసిన శుద్ధీకరించని ఒండు నీరు రంగు మారి నురగతో కూడి ఉన్నా ప్రజలు గత్యంతరం లేక వాటినే పట్టుకున్నారు. అయితే నగరసభ జలమండలి అధికారుల పనితీరు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై ప్రజలు దుమ్మెత్తిపోశారు.

## ఆ అధికారిపై చర్య తీసుకోండి


వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: : అంబేడ్కర్‌ను అగౌరవపరిచిన నగరసభ అధికారిపై చర్యలు చేపట్టాలని దళిత సంఘాల కార్యకర్తలు ధర్నా చేపట్టారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సంచాలకుడు హేమరాజ్ మాట్లాడారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంలో నగరసభ కార్యాలయం వద్ద జాతీయ పతాకం ఎగురవేత సమయంలో కమిషనర్ గురుసిద్దయ్య బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించకుండా అవమానపరిచినందున ఆయనపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రవీంద్ర, బేరి, రాజ్, అస్లాం పాషా, భరత్, నరసింహులు, వెంకటేష్, మారెప్పలున్నారు.

## అందరి క్షేమమే బ్రాహ్మణుల ఆశయం


మాట్లాడుతున్న అనంతరామ్ గౌతమ్

చెళ్లకెరె రూరల్: సమాజంలోని అందరి క్షేమమే బ్రాహ్మణుల ఆశయం అని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డాక్టర్ అనంతరామ్ గౌతమ్ తెలిపారు. ఆయన గురువారం నగరంలోని త్యాగరాజ్ నగర్‌లోని గాయత్రి కళ్యాణ మంటపం వద్ద నూతనంగా నిర్మించిన గాయత్రి విద్యార్థి నిలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న బ్రాహ్మణుల శ్మశానం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నగరసభ, రాజకీయ నాయకులకు మొర పెట్టుకున్నా ఈ విషయంపై ఆసక్తి చూపడం లేదన్నారు. అందువల్ల ఈ సమాజం వారే ముందుకు వచ్చి విరాళాలను అందించాలని అభ్యర్థించారు. ఈ విషయంపై స్పందించిన విప్ర బాంధవులు అధిక సంఖ్యలో విరాళాలు అందజేశారు. రాబోయే రోజుల్లో శ్మశానం అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి సత్యనారాయణ రావ్, వాసుదేవరావు, నాగశయన గౌతమ్, ప్రదీప్ శర్మ, ఆడిటర్ కృష్ణ, శ్రీనాథ్, విప్రగాయత్రి మహిళా సంఘం అధ్యక్షురాలు సీతాలక్ష్మీ వాదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారం పంపిణీ చేయరూ

కంప్లి: పౌష్టికాహారం పంపిణీ చేయాలని తాలూకా గ్రామీణ కూలి కార్మికుల సంఘం పదాధికారులు గురువారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పదాధికారులు మాట్లాడుతూ మహిళలతో పాటు పిల్లల్లో అపౌష్టికతను తొలగించేందుకు ప్రస్తుతం అందిస్తున్న రేషన్‌తో పాటు జొన్నలు, రాగులు, కందిపప్పు, మంచినూనె కూడా అందించాలని కోరారు.

### ప్లేట్లు, గ్లాసుల వితరణ

కంప్లి: తాలూకాలోని వెంకటాపుర క్యాంప్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బుక్కసాగర ప్రాథమిక పాఠశాలలకు ఉచితంగా ప్లేట్లు, గ్లాసులను గురువారం ఎయిర్ వాటర్ ఇండియా ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అదే విధంగా షెడ్ నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు చెత్త బుట్టలు, ఫిల్టర్ నీటి యూనిట్లను కంపెనీ పరంగా ఉచితంగా అందజేశారు.

### కోటె యల్లమ్మకు పూజలు



మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో ఉన్న కోటె యల్లమ్మ ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కె.సోమప్ప నేతృత్వంలో అమ్మవారికి పలు పూజలు జరిగాయి. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, మహాగణపతి దేవతా ప్రార్థన, మహామంగళారతి, వాస్తు హోమం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నెరవేర్చారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

## కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం


కాలువ నీటిలో కొట్టుకు వస్తున్న మహిళ మృతదేహం

బళ్లారిఅర్బన్: గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళూరు రోడ్డు శ్రీనగర్ కాలనీ వద్ద కాలువలో ఓ మహిళ(50) మృతదేహం నీటిలో కొట్టుకు రావడంతో స్థానికులు గమనించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మహిళకు ఇంకా ప్రాణం ఉందేమో? అని ప్రయత్నించినా అప్పటికే ప్రాణం పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ సతీష్, ఎస్ఐ సంతోష్ తమ పోలీసు బృందంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాలువ నీటిలో నుంచి మహిళ మృతదేహాన్ని వెలికి తీసిన యువకుడిని అభినందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అంబులెన్స్ ద్వారా విమ్స్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. కాగా గురువారం ఉదయం హవంబావి సమీపంలో ఈ మహిళ కాలు జారి కాలువలో పడి మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## కోలారు వార్తలు...

## జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక


నూతన అధ్యక్ష ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం


కేజీఎఫ్: గెలిచిన అభ్యర్థుల విజయోత్సవం

శ్రీనివాసపురం: తాలూకాలోని సోమయాజులపల్లి జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిని వాణి, ఉపాధ్యక్షురాలిగా జేడీఎస్ మద్దతు అభ్యర్థిని టి.శ్రీదేవి ఎన్నికయ్యారు. పంచాయతీలో 22 మంది సభ్యులుండగా 11 ఓట్లతో అధ్యక్షురాలిగా కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిని విజయం సాధించారు. ఒక ఓటు చెల్లలేదు. ఉపాధ్యక్ష స్థానానికి తలా 11 ఓట్లు రావడంతో లాటరీ వేశారు. ఇందులో అదృష్టం జేడీఎస్ మద్దతు అభ్యర్థిని టి.శ్రీదేవిని వరించింది. అధ్యక్ష ఎన్నిక సమయంలో ఒక ఓటు తిరస్కరణకు గురి కావడంతో కాంగ్రెస్, జేడీఎస్ అభ్యర్థుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరు పార్టీల వారిని శాంతింప చేశారు. ఎన్నికల అనంతరం ఇరు పార్టీల వారు విజయోత్సవాలను నిర్వహించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను పలువురు అభినందించారు.

**క్యాసంబళ్లి జీపీ కాంగ్రెస్ వశం**

కేజీఎఫ్: తాలూకాలోని క్యాసంబళ్లి జీపీ కాంగ్రెస్ వశమైంది. బూచేపల్లి జయరామి రెడ్డి అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షురాలిగా అంజలమ్మ ప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్యాసంబళ్లి జీపీలో 20 మంది సభ్యులున్నారు. ఇటీవల బీజేపీ మద్దతుతో గెలుపొందిన సభ్యులు కూడా కాంగ్రెస్‌లోకి చేరడంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు వీరొక్కరే నామినేషన్ దాఖలు చేయడం వల్ల వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను కాంగ్రెస్ నాయకుడు ఏఎం లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణారెడ్డి, విజయరాఘవ రెడ్డి అభినందించారు.

### కార్మికుడి ఇంటి కూల్చివేత


బీజీఎంఎల్ భద్రతా సిబ్బంది కూల్చివేసిన ఇల్లు

కేజీఎఫ్: భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్(బీజీఎంఎల్) భద్రతా సిబ్బంది మోడల్ హౌస్ పూస్వామి కాలనీలో బీజీఎంఎల్ కార్మికుడు నిర్మిస్తున్న ఇంటిని కూల్చివేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఘటనలో భద్రతా సిబ్బందిపై ఇంటి యజమాని రాబర్ట్‌సన్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నివృత్త బీజీఎంఎల్ కార్మికుడు తన ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో గదిని నిర్మిస్తుండగా బీజీఎంఎల్ భద్రతా సిబ్బంది స్థలానికి వచ్చి అనుమతి లేకుండా గదిని నిర్మిస్తున్నారంటూ దాన్ని కూల్చివేశారు. ఆ సమయంలో మహిళలు అని కూడా చూడకుండా తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పేదలు ఇల్లు నిర్మిస్తున్నప్పుడు ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే, ఎంపీలు బీజీఎంఎల్ అధికారులకు సూచించినా అధికారులు వారి మాటలను బేఖాతరు చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

### ఉపేంద్రపై కఠిన చర్యలకు వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మాలూరు: దళితులను ఎద్దేవా చేసిన కన్నడ నటుడు, ప్రజాకీయ పార్టీ నాయకుడు ఉపేంద్రపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు గురువారం తహసీల్దార్ రమేష్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. నటుడు ఉపేంద్ర సోషల్ మీడియాలో దళితుల గురించి అవహేళనకరంగా మాట్లాడారన్నారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపేంద్రపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. జిల్లా సంచాలకుడు ఆర్ వెంకటేష్, తాలూకా సంచాలకుడు ఏకె వెంకటేష్, శ్రీనిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకు కఠోర శ్రమే సోపానం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: పోటీల్లో లక్ష్యాలను చేరుకోవడానికి కఠోర సాధన చేయాలని జిల్లా ఉద్యోగ అధికారి కె శ్రీనివాస్ తెలిపారు. గురువారం నగరంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ కార్యాలయంలో స్టడీ సర్కిల్ పథకంలో భాగంగా పోటీ పరీక్షల పూర్వసిద్ధతా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షల్లో విజయ సాధనకు దినపత్రికల్లో నిత్యం వస్తున్న సామాన్య జ్ఞానాన్ని పొందాలన్నారు. నిరంతరంగా నిర్ణీత పఠ్య అధ్యయనం చేయడం ద్వారా విజయం సాధించవచ్చన్నారు. గతంలో కోలారు నుంచి ఎంతో మంది కేఏఎస్ అధికారులు వెళ్లేవారు. అయితే ఇటీవల తగ్గుముఖం పట్టిందన్నారు. గతంలోలా ఎక్కువ మంది అభ్యర్థులు ఐఏఎస్, కేఏఎస్ సాధించాలన్నారు. అభ్యర్థులకు పరీక్ష తయారీపై సలహా, సూచనలు అందిస్తామన్నారు. జ్ఞానార్జనకు అవసరమైన పుస్తకాలను చదవాలన్నారు. విద్యార్థులకు, ఉద్యోగాకాంక్షులకు వృత్తి ఉపన్యాసం, కౌన్సిలింగ్, పరీక్ష పూర్వ శిక్షణ, భారత సేనలో ఉద్యోగావకాశాలపై శిక్షణనిస్తారన్నారు. సహాయక ఉద్యోగ అధికారి మునికృష్ణ, కార్యాలయ సిబ్బంది మనోజ్, తిమ్మరాజు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రాఘవేంద్రస్వామి సన్నిధిలో మాజీ మంత్రి



రథోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి అరవింద లింబావళి

కృష్ణరాజపురం: మాజీ మంత్రి అరవిందలింబావళి గురువారం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠాన్ని సందర్శించారు. బృందావనానికి పూజలు నిర్వహించారు. మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ పారంగంల్‌నుంచి ఆశీర్వాదాలు అందుకున్నారు. అనంతరం లోక కల్యాణం కోసం నిర్వహించిన రథోత్సవంలో పాల్గొన్నారు.

### 57 మంది కాంట్రాక్టర్లకు నోటీసులు

బనశంకరి: బీబీఎంపీ పరిధిలో పెండింగ్ బిల్లుల వ్యవహారం మలుపులు తిరుగుతోంది. తమకు బిల్లులు మంజూరు చేయడం లేదని ఇటీవల కాంట్రాక్టర్ల సంఘం గవర్నర్‌ను కలిసిన విషయం తెలిసిందే. మరో వైపు బీబీఎంపీ అధికారులపై కాంట్రాక్టర్లు ఒత్తిడి తీసుకువస్తున్నారని బీబీఎంపీ అసిస్టెంట్ కమిషనర్ మహదేవ్ హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో హైగ్రౌండ్ పోలీసులు 57 మంది కాంట్రాక్టర్లకు నోటీస్‌జారీ చేసి విచారణకు హాజరుకావాలని సూచించారు. గురువారం 10 మందికి పైగా కాంట్రాక్టర్లు హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. కేంద్ర విభాగ డీసీపీ శ్రీనివాసగౌడ నేతత్వంలో విచారణ చేపడుతున్నారు.

### విద్యుత్ కోతలను నివారించాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గౌరిబిదనూరు: వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్ కోతలు విధిస్తుండటంపై అన్నదాతలు భగ్గుమన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బెస్కాం కార్యాలయం ముందు ధర్నా చేశారు. తాలూకా రైతుసంఘం నాయకుడు గుండాపురం లోకేశగౌడ మాట్లాడుతూ వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఈ తరుణంలో విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పంటలకు నీరు పెట్టుకోలేకపోతున్నారన్నారు. మరో వైపు 400 మంది రైతులు ట్రాన్స్‌ఫార్మర్లకు డీడీలు చెల్లించినా ఇప్పటికీ మంజూరు చేయలేదన్నారు. దీంతో లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయన్నారు. బెస్కాం అధికారులు నిర్లక్ష్యం వీడి విద్యుత్ కోతలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

### ప్రతిభావంతులకు సన్మానం



సన్మానం చేసిన దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధిలోని ఆనేకల్ పట్టణంలో గురువారం సోషల్ క్లబ్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతురాలు, క్రీడాకారిణి రేణుక, జిల్లా చెస్ టోర్నీలో విజేతలు, ఎస్ఎస్ఎల్‌సీ, పియుసి పరీక్షల్లో ఎక్కువ మార్కులతో పాసైన విద్యార్థులకు సన్మానం నిర్వహించారు. సోషల్ క్లబ్ అధ్యక్షుడు కిరణ్ ప్రకాశ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

**వ్యవస్థాపక దినోత్సవం**

బెంగళూరు దక్షిణలోని ఎస్.వ్యాస విశ్వవిద్యాలయంలో వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ పాల్గొని కొత్తగా నిర్మించిన ఫిజియో థెరపీ విభాగాన్ని ప్రారంభించారు. వీసీ నాగేంద్ర, రామకృష్ణ, శివశంకర సాయి, మంజునాథ్‌లు పాల్గొన్నారు.

### కోర్టు వాయిదాకు వచ్చి అస్వస్థత



వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మండ్య: కోర్టు వాయిదాకు విచ్చేసిన వృద్ధురాలు అస్వస్థతకు గురైంది. వెంటనే న్యాయాలయ సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలించారు. మండ్య తాలూకా హళ్లెగెరె గ్రామానికి చెందిన నాగమ్మ ఇప్పటికే గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుంది. ఓ కేసు విషయంలో గురువారం కోర్టులో వాయిదా ఉండటంతో తన తండ్రితో కలిసి వచ్చింది. ఆ సమయంలో ఊపిరి ఆడక కింద పడిపోతుండగా కోర్టు సిబ్బంది గమనించి కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం 108 అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించారు.

# ఛాయాచిత్రం భావయుక్తం



ఫ్రేమ్స్‌లో ప్రదర్శించబోయే కొన్ని అత్యుత్తమ ఫొటోలు




బండీపుర అడవిలో ఏనుగుల సంచారం

- నేటి నుంచి చిత్రకళా పరిషత్‌లో ఫ్రేమ్స్ శిబిరం

బనశంకరి: కెమెరా లేని ప్రపంచాన్ని నేడు ఊహించలేం. అన్ని రంగాల్లోకి కెమెరా విస్తృతంగా చొచ్చుకుపోయింది. దానిని మరింత మెరుగైన రీతిలో ఎలా వాడాలో మెలకువలు తెలుసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. ఈ దిశగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యూత్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫ్రేమ్స్- 2023 విజువల్ వయోజిస్ పేరుతో ఛాయాచిత్ర ప్రదర్శన, సెమినార్, అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.

**మూడు రోజులు సెషన్లు**

నగరంలో కుమారకృప రోడ్డు చిత్రకళా పరిషత్‌లో ఈ నెల 18వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రముఖ వన్యజీవి ఫొటోగ్రాఫర్ ఆర్.అనంతమూర్తి వన్యజీవులు, అరుదైన పక్షులు గురించి మాట్లాడతారు. 19వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు హెచ్.సతీశ్ ఆధ్వర్యంలో లైటింగ్‌లో ఛాయాచిత్రాలను కెమెరాలో ఎలా బంధించాలి అనే దానిపై ఫొటోగ్రఫీ ఔత్సాహికులకు శిక్షణనిస్తారు. 20వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు అందమైన కుటుంబ ఫొటోలను క్లిక్ చేయడం గురించి ప్రయోగాత్మకంగా సెషన్ నిర్వహిస్తారు. మూడురోజుల పాటు దేశం నలుమూలలా తీసిన అత్యుత్తమమైన 72 ఛాయాచిత్రాల ప్రదర్శన ఉంటుందని యూత్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ అధ్యక్షుడు మంజువికాస్‌శాస్త్రి, ఉపాధ్యక్షుడు గిరీశ్ అనంత మూర్తి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చాయాచిత్ర ప్రదర్శన జరుగుతుందని తెలిపారు.



హంపీ సౌందర్యం



కేరళ కళాకారుల నృత్య ప్రదర్శన

### తండ్రీకుమార్తెను కబళించిన రోడ్డు ప్రమాదం

యశవంతపుర: రోడ్డు ప్రమాదం తండ్రీకుమార్తెను బలి తీసుకోగా తల్లీ కొడుకు క్షతగాత్రులయ్యారు. ఈ ఘటన కలబురిగి సమీపంలోని జేవర్గి జాతీయ రహదారిలో గురువారం ఉదయం జరిగింది. జేవర్గి తాలూకా కలబురగి రాఘవేంద్ర నగరకు చెందిన ప్రకాశ హరళయ్య(31) భవన నిర్మాణ పనుల వద్ద మేస్త్రీగా పనిచేసేవాడు. ఆయన తన భార్య గాయత్రి, కుమార్తె అపేక్ష(4) కుమారుడు ప్రదీప్‌తో కలిసి బైక్‌పై జేవర్గికి వెళ్తుండగా టాటా ఏస్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో తండ్రీ కుమార్తె అక్కడికక్కడే మృతి చెందగా తల్లీ కొడుకు గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

### 'బీజేపీని వీడేది లేదు'

యశవంతపుర: తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారం వదంతి మాత్రమేనని మాజీ మంత్రి, యశవంతపుర ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ స్పష్టం చేశారు. ఆయన గురువారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీని వీడే ప్రసక్తి లేదన్నారు. తన నియోజకవర్గంలోకి డీసీఎం డీకే శివకుమార్ వచ్చారని, ఈ సందర్భంగా తాగునీటి సమస్యపై చర్చించానన్నారు. ఎలాంటి రాజకీయాలు మాట్లాడలేదన్నారు. అయితే పాత బీజేపీ నాయకులు తనకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

### పొలాల్లో ఏనుగుల విధ్వంసం



కాఫీ పంటలో సంచరిస్తున్న ఏనుగులు

యశవంతపుర:పొలాల్లోకి చొరబడిన గజరాజులు పంటలను ధ్వంసం చేశాయి. అన్నదాతలకు తీరని నష్టాన్ని కలుగజేశాయి. 20కిపైగా కూడిన ఏనుగుల మంద హాసన జిల్లా బేలూరు తాలూకా మలసావర గ్రామ పరిసరాల్లోకి వచ్చి కాఫీతోటలో మకాం వేశాయి. కాఫీ, మిరియాలు, ఏలక్కి, వక్క చెట్లను పెకలించాయి. వరిమడిలోకి దిగి విధ్వంసం సృష్టించాయి. అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏనుగులను అడవిలోకి తరిమివేసేందుకు చర్యలు చేపట్టారు.

### కూల్‌డ్రింక్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు!

మైసూరు: శ్రీలంకకు చెందిన మాజీ క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ చామరాజనగరలో సుమారు 46 ఎకరాల్లో కూల్‌డ్రింక్స్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు. చామరాజనగర తాలూకాలోని కల్లంబెళ్ల పారిశ్రామిక ప్రాంతంలో ఇది ఏర్పాటవుతుంది. వచ్చే ఏడాది నుంచి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అధికారులు తెలిపారు. దీని వల్ల 800 మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆయన తెలిపారు.

### నిద్రిస్తుండగానే ఇల్లు సీజ్

- బ్యాంకు అధికారుల ఘనకార్యం

యశవంతపుర: ఇంటిలోని వారు నిద్రిస్తుండగానే బ్యాంకు సిబ్బంది ఇంటిని సీజ్ చేశారు. ఈ ఘటన బెంగళూరు కెంగేరి ఉపనగరలో జరిగింది. ఇంటి నిర్మాణం కోసం ఓ వ్యక్తి తుమకూరు వీరశైవ కో ఆపరేటివ్ బ్యాంకులో రూ.2కోట్ల రుణం తీసుకున్నాడు. సకాలంలో తిరిగి రుణం చెల్లించలేదు. దీంతో ఇంటిని సీజ్ చేసేందుకు బ్యాంకు అధికారులు కోర్టు అనుమతి తీసుకున్నారు. అయితే అద్దెకు ఉంటున్న వ్యక్తులు బుధవారం రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగానే బ్యాంకు సిబ్బంది వచ్చి తాళం వేసి వేశారు. తాము రూ.10లక్షలు ఇచ్చి అద్దెకు ఉంటున్నామని, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తాళం వేయడం ఏమిటని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

### మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం

శివాజీనగర: ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సమన్వయం కోసం జిల్లాలవారీగా జరుగుతున్న సమావేశాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం పలు జిల్లాల ప్రతినిధులతో సీఎం సిద్దరామయ్య సమావేశం జరిపారు. తొలుత గదగ్ జిల్లాకు సంబంధించి న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్.కే.పాటిల్, కేపీసీసీ కార్యాధ్యక్షుడు సలీం అహమ్మద్, సీనియర్ ఎమ్మెల్యే జీ.టీ.పాటిల్ పాల్గొన్నారు. గ్యారెంటీ పథకాలను పేదల ముంగిటకు చేర్చటం, స్థానిక సంస్థల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల్లో విజయానికి బాటలు వేయడం తదితర అంశాలపై చర్చించారు. గదగ్ జిల్లా తరువాత ఉత్తర కన్నడ, శివమొగ్గ , మైసూరు, చిక్కమగళూరు, విజయనగర జిల్లాల ప్రతినిధులతో చర్చలు జరిగాయి.

### మౌలిక సదుపాయాలే ముఖ్యం

చిక్కబళ్లాపురం : రోడ్ల అభివృద్ధికి ముందే ఆ ప్రాంతంలో మంచినీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించాలని మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అధికారులకు సూచించారు. జెడ్పీ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. చేళూరు, మంచేనహళ్లిలో మినీ విధానసౌధ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న భూమిని గుర్తించాలన్నారు. ఎమ్మెల్యేలు సుబ్బారెడ్డి, పుట్టస్వామిగౌడ, రవికుమార్, కలెక్టర్ రవీంద్ర, జెడ్పీ సీఈఓ ప్రకాష్ నిట్టాలి, ఎస్పీ నాగేష్ పాల్గొన్నారు.

### కారు బోల్తాపడి రచయిత మృతి

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం పట్టణ వాసి, రచయిత యల్లప్ప కారు ప్రమాదంలో మృతి చెందారు. ఈయన బుధవారం రాత్రి స్నేహితులు మురళి, నాగరాజు, నవీన్‌కుమార్‌తో కలిసి నందికొండకు కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా లింగనహళ్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది. యల్లప్ప అక్కడికక్కడే మృతిచెందగా మిగతావారు తీవ్రంగా గాయపడ్డారు. దొడ్డబళ్లాపురం గ్రామీణ పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా ఓ కేసులో జైలుపాలైన యల్లప్ప కారాగార శిక్ష అనుభవిస్తూనే జైలు జీవితాలు అనే పుస్తకాన్ని రచించారు.

## చాముండికొండ పవిత్రత కాపాడేందుకు చర్యలు

మైసూరు : నాడ శక్తి దేవత కొలువైన చాముండి కొండ పవిత్రతను కాపాడేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. కొండ పవిత్రతను దెబ్బతీసే వారికి, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించేవారికి జరిమానాలు విధించనున్నారు. చాముండి కొండపై, కొండచుట్టు పక్కల అరుదైన మొక్కలు ఉన్నాయి. అనేక జాతులకు చెందిన ప్రాణులు, పక్షులు నివాసం ఉంటున్నాయి. దీంతో ఈ కొండ ఎంతో వైవిధ్యత కలిగి ఉంది. ఈక్రమంలో కొండపైకి వచ్చే వేలాది మంది భక్తులు తెలిసో తెలియక తప్పులు చేస్తున్నారు. కొందరు ఏకంగా మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్నారు. కొండపై మద్యం, మాంసంతో విందు చేసుకున్న ఘటనలు కూడా జరిగాయి. ఈచర్యలతో కొండ పవిత్రత దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునేందుకు మైసూరు ప్రాదేశిక అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నగర హసరీకరణలో భాగంగా చాముండికొండపై జీవ వైవిధ్యతను కాపాడేందుకు నడుం బిగించారు.

## ఆహ్వాన పత్రిక ఇచ్చేందుకు వచ్చి కత్తులతో దాడి

- దంపతులకు తీవ్ర గాయాలు

మైసూరు: దుండగులు దంపతులపై చాకుతో దాడి చేసిన ఘటన మైసూరు నగరంలోని హోటెగళ్లి కే.హెచ్.బీ. కాలనీలో జరిగింది. ఇక్కడ బాబురావు, కమలాబాయి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి హరీష్ అనే కుమారుడు ఉన్నాడు. గురువారం ఒక మహిళ, ఒక పురుషుడు వచ్చి హరీష్‌కు గృహప్రవేశ ఆహ్వానపత్రిక ఇవ్వాలని వచ్చినట్లు తెలిపారు. అయితే హరీష్ ఇంటిలో లేడని దంపతులు చెప్పారు. తాగేందుకు నీరు అడగడంతో దంపతులు వంటగదిలోకి వెళ్లారు. వెనుకనే లోపలకు చొరబడిన దుండగులు హరీష్ ఎక్కడున్నాడంటూ కేకలు వేశారు. అనంతరం చాకుతో బాబురావు,కమలాబాయిపై దాడి చేసి ఉడాయించారు. తీవ్రంగా గాయపడిన దంపతులు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చారు. దీంతో దుండగులు అక్కడినుంచి ఉడాయించారు. అనంతరం గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. విజయనగర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## తమిళనాడుకు ప్రయోజనం చేకూర్చుతున్న సర్కార్

- తక్షణం కావేరి జలాల విడుదల ఆపాలి
- మాజీ సీఎం హెచ్.డీ.కుమారస్వామి

శివాజీనగర: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ మేకెదాటు కోసం పాదయాత్ర చేపట్టి ప్రజలకు టోపీ పెట్టిందని, అధికారంలోకి వచ్చాక కావేరి ప్రయోజనాలను తమిళనాడుకు దారాదత్తం చేసిందని మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ.కుమారస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీఎం, జలవనరుల శాఖ మంత్రి డీ.కే.శివకుమార్ తమిళనాడుకు మంత్రిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే తమిళనాడుకు కావేరి నీటి విడుదలను ఆపివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కన్నడిగులకు, అందులోనూ అన్నదాతలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. వర్షాభావంతో జలాశయాలు నిండలేదని, పంటలకు నీరులేదని, బెంగళూరు ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. తమకు తిండిలేకపోగా పొరుగింటివారి జుట్టుకు మల్లెపూలు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఎద్దేవా చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కావేరి రైతుల శ్రేయస్సును పొరుగు రాష్ట్రానికి తాకట్టు పెట్టిందని విమర్శించారు.

### పాడి రైతుల రాస్తారోకో



గౌరిబిదనూరు: పాల సేకరణ ధర లీటర్‌కు రూ.2.50 తగ్గించడంతో పాడి రైతులు రోడ్డెక్కారు. గురువారం రైతు సంఘాలు, కన్నడ సంఘాలు, సీఐటీయూ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పట్టణం వెలుపల పాల శీతలీకరణ కేంద్రం వద్దకు ర్యాలీగా వెళ్లి హిందూపురం-బెంగళూరు రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. నగరసభ సభ్యుడు డీ వెంకటరెడ్డి మాట్లాడుతూ పాల ప్రభుత్వం స్పందించి పాల సేకరణ ధర పెంచాలని డిమాండ్ చేశారు.

### ఫ్యాక్టరీలో పేలుడు

- కార్మికులకు గాయాలు

యశవంతపుర: హావేరి జిల్లా రాణిబెన్నూరులోని స్పార్క్ క్యాండల్ ఫ్యాకరీలో గురువారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఘటనలో ఫ్యాక్టరీలోని వస్తు సామగ్రి ధ్వంసమైంది. పేలుడు అనంతరం కర్మాగారంలో భారీగా అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. ప్రమాదంలో శంభు, శిల్ప, మంగళ అనే కార్మికులు తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. శ్రీకాంత తిమ్మాపుర అనే వ్యక్తి ఈ ఫ్యాక్టరీని నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

### సాంకేతిక రంగంలో ప్రపంచానికి ఆదర్శం భారత్

బనశంకరి: సాంకేతిక రంగంలో ప్రపంచానికి భారత్ ఆదర్శంగా ఉందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ తెలిపారు. గురువారం బెంగళూరు నగరంలో ఏర్పాటు చేసిన మూడురోజుల జీ 20 డిజిటల్ ఇన్నోవేషన్ అలయెన్స్ సమ్మిట్‌ను మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అభివృద్ధి దిశగా సాగడంలో దేశప్రజలు ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు.

## హోసూరు వార్తలు..

### శరణార్థి కూతురు ఆత్మహత్య

హోసూరు: హోసూరు సమీపంలో ప్లస్‌టూ విద్యార్థిని ఆత్మహత్య చేసుకొన్న ఘటన గురువారం వెలుగు చూసింది. హోసూరు సమీపంలోని కెలవరపల్లి డ్యాం వద్ద నివాసముంటున్న శ్రీలంక శరణాలయానికి చెందిన ఉదయ్‌కుమార్ కూతురు దివ్యప్రియ (17). హోసూరులోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతూ వచ్చింది. జీవితంపై ఇష్టం లేదని ఉత్తరం రాసి ఉంచి ఉరివేసుకొంది. హడ్కో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు మందలించడంతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని తీవ్ర విచారణ జరుపుతున్నారు.

### ఘనంగా రాయణ్ణ జయంతి



సంగొళ్లి రాయణ్ణ ఫ్లెక్సీకి పూల దండలు

కెలమంగలం: స్వాతంత్ర పోరాట యోధుడు సంగొళ్లి రాయణ్ణ 227వ జయంతిని డెంకణీకోట సమీపంలోని అరసకుప్పం గ్రామంలో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. బీజేపీ రాష్ట్ర ఎస్టీ విభాగ కార్యదర్శి పాపణ్ణ ముఖ్య అతిథిగా పాల్గొని సంగొళ్లి రాయణ్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. 1798లో జన్మించిన సంగొళ్లి రాయణ్ణ అప్పటి భారతదేశ పరిపాలనలో ఉన్న ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారని అన్నారు. అలాంటి స్వాతంత్ర పోరాట వీరుని అడుగు జాడలో తామందరూ నడవాలని సూచించారు.

### విడిపోయిన భార్యపై కత్తితో దాడి

కెలమంగలం: విడిపోయి దూరంగా ఉంటున్న భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు హోసూరు సమీపంలోని బత్తలపల్లి ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ సురేష్ (36), ఇతని భార్య సుజాత (30), వీరికి 12 ఏళ్ల క్రితం పెళ్లి జరిగింది. తరచూ గొడవలు పడి విడిపోయారు. సుజాత కదిరేపల్లి గ్రామంలో ఒంటరిగా నివాసముంటోంది. బుధవారం సాయంత్రం సుజాత డెంకణీకోట బేటరాయస్వామి ఆలయం వద్ద వెళుతుండగా సురేష్ ఆమెను అడ్డగించి గొడవపడ్డాడు. కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సుజాతను స్థానికులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. డెంకణీకోట పోలీసులు చేరుకొని సురేష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

## కావేరి నది ఉధృతి

- హొగెనెకల్ వద్ద నిషేధాజ్ఞలు

హోసూరు: ఎగువ ప్రాంతాల్లో వర్షాల కారణంగా కబిని, క్రిష్ణరాజసాగర్ డ్యాంల నుంచి నీటిని విడుదల చేయడంతో కావేరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. హొగేనకల్ వద్ద నది పొంగిపొర్లుతోంది. జూన్, జూలై నెలల్లో కర్ణాటక ప్రభుత్వం తమిళనాడుకు వదలాల్సిన 44 టీఎంసీల నీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలా చేసింది. ఈ నేపథ్యంలో గత కొద్దిరోజులుగా కర్ణాటకలో ఎగువన నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో కబిని, కేఆర్ఎస్ డ్యాంల నుంచి పెద్ద మొత్తంలో నీటిని వదిలారు. బుధవారం మధ్యాహ్నం పాటికి ఆ నీరు హొగేనకల్ వద్దకు చేరుకొంది. పర్యాటకులు నదిలో పుణ్యస్నానాలు చేసేందుకు, పడవలో ప్రయాణాలు చేయడాన్ని అధికారులు నిషేధించారు. దీంతో యాత్రికులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.



హొగేనకల్ వద్ద ఉధృతంగా కావేరి నది

### కందిరీగల గూడుతో బెంగ

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని రామనాయకుని చెరువు పక్కన ఏర్పాటు చేసిన పార్కులో అతిపెద్ద కందిరీగ గూడుకట్టుకొందని, ఈ గూడు వల్ల ప్రజలకు ప్రమాదం సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని, దానిని తొలగించాలని స్థానికులు కోరారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు చేరుకొని ఇక్కడ వాకింగ్ చేస్తుంటారు. కందిరీగలు దాడి చేస్తే ప్రాణాపాయం జరగవచ్చని తెలిపారు. వెంటనే గూడును తొలగించాలని కోరారు.

### ఆర్టీసీ బస్సు బోల్తా, 15 మందికి గాయాలు

హోసూరు: ముందు వెళుతున్న ప్రైవేట్ పాఠశాల బస్సును ఓవర్‌టేక్ చేస్తూ ఆర్టీసీ బస్ పల్టీ కొట్టడంతో 15 మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఉద్దనపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు ధర్మపురి నుంచి 40 మంది ప్రయాణికులను తీసుకొని హోసూరుకు ఆర్టీసీ బస్సు బయల్దేరింది. ఉద్దనపల్లి సమీపంలోని లాలికల్ వద్ద ఓవర్‌టేక్ చేస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ ధర్మపురికి చెందిన జయవేల్ (47), కండక్టర్ జయరామన్ (40)తో పాటు 15 మంది ప్రయాణికులకు గాయాలు తగిలాయి. స్థానికులు వెంటనే గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉద్దనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

### సాహితీవేత్తలకు బెదిరింపు కాల్

యశవంతపుర: సాహితీవేత్తలు, విచారవాదులు, రచయితలకు అపరిచిత వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఈమేరకు రచయితల బృందం హోంమంత్రి డాక్టర్ జీ పరమేశ్వరకు లేఖ రాసింది. ఈనెల 9న సాహితీవేత్త మరుళసిద్ధప్ప, బంజగెరె జయప్రకాశ్, డాక్టర్ వసుంధరా భూపతి, వీరభద్రప్పకు బెదిరింపు లేఖలు వచ్చినట్లు తెలిసింది. చంద్రయాన్-3 శాటిలైట్ అంతరిక్షంలోకి పంపటానికి ముందు శాస్త్రవేత్తలు తిరుమలకు వెళ్లి పూజలు చేశారు. దీనిపై అనేక మంది సాహితీవేత్తలు విమర్శలు చేశారు. విమర్శలు చేసినవారికి శిక్ష ఉంటుందంటూ దుండగులు లేఖలు రాసినట్లు సాహితీవేత్తల బృందం ఆందోళన వ్యక్తం చేసింది.

### దాడికి పథకం..ఇద్దరి అరెస్ట్

- మారణాయుధాలు స్వాధీనం

మైసూరు: మారణాయుధాలతో సంచరిస్తున్న మైసూరులోని రామకృష్ణ నగర్ డీ బ్లాక్‌కు చెందిన సమర్థ్ (25), గిరిదర్శన్ లేఔట్‌కు చెందిన ఉత్సవ్(19) అనేవారిని కువెంపు నగర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్దనుంచి 2 లాంగ్‌లు, కారు, వేటకొడవళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎవరిపైనో దాడి చేసేందుకు వీరు పథకం రచిస్తుండగా దాడి చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనలో రాహుల్, మనోజ్, దర్శన్ అబి, మర్దిన్ తదితర ఏడుమంది తప్పించుకున్నారని, వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

### చికిత్స పొందుతూ బాలుడి మృతి

- మూడుకు చేరిన మృతుల సంఖ్య

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకా లక్ష్మీపుర గ్రామంలో ఈనెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ట్యూషన్ ముగించుకుని ఇళ్లకు తిరిగి వెళ్తున్న నలుగురు చిన్నారులపైకి గూడ్స్ వాహనం దూసుకెళ్లిన ఘటనలో శాలిని(8), దర్శన్(5)అనే ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా సుచేత్(10)అనే బాలుడు గాయపడిన విషయం తెలిసిందే. సుచేత్ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రామనగర గ్రామీణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విడుదలై నేత జన్మదినం


హోసూరు: విడుదలై చిరుత పార్టీ వ్యవస్థాపకుడు తిరుమావళవన్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం హోసూరులో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు రామచంద్రన్ అధ్యక్షతన విక్టోరియా హోటల్ వద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పేదలకు మొక్కలు, చీరలు, ధోవతీలను పంపిణీ చేశారు.

**మారన్ జయంతి వేడుక**

పట్టణంలోని డీఎంకే కార్యాలయంలో దివంగత నేత మురసోలి మారన్ 90వ జయంతిని నాయకులు జరుపుకొన్నారు. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్ పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. వేపనపల్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్, నాయకులు యువరాజ్, పుష్పాసర్వేష్, సుకుమారన్, ఎల్లోరామణి, గజేంద్రమూర్తి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య పాల్గొన్నారు.

అసలు వ్యవసాయమే దండగ అని.. ఎంత మందిని వీలైతే అంత మంది రైతులను ఈ రంగం నుంచి బయటకు రప్పించడమే లక్ష్యం అని విజన్-2020 ద్వారా చాటిన పెద్దమనిషి చంద్రబాబు. గతంలో వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామంటే.. తీగలపై బట్టలు ఆరేసుకోవాలని చెప్పిన ఘనుడూ ఈయనే. అలాంటి చంద్రబాబు ఇప్పుడు వ్యవసాయ రంగాన్ని ఉద్ధరిస్తానని కబుర్లు చెబుతున్నారు. ఇదివరకెన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలతో అన్నదాతలకు చేస్తున్న మేలుపై నిస్సిగ్గుగా దుష్ప్రచారానికి ఒడిగట్టారు. ఎవరు నవ్వి పోయినా పర్వాలేదనుకునే, ఎవరేమన్నా తుడుచుకుని వెళ్లే రకమైన ఈ బాబు దింపుడుకల్లం ఆశగా నోటికొచ్చిన హామీలిస్తున్నారు.

- సాక్షి, అమరావతి




# బాబూ.. మీ నోట వ్యవసాయం మాటా!

## వ్యవసాయమే దండగ అన్నది మీరే

రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రాష్ట్ర ప్రభుత్వం
19.21 లక్షల వ్యవసాయ సర్వీసులకు పగటిపూటే 9 గంటల ఉచిత విద్యుత్
ఆక్వా రైతులకు రాయితీతో యూనిట్ రూ.1.50కే విద్యుత్
ఆర్బీకేల ద్వారానే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు
మరుసటి సీజన్ ప్రారంభానికి ముందే పంటల బీమా పరిహారం
నాలుగేళ్లలో 25.38 లక్షల మంది రైతులకు సీసీఆర్సీ పత్రాలు

ఆరుగాలం కాయకష్టం చేసి అందరికీ అన్నంపెట్టే అన్నదాతకు ఒకప్పుడు కంటి మీద కునుకు ఉండేది కాదు. పంట చేలకు నీరు పెట్టడానికి బోర్ల దగ్గర రేయింబవళ్లు కాపలా కాయాల్సివచ్చేది. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితులుండేవి. రాత్రిళ్లు పొలాల్లో ఉండటం వల్ల రైతులు పాము కాట్లకు, కరెంటు షాకులకు గురై ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేది. విత్తనాల కోసం, విత్తుకున్న తర్వాత ఎరువుల కోసం ఎండనక, వాననక, పగలనకా, రేయినకా నిద్రాహారాలు మాని సొసైటీల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకంతో ప్రభుత్వం పగటిపూటే తొమ్మిది గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. విత్తు నుంచి విక్రయం వరకు గ్రామ స్థాయిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలను చేయిపట్టుకుని నడిపిస్తోంది. దీనిని చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు. తాను అధికారంలో ఉండగా రైతుల యోగ క్షేమాలను గాలికొదిలేసిన ఆయన ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ రైతులకు మంచి చేస్తున్న సీఎం జగన్‌పై దుష్ప్రచారానికి ఒడిగట్టడం దుర్మార్గం.

### కౌలు రైతులకు బాసట

గత ప్రభుత్వాలు ఆలోచన కూడా చేయని పంట సాగు హక్కుదారుల చట్టం-2019ని తీసుకు రావడమే కాకుండా పంట సాగు హక్కు పత్రాలు (సీసీఆర్సీ) ఆధారంగా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, ఈ- క్రాప్ నమోదుతో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి రాయితీ, ఉచిత పంటల బీమా వంటి సంక్షేమ ఫలాలతో కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నాలుగేళ్లలో 30 వేల మంది కౌలు రైతులకు రూ.6.26 కోట్ల సున్నా వడ్డీ రాయితీ ఇచ్చింది. 2.14 లక్షల మందికి రూ.224.27 కోట్ల పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ), 1.73 లక్షల మందికి రూ.487 కోట్ల పంటల బీమా పరిహారం ఇచ్చింది. కౌలు రైతులు చనిపోతే వారి కుటుంబాలకు రూ.7 లక్షల పరిహారం అందిస్తోంది. నాలుగేళ్లలో 25.38 లక్షల మందికి సీసీఆర్సీ పత్రాలు జారీ చేయగా, ఇందులో 17.71 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు. మిగతా 8 లక్షల మంది రైతులు ఓసీల్లోని పేదలేనని చంద్రబాబుకు ఎవరైనా చెప్పండి.

### ఆర్బీకేలతో కొత్త ఒరవడి

ఆర్బీకేలు అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతుల ఇబ్బందులన్నీ తొలగిపోయాయి. 9,484 కియోస్క్‌లలో బుక్ చేసుకుంటే చాలు సీజన్ ముందుగానే సర్టిఫై చేసిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను 24 గంటల్లో రైతుల ముంగిట అందిస్తున్నారు. సాగు వేళ అన్ని కంపెనీలకు చెందిన పురుగు మందులను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. రూ.1,052 కోట్ల విలువైన 6,392 ట్రాక్టర్లు, 491 కంబైన్డ్ హార్వెస్టర్లు, 36,153 వ్యవసాయ పనిముట్లను రైతు సంఘాలకు సమకూర్చి తక్కువ అద్దెకే రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్బీకేల్లో ఇంత చేస్తుంటే చంద్రబాబు కళ్లు మూసుకుపోయి విష ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద 52.38 లక్షల మందికి రూ.30,985.29 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ కింద 73.88 లక్షల మందికి రూ.1834.55 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 54.76 లక్షల మందికి రూ.7802.05 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.22.73 లక్షల మందికి రూ.1985.42 కోట్లు చొప్పున అందించడం రైతుల సంక్షేమమని చంద్రబాబు తెలుసుకోలేకపోతున్నారు.

### ఆక్వాకూ భరోసా

గత ప్రభుత్వం 2014 నుంచి 2016 వరకు ఆక్వా సాగుకు స్లాట్ల ఆధారంగా విద్యుత్ టారిఫ్ యూనిట్‌కు రూ.4.63 నుంచి రూ.7, 2016 నుంచి 2018 మే వరకూ యూనిట్ రూ.3.86 చొప్పున వసూలు చేసింది. ఎన్నికలకు కొద్ది నెలల ముందు యూనిట్‌కు రూ.2 చొప్పున విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించింది. కానీ ఇవ్వాల్సిన సబ్సిడీ భారం రూ.312.05 కోట్లను విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు చెల్లించకుండా బాకీ పెట్టింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ఈ భారాన్ని భరించాల్సి వచ్చింది. అంటే గత ప్రభుత్వంలో చంద్రబాబు చెబుతున్నట్లు ఆక్వా రైతులకు రాయితీతో కూడిన విద్యుత్ సరఫరా జరగనేలేదని స్పష్టమవుతోంది. ప్రస్తుత ప్రభుత్వం 63,754 ఆక్వా కనెక్షన్లలో అర్హత ఉన్న 46,445 కనెక్షన్లకు యూనిట్ రూ.1.50 చొప్పున విద్యుత్ సరఫరా చేస్తోంది.

### ఆది నుంచి రైతులకే అగ్రస్థానం

వైఎస్ జగన్.. అధికారం చేపట్టిన నాటి నుంచి వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల ద్వారా దాదాపు 19.85 లక్షల వ్యవసాయ సర్వీసులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ కోసం రూ.5.500 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. 30 ఏళ్ల పాటు వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్తు పథకాన్ని కొనసాగించడం కోసం సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (సెకీ)తో ఒప్పందం చేసుకుంది. సెకీ నుంచి యూనిట్ కేవలం రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేస్తోంది.

### నాలుగేళ్లలో రూ.1,61,236.72 కోట్ల లబ్ధి

| పథకం | రైతుల సంఖ్య (లక్షల్లో) | ఆర్థిక సాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| వైఎస్సార్ రైతు భరోసా | 52.38 | 30,985.30 |
| వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 44.28 | 6,684.84 |
| ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం | 22.74 | 1,965.43 |
| ధాన్యం కొనుగోలు | - | 58,485.06 |
| ఇతర పంటల కొనుగోలు | - | 7,633.39 |
| ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ | - | 34,200.00 |
| ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ | - | 2,967.88 |
| పగటిపూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంపు | - | 1,700.00 |
| శనగ రైతులకు బోనస్ | - | 300.00 |
| సూక్ష్మసేద్యం, పండ్ల తోటల అభివృద్ధి | 4.50 | 2,012.24 |
| ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ | 0.37 | 171.87 |
| వైఎస్సార్ యంత్ర సేవా పథకం | - | 1,052.16 |
| విత్తన సబ్సిడీ | 62.16 | 1,055.00 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (ఈ ప్రభుత్వం చెల్లించిన గత ప్రభుత్వ బకాయిలతో సహా) | 73.88 | 18,344.55 |

ఈ ప్రభుత్వం చెల్లించిన గత ప్రభుత్వ ధాన్యం సేకరణ బకాయిలు: రూ. 960 కోట్లు

గత ప్రభుత్వ కరెంటు బకాయిలు (ఈ ప్రభుత్వం తన మీద వేసుకున్నది): రూ.8,845.00 కోట్లు

గత ప్రభుత్వం చెల్లించాల్సిన విత్తన బకాయిలు (ఈ ప్రభుత్వం చెల్లించింది): రూ. 384.00 కోట్లు

### ఆర్‌బీకేలతో ఎంతో ఉపయోగం



నేను 20 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. ఏ అవసరం ఉన్నా ఆర్‌బీకే వద్దకు వెళితే చాలు. ఎక్కడకూ వెళ్లాల్సిన పని లేదు. వ్యవసాయ సిబ్బంది అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఆర్‌బీకే వ్యవస్థపై విమర్శలు సరికాదు.

– వాసిరెడ్డి సత్తిరాజు, ఏడిద, మండపేట మండలం, తూర్పుగోదావరి జిల్లా

### రైతులకు మద్దతు ధర



నేను ఐదు ఎకరాలు కౌలు సాగు చేస్తున్నాను. ప్రభుత్వ చర్యలతో ధాన్యానికి మద్దతు ధర లభిస్తోంది. గతంలో వ్యాపారులు చెప్పిన ధరకు అమ్మాల్సి వచ్చేది. ఇప్పుడు తడిసిన ధాన్యానికి కూడా మంచి ధర ఇస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది దగ్గరుండి ధాన్యం కొనుగోళ్లు చేయిస్తున్నారు. ధాన్యం సొమ్ము కూడా సకాలంలో అందించారు.

– కోశెట్టి లోవరాజు, ఏడిద, మండపేట మండలం, తూర్పుగోదావరి జిల్లా

### ఎగతాళి చేసిన చంద్రబాబుకు మాట్లాడే అర్హత లేదు



ఈ ప్రభుత్వం వచ్చాక రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతోంది. గత ప్రభుత్వంలో వారికి కావాల్సిన కొద్ది మందికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గతంలో వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానంటే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలని ఎగతాళి చేసిన చంద్రబాబుకు ఇప్పుడు వ్యవసాయం గురించి, అందునా ఉచిత విద్యుత్ గురించి మాట్లాడే అర్హతే లేదు.

– రామిశెట్టి సుబ్బరాజు, ఏడిద, మండపేట మండలం, తూర్పుగోదావరి జిల్లా

## ప్రతి గడపకూ వచ్చే సత్తా వైఎస్సార్‌సీపీకి ఉంది

- చంద్రబాబు వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ తోట ఆగ్రహం



మండపేట: కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా, రాజకీయాలు చేయకుండా అర్హత కలిగిన అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న తమకు ప్రతి గడపకు వచ్చే సత్తా ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. ఏడిద రచ్చబండలో మాజీ సీఎం చంద్రబాబు మాట్లాడుతూ దమ్ముంటే తనతో ప్రతి గడపకూ రావాలని చేసిన సవాల్‌కు ఎమ్మెల్సీ తోట దీటుగా స్పందించారు. మండపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడుతూ మండపేట నుంచి భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రారంభించానంటున్న చంద్రబాబు.. తన తనయుడు లోకేశ్ భవిష్యత్తుకు గ్యారంటీ కోసమా లేక మనువడి భవిష్యత్తుకు గ్యారంటీ కోసమా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. వైఎస్సార్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ కింద మీ పార్టీ నేతలు ఎమ్మెల్యే వేగుళ్లకు రూ.69,897, శ్రీనివాసచౌదరి కుటుంబానికి దాదాపు రూ.1.65 లక్షల ప్రభుత్వ సాయం అందిందన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఏడాదిలోనే రూ.రెండు వేల కోట్లకు పైగా విలువైన ఇసుకను మీ ఎమ్మెల్యేలు దోపిడీ చేసినట్లు అప్పట్లో మీ గెజిట్ పేపరైన ఈనాడులో 'ఇసుకాసురులు' శీర్షికన రాసిన కథనానికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. హత్యకేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న మీ పార్టీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ హోటల్‌లోనే విందు భోజనం చేసి రాత్రి బస చేసింది మీరు కాదా అని తోట ప్రశ్నించారు.

# ప్రతిభకు సర్కారు పట్టం

## ఐక్యరాజ్య సమితికి రాష్ట్ర ప్రతినిధులుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- యూఎన్ఓ, వరల్డ్ బ్యాంకుల్లో ప్రసంగించే అవకాశం
- అమెరికా అధ్యక్ష భవనం సందర్శించే చాన్స్ కూడా..
- ప్రభుత్వ స్కూళ్లల్లో చదివిన 10 మంది ప్రతిభావంతుల ఎంపిక
- ప్రభుత్వ ఖర్చుతో సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు అమెరికా సందర్శన


అమెరికా పర్యటనకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

సాక్షి అమరావతి : రైతుకూలి బిడ్డ అమ్మాజాన్, లారీ డ్రైవర్ కుమార్తె రాజేశ్వరి, సెక్యూరిటీ గార్డు కూతురు జ్యోత్స్న, కౌలురైతు కొడుకు అంజన సాయి, రోజుకూలీ బిడ్డ గాయత్రి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్తె శివలింగమ్మ, టీచర్ కూతురు మనస్విని, రైతుబిడ్డ యోగీశ్వర్, మెకానిక్ కూతురు రిషితారెడ్డి, ఆటోడ్రైవర్ కుమార్తె చంద్రలేఖ.. వీరి కుటుంబాలకు పని ఉంటేనే రోజు గడిచేది.. లేకపోతే పస్తులే. ఇలాంటి వారి గురించి చెప్పుకోవడానికి ఏముంటుంది? అని అనిపించడం సహజం. పైగా.. ఈ కోవకు చెందినవారు రాష్ట్రంలో లక్షల్లో ఉంటారు.. పత్రికలో రాసేటంతగా విషయం ఏముంటుంది అని కూడా అనుకోవచ్చు.. కానీ, చదువులో రాణించి ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇప్పుడు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకోవడమే వీరు సాధించిన గొప్ప విజయం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఉత్తమ మార్కులు సాధించిన 150 మందిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. వారికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, మారిన బడుల తీరుపై పరీక్ష నిర్వహించగా మొత్తం 30 మంది ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. వీరికి కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ) కార్యదర్శి మధుసూదనరావు, యూఎన్ఓ స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్‌కుమార్ నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం మౌఖిక పరీక్షలు నిర్వహించి పై 10 మందిని విజేతలుగా ఎంపిక చేసింది. ఇప్పుడు వీరంతా సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు ప్రభుత్వ ఖర్చుతో ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించడంతో పాటు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడతారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలుచేస్తున్న విద్యా సంస్కరణలపైన, పాఠశాలల అభివృద్ధిపైన మాట్లాడేందుకు సరైన ప్రతినిధులు విద్యార్థులేనని.. ఎంపికైన వారంతా పేద కుటుంబాల పిల్లలేనని పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ పర్యటనలో వీరు అమెరికా అధ్యక్ష భవనాన్ని సైతం సందర్శిస్తారన్నారు. విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వమే ఐక్యరాజ్య సమితికి పంపిస్తోందని, వీరికి అవసరమైన పాస్‌పోర్టు, వీసా వంటి అన్ని ఏర్పాట్లుచేసినట్లు వారు వివరించారు. ఇక ఈ విద్యార్థుల విజయగాథ ఏమిటంటే..

**గిరిజన బాలికకు అద్భుత అవకాశం..**



కురుపాం మండలం కొండబారిడి గిరిజన గ్రామానికి చెందిన సామల మనస్విని తల్లి కృష్ణవేణి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. మనస్విని ప్రస్తుతం గుమ్మలక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. గిరిజన కుగ్రామంలో పుట్టి పెరిగిన మనస్విని అమెరికా వెళ్లనున్న పది మంది విద్యార్థుల్లో ఒక్కరిగా నిలిచింది. ఇటీవల జరిగిన ముఖ్యమంత్రి సభలో తన ప్రసంగం ద్వారా ఆకట్టుకుంది.

**రైతు బిడ్డకు గొప్ప వరం**



కర్నూలు జిల్లా కౌతాళం మండలం పొదలకుంట గ్రామానికి చెందిన మించాలవారి సోమనాథ్, గంగమ్మల నాలుగో సంతానం శివలింగమ్మ ఆదోని కేజీబీవీలో పదో తరగతి 541 మార్కులతో పాసైంది. బాలిక తండ్రి సోమనాథ్ కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేయడంతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శివలింగమ్మ అమెరికా వరకు వెళ్లే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు సోమనాథ్ ఎక్కడలేని ఆనందం వ్యక్తంచేశారు.

**ఐరాస సదస్సుకు రైతుబిడ్డ..**



తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరసింగాపురం గ్రామానికి చెందిన వంజవాకం నాగరాజు, విజయ దంపతుల రెండో కుమారుడు యోగీశ్వర్. తండ్రి ఉన్న ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకునే రైతు. ఇద్దరి సంతానంలో పాప విద్యశ్రీ ఇంటర్ చదువుతుండగా, కుమారుడు యోగీశ్వర్ 10వ తరగతిలో 586 మార్కులు సాధించి జిల్లాలో రెండోస్థానం సాధించాడు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద తమబిడ్డల చదువుకు ఎంతో సహకరించాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

**కేక.. చంద్ర లేఖ..**



అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన మోతుకూరి రామారావు, మణి దంపతుల రెండో కుమార్తె చంద్రలేఖ. రాష్ట్ర విభజనతో కుటంబంతో భద్రాచలం నుంచి ఎటపాకకు వచ్చిన రామారావు చంద్రలేఖను స్థానిక కేజీబీవీలో చదివించారు. ఇటీవల పదో తరగతిలో 523 మార్కులు సాధించి కేజీబీవీ జిల్లా టాపర్‌గా నిలిచి ప్రభుత్వం అందించిన జగనన్న ఆణిముత్యాలు సత్కారం కింద రూ.50 వేల నగదు బహుమతి అందుకుంది. ఈ విజయమే ఆమెను ఐక్యరాజ్య సమితికి వెళ్లేలా బాటవేసింది.

**తల్లి కష్టంతో తల్లడిల్లి..**



పూట గడవడం కూడా కష్టమైన ఇంట్లో పుట్టిన షేక్ అమ్మాజాన్ ఏడేళ్ల క్రితం తండ్రిని కోల్పోయింది. రైతుకూలీ అయిన తల్లి కష్టంచూసి చదువుల్లో రాణించాలనుకుంది. ఐదో తరగతిలోనే వైఎస్సార్ జిల్లా వేంపల్లిలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీటు తెచ్చుకుంది. ఇటీవల టెన్త్‌లో 581 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో జగనన్న ఆణిముత్యాలు సత్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి అందుకుంది. ఇప్పుడు ఐరాస గడప తొక్కుతోంది. ప్రస్తుతం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చేరింది.

**ప్రతిభ చాటిన సెక్యూరిటీ గార్డు బిడ్డ**



కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటకు చెందిన దడాల సింహాచలం ప్రైవేటు సెక్యూరిటీ గార్డు. ఈయన భార్య గృహిణి. వీరి రెండో కుమార్తె జ్యోత్స్న టెన్త్‌లో 589 మార్కులు సాధించింది. దీంతో పాటు జగనన్న ఆణిముత్యాలు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని సైతం అందుకుంది. ఇప్పుడు కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఐఐటీ అకాడమీలో ఇంటర్ చదువుతూ అమెరికా అవకాశాన్ని అందిపుచ్చుకుంది.

**కౌలురైతు కొడుకు ఘనత..**



పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం వల్లూరుపల్లికి చెందిన జి.గణేష్ అంజనసాయి ఏలూరు జిల్లా అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు. టెన్త్‌లో 581 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. తండ్రి గోపి కౌలురైతు కాగా, తల్లి లక్ష్మి గృహిణి. కుటుంబానికి చదువు భారం కాకూడదని గురుకుల పాఠశాలలో సీటు తెచ్చుకున్నాడు.

**590 మార్కులతో అదరహో..**



తండ్రి కూలీ, తల్లి గృహిణి. తండ్రికి పని దొరికితేనే పూటగడిచే పరిస్థితి. తన భవిష్యత్‌ను చదువుల ద్వారా తీర్చిదిద్దుకుని, కుటుంబాన్ని బాగా చూసుకోవాలని బలంగా అనుకుంది పసుపులేటి గాయత్రి. ఏలూరు జిల్లా పెదపాడు మండలంలోని వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివి ఏకంగా 590 మార్కులు సాధించి జిల్లాలోనే టాపర్‌గా నిలిచింది. అమెరికా బృందానికి ఎంపికైంది.

**మెరిసిన మెకానిక్ కుమార్తె..**



విజయనగరం శివారు జమ్మునారాయణపురంలో నివాసముండే అల్లం రామకృష్ణారెడ్డి, ఉదయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ప్రైవేటు సంస్థలో మెకానిక్‌గా పనిచేసే రామకృష్ణారెడ్డి రెండో కుమార్తె రిషితారెడ్డి స్థానిక మున్సిపల్ హైస్కూల్లో టెన్త్ చదివి 587 మార్కులు సాధించి, నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరింది. ఇప్పుడు అమెరికా వెళ్లే అరుదైన అవకాశం దక్కించుకుంది.

**నంద్యాల నుంచి అమెరికాకు..**



నంద్యాల పట్టణం బొమ్మలసత్రం ప్రాంతానికి చెందిన విద్యార్థిని సి.రాజేశ్వరి తండ్రి దస్తగిరి లారీడ్రైవర్, భార్య రామలక్ష్మమ్మ ఇంటివద్ద బట్టలు ఇస్త్రీ చేస్తుంటారు. వీరి పెద్ద కుమార్తె రాజేశ్వరి నంద్యాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో టెన్త్ చదివి 583 మార్కులు సాధించి నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచింది. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడంతో ఐరాసకు వెళ్లే అరుదైన అవకాశం కైవసం చేసుకుంది.

## వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయదుందుభి

**2019 కంటే ఎక్కువ స్థానాల్లో గెలుపొందుతాం**

- 2024లో చంద్రబాబు కథ ముగుస్తుంది
- నిత్యం అబద్ధాలాడే చంద్రబాబు అసత్య హరిశ్చంద్రుడు
- టీడీపీ డెకాయిట్ పార్టీ.. లోకేశ్‌కు భవిష్యత్తు లేదు
- వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, మంత్రి మేరుగు, ఎంపీ మోపిదేవి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో పూర్తిగా బలంగా ఉందని, 2024 ఎన్నికల్లోనూ విజయదుందుభి మోగిస్తుందని ఆ పార్టీ కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి తెలిపారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 51 శాతానికి పైగా ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి బాపట్ల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ విజయం సాధిస్తామన్నారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా, వైఎస్సార్‌సీపీ సింగిల్‌గానే పోటీచేసి, 2019లో గెల్చుకొన్న సీట్లకంటే ఎక్కువ గెలిచి బాబు అలయన్స్‌కు గుణపాఠం చెబుతామన్నారు. టీడీపీ తెలుగు దొంగల పార్టీ అని, తెలుగు డెకాయిట్ల పార్టీ అని అభివర్ణించారు. అధికార దాహంతో దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతోందని విమర్శించారు. అసాంఘిక కార్యక్రమాలకు, వ్యక్తులకు సపోర్టు చేసే టీడీపీ రాజకీయ పార్టీ కాదని, దానిని ఎన్నికల కమిషన్ రద్దు చేయాలని చెప్పారు. పోలీసులపైనే దాడులు చేయించి తెలుగు ద్రోహుల పార్టీగా మారిందన్నారు. నిత్యం అబద్ధాలాడే చంద్రబాబు అసత్య హరిశ్చంద్రుడని వ్యాఖ్యానించారు. ఏపీలో స్థిర నివాసం లేని చంద్రబాబు ప్రవాసాంధ్రుడని, ఆయన పార్టీని ఇక్కడి ప్రజలు ఎన్నుకోవాలా అని ప్రశ్నించారు. టైమ్స్‌నౌ, ఇండియా టుడే సర్వేల గురించి బాబు అండ్‌కో తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలోని మొత్తం 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. 2024తో టీడీపీ అంతర్ధానమై కొత్త పార్టీలు వస్తాయని, చంద్రబాబు కథ ముగుస్తుందని, ఆయన రాజకీయ సన్యాసం తీసుకొని, కన్నీళ్లతో శేష జీవితం గడపాల్సి వస్తుందని అన్నారు. కొత్తగా 2047 విజన్ అంటున్న చంద్రబాబు అప్పటికి ఏ పరిస్థితిలో ఉంటాడో ఊహించుకోవాలని చెప్పారు. లోకేశ్‌కు అసలు భవిష్యత్తే లేదన్నారు. కులాలు, మతాలు రాజకీయాలకు అతీతంగా పలు పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పార్లమెంట్ సభ్యులకు వారి నియోజకవర్గంతో పాటు దేశవ్యాప్తంగా పర్యటించే పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 18-8-2023



# కాసుల కాంతులు



కాసుల పేరుకు ఎవర్‌గ్రీన్ జ్యువెలరీ అనే పేరుంది. ముఖ్యంగా సంప్రదాయ వేడుకల్లో కళ ఉట్టిపడటమే కాదు చూపులనూ ఇట్టే కట్టిపడేస్తుంది. కానీ, ధనవంతుల జాబితాలోనే ఆ ఆభరణం అనే నిరాసక్తత అవసరం లేకుండా అన్నింటా తానై కాసు కళకళలాడుతోంది. వజ్రాలు పొదిగిన కాసులు తక్కువ బంగారంతో ఎక్కువ కాసులు సిల్వర్ కాసులు, ఇమిటేషన్ కాసులు ఎంబ్రాయిడరీలో ఒదిగిన కాసులు ఇప్పుడు ఎన్నో కాసులు వేడుకల్లో మది దోచడానికి సిద్ధంగా ఉన్నాయి. ఎంపిక మీదే అంటూ తీరొక్క డిజైన్లతో ఆకట్టుకుంటున్నాయి.

### పట్టుకు సరి జోడీ

బంగారు, ఇమిటేషన్ కాసుల ఆభరణాలు పట్టుకు సరిజోడీగా అనిపిస్తాయి. వేడుకల వేళ కళను వెయ్యింతలు చేస్తాయి. మనసును ఆనందభరితం చేస్తాయి.

### ఇండో వెస్టర్న్ లుక్

కాసుల హారాలు పట్టుచీరలు, పరికిణీ మీదకు మాత్రమే నప్పుతాయనే రోజులు ఇప్పుడు కావు. కాయిన్ జ్యువెలరీగా వెస్టర్న్ డ్రెస్సుల మీదకూ వరసలుగా వచ్చి చేరాయి. ఈ ఆభరణాల డిజైన్లలో 18 క్యారెట్ల గోల్డ్, సిల్వర్ కాయిన్స్‌ను వాడుతున్నారు డిజైనర్లు.



### మరిన్ని హంగులు

కాసుల పేరు అనగానే మనకు హారం మాత్రమే గుర్తొస్తుంది. కానీ, ఇప్పుడు కాయిన్స్ ఉంగరాలుగానూ మారాయి. హ్యాంగింగ్స్‌గా మెరుస్తున్నాయి. జడలోనూ, పవిటకూ బ్రోచ్‌లుగా కట్టడి చేస్తున్నాయి. బ్రేస్‌లెట్స్‌గా, బెల్ట్‌గా, గాజులుగా... కాయిన్స్, లక్ష్మీ కాసులు తమ వైభవానికి మరిన్ని వన్నెలు అద్దుతున్నాయి.



## బ్యూటిప్స్

### ట్యాన్ తగ్గాలంటే...

- స్పూను కాఫీ పొడిలో స్పూను తేనె, స్పూను బంగాళ దుంప రసం, స్పూను గంధం పొడివేసి చక్కగా కలిపితే డీ ట్యాన్ ప్యాక్ రెడీ. ఈ ప్యాక్‌ను ముఖం, చేతులు, మెడపైన పూతలా వేసి పదిహేను నిమిషాలు ఆరనివ్వాలి. తరువాత తడి బట్టతో తుడిచేసి, నీటితో కడిగేయాలి. వారానికి రెండు–మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే నలుపు పోయి, చర్మం నిగారింపు సంతరించుకుంటుంది.
- ప్యాక్ వేసుకునే సమయం లేనప్పుడు..టొమాటో రసాన్ని ముఖానికి రాసుకుంటే ట్యాన్ తగ్గుతుంది.
- నిమ్మరసంలో బంగాళదుంప రసం కలిపి ముఖానికి పెట్టుకున్నా ట్యాన్ పోతుంది.
- ఈ ప్యాక్‌లు వేసుకున్నప్పటికీ రాత్రి పడుకునేముందు చేతులు, కాళ్లకు నైట్‌క్రీమ్ రాసుకుంటే ట్యాన్ తొలగి చర్మం కాంతిమంతంగా మెరుస్తుంది.

## వంటిల్లు

# నంజుకు తిందాం

ఉల్లి, పల్లి, కొబ్బరి, వెల్లుల్లి, పుట్నాల పచ్చళ్లు తినితిని చప్పగా మారిన నాలుకకు ఊరించే చట్నీలు కనిపిస్తే ప్రాణం లేచివస్తుంది. అందుకే చూడగానే నోరూరించే చట్నీలతో ఈ వారం వంటిల్లు మీకోసం...

### నిమ్మకాయ ఇన్‌స్టంట్ పచ్చడి



**కావలసినవి:** నిమ్మకాయలు – పది; బెల్లం – అరకప్పు; జీలకర్ర – నాలుగు టీస్పూన్లు; ఎండు మిర్చి – ఇరవై; ఉప్పు – రుచికి సరిపడా.

**తయారీ:** ● నిమ్మకాయలను నాలుగు ముక్కలుగా కట్ చేయాలి ● ముక్కల్లో ఉన్న గింజలన్నింటినీ తీసేయాలి (గింజలు ఉంటే పచ్చడి చేదుగా వస్తుంది) ● నిమ్మకాయ ముక్కలు, జీలకర్ర వేసి కచ్చాపచ్చాగా పేస్టుచేయాలి ● ఎండు మిర్చి, బెల్లంను కలిపి పొడిచేయాలి ● ఇప్పుడు నిమ్మకాయ పేస్టులో ఎండుమిర్చి పొడి, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి. తాలింపు కావాలంటే వేసుకోవచ్చు. తాలింపు లేకపోయినా బావుంటుంది ● ఈ చట్నీని వెంటనే కూడా తినవచ్చు. కానీ రెండుమూడు రోజులు మాగాక మరింత రుచిగా ఉంటుంది ● ఇడ్లీ,దోశ, పరాటా, చపాతీ, అన్నంలోకి ఈ చట్నీ చాలా బావుంటుంది.

### క్యారట్ క్యాప్సికమ్ చట్నీ

**కావలసినవి:** క్యారట్‌లు – పెద్దవి రెండు; క్యాప్సికం –పెద్దది ఒకటి; అల్లం – అంగుళన్నర ముక్క; పచ్చిమిర్చి –ఐదు; జీలకర్ర –టీస్పూను; ధనియాలు –టీస్పూను; ఆవాలు – అరటీస్పూను; పచ్చిశనగపప్పు – టీస్పూను; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; చింతపండు గుజ్జు – రెండు టీస్పూన్లు; నూనె – నాలుగు టీస్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

**తయారీ:** ● క్యారట్, క్యాప్సికం, అల్లంను సన్నని ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి ● జీలకర్ర, ధనియాలను దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో మూడు టీస్పూన్ల నూనె వేసి వేడెక్కిన తరువాత పచ్చిమిర్చి, అల్లం, క్యారట్, క్యాప్సికం ముక్కలు వేసి వేయించాలి ● కొద్దిగా ఉప్పు, కొద్దిగా నీళ్లుపోసి ముక్కలు మెత్తగా అయ్యేంత వరకు ఉడికించి దించేయాలి ● వేయించిన ధనియాలు, జీలకర్ర మిక్సీజార్‌లో వేసి గ్రైండ్ చేయాలి ● ఇవి నలిగిన తరువాత ఉడికించిన క్యాప్సికం క్యారట్ ముక్కలను వేయాలి ● చింతపండు గుజ్జు, కొత్తిమీర తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి ● మిగిలిన టీస్పూను నూనె వేడెక్కిన తరువాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వాలి. తరువాత శనగపప్పు, కరివేపాకు వేసి వేయించాలి. చివరిగా ఇంగువ వేసి దించేయాలి ● ఈ తాలింపుని పచ్చడిలో కలిపితే క్యారట్ క్యాప్సికం చట్నీ రెడీ. ఇడ్లీ, దోశ, రోటీల్లో ఇది మంచి కాంబినేషన్.



### కశ్మీరీ చట్నీ



**కావలసినవి:** కశ్మీరీ మిరపకాయలు – ఇరవై; నూనె – ఐదు టేబుల్ స్పూన్లు; వెల్లుల్లి తురుము – ఐదు టేబుల్ స్పూన్లు; అల్లం తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు –రెండు టేబుల్ స్పూన్లు; టొమాటో కెచప్ – ఐదు టేబుల్ స్పూన్లు; రెడ్‌చిల్లీ సాస్ – రెండు టేబుల్ స్పూన్లు; సోయాసాస్ – టేబుల్ స్పూను; మిరియాల పొడి – టేబుల్ స్పూను; అరోరూట్ పొడి – టేబుల్ స్పూను, చక్కెర – టేబుల్ స్పూను; వెనిగర్ – మూడు టేబుల్ స్పూన్లు; ఉప్పు – రుచికి సరిపడా.

**తయారీ:** ● మిరపకాయలను నీటిలో వేసి రెండు గంటలపాటు నానబెట్టాలి ● మిరపకాయలు చక్కగా నానాక మిక్సీజార్‌లో వేసి పేస్టుచేసి పక్కన పెట్టుకోవాలి ● బాణలిలో నూనె మొత్తం వేసి వేడెక్కనివ్వాలి. బాగా కాగిన నూనెలో వెల్లుల్లి తురుము, అల్లం తరుగు, కొత్తిమీర తరుగు వేసి మీడియం మంట మీద వేయించాలి ● తరువాత ఎండుమిర్చి పేస్టు వేసి వేయించాలి ● తరువాత టొమాటో కెచప్, రెడ్‌చిల్లీసాస్, సోయాసాస్, మిరియాలపొడి, అరోరూట్ పొడి, చక్కెర వేసి ఐదు నిమిషాలు తిప్పాలి ● చివరిగా రుచికి సరిపడా ఉప్పు, వెనిగర్ వేసి రెండు నిమిషాలపాటు వెయించి దించేయాలి ● నెలరోజులపాటు నిల్వ ఉండే ఈ చట్నీ ఇడ్లీ, దోశ, నూడుల్స్, ఎగ్‌ఫ్రైడ్‌రైస్‌ల్లోకి మంచి కాంబినేషన్.

### సగ్గు బియ్యం పచ్చడి

**కావలసినవి:** సగ్గు బియ్యం – అర కప్పు; పెరుగు – రెండున్నర కప్పులు; అల్లం తురుము –టేబుల్ స్పూను; క్యారట్ తురుము – రెండు టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీస్పూను; జీలకర్ర – టీస్పూను; పచ్చిశనగపప్పు –టీస్పూను; పసుపు – అరటీస్పూను; కొత్తిమీర తరుగు – పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – మూడు టీస్పూన్లు; కరివేపాకు – రెండు రెమ్మలు; ఇంగువ – చిటికెడు.



**తయారీ:** ● సగ్గుబియ్యాన్ని పదినిమిషాలపాటు మీడియం మంట మీద వేయించి పక్కన పెట్టుకోవాలి ● సగ్గు బియ్యం చల్లగా అయిన తరువాత పెరుగు వేసి కలపాలి. పెరుగు చిక్కగా అనిపిస్తే కొద్దిగా నీళ్లుపోసుకోని ఐదు గంటలపాటు నానబెట్టుకోవాలి ● సగ్గు బియ్యం పట్టుకుంటే మెత్తగా అయ్యేంతవరకు నానాక... కొత్తిమీర తరుగు , రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● బాణలిలో నూనెవేసి, వేడెక్కిన తరువాత ఆవాలు, జీలకర్ర, పచ్చిశనగపప్పు వేసి వేయించాలి. ఇవన్నీ వేగిన తరువాత పసుపు, ఇంగువ, క్యారట్ తరుగు వేసి నిమిషం పాటు వేయించి తీసేయాలి ● ఈ తాలింపు మిశ్రమాన్ని సగ్గుబియ్యం మిశ్రమంలో వేసి కలిపితే సగ్గు బియ్యం పచ్చడి రెడీ. అన్నం, చపాతీల్లోకి ఈ చట్నీ మంచి కాంబినేషన్.

### కరివేపాకు పచ్చడి



**కావలసినవి:** కరివేపాకులు – రెండు కప్పులు; ఎండుమిర్చి – 10; చింతపండు – పెద్ద ఉసిరికాయ అంత పరిమాణం; పొట్టుతీసిన మినపగుళ్లు – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; నువ్వులు – టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; పచ్చికొబ్బరి తురుము – ముప్పావు కప్పు; బెల్లం – టేబుల్ స్పూను; ఉప్పు రుచికి సరిపడా.

**తయారీ:** ● బాణలిలో నూనెవేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో మినపగుళ్లు, ఎండు మిర్చి వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి ● ఇదే బాణలిలో నువ్వులు వేసి దోరగా వేయించాలి. ఇవి వేగిన తరువాత కరివేపాకు ఆకులు, చింతపండు, రుచికి సరిపడా ఉప్పు వేసి వేయించాలి ● కరివేపాకు వేగిన తరువాత దించేసి, కొబ్బరి తురుము వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి ● కరివేపాకు మిశ్రమం వేడి తగ్గిన తరువాత బెల్లం వేసి మెత్తగా నూరుకుంటే కరివేపాకు పచ్చడి రెడీ. అన్నం, చపాతీ, ఇడ్లీ, దోశల్లోకి బావుంటుంది.

## కొత్తదారి

# ప్రయాణ ప్రమోదం

### – ట్రావెల్ విత్ కిడ్స్



ప్రయాణాల మీద బోలెడు ఆసక్తి ఉన్నప్పటికీ పిల్లలు ఒక వయసు వచ్చాకగానీ ఇల్లు దాటని తల్లులు ఎందరో ఉంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇన్‌స్టాగ్రామ్ ఫ్రెండ్స్, డెంటిస్టులు సాక్షి గులాటీ, నికిత మాథుర్‌లు యంగ్ మదర్స్ కోసం 'ట్రావెల్ విత్ కిడ్స్' అనే ట్రావెల్ గ్రూప్‌ను ప్రారంభించారు. ప్రయాణాలలో తల్లీపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు...

సాక్షి గులాటీ, నికిత మాథుర్‌లు పర్యాటక ప్రేమికులు. వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా సరే ప్రయాణాలకు మాత్రం దూరంగా ఉండేవారు కాదు. నాలుగున్నర సంవత్సరాల క్రితం సాక్షి ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లడానికి ఆలోచనలు చేస్తున్నప్పుడు 'చంటి బిడ్డతో ప్రయాణమా!!' అని ఆశ్చర్య పోవడమే కాదు ప్రయాణాలు వద్దంటే వద్దన్నారు చాలా మంది.

ఒక బిడ్డకు తల్లి అయిన నికితకు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది.



● సాక్షి, నికిత

ఎవరి మాటలు పట్టించుకోకుండా చెన్నైకి చెందిన సాక్షి తన మూడు నెలల బిడ్డతో కలిసి మహాబలిపురానికి వెళ్లింది. చాలా కాలం తరువాత పర్యాటక ప్రదేశానికి వచ్చింది. మరోవైపు బెంగళూరుకు చెందిన నికిత మూడు నెలల పిల్లాడితో కలిసి మైసూర్‌కు వెళ్లింది.

'బేబీతో ప్రయాణం కష్టమని చాలామంది భయపెట్టారు. ఇది నిజం కాదని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను. మొదటి మూడు నాలుగు నెలలు మాత్రమే కష్టం' అంటుంది సాక్షి.

చెన్నైలో ఉండే సాక్షి, బెంగళూరులో ఉండే నికితలు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యారు. ఒకే రకమైన వృత్తి, అభిరుచులు వారిని సన్నిహిత స్నేహితులుగా మార్చాయి.

సినిమాల నుంచి పర్యాటకం వరకు ఇద్దరు స్నేహితులు ఎన్నో విషయాలు మాట్లాడుకునేవారు. అలా ఒకరోజు వారి మధ్య చంటిబిడ్డలు ఉన్న తల్లుల ప్రస్తావన వచ్చింది.

మహిళల కోసం ఎన్నో ట్రావెల్ గ్రూప్స్ ఉన్నాయి. సోలో ట్రావెలర్స్, సీనియర్ సిటిజన్‌లు... మొదలైన వారి కోసం ఎన్నో ట్రావెల్ గ్రూప్స్ ఉన్నాయి. కాని మదర్స్ అండ్ కిడ్స్ కోసం మాత్రం లేవు. ఈ లోటును భర్తీ చేయడానికి రెండు సంవత్సరాల క్రితం 'ట్రావెల్ విత్ కిడ్స్' పేరుతో ట్రావెల్ గ్రూప్‌ను ప్రారంభించారు.

తొలి 'మదర్ అండ్ కిడ్స్' ట్రిప్‌ను పాండిచ్చేరికి ప్లాన్ చేశారు.

సాక్షికి పాండిచ్చేరి కొట్టిన పిండి. పాండిచ్చేరి ట్రిప్‌కు సంబంధించిన వివరాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే మంచి స్పందన లభించింది. ఈ ట్రిప్‌లో ఆరుగురు తల్లులు వారి పిల్లలను తీసుకువెళ్లారు. ఈ ప్రయాణం విజయవంతం కావడంతో ఇద్దరు స్నేహితులకు ఎంతో ఉత్సాహం వచ్చింది. ఆ తరువాత వివిధ ప్రాంతాలకు సంబంధించి అయిదు ట్రిప్‌లు ప్లాన్ చేశారు.

తమ వృత్తిలో బిజీగా ఉండే సాక్షి, నికితలు వీకెండ్స్‌లో ప్లానింగ్ చేస్తుంటారు.

'చంటి బిడ్డలు ఉన్నారని ఇంటి నాలుగు గోడలకే పరిమితం కానక్కర్లేదు. బయటి ప్రపంచలోకి వస్తే కొత్త ఉత్సాహం, శక్తి వస్తాయి' అంటున్నారు సాక్షి, నికిత.

'పర్యాటక ప్రదేశాలకు వెళ్లి కొత్త అనుభూతిని సొంతం చేసుకునేలా చంటి బిడ్డల తల్లులను ప్రేరేపించడం ఒక లక్ష్యం అయితే, ప్రయాణాలలో తల్లీబిడ్డలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవడం అనేది మా ప్రధాన లక్ష్యం' అంటుంది నికిత.

ఈ ట్రావెల్ గ్రూప్ ప్రత్యేకత ఏమిటంటే, ఒక ట్రిప్ ప్లాన్ చేయడానికి ముందు సాక్షి, నికితలలో ఒకరు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి వస్తారు. అక్కడి పరిస్థితులను అంచనా వేస్తారు. రకరకాల జాగ్రత్తలు తీసుకుంటారు.



● సంతోషాల సరిగమలు

'ట్రిప్ బుక్ చేసుకున్న వారి కోసం వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశాం. దీనిద్వారా తల్లుల ఆహారపు అలవాట్లతో పాటు వారి ఇష్టయిష్టాలు, తీసుకోవాల్సిన ప్రత్యేక జాగ్రత్తల గురించి వివరంగా తెలుసుకునే అవకాశం దొరికింది' అంటుంది సాక్షి.

చెన్నై, బెంగళూరు, ముంబై, జైపుర్, కోచి, కోల్‌కతా... ఇలా ఎన్నో నగరాల నుంచి తల్లులు ఈ ట్రిప్‌లలో భాగం అవుతున్నారు. తన పిల్లాడితో కలిసి పాండిచ్చేరికి వెళ్లిన దీపిక ఇలా అంటుంది...

'ట్రిప్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేశారు. ఎప్పుడైనా కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు తిండి సహించేది కాదు. ఈ ప్రయాణంలో మాత్రం ఇంటి తిండిని మరిపించేలా చేశారు. ఈ ట్రిప్ ద్వారా ఎంతోమంది స్నేహితులయ్యారు'

ట్రిప్‌ల ద్వారా పరిచయం అయిన వారు ఒకరి ఇంటికి ఒకరు వెళ్లి కలుసుకోవడం, ఆ కుటుంబంలో వ్యక్తిలా మారడం మరో విషయం.

'కిడ్–ఫ్రెండ్లీగా లేవని కొన్ని ప్రదేశాలకు దూరంగా ఉంటాం. అయితే పిల్లలు మొరాకో నుంచి ఈజిప్ట్ వరకు ఎక్కడైనా సరే తమ ఆనందాన్ని తామే వెదుక్కుంటారు. పిల్లలు పార్క్‌లు, జూలలలో మాత్రమే ఆనందిస్తారనేది సరి కాదు' అంటుంది సాక్షి.

సింగిల్ మదర్స్ ఈ ట్రిప్స్‌పై ఆసక్తి ప్రదర్శించడం మరో కోణం. స్థూలంగా చెప్పాలంటే 'ట్రావెల్ విత్ కిడ్స్' తల్లుల పర్యాటక సంతోషానికి మాత్రమే పరిమితం కావడం లేదు. ఒకే రకంగా ఆలోచించే వారిని ఒక దగ్గరికి తీసుకువచ్చింది. కొత్త స్నేహితుల రూపంలో కొత్త బలాన్ని కానుకగా ఇస్తోంది.

● ఇన్నోవేషన్

**బంజరు భూములలో కూడా బంగారాన్ని పండించవచ్చని నిరూపిస్తున్నారు ఐఐటీ-బాంబే గ్రాడ్యుయేట్స్ అభయ్ సింగ్, అమిత్ కుమార్‌లు. వివిధ రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే క్లైమెట్ ప్రూఫ్ చాంబర్స్ ద్వారా రసాయన రహిత కూరగాయలను పచ్చగా పండిస్తున్నారు. 'ఇకీ ఫుడ్స్' స్టార్టప్‌తో ఈ మిత్రద్వయం అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది...**

# ప్రకృతి పరవశించిన చోట...



అమిత్ కుమార్
అభయ్ సింగ్

అభయ్ సింగ్, అమిత్ కుమార్‌లు ఐఐటీ-బాంబేలో బెస్ట్ ఫ్రెండ్స్. చాలామంది స్నేహితులలాగా సినిమాలు, క్రికెట్ గురించి కంటే పర్యావరణం, వ్యవసాయానికి సంబంధించిన విషయాలు ఎక్కువగా మాట్లాడుకునేవారు.

'కాలేజి రోజుల నుంచి సంప్రదాయానికి భిన్నంగా ఆలోచించడం మా అలవాటు. రకరకాల ప్రాజెక్ట్‌ల గురించి మాట్లాడుకునే వాళ్లం. క్లాస్ పూర్తయిన తరువాత ఎన్నో విషయాలపై మేధోమథనం చేసేవాళ్లం చదువుకున్నామా? ఉద్యోగాలు చేశామా? అని కాకుండా సమాజం కోసం మా వంతుగా ఏదైనా చేయాలనుకునే వాళ్లం. మన దేశంలో ఎంతో మంది వ్యవసాయరంగంలో పనిచేస్తున్నారు. వారి కోసం ఏదైనా చేయాలనుకునే వాళ్లం. ఏదైనా సాధించాలనే తపన పుట్టినప్పుడు ఆత్మవిశ్వాసం మొదలవుతుంది. అది అనేక రకాలుగా శక్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తుంది. మా విషయంలోనూ ఇదే జరిగింది' అంటాడు అమిత్.



**ఇకిగై అంటే...**
ఇకిగై అనేది జపనీస్ కాన్సెప్ట్. ఆరోగ్యవంతమైన. శక్తివంతమైన జీవన విధానాన్ని ప్రతిఫలించే మాట. జపనీస్ పదాలు ఇకీ (జీవితం), కై (ఫలితం, ఫలం) నుంచి పుట్టింది. స్ఫూర్తిదాయకమైన 'ఇకిగై' కాన్సెప్ట్ నుంచి తమ స్టార్టప్‌కు 'ఇకీ ఫుడ్స్' అని నామకరణం చేశారు అమిత్, అభయ్‌లు.

కొత్త ఆలోచనలు వృథా పోవు. కాస్త ఆలస్యమైనా మంచి ఫలితం దక్కుతుంది.
- అమిత్ కుమార్, ఇకీ-ఫుడ్స్, కో-ఫౌండర్

వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన అమిత్, అభయ్‌లు ఆ రంగానికి సంబంధించిన రకరకాల ప్రయోగాలు చేస్తూ స్థిరమైన, అనుకూలమైన, అందుబాటులో ఉండే సాంకేతికతను రైతులకు దగ్గర చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

'జనాభా పెరుగుదల దృష్ట్యా మన దేశంలో ఆహార కొరత ఏర్పడనుంది. ఆహారంలో పోషక విలువలు కోల్పోనున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆహారం అందరికీ అందుబాటులో ఉండేలా, ఆరోగ్యానికి మేలు చేసేలా, వేగంగా ఉత్పత్తి చేసేలా కొత్త ఆవిష్కరణలు చేయాలనుకున్నాం' అంటాడు అభయ్.

తాము చర్చించుకున్న విషయాలను దృష్టిలో పెట్టుకొని 'ఇకీ ఫుడ్స్' అనే అంకురాన్ని ప్రారంభించారు. 'ఇకీ ఫుడ్స్' మొదలు పెట్టినప్పుడు మొదటి మూడు సంవత్సరాలు పరిశోధన, అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టారు.

వీరు సృష్టించిన సాంకేతికత ఎనభై శాతం నీటి వృధాను అరికడుతుంది. సంప్రదాయ పద్ధతుల్లో కంటే 75 శాతం వేగవంతమైన వృద్ధిరేటు ఉంటుంది. వివిధ రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే క్లైమెట్ ప్రూఫ్ చాంబర్స్ ద్వారా రసాయనరహిత కూరగాయలను పండిస్తున్నారు.

గత సంవత్సరం తమ టెక్నాలజీకి సంబంధించిన పేటెంట్ రైట్స్ పొందారు.

'ఎన్నో రకాల వ్యవసాయ పద్ధతులు ఉన్నా అవసరాలకు తగిన పద్ధతులు కనిపించడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని వేగవంతమైన ఉత్పత్తి విధానాలకు ప్రాధాన్యత ఇచ్చాం. మట్టి నుంచి మొక్క మొలకెత్తడానికి నీరు. ఆక్సిజన్, పోషకాలు, సపోర్ట్ అవసరం అవుతాయి. ఈ నాలుగు ఆధారాలతో మట్టితో పని లేకుండా మొక్కలను సృష్టించాలనుకున్నాం. డెబ్బైశాతం తేమ ఉన్న గదిలో అవసరమైన పోషక మూలాలను స్ప్రే చేసి ప్రయోగాలు మొదలు పెట్టాం' అంటాడు అమిత్.

సంపన్న దేశాల వ్యవసాయ క్షేత్రాల హైడ్రోపోనిక్స్ సిస్టమ్‌లో ఉపయోగించే కూలర్‌లు, చిల్లర్‌లు, బ్లోయర్‌లు, ప్లాస్టిక్ ఎన్‌క్లోజర్‌లకు ఈ మిత్రద్వయం దూరంగా ఉండాలనుకుంటోంది. సౌరశక్తిలోని అద్భుతాన్ని ఉపయోగించుకొని సంప్రదాయ పద్ధతుల్లో కంటే ఎక్కువ దిగుబడి సాధించాలనుకుంటోంది.

రాజస్థాన్‌లోని కోట కేంద్రంగా పని చేస్తున్న 'ఇకీ ఫుడ్స్' స్టార్టప్ 'కంట్రోల్డ్ ఎన్విరాన్‌మెంట్ అగ్రికల్చర్'ను తన నినాదంగా, విధానంగా ఎంచుకుంది. రాబోయే రోజుల్లో మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్రలలో 'ఇకీ ఫుడ్స్' క్షేత్రాలకు శ్రీకారం చుట్టడానికి రెడీ అవుతున్నారు అమిత్, అభయ్‌లు.

# యువర్స్

### టెక్.. టాక్

### షావోమీ రెడ్‌మీ ప్యాడ్ ఎస్ఈ



రిజల్యూషన్: 1920×1200 పిక్సెల్స్; రిఫ్రెష్‌రేట్: 90 హెచ్‌జడ్
కలర్స్: గ్రాఫిటి గ్రే, మింట్ గ్రీన్;
బ్యాటరీ: 8,000 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్: 13;
బ్లూటూత్: 5.0

### రెడ్‌మీ వాచ్ 3 యాక్టివ్

- రిజల్యూషన్: 240×280
- రిఫ్రెష్ రేట్: 60 హెచ్‌జడ్
- బరువు: 42 గ్రా
- కలర్: బ్లాక్ అండ్ ఆఫ్-వైట్
- వాటర్ ప్రూఫ్
- బ్లూటూత్
- 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్
- ధర: రూ.2,999



### ఎక్స్‌రియల్ ఎయిర్ ఏఆర్ గ్లాసెస్

డైమెన్షన్స్:
అన్ ఫోల్డెడ్: 148 ఎంఎం×52 ఎంఎం×159ఎంఎం
ఫోల్డెడ్:
148ఎంఎం×52 ఎంఎం×60 ఎంఎం
ఆడియో: డ్యూయల్ ఓపెన్-ఇయర్ స్పీకర్స్
రిజల్యూషన్: 1920×1080 పిక్సెల్స్
స్క్రీన్ సైజ్: 130-అంగుళాలు
ఇంటర్నల్స్: 4జీబీ ర్యామ్
బ్యాటరీ: 4870 ఎంఏహెచ్



● ఇంగ్లిష్ ఇడియమ్స్




**ఎగ్ ఆన్ యువర్ ఫేస్**
ఏదైనా తప్పు జరిగినప్పుడు, తప్పు జవాబు చెప్పినప్పుడు ఎగతాళిగా ఉపయోగించే మాట... ఎగ్ ఆన్ యువర్ ఫేస్.
ఉదా: శ్రీను హ్యాడ్ ఎగ్ ఆన్ హిజ్ ఫేస్ ఆఫ్టర్ సేయింగ్ హీ కుడ్ ఈజీలీ దు 50 పుషప్స్, అండ్ దెన్ గివింగ్ అప్ ఆఫ్టర్ డూయింగ్ జస్ట్ ట్వంటీ.

**కార్ట్ బ్లాష్**
ఒక వ్యక్తికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చే సందర్భంలో ఉపయోగించే మాట.
ఉదా: ది ఆర్కిటెక్ట్ గివెన్ కార్ట్ బ్లాష్ టు డిజైన్ ది స్టోర్
'కార్ట్ బ్లాష్' అనే ఫ్రెంచ్ మాటకు తెల్ల కాగితం, బ్లాంక్ చెక్ లాంటి అర్థాలు ఉన్నాయి.

● మ్యూజిక్ వరల్డ్

## విజయ కేతనం


కేతకి

ఏ గూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుంది...అన్నట్లు సంగీతకారుల కుటుంబంలో జన్మించిన కేతకి మతేంగోకర్‌కు చిన్నప్పటి నుంచే పాట అంటే ఇష్టం. తండ్రి ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్. తల్లి సువర్ణ సింగర్.

నటిగా కూడా మెప్పించింది కేతకి. 'షాల' ఆమె డెబ్యూ ఫిల్మ్. ఈ సినిమా కోసం అవకాశం తనను వెదుక్కుంటూ వచ్చింది. దర్శకుడు సుజిత్ ఒక టెలివిజన్ మ్యూజిక్ షోలో కేతకిని చూసి తన సినిమాలోని పాత్రకు ఎంపిక చేశాడు.

నటనలో మంచి మార్కులు తెచ్చుకున్నప్పటికీ 'నటన' కంటే సంగీతానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానంటోంది కేతకి. రోజుకు నాలుగు గంటల పాటు సంగీత సాధన చేస్తుంది.

'మహేష్ మంజ్రేకర్ సినిమాలో నటించిన తరువాత ఎన్నో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చినా సంగీతానికే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. మంచి సింగర్‌గా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను. క్లాసిక్ నుంచి కాంటెంపరరీ మ్యూజిక్ వరకు నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నాను'

గత సంవత్సరం 'మాయి' ఆల్బమ్‌తో మ్యూజిక్ కంపోజర్‌గా కూడా తన ప్రతిభ చాటుకుంది కేతకి. ఈ ఆల్బమ్‌లోని తొమ్మిది పాటలను శంకర్ మహాదేవన్, మహాలక్ష్మి అయ్యర్‌లాంటి ప్రసిద్ధ గాయకులు పాడారు.

'మన దగ్గర ఉమెన్ మ్యూజిక్ కంపోజర్‌లు తక్కువగా ఉన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. మంచి మ్యూజిక్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారు. చాలామందికి మ్యూజిక్ కంపోజిషన్‌లో అద్భుత ప్రతిభ ఉన్నా ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల దూరంగా ఉంటున్నారు' అంటుంది కేతకి.

# సినిమా

**పైసా మే పరమాత్మ అంటారు. ఒక్క చిన్న మార్పు. ఇప్పుడు 'పైసా మే సినిమా' అనాలి. ఎందుకంటే రిలీజ్ తర్వాత సాధించే పైసా వసూల్ కోసం పైసల చుట్టూ కథలు అల్లి కొన్ని సినిమాలు తీస్తున్నారు. 'పైసా మే సినిమా'... అంటూ పైసల మీద తీస్తున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.**

## పైసా మే సినిమా



● ధనుష్ 51 పోస్టర్


● వెంకటేశ్, వరుణ్ తేజ్


● వరుణ్ తేజ్ 'మట్కా' పోస్టర్

**వినోదం.. సందేశం**
వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రాలు 'ఎఫ్ 2', 'ఎఫ్ 3'. భార్యాభర్తల అనుబంధాలతో అల్లుకున్న 'ఎఫ్ 2' అయినా.. వారసత్వం నేపథ్యంతో సాగిన 'ఎఫ్ 3' అయినా.. ఈ రెండు సినిమాల్లో అంతర్లీనంగా ఉన్న ప్రధానాంశం డబ్బుతో కూడుకున్న అవసరాలేనని ప్రేక్షకులకు అనిపిస్తుంది. 'ఎఫ్ 3'లో అయితే జీవితంలో డబ్బు చాలా ముఖ్యమంటూ 'లబ్ డబ్.. లబ్ డబ్.. డబ్బా..' అనే పాట కూడా ఉంది. ఈ చిత్రం ఎండింగ్‌లో 'ఎఫ్ 4' ఉంటుందన్నట్లుగా పేర్కొన్నారు. వచ్చే ఏడాది 'ఎఫ్ 4' సినిమా ఆరంభం కానుందట. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3'ల మాదిరిగానే 'ఎఫ్ 4' ప్రధాన కథాంశం డబ్బే అయ్యుంటుందని ఊహించవచ్చు.

**ఖరీదైన భవనాలు.. నోట్ల కట్టలు**
దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించే చిత్రాలు వినోదంతో పాటు సందేశాత్మకంగానూ ఉంటాయి. ఇక శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందనున్న తాజా సినిమాలో ధనుష్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. నాగార్జున ఓ కీలక పాత్రలో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇటీవలే ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో ఒకవైపు అత్యంత ఖరీదైన భవనాలు, మరోవైపు మురికి వాడలు.. మధ్యలో నోట్ల కట్టలు కనిపిస్తుంటాయి. సో.. ఈ సినిమా ప్రధాన కథాంశం డబ్బు నేపథ్యంలో ఉంటుందని, సమాజంలో నెలకొన్న అసమానతల కోణంలో కథనం సాగుతుందని ఊహించవచ్చు. వచ్చే ఏడాది ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం.


● వీజే సన్నీ

**జూదం**
వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తాజా పీరియాడికల్ ఫిల్మ్ 'మట్కా'. ఈ పాన్ ఇండియన్ సినిమాకు 'పలాస' ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్, టైటిల్‌ని బట్టి 'మట్కా' కథ అంతా డబ్బు చుట్టే తిరుగుతుందని తెలుస్తోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'మట్కా'ను తెరకెక్కిస్తున్నట్లు, వైజాగ్ నేపథ్యంలో 1958 – 1982 టైమ్ పీరియడ్‌లో ఈ సినిమా కథనం ఉంటుందన్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు.


● దుల్కర్

**సామాన్యుడి కథ**
నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన ఒక సాధారణ మనిషి కథగా రూపొందనున్న సినిమా 'లక్కీ భాస్కర్'. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించనున్న సినిమా ఇది. 'లక్కీ భాస్కర్' టైటిల్‌ను గమనిస్తే టైటిల్‌లో డాలర్ సింబల్ స్పష్టంగా కనిపిస్తుంది. నమ్మశక్యం కాని విధంగా ఉన్నత శిఖరాలకు చేరిన వ్యక్తి కథ అంటూ చిత్ర యూనిట్ పేర్కొంది. సో..'లక్కీ భాస్కర్' కథలోని ప్రధానాంశం డబ్బే అని తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

**డాలర్ కుమార్**
'బిగ్ బాస్' షో ఫేమ్ వీజే సన్నీ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సౌండ్ పార్టీ'. ఏ ట్విస్టెడ్ ఫ్యామిలీ స్టోరీ అనేది ఉపశీర్షిక. హ్రితికా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు సంజయ్ శేరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో డాలర్ కుమార్ అనే పాత్రలో నటిస్తున్నారు వీజే సన్నీ. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్స్‌లో డబ్బు కనిపిస్తుండటం 'సౌండ్ పార్టీ' ప్రధాన కథాంశం డబ్బే అని స్పష్టం చేస్తోంది.

**డబ్బే ప్రధానాంశంగా సాగే మరికొన్ని సినిమాలు ఉన్నాయి.**

## చీకటి యుగంలో...

మమ్ముట్టి లీడ్ రోల్‌లో నటిస్తున్న కొత్త చిత్రానికి 'భ్రమయుగం' టైటిల్ ఖరారైంది. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో వైనాట్ స్టూడియోస్, నైట్ షిఫ్ట్ స్టూడియోస్‌ల సమర్పణలో ఎస్. శశికాంత్, చక్రవర్తి రామచంద్ర నిర్మిస్తున్నారు. 'భ్రమ యుగం' సినిమా చిత్రీకరణ గురువారం ప్రారంభమైంది. ''ఇప్పటివరకూ చేయని కొత్త పాత్రను ఈ సినిమాలో చేస్తున్నాను'' అని మమ్ముట్టి అన్నారు. ''కేరళలోని చీకటి యుగాల నేపథ్యంలో సాగే కథ 'భ్రమ యుగం'' అన్నారు రాహుల్ సదాశివన్. ''హారర్, థ్రిల్లర్ జానర్ చిత్రాలను నిర్మించడానికే మా నిర్మాణ సంస్థను స్టార్ట్ చేశాం. తొలి చిత్రాన్నే మమ్ముట్టీగారితో చేస్తుండడాన్ని గౌరవంగా భావిస్తున్నాం. మమ్ముట్టీ గారి ఇమేజ్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకుని వెళ్తుంది. దర్శకుడు రాహుల్ సృష్టించిన అద్భుత ప్రపంచం 'భ్రమ యుగం'' అన్నారు నిర్మాతలు. మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.


● మమ్ముట్టి


● రవితేజ

## తప్పించుకున్నాడు!

'నేటి ముఖ్యాంశాలు.. హైదరాబాద్, ముంబై, ఢిల్లీ.. ఇంకా అనేక నగరాల్లో అతి దారుణంగా దోపిడీలు చేసిన స్టువర్టుపురం దొంగ మద్రాస్ సెంట్రల్ జైలు నుంచి తప్పించుకున్నాడు' అంటూ మొదలైంది 'టైగర్ నాగేశ్వరరావు' సినిమా గ్లింప్స్ వీడియో. రవితేజ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పతాకంపై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 20న విడుదల కానుంది. స్టువర్టుపురం దొంగగా పేరు గాంచిన టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. గురువారం 'టైగర్ నాగేశ్వరరావు' గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. రేణు దేశాయ్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: ఆర్ మది, సహనిర్మాత: మయాంక్ సింఘానియా.


## నా స్క్రీన్ టైమ్ తక్కువే కానీ..
**- ఐశ్వర్యా లక్ష్మి**



''దర్శకుడు అభిలాష్ జోషి 'కింగ్ ఆఫ్ కోత' సినిమా స్కేల్ గురించి చెప్పినప్పుడు చాలా ఆసక్తికరంగా అనిపించింది. ప్రొడక్షన్ పరంగా చాలా పెద్ద సినిమా. ప్రతి షాట్ చాలా నిండుగా అచ్చమైన తెలుగు సినిమాలా ఉంటుంది. మలయాళంలో ఇంత పెద్ద స్కేల్ సినిమాలో భాగం కావడం నాకు ఇదే తొలిసారి'' అని హీరోయిన్ ఐశ్వర్యా లక్ష్మి అన్నారు. దుల్కర్ సల్మాన్, ఐశ్వర్యా లక్ష్మి జంటగా అభిలాష్ జోషి దర్శకత్వం వహించిన చిత్రం 'కింగ్ ఆఫ్ కోత'. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఐశ్వర్యా లక్ష్మి మాట్లాడుతూ– ''కింగ్ ఆఫ్ కోత'లో తార పాత్ర చేశాను. దుల్కర్ పేరు రాజు. తార, రాజు మధ్య అందమైన లవ్ స్టోరీ ఉంటుంది. నా పాత్రకి స్క్రీన్ టైమ్ తక్కువగానే ఉన్నప్పటికీ కథలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఈ చిత్రంలో భావోద్వేగ సన్నివేశాలు చేసినప్పుడు సవాల్‌గా అనిపించింది. నాకంటూ డ్రీమ్ రోల్స్ ప్రత్యేకంగా లేవు. కానీ, నేను చేసిన పాత్రలు గుర్తుండిపోవాలని కోరుకుంటాను. ప్రస్తుతం తమిళంలో ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

## ఆ ఇద్దరూ కలియుగంలోకి వస్తే?

నవీన్ బేతిగంటి, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో శ్రీమాన్ కీర్తి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రాక్షస కావ్యం'. దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. ఈ సినిమా టీజర్‌ని 'బలగం' దర్శకుడు వేణు యెల్దండి, హీరో తిరువీర్ విడుదల చేసి, సినిమా మంచి హిట్టవ్వాలన్నారు. శ్రీమాన్ కీర్తి మాట్లాడుతూ– ''పురాణాల్లోని జయ విజయలు ఒక్కో యుగంలో ఒక్కో రాక్షసుల్లా పుట్టారు. వాళ్లు ఇప్పుడు కలియుగంలోకి వస్తే ఎలా ఉంటుంది? అనే కాల్పనిక కథతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''మా చిత్రంలో మంచి భావోద్వేగాలున్నాయి'' అన్నారు దాము రెడ్డి. ''టీజర్ ఎంత బాగుందో సినిమా అంతకంటే బాగుంటుంది'' అన్నారు నవీన్ బేతిగంటి.. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ చిక్కు, సహనిర్మాతలు: నవీన్ రెడ్డి, వసుంధరా దేవి.


● అన్వేష్, కుశాలిని, వేణు, నవీన్

## నాలాంటివాళ్లు కొత్త కథలే చేయాలి
**- సోహైల్**



''మిస్టర్ ప్రెగ్నెంట్' ప్రీమియర్ షో చూశాక చాలా మంది మహిళలు అమ్మ పడే ఇబ్బందులు బాగా చూపించారని కన్నీళ్లు పెట్టుకుని చెప్పారు. దీంతో మా ప్రయత్నం విజయవంతం అయిందనిపించింది'' అన్నారు సయ్యద్ సోహైల్ రియాన్. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వంలో సయ్యద్ సోహైల్, రూపా కొడవయూర్ జంటగా రూపొందిన చిత్రం 'మిస్టర్ ప్రెగ్నెంట్'. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా సోహైల్ విలేకరులతో మాట్లాడుతూ– ''స్టార్ హీరోలకు ఫ్యాన్స్ ఉంటారు. కమర్షియల్ సినిమాలు చేసినా వర్కవుట్ అవుతుంది. కానీ, నాలాంటి వాళ్లు కొత్త ప్రయత్నాలు చేస్తేనే ప్రేక్షకులు సినిమాలకు వస్తారని నమ్మాను. అందుకే 'బిగ్ బాస్' నుంచి రాగానే 'మిస్టర్ ప్రెగ్నెంట్' వంటి కొత్త జానర్ మూవీ చేశాను. మేల్ ప్రెగ్నెన్సీ నిజంగా సాధ్యమైతే కనీసం 20 శాతం మంది మేల్స్ ప్రెగ్నెన్సీ తీసుకోవడం కోసం రెడీగా ఉన్నారు'' అన్నారు.

## రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటాను
**- సంతోష్ శోభన్**



''వందేళ్ల ఇండియన్ సినిమాల్లో ఎన్నో పాత్రలు, ఎన్నో సినిమాలు వచ్చాయి. అయితే ఇప్పటివరకూ చెప్పని కథ, ఎవరూ చేయని పాత్రను ఎలివేట్ చేయటం అనేది ఓ ఆర్టిస్ట్‌కి కొత్తగా ఉంటుంది. అలా పెళ్లి మండపంపై మిగిలిపోయేవాడి కథే 'ప్రేమ్ కుమార్'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. సంతోష్ శోభన్, రాశీ సింగ్, రుచితా సాధినేని హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ్ కుమార్'. అభిషేక్ మహర్షి దర్శకత్వంలో శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ–''అభిషేక్ కొన్ని సినిమాల్లో నటుడిగా చేశాడు. దర్శకుడు కావాలనుకున్నప్పుడు 'ప్రేమ్ కుమార్' కథ రాసుకుని, చక్కగా తీశాడు. వరుసగా వరుడు, పెళ్లి వంటి సినిమాలు చేస్తున్నాను. అయితే నిజ జీవితంలో నేను రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటాను (నవ్వుతూ). నేనిప్పటి వరకు మంచి డైరెక్టర్స్‌తో సినిమాలు చేశాను. అయితే నేను చేసిన సినిమాలన్నీ కరెక్ట్‌గానే ఎంచుకున్నానా? అంటే లేదనే అంటాను. 'ప్రేమ్ కుమార్' నాకు సరైన హిట్ ఇస్తుందనుకుంటున్నాను'' అన్నారు.

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 388 | 100 |
| 65,151 | 19,365 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | ముగింపు | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 13,429 | ▽ | 41 |
| డోజోన్స్ | 34,684 | ▽ | 81 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,310 | ▽ | 47 |
| డాక్స్ | 15,677 | ▽ | 113 |
| షాంఘై | 3,164 | △ | 14 |
| నికాయ్ | 31,626 | △ | 141 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్



## సిమ్ కార్డ్ డీలర్ల ధ్రువీకరణ తప్పనిసరి

- మోసాల నివారణకే బల్క్ కనెక్షన్ల నిలిపివేత: కేంద్ర మంత్రి వైష్ణవ్

**న్యూఢిల్లీ:** డిజిటల్ మోసాలను కట్టడి చేసేందుకే సిమ్ కార్డు డీలర్లకు ధ్రువీకరణను తప్పనిసరి చేసినట్లు, బల్క్ కనెక్షన్లు ఇచ్చే నిబంధనలను తొలగించినట్లు కేంద్ర ఐటీ, టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. డీలరును నియమించుకునే ముందు ప్రతి వ్యాపార సంస్థ యజమాని, వారి వ్యాపార సంబంధ పత్రాలను 'లైసెన్సీ' లేదా టెలికం ఆపరేటర్లు ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే డీలర్లకు రూ. 10 లక్షల జరిమానా ఉంటుందన్నారు. ప్రస్తుతం 10 లక్షల పైచిలుకు సిమ్



డీలర్లు ఉన్నారని, వారి ధ్రువీకరణ కోసం తగినంత సమయం ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బల్క్ కనెక్షన్లను ఇచ్చే నిబంధనను టెలికం శాఖ తొలగించిందని, దానికి బదులుగా కొత్తగా బిజినెస్ కనెక్షన్ కాన్సెప్టును ప్రవేశపెడుతోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది మే నుంచి ప్రభుత్వం 52 లక్షల మొబైల్ కనెక్షన్లను నిలిపివేసినట్లు, 67,000 మంది పైగా డీలర్లను బ్లాక్‌లిస్టులో ఉంచినట్లు వివరించారు. సిమ్ కార్డు డీలర్లపై 300 పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు మంత్రి చెప్పారు.

## జీవిత బీమా మెచ్యూరిటీపై పన్ను!

**నిబంధనలను నోటిఫై చేసిన సీబీడీటీ**

**న్యూఢిల్లీ:** జీవిత బీమా పాలసీల వార్షిక ప్రీమియం రూ.5 లక్షలకు మించి ఉంటే, వాటి మెచ్యూరిటీ తర్వాత అందుకునే మొత్తంపై పన్నును ఏ విధంగా లెక్కించాలన్నది ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి సవరించిన నిబంధనలను నోటిఫై చేసింది. ఏడాదికి చెల్లించే ప్రీమియం రూ.5 లక్షలకు మించితే పాలసీ గడువు తర్వాత అందుకునే మొత్తాన్ని వార్షిక ఆదాయానికి కలిపి చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.




2023 ఏప్రిల్ 1 తర్వాత నుంచి రూ.5 లక్షలకు మించి ప్రీమియం ఉండే పాలసీల మెచ్యూరిటీపై పన్ను అమల్లోకి వచ్చిన విషయం గమనార్హం. అంతకుముందు వరకు పాలసీల ప్రీమియం ఎంతన్న దానితో సంబంధం లేకుండా మెచ్యూరిటీ మొత్తంపై సెక్షన్ 10(10డీ) కింద పన్ను మినహాయింపు అమల్లో ఉంది.

## పియాజియో 'బీబర్' వెస్పా @ 6.45 లక్షలు



**ముంబై:** వెస్పా స్కూటర్ల తయారీ సంస్థ పియాజియో వెహికల్స్ తాజాగా జస్టిన్ బీబర్ ఎక్స్ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. ఈ స్కూటర్ ధర రూ. 6.45 లక్షల నుంచి (ఎక్స్ షోరూమ్). కెనడాకు చెందిన పాప్ స్టార్ జస్టిన్ బీబర్ పేరిట ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఈ లిమిటెడ్ ఎడిషన్ మోడల్స్‌ను (పదిలోపే) ప్రీ-ఆర్డర్ చేయాల్సి ఉంటుంది. ఇవి పూర్తిగా అసెంబుల్ చేసిన యూనిట్‌గా దిగుమతి అవుతాయి. 150 సీసీ ఇంజిన్‌తో ఈ లిమిటెడ్ ఎడిషన్ ఉంటుందని పియాజియో వెహికల్స్ సీఎండీ డీగో గ్రాఫీ తెలిపారు.

## అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాల కోసం ఆర్‌బీఐ పోర్టల్

**ముంబై:** అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలను అన్వేషించేందుకు, క్లెయిమ్ చేసుకునేందుకు తోడ్పడేలా కేంద్రీకృత వెబ్ పోర్టల్ ఉద్‌గమ్ (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ – గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్)ను గురువారం రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రారంభించారు. వివిధ బ్యాంకుల్లో క్లెయిమ్ చేయకుండా ఉండిపోయిన తమ డిపాజిట్లన్నింటి గురించిన వివరాలను కస్టమర్లు ఒకే చోట తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (రెబిట్), ఇండియన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ అండ్ అలైడ్ సర్వీసెస్ (ఐఎఫ్‌టీఏఎస్), భాగస్వామ్య బ్యాంకులు కలిసి దీన్ని రూపొందించాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,



ధన్‌లక్ష్మి బ్యాంక్, సౌతిండియా బ్యాంక్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా, సిటీబ్యాంక్ వంటి ఏడు బ్యాంకుల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల వివరాలు ఈ పోర్టల్‌లో ఉన్నాయి. ఇతర బ్యాంకుల వివరాలను కూడా అక్టోబర్ 15 నాటికి దశలవారీగా అందుబాటులోకి తేనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి దాదాపు రూ. 35,000 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ప్రభుత్వ రంగ బ్యాంకులు ఆర్‌బీఐకి బదలాయించాయి. సిసలైన యజమానులు, లబ్ధిదారులకు ఆయా డిపాజిట్లను అందించాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ పలు చర్యలు తీసుకుంటోంది.

## గోద్రెజ్ నుంచి మ్యాట్రిక్స్ లాకర్స్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** గోద్రెజ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ తాజాగా మూడు ఉత్పత్తులను ఆవిష్కరించింది. భద్రతాపరంగా మరిన్ని ఫీచర్లు పొందుపర్చిన మ్యాట్రిక్స్ లాకర్లతో పాటు బంగారం, వెండి స్వచ్ఛతను తెలియజేసే యాక్యుగోల్డ్, స్మార్ట్‌ఫాగ్ సెక్యూరిటీ సిస్టమ్ వీటిలో ఉన్నాయి. లాకర్ల ధర రూ. 80,000 నుంచి రూ. 1.5 లక్షల వరకూ, స్మార్ట్‌ఫాగ్ వ్యవస్థ సుమారు రూ. 1.5 లక్ష స్థాయిలో ఉంటుంది. ఎవరైనా బలవంతంగా తెరిచేందుకు ప్రయత్నిస్తే అలారం మోగడంతో పాటు యజమానికి తక్షణం సమాచారం వెళ్లేలా మ్యాట్రిక్స్ లాకర్‌ను తీర్చిదిద్దారు. ఇక పొగను విడుదల చేసి, చోరీ యత్నాలను అడ్డుకునేందుకు స్మార్ట్‌ఫాగ్ సిస్టమ్ ఉపయోగపడుతుందని గురువారమిక్కడ ఉత్పత్తుల ఆవిష్కరణ సందర్భంగా సంస్థ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే తెలిపారు. మరోవైపు, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ. 850 కోట్లుగా ఉండగా.. ఈసారి రూ. 1,000 కోట్లు అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు. తమ ఆదాయంలో దాదాపు 10–12 శాతం వాటా తెలంగాణ మార్కెట్‌ది ఉంటుందని తెలిపారు.

## హైదరాబాద్‌లో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ

- హానర్ హోమ్స్ 'హానర్ సిగ్నాటిస్'
- మొత్తం 3,266 అపార్ట్‌మెంట్లు

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** రియల్టీ రంగ సంస్థ హానర్ ప్రైమ్ హౌజింగ్ హైదరాబాద్‌లో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును ఆవిష్కరించింది. హానర్ సిగ్నాటిస్ పేరుతో హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి మార్గంలో ఐడీఎల్ రోడ్డులో రూ.3,000 కోట్లతో ఈ భారీ నిర్మాణానికి సంస్థ శ్రీకారం చుట్టింది. 27.5 ఎకరాల్లో ఒక్కొక్కటి 25 అంతస్తుల్లో 18 టవర్లు రానున్నాయి. మొత్తం 3,266 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. హానర్ సిగ్నాటిస్ ఇప్పటికే సుమారు 1,300 బుకింగ్స్ నమోదు చేసింది. రెరాకు సమర్పించిన ప్రణాళిక ప్రకారం 9 టవర్లతో కూడిన తొలి దశ ప్రాజెక్టు 2026 డిసెంబరుకల్లా పూర్తి కావాల్సి ఉంది. గడువు కంటే ముందుగా తొలి దశ పూర్తి చేస్తామని ప్రమోటర్-డైరెక్టర్ బాలు చౌదరి వెల్లడించారు. ప్రమోటర్-డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, స్వప్న కుమార్, రాజమౌళితో కలిసి ప్రాజెక్టు విశేషాలను గురువారమిక్కడ మీడియాకు వెల్లడించారు.

**ధర రూ.3 కోట్ల వరకు..**

ఒక్కో అపార్ట్‌మెంట్ 1,695–3,815 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3, 3.5, 4 బీహెచ్‌కే ఆఫర్ చేస్తారు. ధర రూ.1.25 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఉంది. 4 బీహెచ్‌కే అల్ట్రా ప్రీమియం అపార్ట్‌మెంట్స్ కోసం ప్రత్యేకంగా నాలుగు టవర్లు ఏర్పాటు చేస్తారు. 1.31 లక్షల చ.అ.విస్తీర్ణంలో రెండు క్లబ్ హౌజులు ఉంటాయి. వీటిలో 20,000 చ.అ.విస్తీర్ణంలో జిమ్ నెలకొల్పుతారు. రెండు




బ్రౌచర్‌ను ఆవిష్కరిస్తున్న బాలు చౌదరి, రాజమౌళి, వెంకటేశ్వర్లు, స్వప్న కుమార్ (ఎడమ నుంచి)

స్విమ్మింగ్ పూల్స్, సూపర్ మార్కెట్, క్లినిక్, అలాగే లాకర్ సౌకర్యంతో బ్యాంక్ వంటివి రానున్నాయి. ఈవీ చార్జింగ్ స్టేషన్, 5 ఎకరాల పార్క్ అదనపు ఆకర్షణ. స్కూల్ బస్‌లు వచ్చేందుకు వీలుగా ప్రత్యేకంగా రోడ్డు నిర్మిస్తారు. ఐజీబీసీ నుంచి ఈ ప్రాజెక్టు ప్రీ-సర్టిఫైడ్ గోల్డ్ ధ్రువీకరణ అందుకుంది.

**మరో కోటి చ.అ. విస్తీర్ణంలో..**

హానర్ ప్రైమ్ హౌజింగ్ హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రాజెక్టులను 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పూర్తి చేసింది. మూడవ ప్రాజెక్టు హానర్ రిచ్‌మాంట్‌లో భాగంగా 28.4 ఎకరాల్లో 12 లక్షల చ.అ. విస్తీర్ణంలో విల్లాలు నిర్మాణంలో ఉన్నాయి. నాల్గవ ప్రాజెక్టు అయిన హానర్ సిగ్నాటిస్ 78 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటవుతోంది. రానున్న రోజుల్లో మరో ఒక కోటి చ.అ.విస్తీర్ణం జోడించనున్నట్టు కంపెనీ వెల్లడించింది. నాణ్యత, అత్యాధునిక సౌకర్యాలతో హైదరాబాద్ రియల్టీ రంగంలో టాప్-10లో నిలవాలన్న లక్ష్యంతో ఈ రంగంలోకి అడుగు పెట్టినట్టు సంస్థ తెలిపింది.

# నిఫ్టీకి 100 పాయింట్ల నష్టం

- ప్రపంచ ప్రతికూల సంకేతాల ప్రభావం
- బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు

**ముంబై:** చైనా ఆర్థిక మందగమన ఆందోళనలు, అమెరికా వడ్డీరేట్ల పెంపు భయాలతో ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్అండ్‌టీతో పాటు బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో దేశీయ మార్కెట్ రెండు రోజుల ర్యాలీకి గురువారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 35 పాయింట్ల స్వల్ప నష్టంతో 65,504 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 493 పాయింట్లు పతనమై 65,046 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. ఆఖర్లో స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో 388 పాయింట్లు క్షీణించి 65,151 వద్ద స్థిరపడింది. నిఫ్టీ రోజంతా 19,326 – 19,462 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 100 పాయింట్లు నష్టపోయి 19,365 వద్ద నిలిచింది. నష్టాల మార్కెట్లోనూ ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగాల



షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,511 కోట్ల షేర్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.314 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆసియా, యూరప్ మార్కెట్లు 0.5% పైగా నష్టపోయాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు...**

- జీక్యూజీ 8.1% వాటా కొనుగోలుతో అదానీ పవర్ షేరు రాణించింది. బీఎస్ఈలో 3% పెరిగి రూ.287 వద్ద స్థిరపడింది. అలాగే ప్రమోటార్ 1.27% వాటా విక్రయంతో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేరు 4% నష్టపోయి రూ.352 వద్ద స్థిరపడింది.
- ఐఆర్‌ఎఫ్‌సీ షేరు 7% నష్టపోయి రూ.48 వద్ద స్థిరపడింది. కేంద్రం ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) పద్ధతిలో 11% వాటా విక్రయించే ప్రయత్నాలు చేస్తుందనే వార్తలు ఇందుకు కారణం.
- ఎఫ్ఎంసీజీ షేర్ల పతనంలో భాగంగా ఐటీసీ షేరు 2% నష్టపోయి రెండు నెలల కనిష్టం రూ.441 వద్ద ముగిసింది. సెన్సెక్, నిఫ్టీ సూచీలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే.
- భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు గ్లోబల్ ఫుట్‌వేర్ బ్రాండ్ అడిడాస్... బాటా ఇండియాతో వ్యూహాత్మక భాగసామ్య ఒప్పంద చర్చలు జరుపుతుందనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఫలితంగా బాటా ఇండియా షేరు 5% ఎగసి రూ.1734 వద్ద స్థిరపడింది.
- నిఫ్టీ నెక్ట్స్ 50 సూచీ నుంచి ఏసీసీ, నైకా, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, ఇండస్ టవర్స్, పేజ్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లు వైదొలిగాయి. వీటి స్థానంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, ట్రెంట్, టీవీఎస్ మోటార్స్, జైడస్ లైఫ్ సైన్సెస్ సంస్థల షేర్లు చోటు దక్కించుకున్నాయి. ఈ మార్పులు సెప్టెంబర్ 29 నుంచి అమల్లోకి రానున్నాయి.

## కొత్త సర్వీస్ ప్రొవైడర్‌పై జీఎస్‌టీఎన్ కసరత్తు

- కన్సల్టెన్సీ ఎంపిక కోసం బిడ్లకు ఆహ్వానం
- తుది గడువు సెప్టెంబర్ 5

**న్యూఢిల్లీ:** సాంకేతిక సహకారం అందించేందుకు ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌కు ఇచ్చిన కాంట్రాక్టు 2024 సెప్టెంబర్‌తో ముగియనున్న నేపథ్యంలో కొత్త సర్వీస్ ప్రొవైడర్ ఎంపికపై వస్తు, సేవల పన్నుల నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) దృష్టి సారించింది. ఇందుకు సంబంధించిన బిడ్డింగ్ డాక్యుమెంట్లను తయారు చేసే కన్సల్టెన్సీ కోసం అన్వేషణ ప్రారంభించింది. బిడ్డింగ్ ప్రక్రియ, జీఎస్‌టీఎన్ ఐటీ వ్యవస్థను మరో సర్వీస్ ప్రొవైడర్‌కు బదలాయించడం తదితర పనులను సదరు కన్సల్టెన్సీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే ప్రస్తుత వ్యవస్థను మదింపు చేసి తదుపరి కాంట్రాక్టు వ్యవధిలో దాన్ని మరింత మెరుగుపర్చేందుకు తగు మార్గదర్శకాలు రూపొందించాలి. దేశీయంగా ప్రత్యక్ష లేదా పరోక్ష పన్నులు లేక ఇతరత్రా ఆర్థిక సంస్థకు ఐటీ కన్సల్టింగ్ సర్వీసులు అందించడం ద్వారా




గత మూడేళ్లలో సగటున రూ. 30 కోట్ల వార్షిక టర్నోవరు ఉన్న కన్సల్టెన్సీలు ఇందుకు పోటీపడొచ్చని జీఎస్‌టీఎన్ తెలిపింది. బిడ్ల దాఖలుకు ఆఖరు తేదీ సెప్టెంబర్ 5. కొత్త కాంట్రాక్టు 2024 అక్టోబర్ 1 నుంచి ఏడేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చింది. దానికి అవసరమైన సాంకేతిక సేవలు అందించేందుకు 2015లో రూ. 1,320 కోట్ల కాంట్రాక్టును ఇన్ఫోసిస్ దక్కించుకుంది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రిజిస్ట్రేషన్, రిటర్నుల ఫైలింగ్, ఆడిట్ మొదలైన వాటికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఇన్ఫోసిస్ అందిస్తోంది.





## కాంస్య పతకంతో భారత్ బోణీ

ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజే భారత్ పతకాల బోణీ కొట్టింది. అజర్‌బైజాన్ రాజధాని బకూలో గురువారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టుకు కాంస్య పతకం లభించింది. శివా నర్వాల్ (579), సరబ్‌జోత్ సింగ్ (578), అర్జున్ సింగ్ (577)లతో కూడిన భారత జట్టు 1,734 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత క్వాలిఫయింగ్ పోటీల్లో ఆయా దేశాల షూటర్లు సాధించిన పాయింట్ల సగటు ఆధారంగా టీమ్ ఈవెంట్ పతకాలను ఖరారు చేస్తారు. భారత పిస్టల్ షూటర్లెవరూ టాప్-8లో నిలవకపోవడంతో వ్యక్తిగత విభాగం ఫైనల్‌కు అర్హత పొందలేకపోయారు. మరోవైపు హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్, పలక్, దివ్యలతో కూడిన భారత మహిళల పిస్టల్ జట్టు 1,708 పాయింట్లతో 11వ స్థానంలో నిలిచింది.

## అర్జున్ పరాజయం సెమీస్‌లో ప్రజ్ఞానంద




ప్రజ్ఞానంద

**బకూ (అజర్‌బైజాన్):** ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రజ్ఞానంద 5–4తో గెలుపొందాడు. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ టోర్నీ చరిత్రలో సెమీఫైనల్ దశకు చేరిన తొలి భారత ప్లేయర్‌గా ప్రజ్ఞానంద గుర్తింపు పొందాడు. తెలంగాణకు చెందిన 19 ఏళ్ల అర్జున్ కడదాకా పోరాడినా చివరకు తమిళనాడుకు చెందిన 17 ఏళ్ల ప్రజ్ఞానంద ఎత్తులకు చేతులెత్తేశాడు. బుధవారం ఇద్దరి మధ్య రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత స్కోరు 1–1తో సమంగా నిలువడంతో... విజేతను నిర్ణయించేందుకు గురువారం ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ముందుగా 25 నిమిషాల నిడివి గల రెండు గేమ్‌లు ఆడించారు. ఈ రెండూ 'డ్రా' కావడంతో ఇద్దరూ



అర్జున్

2–2తో సమంగా నిలిచారు. అనంతరం 10 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లను ఆడించారు. తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 76 ఎత్తుల్లో గెలుపొందగా... రెండో గేమ్‌లో అర్జున్ 28 ఎత్తుల్లో నెగ్గాడు. దాంతో స్కోరు 3–3తో సమంగా నిలిచింది. ఈ దశలో 5 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు ఆడించారు. ఇందులో తొలి గేమ్‌లో ప్రజ్ఞానంద 31 ఎత్తుల్లో నెగ్గగా... రెండో గేమ్‌లో అర్జున్ 36 ఎత్తుల్లో గెలుపొందడంతో స్కోరు 4–4తో సమంగా నిలిచింది. దాంతో 'సడన్ డెత్ టైబ్రేక్' మొదలైంది. 'సడన్ డెత్'లో తొలుత నెగ్గిన ప్లేయర్‌ను విజేతగా ప్రకటిస్తారు. 'సడన్‌డెత్' తొలి గేమ్‌లోనే ప్రజ్ఞానంద 72 ఎత్తుల్లో అర్జున్‌ను ఓడించి విజేతగా అవతరించాడు. శనివారం జరిగే సెమీఫైనల్స్ తొలి గేముల్లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)... కరువానా (అమెరికా)తో ప్రజ్ఞానంద తలపడతారు.



బొమ్మదేవర ధీరజ్, అతాను దాస్, తుషార్ ప్రభాకర్



సిమ్రన్‌జీత్ కౌర్, అంకిత, భజన్ కౌర్

# భారత్ గురికి రెండు కాంస్యాలు

- రికర్వ్ విభాగంలో రాణించిన భారత ఆర్చరీ జట్లు
- ధీరజ్ బృందానికి మూడో స్థానం

**పారిస్:** ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-4 టోర్నీలో రెండో రోజూ భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. తొలి రోజు బుధవారం కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్ చేరి కనీసం రెండు రజతాలు ఖరారు చేసుకోగా... గురువారం రికర్వ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాయి.

ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు బొమ్మదేవర ధీరజ్‌తో పాటు అతాను దాస్, తుషార్ ప్రభాకర్ షెల్కేలతో కూడిన భారత పురుషుల జట్టు కాంస్య పతక మ్యాచ్‌లో 6–2తో (54–56, 57–55, 56–54, 57–55) స్పెయిన్ జట్టుపై గెలుపొందింది. సెమీఫైనల్లో భారత్ 0–6తో (54–56, 47–58, 55–56) చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతకం కోసం పోటీపడింది. రికర్వ్ ఈవెంట్‌లో మ్యాచ్‌లను 'బెస్ట్ ఆఫ్ ఫోర్ సెట్స్' పద్ధతిలో మ్యాచ్‌ను నిర్వహిస్తారు. సెట్ గెలిచిన జట్టుకు రెండు పాయింట్లు లభిస్తాయి. స్కోరు సమంగా నిలిస్తే రెండు జట్లకు ఒక్కో పాయింట్ వస్తుంది. నాలుగు సెట్‌ల తర్వాత స్కోరు సమమైతే 'షూట్ ఆఫ్' ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

మహిళల టీమ్ రికర్వ్ కాంస్య పతక మ్యాచ్‌లో అంకిత, భజన్ కౌర్, సిమ్రన్‌జీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 'షూట్ ఆఫ్'లో 5–4తో (52–55, 52–53, 55–52, 54–52, 27–25) మెక్సికో జట్టును ఓడించింది. నాలుగు సెట్‌ల తర్వాత రెండు జట్లు 4–4తో సమంగా నిలిచాయి. విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్' నిర్వహించగా... భారత బృందం 27 పాయింట్లు స్కోరు చేయగా... మెక్సికో జట్టు 25 పాయింట్లు చేసి ఓడిపోయింది. అంతకుముందు సెమీఫైనల్లో భారత్ 0–6తో (52–57, 47–56, 52–53) చైనీస్ తైపీ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతకం కోసం ఆడింది.

### సెమీఫైనల్లో జ్యోతి సురేఖ



మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకం రేసులో నిలిచింది. సురేఖ తొలి రౌండ్‌లో 145–131తో పూన్ చియు యి (హాంకాంగ్)పై, రెండో రౌండ్‌లో 148–145తో చెన్ లి జు (చైనీస్ తైపీ)పై, మూడో రౌండ్‌లో 148–145తో హువాంగ్ జు (చైనీస్ తైపీ)పై, క్వార్టర్ ఫైనల్లో 147–144తో డాఫ్నీ క్వింటిరో (మెక్సికో)పై నెగ్గింది. శనివారం జరిగే సెమీఫైనల్లో ఎల్లా గిబ్సన్ (బ్రిటన్)తో సురేఖ ఆడుతుంది. ప్రపంచ చాంపియన్, భారత ప్లేయర్ అదితి క్వార్టర్ ఫైనల్లో 135–148తో ఎల్లా గిబ్సన్ చేతిలో ఓడింది.

## గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్ గెలుపు

**విశాఖ స్పోర్ట్స్:** ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌ల్లో రాయలసీమ కింగ్స్ ఐదు వికెట్ల తేడాతో ఉత్తరాంధ్ర లయన్స్ జట్టును ఓడించగా... గోదావరి టైటాన్స్ 56 పరుగుల తేడాతో వైజాగ్ వారియర్స్ జట్టుపై గెలుపొందింది. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో గోదావరి టైటాన్స్ 20 ఓవర్లలో 191 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (53 బంతుల్లో 80; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు), యారా సందీప్ (38 బంతుల్లో 63; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. అనంతరం వైజాగ్ వారియర్స్ 17.4 ఓవర్లలోనే 135 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఇస్మాయిల్ మూడు వికెట్లు తీశాడు. రాయలసీమ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదట ఉత్తరాంధ్ర లయన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసింది. శ్రీరామ్ వెంకట



రాహుల్

రాహుల్ (31 బంతుల్లో 60; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం రాయలసీమ కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసి గెలిచింది. తన్నీరు వంశీకృష్ణ (34 బంతుల్లో 53; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), గిరినాథ్ రెడ్డి (19 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షేక్ కమరుద్దీన్ (18 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాయలసీమ కింగ్స్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

## 'పసిడి' ప్రియ

**అమ్మాన్ సిటీ (జోర్డాన్):** ప్రపంచ అండర్-20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల 76 కేజీల విభాగంలో భారత రెజ్లర్ ప్రియా మలిక్ స్వర్ణ పతకం సాధించింది. గురువారం జరిగిన ఫైనల్లో ప్రియ 5–0తో లౌరా సెలిన్ క్యుహెన్ (జర్మనీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన డిఫెండింగ్ చాంపియన్ అంతిమ్ పంఘాల్ (53 కేజీలు), సవిత (62 కేజీలు), అంతిమ్ కుందు (65 కేజీలు) కూడా ఫైనల్‌కు చేరడంతో భారత్ ఖాతాలో మరో మూడు స్వర్ణ పతకాలు చేరే అవకాశముంది.



# శుభారంభం లక్ష్యంగా...



- నేడు ఐర్లాండ్‌తో భారత్ తొలి టి20
- ఫామ్‌లో తిలక్‌వర్మ
- కెప్టెన్‌గా బుమ్రా బరిలోకి
- రాత్రి గం.7:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

**డబ్లిన్:** రాబోయే కాలానికి కాబోయే స్టార్లతో ఉన్న టీమిండియా మరో టి20 క్రికెట్ సమరానికి సిద్ధమైంది. ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో నిరూపించుకునేందుకు కుర్రాళ్లు సై అంటున్నారు. ఇందులో భాగంగా నేడు తొలి పోరు జరుగనుంది. 11 నెలలుగా బరిలోకే దిగని బుమ్రా టీమిండియాకు నాయకత్వం వహించనుండటం మరో విశేషం. అయితే స్టార్ల కొరతే సిరీస్‌కు వెలతి! ఇటీవల వెస్టిండీస్‌తో ఆడిన జట్టులో తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్యా అయినా ఉన్నాడు. ఈ సిరీస్‌కు తను కూడా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలాగే విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతమాత్రాన ఈ క్రికెట్ 'షో'కు సోకులేం తక్కువగా లేవు. ఎందుకంటే రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, రింకూ సింగ్, జితేశ్ శర్మ తదితరులంతా ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన వారే! కలగలిపిన ప్రపంచ శ్రేణి బౌలర్లను ఎదుర్కొన్నవారే! ఇప్పుడు మాత్రం ఒక్క ఐర్లాండ్ బౌలర్లతో 'ఢీ' కొట్టేందుకు రెడీ అయ్యారు.

**అందరి కళ్లు బుమ్రా, తిలక్‌లపైనే...**

వెన్ను గాయం, శస్త్ర చికిత్స, పునరావస శిబిరం ఇలా చాన్నాళ్ల తర్వాత 29 ఏళ్ల బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ బరిలోకి దిగుతున్నాడు. ఇదేమో టి20 సిరీస్... భారత్‌లో జరగబోయేది వన్డే వరల్డ్‌కప్... ఎలా చూసుకున్నా పరిమిత ఓవర్లలో బుమ్రా పవర్‌ఫుల్ బౌలర్. ఒకేసారి 10 ఓవర్ల కోటా ఉండే వన్డేల్లో కాకుండా 4 ఓవర్లతో సరిపెట్టుకునే టి20 మ్యాచ్‌లతో ఆడించడం ద్వారా అతనిపై పని ఒత్తిడి లేకుండా బోర్డు జాగ్రత్త పడింది. మరోవైపు అవకాశం వచ్చిన ఐపీఎల్‌లో, బరిలోకి దించిన కరీబియన్ సిరీస్‌లో చెలరేగిన హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మపై కూడా సెలక్టర్లు దృష్టి పడింది. ఈ సిరీస్‌లో వీరిద్దరిపైనే అందరి కళ్లుంటాయనేది వాస్తవం. ఇక ప్రత్యర్థి ఐర్లాండ్ విషయానికొస్తే బల్బిర్నీ సారథ్యంలో జట్టు నిలకడగా రాణిస్తోంది. కుర్రాళ్లన్నా... ఇంకెవరున్నా... టీమిండియాపై గెలుపు వారికి గొప్పదే అవుతుంది. అందుకే సిరీస్ లక్ష్యంగా ఐర్లాండ్ దిగుతోంది.

### టికెట్లు హాట్‌కేకుల్లా...

మైదానంలో భారత జట్టు దిగితే ఏ జట్టుకైనా కాసుల రాశులు కురుస్తాయనే దానికి భారత్, ఐర్లాండ్ టి20 సిరీస్ మరో ఉదాహరణ. టీమిండియా వైపు నుంచి చూస్తే ప్రత్యర్థి పెద్దగా పోటీ జట్టు కాదు. 'హిట్‌మ్యాన్' రోహిత్, బ్యాటింగ్ 'కింగ్' కోహ్లి... అంతెందుకు తాజా తాత్కాలిక కెప్టెన్ హార్దిక్ పాండ్యా కూడా లేడు. అంటే భారత స్టార్లెవరూ బరిలో లేకపోయినా... మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో తొలి రెండు టి20లకు టికెట్లన్నీ అమ్ముడయ్యాయని స్వయంగా ఐర్లాండ్ బోర్డే వెల్లడించింది. 11,500 సీట్ల సామర్థ్యమున్న స్టేడియం 'హౌస్‌ఫుల్' అయ్యింది. అయితే శుక్రవారం డబ్లిన్‌లో భారీ వర్ష సూచన ఉండటంతో మ్యాచ్ సజావుగా సాగుతుందో లేదో వేచి చూడాలి.

## శివానికి రెండు స్వర్ణాలు

**భువనేశ్వర్:** జాతీయ సబ్ జూనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి కర్రా శివాని రెండు బంగారు పతకాలు గెలిచింది. గురువారం జరిగిన గ్రూప్-3 బాలికల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్లో శివాని 1ని:11.83 సెకన్లలో... 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఫైనల్లో శివాని 2ని:43.23 సెకన్లలో అందరికంటే ముందుగా గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లేలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాగిత లాస్యశ్రీ కాంస్య పతకాన్ని సాధించింది.



## క్లుప్తంగా...

### బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ప్రభావంతో రాగల రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి. ఉరుములతో కూడిన జల్లులు, ఒకట్రెండుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

### చంద్రకళ విజయం యువతకు ఆదర్శం

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ

సాక్షి, అమరావతి: సీనియర్ నేషనల్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ సాధించిన ఎస్.చంద్రకళ విజయం యువతకు ఆదర్శమని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ అభినందించారు. గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయం లో చంద్రకళను సత్కరించారు. ఉత్తరాఖండ్‌లోని కాశీపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చంద్రకళ మొత్తం 550 కిలోల బరువు ఎత్తి ఓవర్ ఆల్ ఛాంపియన్‌గా నిలిచిన విషయం విదితమే.

### బాలల న్యాయ చట్టాలను పాఠ్యాంశంగా పెట్టాలి

ప్రభుత్వాన్ని కోరిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

సాక్షి, అమరావతి: బాలల న్యాయ చట్టాలను 8–10వ తరగతి వరకు పాఠ్యాంశంగా పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో కమిషన్ సభ్యులు జంగం రాజేంద్ర ప్రసాద్, త్రివర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతితో చైర్మన్ అప్పారావు గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికుల వ్యవస్థ, నిర్బంధ విద్యా హక్కు చట్టం, బాలలపై లైంగిక వేధింపుల నివారణ, దత్తత, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియాతోపాటు బాలలకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. వీటి వల్ల బాలలకు అవగాహన, చైతన్యం పెరుగుతుందన్నారు.

### తిరుచానూరు ఆలయంలో వర్చువల్ కల్యాణోత్సవం

- ఆన్‌లైన్‌లో టికెట్లు జారీ

తిరుచానూరు (తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి ఆలయంలో ప్రతిరోజు నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవంలో భక్తులు వర్చువల్ విధానంలో పాల్గొనే అవకాశాన్ని కల్పించనున్నట్లు టీటీడీ గురువారం తెలిపింది. ఎస్వీబీసీ చానల్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వర్చువల్ విధానంలో భక్తులు పాల్గొనేందుకు వీలుగా సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ టికెట్లను టీటీడీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. రూ.500 చెల్లించి టికెట్ కొనుగోలు చేయవచ్చు. ఈ టికెట్లు పొందిన భక్తులకు టికెట్ పొందిన తేదీ నుంచి 90 రోజుల్లోపు అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. వీరికి ఒక ఉత్తరీయం, రవిక, లడ్డూ, వడ బహుమానంగా ఇస్తారు. సుదూర ప్రాంతాల నుండి తిరుచానూరు వచ్చి అమ్మవారి కల్యాణోత్సవంలో పాల్గొన లేని భక్తుల కోసం వర్చువల్ కల్యాణోత్సవం ప్రవేశపెట్టినట్టు టీటీడీ తెలిపింది.

### రైలు హైజాక్‌కు యత్నం

- తమిళనాడులో ఘటన

సాక్షి, చెన్నై: చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు వెళ్తున్న ఎలక్ట్రిక్ రైలును ఓ యువకుడు హైజాక్ చేయడానికి ప్రయత్నించాడు. లోకో పైలట్ అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. బీచ్ నుంచి చెంగల్పట్టుకు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఎలక్ట్రిక్ రైలు బయలుదేరి వెళ్లింది. మార్గమధ్యంలోని పనయూరుస్టేషన్ దాటగానే రైలు పట్టాలకు అడ్డంగా ఓ యువకుడు నిలబడడంతో లోకో పైలట్ శిఖామణి అప్రమత్తమై రైలును ఆపేశాడు. హఠాత్తుగా ఆ యువకుడు ఆయుధంతో లోకో పైలట్‌పై దాడి చేయడం మొదలెట్టాడు. దీంతో ఆయన రైలును లాక్ చేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. వెంటనే ఆ యువకుడు లోకో పైలట్ గదిని తన ఆధీనంలోకి తీసుకుని లోపలి వైపు గడియ పెట్టాడు. అయితే, లోకో పైలట్ ముందుగానే రైలును లాక్ చేయడంతో ముందుకు కదలని పరిస్థితి. వెంటనే రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు అరియలూరుకు చెందిన ఎంసీఏ పట్టభద్రుడు సురేష్ అని తెలిసింది. సిరుచ్చేరి ఐటీ పార్క్‌లో ఓ సంస్థలో పనిచేస్తున్న ఇతను, రైలును నడపాలన్న అత్యుత్సాహంతో వ్యవహరించి కటకటాలపాలయ్యాడు.

### ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించండి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 వల్ల ఉపాధ్యాయులపై పెరిగిన పని భారాన్ని తగ్గించాలని కోరుతూ గురువారం ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయి శ్రీనివాస్ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ పోస్టుల రద్దుతో సమస్య ఏర్పడిందని, ఒక్కొక్కరు వారానికి 42 పీరియడ్లు బోధించాల్సి వస్తోందన్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 5 పీరియడ్లే బోధించేలా ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని కోరారు.

# త్వరలో గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్లు

- 2020 అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- 220 జూనియర్ లెక్చరర్లు
- డిగ్రీ కాలేజీల లెక్చరర్లు, డిప్యూటీ డీఈవో తదితర 1,199 పోస్టుల భర్తీకి కూడా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో గ్రూప్–1, గ్రూప్–2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తామని ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ తెలిపారు. విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్లకు సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. గ్రూప్–1, గ్రూప్–2లే కాకుండా డిగ్రీ కాలేజీ లెక్చరర్లు, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు (డీఈవో), ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు, లైబ్రేరియన్లు తదితరాలు కలిపి 1,199 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. వీటితోపాటు 2020 అసిస్టెంట్ ప్రొఫెసర్, 220 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ ఇవ్వనున్నామని వెల్లడించారు. 17 ఏళ్ల తర్వాత ఈ పోస్టుల భర్తీ చేపడుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో గ్రూప్–2 పరీక్షల సిలబస్, పరీక్ష విధానంలోనూ మార్పులు చేస్తున్నామన్నారు. పాత సిలబస్ పూర్తిగా డూప్లికేషన్‌తో ఉందని.. దీన్ని మార్చాలని అభ్యర్థుల నుంచి వినతులు వచ్చాయన్నారు. గ్రూప్–2లో గతంలో మూడు



మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్

పేపర్లుండగా ఇప్పుడు రెండు పేపర్లుగా మార్చామని తెలిపారు. కొత్త నోటిఫికేషన్లు వెలువడనున్న నేపథ్యంలో అభ్యర్థులు విజయం సాధించేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. ఏపీపీఎస్సీ పరీక్షలను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు గతంలో లాగా లోపాలు తలెత్తకుండా అంతర్గత కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

#### నాలుగేళ్లలో ఏపీపీఎస్సీ ద్వారా 1,31,364 పోస్టుల భర్తీ

కాగా గత నాలుగేళ్లలో ఏపీపీఎస్సీ ద్వారా 1,31,364 పోస్టులను భర్తీ చేశామని గౌతమ్ సవాంగ్ తెలిపారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో పోస్టుల భర్తీ జరగలేదని గుర్తు చేశారు. వీటిలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి 1,26,728 పోస్టులను భర్తీ చేశామన్నారు. మీడియా సమావేశంలో ఏపీపీఎస్సీ సభ్యులు సలాంబాబు, సుధీర్, సెలీనా, శంకరరెడ్డి, కార్యదర్శి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

#### ఏపీపీఎస్సీ పరీక్షల షెడ్యూళ్లు విడుదల

కాగా రాష్ట్రంలో వివిధ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్షల షెడ్యూళ్లను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, నాన్ గెజిటెడ్ పోస్టుల పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ ప్రకటన విడుదల చేశారు.

| పోస్టు | పేపర్–1 | సబ్జెక్టు పేపర్ |
|---|---|---|
| ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ | సెప్టెంబర్ 25 | సెప్టెంబర్ 25, 26, 27 |
| సివిల్ అసిస్టెంట్ సర్జన్ | అక్టోబర్ 3 | సెప్టెంబర్ 27 |
| టెక్నికల్ అసిస్టెంట్స్ (ఏపీ గ్రౌండ్‌వాటర్) | అక్టోబర్ 3 | సెప్టెంబర్ 27 |
| అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్(ఫిషరీస్) | అక్టోబర్ 3 | సెప్టెంబర్ 27 |
| ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ | అక్టోబర్ 3 ఉదయం | అక్టోబర్ 3 మధ్యాహ్నం |
| ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ | అక్టోబర్ 3 | అక్టోబర్ 4 |
| గ్రూప్ 4 సర్వీసులు | అక్టోబర్ 3 | అక్టోబర్ 4 |
| జూనియర్ ట్రాన్స్‌లేటర్ (తెలుగు) | అక్టోబర్ 3 | అక్టోబర్ 5 |
| టెక్నికల్ అసిస్టెంట్స్ (మైన్స్) | అక్టోబర్ 3 | అక్టోబర్ 5 |
| గ్రేడ్ 2 ప్రొబేషన్ ఆఫీసర్ (జువైనల్ వెల్ఫేర్) | అక్టోబర్ 3 | అక్టోబర్ 5 |
| అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ | అక్టోబర్ 6 | అక్టోబర్ 6 |

### ఎంబీబీఎస్ ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ కోర్సులలో ప్రైవేట్ వైద్య కళాశాలల్లో యాజమాన్య కోటా సీట్లలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసింది. దీంతోపాటు ఈ ఏడాది కొత్తగా ప్రారంభిస్తున్న 5 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. విద్యార్థులు తమ అభ్యంతరాలు, వినతులను https://ugmq.ysruhs.com/ Grievance/ index. php వెబ్సైట్ లో శుక్రవారం సాయంత్రం 4 గంటలలోగా నమోదు చేయాల్సి ఉంటుంది. గడువు ముగిసిన అనంతరం నమోదు చేసిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోబోమని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

# గ్రూప్–1 ఫైనల్ ఫలితాలు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన ఒక పోస్టుకు ఎంపికపై క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నుంచి నివేదిక రావాల్సి ఉంది.

**పోటీపడ్డ ఉన్నత విద్యావంతులు..**

మొత్తం 111 పోస్టులకు గాను 110 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయగా వారిలో పురుషులు 59 మంది (53.6 శాతం) మహిళలు 51 (46.4 శాతం) మంది ఉన్నారు. టాప్ 10 ర్యాంకుల్లో ఆరుగురు మహిళలుండగా నలుగురు పురుషులున్నారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన 220 మందిలో ఎక్కువ మంది ఉన్నత విద్యావంతులే. వీరిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) మెయిన్స్ రాసిన వారు 32 మంది ఉండగా ఇంటర్వ్యూల వరకు వెళ్లిన వారు 13 మంది ఉన్నారు. విద్యార్హతల పరంగా చూస్తే.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) వంటి జాతీయ ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన వారు 35 మంది ఉన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలను, ఇంటర్వ్యూలను అత్యంత పకడ్బందీగా ఏపీపీఎస్సీ నిర్వహించింది. ఇంటర్వ్యూ బోర్డులో ఇద్దరు అఖిల భారత సర్వీస్ అధికారులు, సబ్జెక్టు నిపుణులు, వైస్ చాన్సలర్లు, ఐఐటీ, ఐఐఎం తదితర అత్యున్నత సంస్థల ప్రముఖులను సభ్యులుగా చేర్చింది. అత్యున్నత ప్రమాణాలతో ఎంపికలు జరిగి రాష్ట్రానికి ఉత్తమ సేవలు అందించేలా తుది ఎంపికలను పూర్తి చేసింది.

**మెయిన్స్ పరీక్షలకు 6,455 మంది ఎంపిక..**

గ్రూప్–1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ గతేడాది సెప్టెంబర్ 30న నోటిఫికేషన్ వెలువరించింది. మొత్తం 1,26,450 మంది దరఖాస్తు చేయగా జనవరి 8న నిర్వహించిన ప్రిలిమ్స్‌కు 86,494 మంది హాజరయ్యారు. ప్రిలిమ్స్ ఫలితాలను కేవలం 19 రోజుల్లోనే కమిషన్ వెల్లడించింది. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 6,455 మందిని ఎంపిక చేసింది. జూన్ 6 నుంచి 10 వరకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలకు 4,688 మంది హాజరయ్యారు. ఈ పరీక్షల మూల్యాంకనాన్ని అత్యంత పారదర్శకంగా 34 రోజుల్లోనే ఏపీపీఎస్సీ పూర్తి చేయించింది. జూలై 14న మెయిన్స్ ఫలితాలను విడుదల చేసింది. వీరిలో 220 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. ఆగస్టు 2 నుంచి 11 వరకు మూడు బోర్డులతో వీటిని నిర్వహించింది.

**భర్తీ అయిన పోస్టులు..**

| | |
|---|---|
| డిప్యూటీ కలెక్టర్ | 13 |
| సీటీవో | 13 |
| డీఎస్పీ (సివిల్) | 13 |
| డీఎస్పీ (జైళ్లు) | 2 |
| డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ | 2 |
| ఏటీవో | 11 |
| ఆర్టీవో | 2 |
| ఎంపీడీవో | 16 |
| డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ | 3 |
| డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ | 1 |
| బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ | 3 |
| మున్సిపల్ కమిషనర్ | 6 |
| ఏవో | 18 |
| డిప్యూటీ రిజిస్ట్రార్ (కోపరేటివ్) | 1 |
| అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ | 5 |
| అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ | 1 |

**టాపర్స్ ఇలా..**

**పేరు: గణేశ్న భాను శ్రీలక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష**
విద్యార్హత: గ్రాడ్యుయేషన్, ఢిల్లీ యూనివర్సిటీ
స్వస్థలం: సీసలి, కాళ్ల మండలం, పశ్చిమ గోదావరి
తండ్రి: వెంకట రామాంజనేయులు ( ప్రభుత్వ ఉపాధ్యాయుడు, డీఈవో కార్యాలయంలో ఏపీవో)
➡ భాను శ్రీలక్ష్మీ అన్నపూర్ణ ప్రత్యూష గ్రూప్–1లో మొదటి ర్యాంకు సాధించారు. ఢిల్లీ యూనివర్సిటీలోని లేడీ శ్రీరామ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ప్రిలిమ్స్ పూర్తిచేసి సెప్టెంబర్ 15 నుంచి జరగనున్న మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్టు తండ్రి రామాంజనేయులు తెలిపారు.

**పేరు: భూమిరెడ్డి పావని**
విద్యార్హత: బీటెక్ (ఈసీఈ)
తండ్రి: భూమిరెడ్డి గంగయ్య (రైతు)
తల్లి: లక్ష్మీదేవి
స్వస్థలం: మైదుకూరు, వైఎస్సార్ జిల్లా
➡ పావని గ్రూప్–1 ఫలితాల్లో 2వ ర్యాంకు సాధించారు. 2016 నుంచి హైదరాబాద్‌లో గ్రూప్స్‌కి సన్నద్ధమవుతున్నారు. 2016, 2017లో గ్రూప్–2 మెయిన్స్‌వరకు వెళ్లారు. 2018లో గ్రూప్–1 ఇంటర్వ్యూ వరకు వెళ్లగలిగారు. తల్లిదండ్రులు, సోదరి భాగ్య, సోదరుడు గణేష్ సహకారంతో కష్టపడి చదివి ఈసారి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు.

**పేరు: కె.లక్ష్మీప్రసన్న**
విద్యార్హత: బీటెక్ (ఐటీ) 2013, రాజంపేట
స్వస్థలం: టంగుటూరు గ్రామం, అన్నమయ్య జిల్లా
భర్త: పి.చంద్రదీప్ (పంచాయతీ సెక్రటరీ)
తండ్రి: కె.సుబ్బారాయుడు (ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్)
తల్లి: సరస్వతి
➡ లక్ష్మీ ప్రసన్న గ్రూప్–1 ఫలితాల్లో 3వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆమె టీవీ పురం పంచాయతీలో గ్రామ–వార్డు సచివాలయ వ్యవస్థలో పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నారు. 2014 నుంచి సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు.

**పేరు: కుప్పిరెడ్డి ప్రవీణ్ కుమార్‌రెడ్డి**
విద్యార్హత: బీటెక్ (ఈఈఈ), 2009, మదనపల్లె
స్వస్థలం: ప్రొద్దుటూరు, వైఎస్సార్ జిల్లా తండ్రిపేరు: కేసీ వెంకటరెడ్డి (డీసీసీబీ రిటైర్డ్ సూపర్‌వైజర్) తల్లి: కె.రామసుబ్బమ్మ
➡ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గ్రూప్–1 ఫలితాల్లో 4వ ర్యాంకు సాధించారు. ఆయన 2018లో గ్రూప్–1 నోటిఫికేషన్‌లో పరీక్ష రాయగా.. 2022లో రిజల్ట్స్ వచ్చాయి. 47వ ర్యాంకు సాధించగా.. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా సెలక్టయ్యారు. కానీ.. 2018లోనే గ్రూప్–2 పరీక్ష రాయగా.. 2020లో వెలువడిన ఫలితాల్లో 11వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికై ప్రస్తుతం మదనపల్లెలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. అంతకు ముందు ఎనిమిదేళ్లు ఒరాకిల్ టెక్నాలజీస్ అండ్ ఇన్ఫోసిస్ టెక్నాలజీస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేశారు. 2018 నాటి గ్రూప్–1 ఫలితాలు 2022లో వెలువడే నాటికే ఆయన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరిపోవడంతో.. మరింత మెరుగైన ర్యాంకు కోసం శ్రమించారు.

# టీడీపీ విధ్వంసాన్ని తీవ్రంగా పరిగణించాలి

**అంగళ్లు, పుంగనూరు విధ్వంసం వంటి ఘటనలు సమాజానికే ప్రమాదకరం**

- వీటిని అడ్డుకోకుంటే విధ్వంసాన్ని ప్రోత్సహించినట్లవుతుంది
- హత్యాయత్నం కేసుకు ఉద్దేశం సరిపోతుంది.. గాయపరచక్కరలేదు
- చంపండిరా అంటూ చంద్రబాబు కార్యకర్తలను ఉసిగొల్పారు
- అందుకే ఆయనపై హత్యాయత్నం కేసు
- పిటిషనర్లకు బెయిల్ మంజూరు చేయవద్దు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- చంద్రబాబు తదితరులపైనే అధికార పార్టీ నేతలు రాళ్లు విసిరారు
- ఏ షరతులు విధించినా లోబడి ఉంటాం.. ముందస్తు బెయిల్ ఇవ్వండి
- హైకోర్టును అభ్యర్థించిన టీడీపీ నేతల న్యాయవాదులు
- వాదనలు పూర్తి.. తీర్పు వాయిదా



సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లు, చిత్తూరు జిల్లా పుంగనూరుల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఇతర నేతల ప్రోద్బలంతో జరిగిన విధ్వంసాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. సమాజానికే ప్రమాదం కలిగించే ఇలాంటి ఘటనలను అడ్డుకోకుంటే విధ్వంసాన్ని ప్రోత్సహించినట్లవుతుందని అన్నారు. ఇలాంటి వ్యక్తులు, ఘటనల వల్ల సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని తెలిపారు. అంతిమంగా ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దౌర్జన్యం చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. అంగళ్లులో విధ్వంసం కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ సీనియర్ నేతలు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, పులివర్తి నాని దాఖలు చేసిన వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి గురువారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏఏజీ వాదనలు వినిపిస్తూ.. చట్ట ప్రకారం ఓ వ్యక్తిపై హత్యాయత్నం (ఐపీసీ సెక్షన్ 307) కేసు నమోదు చేయాలంటే అతను మరొకరిని గాయపరచాల్సిన అవసరం లేదని, చంపాలన్న ఉద్దేశం ఉంటే సరిపోతుందని వివరించారు. అంగళ్లులో చంద్రబాబు తరమండిరా.. చంపండిరా.. అంటూ తన పార్టీ కార్యకర్తలను అధికార పార్టీ నేతలపై, సామాన్యులపై ఉసిగొల్పారన్నారు. టీడీపీ కార్యకర్తల దాడిలో అధికార పార్టీకి చెందిన వారే కాక సామాన్యులు కూడా గాయపడ్డారన్నారు. అందుకే చంద్రబాబు, ఇతర నేతలపై పెట్టిన హత్యాయత్నం కేసు చెల్లుబాటవుతుందని వివరించారు. అన్నమయ్య జిల్లాలోని ప్రజలకు ఎంతో ముఖ్యమైన పిచ్చివాండ్లపల్లి ప్రాజెక్టుపై టీడీపీ నేతలు కొందరు స్టే తెచ్చారని, దీంతో ప్రాజెక్టును అడ్డుకోవద్దంటూ చంద్రబాబును అభ్యర్థించేందుకే అధికార పార్టీ నేతలు ప్రయత్నించారన్నారు. టీడీపీ నేతల విధ్వంసానికి స్పష్టమైన ఆధారాలున్నాయని చెప్పారు. విధ్వంస ఘటనల వీడియో ఉన్న పెన్‌డ్రైవ్‌ను ఆయన కోర్టుకు సమర్పించారు. పులివర్తి నానిపై 16 కేసులు ఉన్నాయన్నారు. ముందస్తు వ్యూహంలో భాగంగా యుద్ధభేరిలో పాల్గొన్న నేతలందరూ వారి నియోజకవర్గాల నుంచి మనుషులను తెచ్చుకుని, విధ్వంసం సృష్టించారన్నారు. అంగళ్లు నుంచి పుంగనూరు వరకు అప్రతిహతంగా విధ్వంసం కొనసాగించారని వివరించారు. ఈ సందర్భంగా పలువురు సాక్షుల వాంగ్మూలాలను చదివి వినిపించారు. పిటిషనర్లకు బెయిల్ ఇస్తే ఏదైనా చేసి బెయిల్ తెచ్చుకోవచ్చన్న భావన ప్రజల్లో ఏర్పడుతుందన్నారు. అందువల్ల బెయిల్ మంజూరు చేయవద్దని కోరారు.

అనంతరం టీడీపీ నేత ఉమామహేశ్వరరావు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్‌రెడ్డి తరఫున న్యాయవాది ఎన్వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తులో జోక్యం చేసుకోబోమని, విచారణ నుంచి పారిపోబోమని, ఏ షరతులు విధించినా లోబడి ఉంటామని తెలిపారు. ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరారు. అంగళ్లు, పుంగనూరులో జరిగిన ఘటనలు వేర్వేరని, రెండింటినీ కలిపి పెద్దదిగా చిత్రీకరిస్తున్నారని వివరించారు. అధికార పార్టీ నేతలే చంద్రబాబు తదితరులపై రాళ్లు రువ్వారని చెప్పారు. వారి దాడిలో టీడీపీ నేతలు, కార్యకర్తలే గాయపడ్డారని తెలిపారు. పిచ్చివాండ్లపల్లి ప్రాజెక్టుపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి తీర్పును వాయిదా వేశారు. తీర్పు వెలువరించేంత వరకు పిటిషనర్లను అరెస్ట్ చేయకుండా పోలీసులకు తగిన సూచనలు ఇవ్వాలని ఏఏజీకి స్పష్టం చేశారు. ఆయుధ చట్టం కింద నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో కూడా న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

# సర్పం కాదు... మత్స్యమే!



ఈ చిత్రంలో మత్స్యకారుడి చేతిలో కనిపిస్తున్నది పాము అని అనుకునేరు. చూడడానికి గిరినాగులా కనిపిస్తున్నా.. సముద్రంలో లభ్యమయ్యే 'ఈల్ ఫిష్' ఇది. దీనికి కోల్‌కత, ముంబైలో భారీ డిమాండ్ ఉంది. 15 అడుగుల పైగా ఉన్నా ఈ చేపను కాకినాడ జిల్లా కేంద్రంలోని కుంభాభిషేకం రేవు వద్ద మత్స్యకారులు గురువారం విక్రయించారు.

– కాకినాడ రూరల్

### దోపిడీదారుల అధిపతి చంద్రబాబు

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



శ్రీరంగరాజపురం(చిత్తూరు జిల్లా): దోపిడీదారులకు, వెన్నుపోటు, భూకబ్జా, అవినీతి, పెత్తందారులకు అధిపతి చంద్రబాబు నాయుడు అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి విమర్శించారు. శ్రీరంగరాజపురంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరులో జరిగిన ఘటనకు సూత్రధారి, కర్త, కర్మ మొత్తం చంద్రబాబునాయుడు కనుసన్నల్లోనే జరిగాయన్నారు. పోలీసులను చంపాలన్న కుట్ర, వాహనాలను తగులబెట్టడం, టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులపైకి ఉసిగొల్పడం, రాష్ట్రంలో అలజడులు సృష్టించాలన్నా నీచమైన ఆలోచన చంద్రబాబుకే వస్తుందన్నారు. అధికారం కోసం ఎవరినైనా చంపడానికి చంద్రబాబు ముందు వరుసలో ఉంటారన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనేదే సీఎం జగన్ ఆకాంక్ష అని చెప్పారు. చంద్రబాబుకు తోడుగా ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు, ఎల్లో మీడియా అందరూ ఒక్కటయ్యారని చెప్పారు.

### అసలైన పెత్తందారులు బాబు, రామోజీ


ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



సాక్షి,అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, 'ఈనాడు' రామోజీరావు అసలైన పెత్తందారులని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఆయన గురువారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ '2024 ఎన్నికల తర్వాత టీడీపీ ఉండదు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని టైమ్స్ నౌ సర్వేలో మరోసారి స్పష్టమైంది. దీంతో చంద్రబాబులో వణుకు ప్రారంభమైంది. రామోజీకి నిద్రపట్టడం లేదు. అందువల్లే చంద్రబాబుకు మైలేజీ కోసం రామోజీ దిగజారుడు రాతలు రాస్తున్నారు. రామోజీరావు పక్కా వైట్‌కాలర్ క్రిమినల్. చేసిన పాపాలకు రామోజీకి కష్టాలు ప్రారంభమయ్యాయి. రామోజీరావు, చంద్రబాబులే నిజమైన పెత్తందారులు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారు. వీరందరికీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు' అని ఇజ్రాయిల్ చెప్పారు.

# తెచ్చిన వారితో నచ్చిన తీరుతో జనవాణి

- ఎంపిక చేసుకున్న వారితోనే కార్యక్రమం
- స్టీల్‌ప్లాంట్‌పై నోరుమెదపని పవన్



దొండపర్తి: ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామంటూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్వహించిన జనవాణి కార్యక్రమం ప్రభుత్వంపై నిందలకే పరిమితమైంది. ఒక్క సమస్యనూ ఎలా పరిష్కరిస్తారో చెప్పలేదు. బాధితులకు భరోసా కూడా ఇవ్వలేదు. గురువారం విశాఖలోని దసపల్లా హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమం మొత్తం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కాకుండా, జనసేన నేతలకు నచ్చిన విధంగా నిర్వహించారు. ముందుగా ఎంపిక చేసి తెచ్చిన వారితోనే వినతులు ఇప్పించారు. వారి సమస్యలకూ పవన్ పరిష్కారం చూపకుండా ప్రతిదానికీ ప్రభుత్వంపై నిందలేశారు. ఉదయం 10 గంటలకు రావాల్సిన పవన్ 11.30కు వచ్చారు. ముందుగా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన ఐదుగురు జనసేన కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున చెక్కులు అందజేశారు. అనంతరం కొందరు భూ సమస్యలు వివరించగా.. ఉత్తరాంధ్రలో భూములను వైఎస్సార్‌సీపీ నేతలు దోచుకున్నారంటూ ఏవేవో ఆరోపణలు చేశారు. తమ కుమార్తె రెండేళ్లుగా కనిపించడంలేదని మడిగట్ల శ్రీనివాస్ దంపతులు చెప్పగా.. రాష్ట్రంలో 30 వేల మంది అమ్మాయిలు కనిపించడంలేదని ఇప్పటికే చెప్పానని అన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ ఘటన తర్వాత వైద్య పరీక్షలు చేయడంలేదని కొందరు చెప్పగా.. ఎల్‌జీ పాలిమర్స్ బాధితులకే న్యాయం చేయలేని ముఖ్యమంత్రి జగన్.. విశాఖను రాజధాని ఎలా చేస్తారని ప్రశ్నించారు. తమను ఆదుకోవాలని కొందరు దివ్యాంగులు కోరగా.. మన ప్రభుత్వం వస్తే కూర్చోబెట్టి పోషిస్తానని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ లాభాల్లోకి వచ్చేందుకు ఉన్న అవకాశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పడానికి వచ్చిన స్టీల్ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రతినిధులకు పవన్ ఎటువంటి భరోసా ఇవ్వలేదు. సెయిల్‌లో విలీనం సహా ప్లాంట్ లాభాల్లోకి వచ్చే అంశాలను వారు వివరిస్తుండగానే పవన్ అడ్డుకొన్నారు. దీనిపై తరువాత చర్చిద్దామంటూ పంపేశారు.

యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మినిమం టైం స్కేల్ అమలు చేయడంలేదని కొందరు వినతిపత్రం ఇవ్వగా.. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో ప్రక్షాళన జరగాలని పవన్ అన్నారు. ఈ ప్రభుత్వం మళ్లీ వచ్చే పరిస్థితులు లేవన్నారు. ఆంధ్రా వర్సిటీ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంగా మారిపోయిందని, దీనిని హెచ్ఆర్‌డీ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. గంగవరం పోర్టు జీతాలపై కొందరు కార్మికులు వినతిపత్రం ఇవ్వగా ఈ అంశాన్ని ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడి పెద్దల దృష్టికి తీసుకెళ్తానన్నారు. దివిస్, హెటిరో కంపెనీలపై ఫిర్యాదులు రాగా.. ఉత్తరాంధ్ర కాలుష్యంతో నిండిపోయిందని, ఈ సమస్యను పరిష్కరించలేని జగన్.. విశాఖను రాజధానిగా ఏం చేస్తారని విమర్శించారు. అనేక మంది వినతులు ఇచ్చేందుకు వచ్చినప్పటికీ మరోసారి జనవాణి నిర్వహిస్తామని చెప్పి పంపించేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శుక్రవారం : 18 : ఆగస్టు : 2023


## ట్యాంకర్‌తో తంటా






ధార్వాడ వద్ద హైవే అండర్‌పాస్ కింద ఇరుక్కున్న గ్యాస్ ట్యాంకర్, అధికారులు శ్రమించి దానిని బయటకు తీశారు. ఈ సందర్భంగా హైవేను బంద్ చేసిన దృశ్యం

## న్యూస్‌రీల్

### 15 రోజుల పాటు మెట్రోలో అంతరాయం



**బనశంకరి:** బెంగళూరులో పర్పుల్ లైన్ మెట్రో రైలు సేవల్లో గురువారం నుంచి 15 రోజుల పాటు అంతరాయం ఏర్పడింది. గురువారం కెంగేరి, మైసూరు రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య మెట్రో రైళ్లు సంచరించలేదు. పర్పుల్ లైన్ మార్గమైన కెంగేరి, చల్లఘట్ట, బయప్పనహళ్లి, కృష్ణరాజపుర మెట్రోస్టేషన్ల మధ్య సిగ్నలింగ్ వ్యవస్థ పనుల వల్ల 15 రోజుల పాటు మెట్రోసేవల్లో అంతరాయం ఉంటుంది. మైసూరురోడ్డు, బయప్పనహళ్లి మెట్రోస్టేషన్లలో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రైళ్లు నడుస్తాయి. 23, 24 తేదీల్లో కెంగేరి, మైసూరు రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య ఉదయం 7 గంటల వరకు మెట్రో రైళ్లు తిరగవు. ఈ సమయంలో మైసూరు రోడ్డు, స్వామి వివేకానంద రోడ్డు మెట్రోస్టేషన్ మధ్య మాత్రమే సర్వీసులుంటాయి. ఇంకా పలు స్టేషన్లలో మార్పులు చేర్పులు ఉంటాయని మెట్రో వర్గాలు తెలిపాయి.

### ఉపేంద్రకు మళ్లీ ఊరట

**యశవంతపుర:** వివాదాస్పద వ్యాఖ్యల కేసుల్లో నటుడు ఉపేంద్రకు ఉపశమనం దొరికింది. బెంగళూరు హలసూరు గేటు పోలీసుస్టేషన్‌లో దాఖలైన కేసుపై కూడా హైకోర్టు స్టే విధించింది. ఆయన పిటిషన్ మేరకు వాదనలు ఆలకించిన కోర్టు, హలసూరు గేటు, సీకే అచ్చుకట్టు స్టేషన్‌లో దాఖలైన రెండు కేసుల్లో చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. ఉపేంద్ర వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు, ఆ వీడియోలను తొలగించారని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

### కలబురిగిలో లాకప్ డెత్?


**యశవంతపుర:** కలబురిగిలో లాకప్ డెత్ జరిగింది. పట్టణంలోని అశోకనగర పోలీసుస్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. కలబురగి తాలూకా సిరసగిమడ్డికి చెందిన ఉదయకుమార పరదిని దొంగతనం కేసులో విచారణ కోసం గురువారం ఉదయం తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఫోన్ చేసి ఆస్పత్రిలో ఉన్నాడని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. పోలీసులు కొట్టడం వల్ల ఉదయకుమార్ చనిపోయాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.



మృతుడు ఉదయ కుమార్ (ఫైల్)

### కావేరి నీళ్లు.. సెగలు

- తమిళనాడుకు విడుదల చేయరాదని రైతుల ధర్నా



గురువారం మండ్య కేఆర్ఎస్ డ్యాం నుంచి పరుగులు తీస్తున్న కావేరి జలాలు



కేఆర్ఎస్ డ్యాం వద్ద రైతుల ఆందోళన

**మండ్య:** మండ్యలో ఉన్న కృష్ణరాజసాగర జలాశయం నుంచి తమిళనాడుకు కావేరి నీటిని వదలడాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం కార్యకర్తలు గురువారం మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు భారీగా తరలివచ్చి ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీటి విడుదలను తక్షణం నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయాధారిత మండ్య జిల్లాలో రైతుల పంటలకు సరైన సమయంలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం, కాలువల ద్వారా నీటిని వదలాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది సరిగా వర్షాలు పడకపోవడంతో కేఆర్ఎస్ జలాశయం పూర్తిగా నిండలేదని, మునుముందు రోజుల్లో బెంగళూరు నగరంతో పాటు జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య వస్తుందని అన్నారు.

మరోవైపు ఒప్పందం ప్రకారం కేఆర్ఎస్ నుంచి తమిళనాడుకు నిర్ణీత మొత్తంలో నీటి విడుదల కొనసాగుతోంది. కొన్ని గేట్లు ఎత్తి నీటిని పంపుతున్నారు. డ్యాం వద్ద కూడా రైతులు ధర్నా చేశారు. గొడవలు జరగకుండా డ్యాం పరిసరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటైంది.

# అక్రమాస్తులపై పంజా

- 10 మంది అధికారులపై లోకాయుక్త మెరుపు దాడులు
- భారీగా నగదు, బంగారం పట్టివేత
- కోట్ల రూపాయల ఆస్తుల గుర్తింపు





బీదర్ జిల్లాలో కానిస్టేబుల్ విజయకుమార్ ఇంట్లోని కారులో అధికారుల తనిఖీలు, ఈ సోదాల్లో పట్టుబడిన నోట్ల కట్టలు

**బనశంకరి:** ఇంకా తెల్లవారకుండానే రహస్యంగా చేరుకున్న లోకాయుక్త అధికారులు.. లంచగొండ్లకు ముచ్చెమటలు పట్టించారు. అవినీతి ఆరోపణ లున్న అధికారులపై లోకాయుక్త పంజా విసిరింది. వీరిలో కానిస్టేబుల్ నుంచి అదనపు కలెక్టర్ వరకూ ఉన్నారు. గురువారం వేకువనుంచి బెంగళూరు, బెంగళూరు గ్రామాంతర, కొప్పళ, రామనగర, తుమకూరు, చిక్కబళ్లాపుర, దావణగెరె, కొడగు, ధార్వాడ, బీదర్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 50 చోట్ల మెరుపు దాడులు నిర్వహించారు. భారీగా లంచాలు తీసుకుంటూ పోగేసుకున్న అక్రమాస్తులు ఈ దాడుల్లో బయటపడ్డాయి.

**ఎక్కడెక్కడ సోదాలు..**

- మొత్తం 10 మంది అధికారులపై దాడులు నిర్వహించారు. ఒక్కో అధికారి వద్ద సగటున రూ. 3 కోట్లకు పైగా లెక్క తేలని ఆస్తులు కనుగొన్నట్లు లోకాయుక్త వర్గాలు తెలిపాయి.
- కొడగు జిల్లా అదనపు కలెక్టర్ నంజుండేగౌడ, హారంగి జలాశయ అదనపు ఇంజనీర్ రఘుపతి నివాసాల్లో సోదాలు నిర్వహించారు. నంజుండేగౌడ నివాసం, కార్యాలయం, మైసూరులోని బంధువుల నివాసాల్లో భారీగా ఆస్తులను గుర్తించారు. ఇంజనీర్ రఘుపతికి మైసూరులో ఉన్న బృహత్ బంగ్లాలో సోదాలు జరుగుతున్నాయి.
- బెళగావి మహానగర పాలికె రెవెన్యూ అధికారి సంతోష్ అనిశెట్టర్ ఇల్లు, ఆఫీసులో సోదాలు చేశారు.
- బీదర్‌లో చిటగుప్ప పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ విజయకుమార్‌కు హోసకనహళ్లి గ్రామంలో, హుమ్నాబాద్ పట్టణ టీచర్స్ కాలనీలో ఉన్న రెండు ఇళ్లపై దాడులు జరిపారు.
- చిత్రదుర్గ జిల్లా హొళల్కెరె చిన్ననీటి పారుదల శాఖ ఇంజనీర్ కే.మహేశ్, భార్య బీబీఎంపీ ఏఈ హెచ్.భారతి జయనగరలో నివాసంలో సోదాలు చేపట్టారు. రూ.15 లక్షల నగదు, నగలు సీజ్ చేశారు.
- కొప్పళ నిర్మితి కేంద్రం ఎండీ మంజునాథ బన్ని కొప్ప ఆఫీసులో సోదాలు చేపట్టారు.
- బెంగళూరు వద్ద దేవనహళ్లి గ్రేడ్–2 తహసీల్దార్ శివరాజు ఆఫీసు, ఇళ్లల్లో ముమ్మరంగా సోదాలు జరిపారు.
- చిక్కబళ్లాపురం జిల్లా చిక్కజాల గ్రామ పంచాయతీ ఉద్యోగి లక్ష్మీపతి కి చెందిన తాలూకా కోడూరు ఫాంహౌస్‌లో తనిఖీలు చేపట్టారు. కోడూరులో మూడు ఎకరాల భూమి, తోట ఉన్నట్లు గుర్తించారు.



తుమకూరు నగరంలో ఇద్దరు అధికారులకు చెందిన విలాసవంత భవనాలు

### తుమకూరులో ఇద్దరు అధికారులపై దాడి

**తుమకూరు:** జిల్లా జడ్పీ అధికారి భువనహళ్లి నాగరాజుకు చెందిన తుమకూరు ఆదర్శనగరలోని ఇంట్లో సోదాలు చేశారు. లోకాయుక్త డీఎస్పీ ప్రదీప్ కుమార్ నాయకత్వంలో అధికారులు వచ్చారు. నాగరాజు, కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో మధ్యాహ్నం 12 వరకు వేచి ఉన్నారు. వారు రావడంతో తనిఖీలు సాగించారు. ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించారన్న ఆరోపణలతో తుమకూరు నగరాభివృద్ధి యోజన జాయింట్ డైరెక్టర్ అయిన నాగరాజుకు చెందిన దేవనూరు చర్చి రోడ్డులోని ఇంటిపైన, సొంతూరు పావగడ తాలూకాలోని అరసికెరె దగ్గర జంగమ నరహళ్లిలోని సొంతిళ్లు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేశారు. భారీగా నగదు, ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

### నటరాజ్ ఇంట్లో డబ్బే డబ్బు



ఆర్ఐ నటరాజ్ ఇంట్లో దొరికిన డబ్బు, బంగారంతో అధికారులు

**దొడ్డబళ్లాపురం:** ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై బీబీఎంపీ అధికారి నటరాజ్‌కు చెందిన కనకపుర తాలూకా శివనహళ్లి గ్రామం వద్ద ఉన్న ఇల్లు, ఫాంహౌస్‌పై లోకాయుక్త అధికారులు దాడులు చేశారు. బెంగళూరు మహదేవపుర పరిధిలోని బీబీఎంపీ ఆఫీసులో ఆర్ఐగా ఉన్నారు. శివనహళ్లి ఫాంహౌస్‌లో దాడులు జరపగా కట్టల కొద్దీ డబ్బు, నగలు, విలువైన వస్తువులు లభించాయి. ఫాంహౌస్‌లో కూడా విలువైన చెట్లు పెంచుతున్నట్టు కనుగొన్నారు. దాడి సమయంలో నటరాజ్ పరారీలో ఉన్నాడు. 7.5 ఎకరాల కొబ్బరితోట, సొంతూరిలో అందమైన బంగళా, వక్క తోటల రికార్డులు దొరికాయి. రూ. 4 కోట్ల అక్రమ ఆస్తులున్నట్లు తేలింది. ఈ నెల 4వ తేదీన ఓ అపార్టుమెంట్‌లో 79 ఫ్లాట్లకు ఖాతా చేయడానికి రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ నటరాజ్ పట్టుబడ్డాడు.

### కరువు తాలూకాలపై వారంలోగా నిర్ణయం: మంత్రి

**శివాజీనగర:** వచ్చేవారంలోగా రాష్ట్రంలో కరువు పీడిత ప్రాంతాల ప్రకటనపై నిర్ణయం వెలువరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. గురువారం నగరంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో రైతులకు సమాచారమిచ్చే కాల్ సెంటర్‌ను ప్రారంభించి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో తక్కువ వర్షాలు కురిసినందున మరో వారంలోగా కరువుపీడిత ప్రాంతాల ప్రకటనపై ప్రభుత్వం నిర్ణయం తెలియజేస్తుంది, కరువు మార్గదర్శకాలను మార్చాలని కేంద్రానికి సీఎం సిద్దరామయ్య లేఖ రాశారు. కేంద్రం నుంచి త్వరలోనే సమాధానం రావచ్చు, పాత మార్గదర్శకాలు అనుకూలం కాదు. ఇందులో 60 శాతం వర్షం కొరత మూడు వారాలు ఉంటే మాత్రం కరువు ప్రకటించాలనే నియమం ఉంది. ఒకవేళ కేంద్రం నుంచి సమాధానం రాకపోతే పాత మార్గదర్శకాల ప్రకారం కరువు తాలూకాలను ప్రకటిస్తామని తెలిపారు.



చిత్రలేఖనాలను తిలకిస్తున్న సందర్శకులు



### వర్ణ-చిత్రాల కనువిందు

**బనశంకరి:** చిత్రకళా పరిషత్‌లో ఇన్ అండ్ యంగ్ పేరుతో ఏర్పాటు చేసిన చిత్రలేఖనాల ప్రదర్శన కళాప్రియులను మురిపిస్తోంది. వర్ధమాన చిత్రకారుడు ఆర్.బాలసుబ్రమణ్యన్ గీసిన చిత్రాలతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వైవిధ్యభరితమైన పెయింటింగ్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రంగుల మిశ్రమంలో కొత్త పంథాకు ప్రాధాన్యమిస్తూ చిత్రలేఖనాలను రూపొందించినట్లు చిత్రకారుడు తెలిపారు.

# బచ్చా.. అయ్యాడు సీఐ



పోలీస్‌స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ దుస్తుల్లో బాలుడు అజాన్‌ఖాన్

- శివమొగ్గలో గుండెజబ్బు చిన్నారికి సరదా తీర్చిన పోలీసులు

**శివమొగ్గ:** బాలుడు సీఐగా అవతారమెత్తాడు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని ఆజమాయిషీ చేశాడు. భేష్.. చిన్న వయసులోనే మంచి ఉద్యోగం సంపాదించాడు అనుకుంటే పొరపాటే. గుండెజబ్బుతో బాధపడుతున్న బాలుని ఆశను తీర్చేందుకు శివమొగ్గ ఎస్పీ అతనికి ఈ అవకాశం కల్పించారు.

**ఇన్‌స్పెక్టర్ అజాన్‌ఖాన్**

వివరాలు.. శివమొగ్గ నగరానికి చెందిన, ప్రస్తుతం బాలెహొన్నూరులో నివాసం ఉంటున్న తబ్రేజ్ ఖాన్ అనే వ్యక్తి కుమారుడు అజాన్‌ఖాన్ (8) గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. పెద్దయ్యాక పోలీస్ అవుతానని అందరితో చెప్పేవాడు. కానీ అతని ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆ కోరిక నెరవేరుతుందో, లేదో చెప్పలేని పరిస్థితి. ఇది జిల్లా ఎస్పీ జీకే మిథున్‌కుమార్‌కు తెలిసింది. ఆయన సూచనతో బాలున్ని ఒక్కరోజు ఇన్స్‌పెక్టర్‌ని చేశారు. గురువారం ఉదయం చక్కగా కుట్టించిన పోలీస్ డ్రెస్ వేసుకుని బాలుడు శివమొగ్గ నగరంలోని దొడ్డపేట పోలీసు స్టేషన్‌కు రాగానే పోలీసులు గౌరవ వందనం ప్రకటించారు. సీఐ సీట్లో కూర్చుని సరదాగా గడిపాడు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జీకే మిథున్ కుమార్, ఏఎస్పీ అనిల్ కుమార్ భూమారెడ్డి, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు. తరువాత బాలునికి మిఠాయిలు ఇచ్చి ఇంటికి సాగనంపారు. కల తీరడంతో చిన్నారి ఆనందానికి అవధులు లేవు. స్థానికులు, బాలుని బంధుమిత్రులు ఈ తతంగాన్ని ఉత్సాహంగా తిలకించారు.



చిన్నారి సీఐకి ఎస్పీ తదితరుల స్వాగతం

### తండ్రి అడిగాడు: ఎస్పీ

ఎస్పీ మిథున్ మాట్లాడుతూ కుమారుని కోరిక గురించి తండ్రి మాకు చెప్పడంతో సంతోషంగా అంగీకరించాం, బాలుడు చాలా ఉత్సాహంగా డ్యూటీ చేశాడు, ఒక సిబ్బందికి సెలవు మంజూరు చేశాడని చెప్పారు.

# మాటలు కలిపి రూ.కోట్లు లూటీ

- వృద్ధురాలికి ఘరానా ముఠా టోపీ
- అరెస్టు చేసిన పోలీసులు

**బనశంకరి:** బీమా చేస్తామనే నెపంతో వృద్ధురాలిని పరిచయం చేసుకుని, ఇంటి వాస్తు సరిగా లేదని ఇంటిని విక్రయించి రూ.3.50 కోట్లు కాజేసిన ఘరానా ముఠాను గురువారం బనశంకరి పోలీసులు అరెస్టు చేశారు. ఆర్.విశాల, అరుంధతి, అపూర్వ, రాకేశ్ పట్టుబడిన వంచకులు.

వివరాలు.. బనశంకరి పద్మనాభనగర నివాసి శాంత (63), ఆమె కుమార్తెతో కలిసి జీవిస్తోంది. వంచకులు అరుంధతి, రాకేశ్ 2021లో వీరిని కలిసి ఇన్సూరెన్స్ పాలసీ చేయాలని అడిగారు. అలా స్నేహం పెంచుకుని పద్మనాభనగరలో గల ఇంటి సమాచారం తెలుసుకున్నారు. ఇంటి వాస్తు సక్రమంగా లేదని మాయమాటలు చెప్పి ఇంటిని అమ్మేద్దామని ఒప్పించారు. రియల్‌ఎస్టేట్ బ్రోకర్లను తీసుకువచ్చి సుమారు రూ.4.5 కోట్లకు ఇంటిని అమ్మేయించారు. ఈ నగదును ఆమె బ్యాంక్ అకౌంట్‌లోకి జమచేశారు.

**నకిలీ చెక్కులపై సంతకాలతో..**

శాంత, ఆమె భర్త పేరుతో షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని చెప్పి కత్రిగుప్పెలోని కెనరాబ్యాంక్‌లో ఉన్న రూ.1.90 కోట్లతో ఉండే రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలను క్లోజ్ చేయించారు. ఈ సమయంలో శాంత నుంచి ఆరు చెక్‌లపై, అలాగే ఖాళీ ఫారాలపై మోసగాళ్లు సంతకాలు చేయించుకున్నారు. 2023 మే 16 నుంచి జూన్ 26 వరకు వంచకులు చెక్కులను అదే బ్యాంకులో ఇచ్చి రూ.3.50 కోట్లను విశాలా ఆర్.సంజీవప్ప, ఆర్.పరిమళా అనే బ్యాంకు అకౌంట్లలోకి జమ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన శాంత పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలించి నలుగురు వంచకులను అరెస్ట్ చేశారు.

నిందితులు విశాల, అరుంధతి, అపూర్వ, రాకేశ్



### భక్తిశ్రద్ధలతో శనీశ్వర పూజలు



నవగ్రహ దేవతలకు అభిషేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**పావగడ:** శ్రావణ మాసోత్సవం సందర్భంగా ప్రసిద్ధ పావగడ శనీశ్వరాలయంలో కొలువు తీరిన నవగ్రహ దేవతలకు అభిషేక పూజలు తొలి రోజు గురువారం వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నవగ్రహాలకు పూజలు చేశారు. శని దోష నివారణ విశేష పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండంలోకి భక్తులు తొమ్మిది నల్ల ఒత్తులు సమర్పించి తొమ్మిది సార్లు ప్రదక్షిణలు చేశారు. శీతలాంబదేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి తల నీలాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నదాసోహ భవనంలో స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కర్ణాటక లోని మంగళూరు నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

## క్లుప్తంగా

### మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



గురుసిద్దయ్యను సన్మానించిన దృశ్యం

రాయచూరు రూరల్: నగరసభ కమిషనర్ గురుసిద్దయ్యను తాలూకా బేడ జంగమ సంఘం పదాధికారులు సన్మానించారు. గురువారం నగరంలోని ప్రభుత్వ అతిథిగృహంలో సంఘం గౌరవాధ్యక్షుడు ప్రభు శాస్త్రి కమిషనర్‌ను అభినందించి నగరాభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈసందర్భంగా శరణ బసవ, మల్లికార్జున, మంజునాథ్, శరణయ్య, రేణుకా స్వామి, అంబమ్మ, జయశ్రీ. అయ్యప్ప, బసవరాజ్ స్వామిలున్నారు.

### విద్యార్థులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయచూరు రూరల్: నగరంలోని ప్రభుత్వ జవహర్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం నవోదయ దంత కళాశాల వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ కులకర్ణి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చక్కగా చదువుకోగలరన్నారు. దాదాపు 200 మందికి వైద్యులు సోమనాథ్ రెడ్డి, కవితా, సహన, ఇందిరారాణి, టీనా, లావణ్య, భరిణి, సుభాష్ పరీక్షలు చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు సంధ్య, శిల్ప, యంకమ్మ, తనూజ, మౌనేష్, బీరలింగ పాల్గొన్నారు.

### విద్యాట్రస్టు అధ్యక్షుడు కన్నుమూత

బనశంకరి: నగరంలో తెలుగు విజ్ఞానసమితి విద్యాట్రస్టు అధ్యక్షుడు కే.మునిస్వామిరాజు (80) గురువారం ఉదయం మరణించారు. ఆయన పలు ప్రముఖ విద్యాసంస్థల్లో సభ్యునిగా ఉన్నారు. సదాశివనగరలోని ఆయన నివాసంలో మునిస్వామిరాజు పార్థివదేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. విద్యాట్రస్టుకు మునిస్వామిరాజు గత 4 దశాబ్దాలుగా అమూల్యమైన సేవలందించారని, ఆయన మృతి బాధాకరమని మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ అన్నారు. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు ఏ.రాధాకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, సమితి ఉపాధ్యక్షుడు కే.గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, సీపీ.వరదరాజు తదితరులు సంతాపం తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

చెళ్లకెరె రూరల్: నగరంలోని బీఈఓ కార్యాలయం వెనుక ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. ఉదయాన్నే ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని దావణగెరె జిల్లా బిళిచోడు గ్రామానికి చెందిన రవి(40)గా గుర్తించారు. ఇతను చెళ్లకెరెలోని వాల్మీకి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని సమాచారం. ఇతడు బ్యాండ్ వాయిస్తూ జీవిస్తున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. స్థలానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేశాయి, సబ్‌ఇన్‌స్పెక్టర్ సతీష్‌నాయక్ వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

కంప్లి: పట్టణంలోని శ్రీనిధి పరపతి సహకార సంఘం నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు గురువారం జరిగాయి. బళ్లారి సహకార సంఘాల ఉప విభాగపు ప్రముఖురాలు షాకీరబాను ఎన్నికల ప్రక్రియ చేపట్టగా అధ్యక్ష స్థానానికి ఎం.తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి జీ.సుధాకర్ మాత్రమే నామినేషన్లు వేయడంతో ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిణి షాకీరబాను అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు పీ.బ్రహ్మయ్య, గరడి విరుపాక్షప్ప, ఎం.మహేష్, లక్ష్మీ, ఎం.వెంకట కొండయ్య, జీ.విరుపాక్షప్ప, జీ.రవీంద్ర, సణ్ణహులుగప్ప, ఎం.లలిత, కొండమ్మ, సిబ్బంది జీ.శివశంకర్, ఎం.సునీల్, ఎం.హేమలత, జీ.రాకేష్, విరుపణ్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

# గ్యాస్ ట్యాంకర్ ఎంత పని చేసింది?

- హైవే అండర్‌పాస్ కింద ఇరుక్కున్న వైనం
- ధార్వాడ హైకోర్టు బెంచ్ వద్ద సంఘటన
- 16 గంటల పాటు ప్రజలకు టెన్షన్

హుబ్లీ: ధార్వాడ సమీపంలో భారీ ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్ అండర్‌పాస్ కింద ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. పోలీసులు, ఫైర్ సిబ్బంది జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో డ్రైవర్లు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. 16 గంటలు శ్రమించి ట్యాంకర్‌ను బయటకు తీయడంతో హైడ్రామా సమాప్తమైంది.

**ఏం జరిగిందంటే**

వివరాలు... ధార్వాడ నగర సమీపంలో హైవే- 4లో హైకోర్టు బెంచ్ వద్ద ఒక అండర్ పాస్‌లో బుధవారం సాయంకాలం 7 గంటలప్పుడు ట్యాంకర్ చిక్కుకుపోయింది. ట్యాంకర్ డ్రైవర్ అవగాహన లేకుండా అవతలి వైపునకు వెళ్లగా, ట్యాంకర్ ఎత్తు ఎక్కువగా ఉండడంతో అండర్‌పాస్ పైకప్పుతో రాపిడి జరిగి ఇరుక్కుంది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ముందుకు, వెనక్కు కదలలేకపోయింది.

**ముమ్మరంగా సహాయక చర్యలు**

విషయం తెలిసిన తరువాత జిల్లాధికారులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది క్రేన్లతో సహాయక చర్యలు ప్రారంభించారు. గ్యాస్ లీకై ఒక్క రవ్వ నిప్పు పడినా భస్మీపటలం సంభవిస్తుందనే భయం నెలకొంది. ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల కరెంటును నిలిపివేశారు. ఎవరూ ఇళ్లల్లో అగ్గిపెట్టె వాడరాదని, వంటలు చేయరాదని ప్రకటించారు. బెళగావి నుంచి ధార్వాడకు వచ్చే వాహనాలను నిలిపివేశారు. వేరే ట్యాంకర్‌ను తెప్పించి అందులోకి గ్యాస్‌ను డంప్ చేశారు. తరువాత ఖాళీ ట్యాంకర్‌ను క్రేన్లతో బయటకు లాగారు. ప్రజలు సహకరించారని జిల్లా ఎస్పీ డాక్టర్.సంజీవ్ పాటిల్ తెలిపారు. మొత్తానికి 16 గంటల పాటు అందరిని టెన్షన్ పెట్టిన గ్యాస్ ట్యాంకర్ ఉదంతం గురువారం మధ్యాహ్నంకల్లా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గంటల కొద్దీ వాహనాలను బంద్ చేయడంతో ప్రజలు, ఉద్యోగులు కాలినడకన సంచరించారు. ఇళ్లల్లో ప్రజలు వంటలు చేసుకోక ఆకలి బాధ అనుభవించారు.



ట్యాంకర్‌ను బయటకు లాగుతున్న దృశ్యం



వాహనాలను బంద్ చేయడంతో కాలినడకన వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగులు



ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు

## నర్సుల వాగ్వాదం



పాదరక్షను చూపుతున్న నర్సు

రాయచూరు రూరల్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆరోగ్య కార్యకర్తలు(నర్సులు)అవాచ్య పదాలతో నిందించుకుంటూ చెప్పులతో కొట్టుకున్న ఘటన జిల్లాలోని లింగసూగూరు తాలూకా ఈచనాళలో చోటు చేసుకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సు దీపా తనను కులం పేరుతో దూషించిందంటూ జ్యోతి అనే నర్సు పరస్పరం చెప్పులతో కొట్టుకున్నారు. కాగా విధి నిర్వహణలో ఇద్దరి మధ్య సామరస్యత లేకపోవడం వల్ల ఈ ఘటన జరిగిందని, ఇద్దరినీ వేర్వేరు చోట్లకు బదిలీ చేయాలని గ్రామస్తులు కోరారు.

## చిరుత పట్టివేతకు సన్నాహాలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా నీరమాన్వి కొండల్లో చిరుత సంచారం, పట్టివేతపై అధికారులతో చిన్న నీటి పారుదల శాఖా మంత్రి ఎస్ ఎస్ బోసురాజు చర్చించారు. గురువారం నీరమాన్వి వద్ద అటవీ శాఖాధికారులతో ఆయన మాట్లాడారు. చిరుతను పట్టుకోవడానికి బోనులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల ప్రాణభయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి వెంట జెడ్పీ మాజీ అధ్యక్షుడు దొడ్డ బసవరాజ్, నగరసభ మాజీ సభ్యుడు రుద్రప్పలున్నారు.

**జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత**

మహత్వాకాంక్ష(ఆస్పిరేషన్) పథకంలో జిల్లాకు సమగ్రాభివృద్ధిలో మొదటి స్థానం లభించినా మరింత ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎస్ఎస్ బోసురాజు పేర్కొన్నారు. ఆయన గురువారం రాయచూరు వ్యవసాయ వర్సిటీలో జరిగిన జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడారు. నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడించిన అంశాలను, విద్య, ఆరోగ్య, ఆర్థిక, వ్యవసాయ, ఇతరత్ర విషయాల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించిన నివేదికలను వివరించారు. దేశంలో 112 జిల్లాల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. పౌష్టికాహారం, గర్భిణుల్లో పౌష్టికత, రక్షిత తాగునీరు, జలశక్తి, భూగర్భ జలాల పెరుగుదలపై చర్చించారు. ఈసందర్భంగా ప్రభుత్వ జాయింట్ డైరెక్టర్ సుబోధ్ యాదవ్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌లున్నారు.

## రాఘవేంద్ర సప్తరథోత్సవాలకు నీరందేనా?



వట్టిపోయిన తుంగభద్రా నది

రాయచూరు రూరల్: మంత్రాలయంలో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాలు, సప్తరథోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం అడుగంటింది. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గోవా, కేరళ, పాండిచ్చేరిల నుంచి వచ్చే భక్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించామని మఠం చెబుతున్నా నీటి సౌకర్యం విషయంలో ఆలయ పాలక మండలి మౌనం వహించింది. హొసపేటెలోని తుంగభద్ర డ్యాం పూర్తి స్థాయిలో నిండడానికి మరో ఐదు అడుగులు(15 టీఎంసీల) నీరు వచ్చి చేరాల్సి ఉంది. ఈనేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా డ్యాం నుంచి నదికి అధికారులు నీరు వదలలేదు. పైగా ఆలయ పాలక మండలి రాష్ట్ర ప్రభుత్వానికి, హొసపేటెలోని తుంగభద్ర బోర్డు అధికారులకు లేఖలు రాయలేదు. మరో 12 రోజుల్లో ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతున్న తరుణంలో మాధవరం వద్ద తుంగభద్ర నదిలో నీరు లేక వట్టిపోయింది. నదిలో భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందులు పడకుండా అధికారులు తుంగభద్ర డ్యాం నుంచి నీటిని వదలాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## 21 నుంచి ద్వితీయ పీయూ సప్లిమెంటరీ

- సజావుగా పరీక్షల నిర్వహణకు సూచన



మాట్లాడుతున్న జిల్లాధికారి ఎంఎస్ దివాకర్

హొసపేటె: జిల్లాలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న ద్వితీయ పీయూసీ ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ సూచించారు. ద్వితీయ పీయూసీలో ఫెయిలైన విద్యార్థులకు 2వ ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రిలిమినరీ ప్రిపరేషన్‌పై వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 5 పరీక్షా కేంద్రాల్లో 4184 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. ఈ సారి పరీక్ష మధ్యాహ్నం జరుగుతుందని, పరీక్ష అనంతరం సమాధాన పత్రాలు పోస్టాఫీసుకు పంపే వరకు అన్ని తాలూకా పోస్టాఫీసుల్లో సిబ్బందిని నియమించాలన్నారు. నిర్దేశిత సమయంలో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల మార్గదర్శకాలను కచ్చితంగా పాటించడంతో పాటు, ప్రశ్న పత్రాలను తీసుకువెళ్లే వాహనాల జీపీఎస్ సిస్టమ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఈ విషయంలో అధికారులందరూ మరింత దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. సన్నాహాలపై అండర్ గ్రాడ్యుయేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్, వివిధ శాఖల తాలూకా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ మార్గదర్శకాల గురించి మాట్లాడారు. పరీక్ష ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన నిఘా ఉంచి పారదర్శకంగా పరీక్షల నిర్వహణకు సహకరించాలని సూచించారు.

## కొళాయిల్లో రంగు మారిన నీరు సరఫరా



కొళాయిలో సరఫరా అవుతున్న రంగు మారిన నీరు



సీసాలో రంగు మారిన నీరు దృశ్యం

రాయచూరు రూరల్: నగర ప్రజలకు నగర సభ అధికారులు గురువారం రంగు మారిన నీటిని సరఫరా చేశారు. మంగళవారపేట, జహీరాబాద్, జేడితోట, నవాబ్‌గడ్డ, వాసవి నగర్ ప్రాంతాల్లోని కొళాయిల్లో కృష్ణా నది నుంచి సరఫరా అయిన తాగునీరు రంగు మారింది. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు కొళాయిల్లో సరఫరా చేసిన శుద్ధీకరించని ఒండు నీరు రంగు మారి నురగతో కూడి ఉన్నా ప్రజలు గత్యంతరం లేక వాటినే పట్టుకున్నారు. అయితే నగరసభ జలమండలి అధికారుల పనితీరు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై ప్రజలు దుమ్మెత్తిపోశారు.

## ఎమ్మెల్యేకు ఘన సన్మానం



ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు జెట్టి వీరప్రసాద్

గంగావతి రూరల్: నగరానికి సమీపంలోని కొండపై వెలసిన అయ్యప్ప స్వామిని గురువారం ఉదయం ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి తన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు జెట్టి వీరప్రసాద్ నేతృత్వంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ గత పదేళ్లుగా ఆలయాన్ని భక్తుల దానాలతో నిర్వహిస్తున్నామన్నారు. కాని ప్రస్తుతం నిర్వహణ ఖర్చులు అధికమైనందున ప్రభుత్వ సహకారంతో పాటు ఎమ్మెల్యే గ్రాంట్ నుంచి కూడా నిధులు అందించాలని మనవి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా దేవుని సేవకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తాయిబాబు, సభ్యులు డాక్టర్ సోమరాజ్, యల్బన్ క్లబ్ మాజీ అధ్యక్షులు టి.రామకృష్ణ, కల్యాణ కర్ణాటక ఆర్యఈడిగ సమాజం అధ్యక్షులు కె. సుబ్రమణ్యేశ్వర రావు, బసాపట్న నాని, కల్గుడి శేషారావు, జోగద నారాయణప్ప నాయక, జెట్టి వెంకటరమణ, రాము నాయక్, కె.శ్రీనివాస్, సి.హెచ్.సత్యనారాయణ, అలీసాబ్, కేఆర్‌పీపీ జిల్లాధ్యక్షులు మనోహర్ గౌడ, చౌడ్కి యమనూరు, జిలాన్‌పాషా పాల్గొన్నారు.

**విద్యుత్ సమస్యల పరిష్కారంపై దిశానిర్దేశం**

గ్రామీణ ప్రాంతంతో పాటు నగరంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఆయన గురువారం జెస్కాం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాత స్తంభాలను తొలగించి కొత్త వాటిని పాతడంతో పాటు రైతన్నలకు 10 గంటల విద్యుత్‌ను అందించాలని సూచించారు. టీసీల విషయంలో కూడా ఎక్కడా జాప్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో అనేక వార్డుల్లో ఇళ్లపై గుండా కరెంట్ తీగలు వేలాడుతున్నాయని, వాటిని తక్షణం తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జెస్కాం అధికారి రియాజ్, ఏఈఈలు వీరేష్, మహంతేశ్ శివమణితో పాటు సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## వాహన రాకపోకలను ఆపవద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్

గంగావతి: కొప్పళ నగరంలో నుంచి కూడ్లిగి వైపు వెళ్లే రహదారిలో వాహనాల రాకపోకలకు ఏర్పడిన అంతరాయాన్ని తొలగించాలని కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్ అధికారులను ఆదేశించారు. ఆయన కొప్పళ జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇతర సిబ్బందితో కలిసి నగరంలోని 66వ వంతెన నిర్మాణ పనుల వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వంతెన నిర్మాణం ఒక వైపు నిర్మిస్తూనే మరో వైపు వాహనాల రాకపోకలను యథేచ్ఛగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, రాకపోకలను ఎట్టి పరిస్థితిలోను ఆపరాదని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుందరేశ్‌బాబు, ఎస్పీ యశోదా వంటగోడి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అందరి క్షేమమే బ్రాహ్మణుల ఆశయం



మాట్లాడుతున్న అనంతరామ్ గౌతమ్

చెళ్లకెరె రూరల్: సమాజంలోని అందరి క్షేమమే బ్రాహ్మణుల ఆశయం అని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు డాక్టర్ అనంతరామ్ గౌతమ్ తెలిపారు. ఆయన గురువారం నగరంలోని త్యాగరాజ్ నగర్‌లోని గాయత్రి కళ్యాణ మంటపం వద్ద నూతనంగా నిర్మించిన గాయత్రి విద్యార్థి నిలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న బ్రాహ్మణుల శ్మశానం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నగరసభ, రాజకీయ నాయకులకు మొర పెట్టుకున్నా ఈ విషయంపై ఆసక్తి చూపడం లేదన్నారు. అందువల్ల ఈ సమాజం వారే ముందుకు వచ్చి విరాళాలను అందించాలని అభ్యర్థించారు. ఈ విషయంపై స్పందించిన విప్ర బాంధవులు అధిక సంఖ్యలో విరాళాలు అందజేశారు. రాబోయే రోజుల్లో శ్మశానం అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి సత్యనారాయణ రావ్, వాసుదేవరావు, నాగశయన గౌతమ్, ప్రదీప్ శర్మ, ఆడిటర్ కృష్ణ, శ్రీనాథ్, విప్రగాయత్రి మహిళా సంఘం అధ్యక్షురాలు సీతాలక్ష్మీ వాదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారం పంపిణీ చేయరూ

కంప్లి: పౌష్టికాహారం పంపిణీ చేయాలని తాలూకా గ్రామీణ కూలి కార్మికుల సంఘం పదాధికారులు గురువారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పదాధికారులు మాట్లాడుతూ మహిళలతో పాటు పిల్లల్లో అపౌష్టికతను తొలగించేందుకు ప్రస్తుతం అందిస్తున్న రేషన్‌తో పాటు జొన్నలు, రాగులు, కందిపప్పు, మంచినూనె కూడా అందించాలని కోరారు.

### ప్లేట్లు, గ్లాసుల వితరణ

కంప్లి: తాలూకాలోని వెంకటాపుర క్యాంప్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, బుక్కసాగర ప్రాథమిక పాఠశాలలకు ఉచితంగా ప్లేట్లు, గ్లాసులను గురువారం ఎయిర్ వాటర్ ఇండియా ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అదే విధంగా షెడ్ నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులతో పాటు చెత్త బుట్టలు, ఫిల్టర్ నీటి యూనిట్లను కంపెనీ పరంగా ఉచితంగా అందజేశారు.

### కోటె యల్లమ్మకు పూజలు



మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో ఉన్న కోటె యల్లమ్మ ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కె.సోమప్ప నేతృత్వంలో అమ్మవారికి పలు పూజలు జరిగాయి. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, మహాగణపతి దేవతా ప్రార్థన, మహామంగళారతి, వాస్తు హోమం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నెరవేర్చారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

## ఆ అధికారిపై చర్య తీసుకోండి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: : అంబేడ్కర్‌ను అగౌరవపరిచిన నగరసభ అధికారిపై చర్యలు చేపట్టాలని దళిత సంఘాల కార్యకర్తలు ధర్నా చేపట్టారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన సంచాలకుడు హేమరాజ్ మాట్లాడారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంలో నగరసభ కార్యాలయం వద్ద జాతీయ పతాకం ఎగురవేత సమయంలో కమిషనర్ గురుసిద్దయ్య బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించకుండా అవమానపరిచినందున ఆయనపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా రవీంద్ర, బేరి, రాజ్, అస్లాం పాషా, భరత్, నరసింహులు, వెంకటేష్, మారెప్పలున్నారు.

### విద్యార్థులకు ప్రతిభా పోటీలు

బళ్లారిఅర్బన్: అనంతపురం రోడ్డులోని బీపీఎస్‌సీ పాఠశాలలో వివిధ పాఠశాలలకు విద్యార్థులకు గురువారం ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్వర్ణమహోత్సవం సందర్భంగా ప్రతిభా పోటీలను నిర్వహించారు. సైన్స్, ఆహారం, సాంస్కృతిక, చిత్రలేఖనం, నృత్యాలతో పాటు సుమారు 20 విభాగాల్లో పోటీలకు సంబంధించి 200 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా న్యాయనిర్ణేతలు ప్రతిభావంత విద్యార్థులకు ఎంపిక చేశారు.

### రూ.8.85 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

- నలుగురు దోపిడీ దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీస్ అధికారులు

గంగావతి: గంగావతి పోలీసులు నలుగురు దోపిడీ దొంగలను బంధించి రూ.8.85 లక్షల విలువ గల వెండి, బంగారు ఆభరణాలను, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం డీఎస్పీ సిద్ద లింగప్పగౌడ పాటిల్, ఎస్ఐ అడివప్ప నేతృత్వంలోని బృందం చోరీ సొత్తును స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల ఎదుట ప్రదర్శించి వివరాలు వెల్లడించారు. గంగావతికి చెందిన ఖాజా, గౌస్‌పాషా, హనీఫ్, సోహైల్ అనే నిందితులను బంధించి విచారించగా అసలు విషయం బయట పడింది. వారి నుంచి నాలుగు ఇళ్లల్లో దోపిడీ చేసిన బంగారు, వెండి సామగ్రిని స్వాధీన పరుచుకున్నారు. ఇందులో సుమారు రూ.6,35,400ల విలువ చేసే 105.9 గ్రాముల బంగారు, సుమారు రూ.2,50,000 విలువ చేసే 3.885 గ్రాముల వెండి ఆభరణాలున్నట్లు తెలిపారు.

### ధార్వాడలో లోకాయుక్త దాడి

హుబ్లీ: రాష్ట్రంలోని వివిధ చోట్ల మంగళవారం ఉదయమే లోకాయుక్త అధికారులు ఏకకాలంలో పలు శాఖల అధికారుల ఇళ్లుచ కార్యాలయాలపై దాడులు చేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ధార్వాడలోనూ లోకాయుక్త దాడి జరిగింది. బెళగావి కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషన్ సంతోష్ అనిశెట్టర్ నివాసంలో దాఖలాలను పరిశీలించారు. ధార్వాడ సత్తాపుర లేఅవుట్ మిచిగన్ ప్రాంతంలో సంతోష్ నివాసంపై సూర్యోదయంతోనే దాడి చేశారు. అంతకు ముందు సంతోష్ హుబ్లీ ధార్వాడ కార్పొరేషన్‌లో విధులు నిర్వహించారు. కొన్నేళ్ల క్రితం బెళగావికి బదిలీ అయ్యారు. సంతోష్ ధార్వాడలోనే ఇళ్లు కలిగి ఉన్నారని తెలిసింది. అలాగే సంతోష్‌కు చెందిన బెళగావి సుభాష్ నగర్‌లో అపార్ట్‌మెంట్‌లో కూడా అధికారులు దాడి చేశారు. సంతోష్ సోదరుడి ఇంటిపై కూడా దాడి చేశారు. సంపిగెనగర్‌లోని ఆనంద్ ఇంటిపై కూడా దాడి చేసి రికార్డులను పరిశీలించారు.

## కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కాలువ నీటిలో కొట్టుకు వస్తున్న మహిళ మృతదేహం

బళ్లారిఅర్బన్: గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళూరు రోడ్డు శ్రీనగర్ కాలనీ వద్ద కాలువలో ఓ మహిళ(50) మృతదేహం నీటిలో కొట్టుకు రావడంతో స్థానికులు గమనించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మహిళకు ఇంకా ప్రాణం ఉందేమో? అని ప్రయత్నించినా అప్పటికే ప్రాణం పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ సతీష్, ఎస్ఐ సంతోష్ తమ పోలీసు బృందంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాలువ నీటిలో నుంచి మహిళ మృతదేహాన్ని వెలికి తీసిన యువకుడిని అభినందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం అంబులెన్స్ ద్వారా విమ్స్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు. కాగా గురువారం ఉదయం హవంబావి సమీపంలో ఈ మహిళ కాలు జారి కాలువలో పడి మరణించి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## లక్ష్య సాధనకు కఠోర శ్రమే సోపానం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: పోటీల్లో లక్ష్యాలను చేరుకోవడానికి కఠోర సాధన చేయాలని జిల్లా ఉద్యోగ అధికారి కె శ్రీనివాస్ తెలిపారు. గురువారం నగరంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో స్టడీ సర్కిల్ పథకంలో భాగంగా పోటీ పరీక్షల పూర్వసిద్ధతా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షల్లో విజయ సాధనకు దినపత్రికల్లో నిత్యం వస్తున్న సామాన్య జ్ఞానాన్ని పొందాలన్నారు. నిరంతరంగా నిర్ణీత పఠ్య అధ్యయనం చేయడం ద్వారా విజయం సాధించవచ్చన్నారు. గతంలో కోలారు నుంచి ఎంతో మంది కేఏఎస్ అధికారులు వెళ్లేవారు. అయితే ఇటీవల తగ్గుముఖం పట్టిందన్నారు. గతంలోలా ఎక్కువ మంది అభ్యర్థులు ఐఏఎస్, కేఏఎస్ సాధించాలన్నారు. అభ్యర్థులకు పరీక్ష తయారీపై సలహా, సూచనలు అందిస్తామన్నారు. జ్ఞానార్జనకు అవసరమైన పుస్తకాలను చదవాలన్నారు. విద్యార్థులకు, ఉద్యోగాకాంక్షులకు వృత్తి ఉపన్యాసం, కౌన్సిలింగ్, పరీక్ష పూర్వ శిక్షణ, భారత సేనలో ఉద్యోగావకాశాలపై శిక్షణనిస్తారన్నారు. సహాయక ఉద్యోగ అధికారి మునికృష్ణ, కార్యాలయ సిబ్బంది మనోజ్, తిమ్మరాజు పాల్గొన్నారు.